సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 277

శనివారం 28-12-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'జల ప్రాజెక్టులపై జనం ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నారు. వాళ్ల నమ్మకం వమ్ము కాకుండా పనిచేయాలి'



స్వయంకృతం!

ఆస్ట్రేలియాతో నాలుగో టెస్టులో భారత్ ఎదురీత. ప్రస్తుతం 164/5 - 17లో



భారత్ క్లీన్‌స్వీప్

వెస్టిండీస్ మహిళల జట్టుతో జరిగిన చివరి వన్డేలోనూ టీమిండియా గెలుపు - 17లో



లష్కరే నేత అబ్దుల్ రెహ్మాన్ మృతి

నిషేధిత జమాత్ ఉద్-దవా ఉపాధ్యక్షుడు హఫీజ్ అబ్దుల్ రహ్మాన్ మక్కి లాహోర్‌లో గుండెపోటుతో చనిపోయాడు. - వివరాలు 6లో▶



కొరడాతో కొట్టుకున్న అన్నామలై

విద్యార్థినిపై లైంగికదాడి కేసులో డీఎంకే ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ తమిళనాడు బీజేపీ చీఫ్ తనను తాను కొరడాతో కొట్టుకున్నారు. - వివరాలు 6లో▶



సూర్యుడి 'కరోనా'ను తాకింది..

'నాసా' స్పేస్‌క్రాఫ్ట్ చరిత్ర సృష్టించింది. ఆ సంస్థ ప్రయోగించిన 'పార్కర్ సోలార్ ప్రోబ్' సూర్యుడి సమీపానికి చేరుకుంది. - వివరాలు 6లో▶



జర్మనీ పార్లమెంట్‌కు ఫిబ్రవరిలో...

జర్మనీ అధ్యక్షుడు ఫ్రాంక్-వాల్టర్ స్టెయిన్ మెయిర్ శుక్రవారం పార్లమెంట్ (బుండెస్టాగ్)ను రద్దు చేశారు. ఫిబ్రవరి 23న ఎన్నికలకు మార్గం సుగమమైంది. - వివరాలు 6లో▶

న్యూస్‌రీల్

వారం పాటు కాంగ్రెస్ సంతాప దినాలు



మన్మోహన్‌సింగ్ మృతి నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ వారం పాటు సంతాప దినాలను పాటించనుంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని స్థాయిల్లో ఎలాంటి పార్టీ కార్యక్రమాలు నిర్వహించవద్దని టీపీసీసీ ప్రకటించింది.

- వివరాలు 8లో▶

దేశానికి వన్నె తెచ్చిన నేత



మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ లాంటి మహానుభావుడిని కోల్పోవడం దేశానికి తీరని లోటు అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు అన్నారు. శుక్రవారం రాత్రి ఢిల్లీలో మన్మోహన్ సింగ్ పార్థివదేహానికి కేటీఆర్, ఇతర పార్టీ నేతలు నివాళులర్పించారు.

- వివరాలు 8లో▶

నీట్ పీజీ మెరిట్ లిస్ట్ విడుదల



సుదీర్ఘ జాప్యం తరువాత నీట్ పీజీ అడ్మిషన్లకు రాష్ట్ర మెరిట్ జాబితాను కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం శుక్రవారం విడుదల చేసింది. 3,314 మందిని పీజీ కౌన్సెలింగ్‌కు అర్హులుగా ప్రకటించింది.

- వివరాలు 18లో▶

ఆర్టీసీ కండక్టర్ వెంకటేశ్వర్లు కుమారుడు జేఈఈలో ఆలిండియా స్థాయిలో 265 ర్యాంకు సాధించాడు. ఐఐటీ ఫీజు చెల్లించేందుకు సీసీఎస్ నిధి నుంచి లోన్ కోసం వెంకటేశ్వర్లు దరఖాస్తు చేశాడు. నిధులు లేక సకాలంలో రుణం ఇవ్వలేమని వారు చెప్పడంతో ఇల్లు తాకట్టు పెట్టి ప్రైవేటుగా రూ.10 లక్షలు అప్పు చేశాడు. ఆ వడ్డీ భారంతో సతమతమవుతున్నాడు.

మెకానికల్ సెక్షన్‌లో పనిచేస్తున్న జుబేర్‌కు కొన్నిరోజులుగా ఒక కాలు, చేతికి స్పర్శ సరిగా ఉండటం లేదు. ఆస్పత్రికి వెళితే త్వరగా శస్త్రచికిత్స చేయాలని, లేకుంటే పక్షవాతానికి గురికావొచ్చని హెచ్చరించారు. ఆర్టీసీ ఆస్పత్రికి వెళ్తే.. తొలుత ట్రీట్‌మెంట్ ఇస్తామని, తగ్గకుంటే ప్రైవేటుకు రిఫర్ చేస్తామన్నారు. దీనితో ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స కోసం రుణం కావాలని సీసీఎస్‌లో దరఖాస్తు చేశారు. నిధులు లేవనడంతో బయట అధిక వడ్డీకి అప్పు చేయాల్సి వచ్చింది.

ఇదేం దా'రుణం'?

ఉద్యోగులు పొదుపు చేసుకున్న 'సహకార పరపతి' నిధిని వాడేసుకున్న ఆర్టీసీ

అత్యవసరాలకు రుణం తీసుకునేందుకు వీలు లేకుండా మాయం

బకాయిలు చెల్లించని ఆర్టీసీ.. చేతులెత్తేసిన సీసీఎస్

పిల్లల పెళ్లిళ్లు, చదువులు, వైద్య చికిత్సల కోసం అధిక వడ్డీతో ప్రైవేట్ అప్పులు తెచ్చుకుంటున్న కార్మికులు..

ఆరు నెలల్లో 7 వేలకు చేరిన దరఖాస్తులు..

జోక్యం చేసుకోని సర్కార్.. మళ్లీ హైకోర్టుకు కార్మికులు!



సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీలోని సహకార పరపతి సంఘం (సీసీఎస్) దివాలా దశకు చేరుకోవటంతో సంస్థలోని చిరుద్యోగుల జీవితాలు ఆగమాగం అవుతున్నాయి. పిల్ల ల చదువుల కోసం కొందరు, పెళ్లిళ్ల కోసం మరికొందరు, అనారోగ్య సమస్యలతో ఇంకొందరు, ఇతర కుటుంబ అవసరాల కోసం మరెందరో.. లోన్ కోసం సీసీఎస్‌లో దరఖాస్తు చేస్తున్నారు. అక్కడ నిధులు లేవని తేల్చిచెప్తుండటంతో తప్పని పరిస్థితుల్లో ప్రైవేటు ఫైనాన్షియర్ల వద్ద అధిక వడ్డీలకు అప్పులు చేస్తున్నారు. సిబిల్ స్కోర్ సరిగా లేదన్న కారణంతో బ్యాంకులు రుణాలకు నిరాకరిస్తుండంతో ప్రైవేటు అప్పులు చేయక తప్పడం లేదు. వచ్చే జీతంలో ఇంటి ఖర్చులు పోగా మిగతా సొమ్ము వడ్డీలు కట్టేందుకు కూడా సరిపోని దుస్థితి తలెత్తుతోందని, కుటుంబాలు ఆగమవుతున్నాయని ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు వాపోతున్నారు. ప్రైవేటు వడ్డీ వ్యాపారులు రూ.లక్షకు నెలకు రూ.4 వేల నుంచి రూ.6 వేల వరకు వసూలు చేస్తున్నారని ఆవేదన మిగతా 14వ పేజీలో ▶

మన్మోహన్ పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న ప్రధాని మోదీ. చిత్రంలో మన్మోహన్ సతీమణి గురుచరణ్‌కౌర్, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా తదితరులు



ఆర్థిక సంస్కర్తకు అశ్రునివాళి

మన్మోహన్ సింగ్ పార్థివదేహం వద్ద నివాళులర్పించిన రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ

- మన్మోహన్ నివాసానికి తరలివచ్చిన పార్టీల నేతలు, కేంద్ర మంత్రులు, ప్రముఖులు
- కుటుంబ సభ్యులకు పరామర్శ.. ప్రగాఢ సానుభూతి తెలిపిన నేతలు
- నేడు ఉదయం 11.45 గంటలకు అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు
- స్మారకం నిర్మించడానికి వీలైన చోటే ఆయన అంత్యక్రియలు నిర్వహించాలి
- ప్రధాని నరేంద్ర మోదీకి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే లేఖ
- దివంగత మాజీ ప్రధానమంత్రికి కేంద్ర కేబినెట్, సీడబ్ల్యూసీ సంతాపం

6లో

ఫోరెన్సిక్ ఆడిటింగ్‌పై 'రెవెన్యూ'లో గుబులు



డిజిటల్ ఫుట్‌ప్రింట్స్‌తో తేలనున్న ధరణి రికార్డుల తారుమారు గుట్టు

- నిషేధిత జాబితాలోని భూములే టార్గెట్‌గా అక్రమాలు?... రికార్డులు స్వాధీనం చేసుకున్న ఎన్‌ఐసీ
- ఎన్‌ఐసీ చేతికి పోర్టల్ నిర్వహణ వచ్చాక ఆడిటింగ్‌పై విధాన ప్రకటన!
- తహసీల్దార్ల గుండెల్లో రైళ్లు

సాక్షి, హైదరాబాద్: 'ధరణి పోర్టల్ పేరుతో గత ప్రభుత్వంలోని పెద్దలు అక్రమాలకు పాల్పడ్డారు. అర్ధరాత్రి భూముల రికార్డులు మార్చేశారు. ఇదో పెద్ద ఆర్థిక నేరం. ఈ అక్రమాల నిగ్గు తేల్చేందుకు ధరణి పోర్టల్ లావాదేవీలపై ఫోరెన్సిక్ ఆడిటింగ్ జరుపుతాం..' ఇది ఇటీవల ముగిసిన శాసనసభ శీతాకాల సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రకటన. ఈ ప్రకటన రెవెన్యూ శాఖలో గుబులు రేపుతోంది. ఫోరెన్సిక్ ఆడిటింగ్ ఎలా ఉంటుంది? ఏఏ లావాదేవీలపై ఆడిటింగ్ చేస్తారు? ఎవరిని బాధ్యులుగా తేలుస్తారు? మిగతా 14వ పేజీలో ▶

రిజిస్ట్రేషన్ల రాబడిపై త్వరలో కీలక భేటీ!



- అధికారులతో మంత్రి పొంగులేటి సమావేశమయ్యే అవకాశం
- భూవిలువల సవరణ అంశమూ చర్చకు వచ్చే చాన్స్...
- ఈ ఏడాది రూ.3 వేల కోట్ల లోటు బాటలో వెళుతున్న కీలక శాఖ

3లో

ఈనెల 31 వరకు కేటీఆర్ అరెస్టు వద్దు



- ఫార్ములా-ఈ కేసులో ఏసీబీకి హైకోర్టు ఆదేశం
- మధ్యంతర ఉత్తర్వుల ఎత్తివేతకు నిరాకరణ
- అఫిడవిట్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి ఆదేశం... విచారణను 31కి వాయిదా వేసిన న్యాయమూర్తి

3లో

శుభమస్తు.. ఆరోగ్య'మస్తు'

2025

కొత్త ఏడాది నాడు..
పెద్దలు దీవెనలిస్తారు
ఫ్రెండ్స్ విషెస్ చెబుతారు
పిల్లలకు కానుకలిస్తారు
మరి పెద్ద పెద్ద డాక్టర్లో..?

కొత్త సంవత్సరంలో 'అందరికీ ఆరోగ్య మస్తు' అని దీవిస్తూనే.. ఆరోగ్య రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సలహా–సూచనలను 'కన్సల్టేషన్'గా అందిస్తున్నారు. దాన్నే సమగ్రంగా, సంక్షిప్తంగా, చిరు కానుకగా ప్రత్యేక పేజీ రూపంలో 'సాక్షి' అందిస్తోంది.

7లో






రేపటి 'ఫన్‌డే'కి బదులుగా సాక్షి 2025 క్యాలెండర్‌ను ఉచితంగా అందుకోండి

ఇదండీ సంగతి




ఈ బహుమతి,
మిమ్మల్ని ఎప్పుడూ
తలుచుకునేలా చేస్తుంది.
Prestige
NEW YEAR BO-NAN-ZA
న్యూ ఇయర్ బొనాంజా
డిసెంబర్ 21, 2024 నుండి జనవరి 26, 2025 వరకు
కొనండి
ట్రై-ప్లై స్వచ్ఛ్ ప్రెషర్ కుక్కర్ కాంబో
₹9 180.00 విలువగల 5లీ + 3లీ ఔటర్ లిడ్
కేవలం ₹6 395.00 కే
లేదా
₹8 285.00 విలువగల 5లీ + 3లీ ఇన్నర్ లిడ్
కేవలం ₹5 795.00 కే
స్టెయిన్‌లెస్ స్టీల్ స్వచ్ఛ్ ప్రెషర్ కుక్కర్ కాంబో
కొనండి
₹6 090.00 విలువగల
ఎసెన్షియల్ ఇన్నర్ లిడ్ 5లీ + 3లీ కాంబో
కేవలం ₹4 495.00 కే
లేదా
₹5 870.00 విలువగల
పాప్యులర్ ఔటర్ లిడ్ 5లీ + 3లీ కాంబో
కేవలం ₹4 395.00 కే
₹5 325.00 విలువగల
ట్రై-ప్లై కుక్‌వేర్ 3Pc సెట్
కొనండి
కేవలం ₹3 195.00 కే
₹3 980.00 విలువగల
ప్లాటిన కుక్‌వేర్ 3Pc సెట్
కొనండి
కేవలం ₹2 295.00 కే
₹4 235.00 విలువగల
సెరాగ్లైడ్ నాన్ స్టిక్ కుక్‌వేర్ 3Pc సెట్
కొనండి
కేవలం ₹2 595.00 కే
₹3 195.00 విలువగల
స్టెయిన్‌లెస్ స్టీల్ 24Pc డిన్నర్ సెట్
కొనండి
కేవలం ₹2 095.00 కే
JUDGE
మిగతా కేటగిరీలలో మరిన్ని డీల్స్ ని మిస్ అవ్వకండి.
*నిబంధనలు వర్తించును. పైన ఇచ్చిన ధరలన్నీ ప్రొడక్ట్ యొక్క MRP (అన్ని టాక్స్ లు కలిపి). MRP పై మాత్రమే డిస్కౌంట్స్ వర్తిస్తాయి. ఏ రెండు ఆఫర్స్ కలపకూడదు. MRP, నిబంధనలు మరియు షరతులకు సంబంధించిన మరిన్ని వివరాలు కోసం మీ సమీపంలోని ఎక్స్‌క్లూజివ్/డీలర్ అవుట్లెట్ ని సందర్శించండి.
PRIDE IN INDIA
CUSTOMER CARE NO 080-6000 4411
Store Locator
Scan to Connect
Shop Online on shop.ttkprestige.com
ttk
Prestige Xclusive
ప్రెస్టీజ్ ఎక్స్‌క్లూసివ్ లో మరియు లీడింగ్ డీలర్ అవుట్‌లెట్స్ లో లభిస్తుంది.
Prestige
తనవాళ్ళ మీద ప్రేమ ఉన్నవారు ప్రెస్టీజ్‌ని ఎలా కాదనగలరు.

31 వరకు కేటీఆర్ అరెస్టు వద్దు

- ఫార్ములా–ఈ కేసులో ఏసీబీకి హైకోర్టు ఆదేశం
- 'కేటీఆర్ అరెస్టు'పై ఇచ్చిన స్టేను రద్దు చేయాలని ఏసీబీ విజ్ఞప్తి
- కానీ మధ్యంతర ఉత్తర్వుల ఎత్తివేతకు నిరాకరించిన కోర్టు
- అఫిడవిట్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి ఆదేశం
- విచారణను ఈ నెల 31కి వాయిదా వేసిన న్యాయమూర్తి



సాక్షి, హైదరాబాద్: ఫార్ములా–ఈ కార్ రేసు కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను ఈ నెల 31 వరకు అరెస్టు చేయవద్దని ఏసీబీని హైకోర్టు ఆదేశించింది. కేటీఆర్‌ను అరెస్టు చేయవద్దంటూ గతంలో జారీ చేసిన ఉత్తర్వులను ఎత్తివేయాలన్న ఏసీబీ విజ్ఞప్తిని తోసిపుచ్చింది. వాదనలు వినకుండా ఉత్తర్వులను మార్చలేమని స్పష్టం చేసింది. గత విచారణ సందర్భంగా 30వ తేదీ వరకు అరెస్టు వద్దని మధ్యంతర ఉత్తర్వులిచ్చిన కోర్టు.. శుక్రవారం దానిని 31వ తేదీ వరకు పొడిగించింది. ఆలోగా కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ.. విచారణను ఈ నెల 31వ తేదీకి వాయిదా వేసింది. ఫార్ములా–ఈ కార్ రేసు వ్యవహారంపై రాష్ట్ర అవినీతి నిరోధక విభాగం (ఏసీబీ) ఈ నెల 19న కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. మాజీ మంత్రి కేటీఆర్, ఇద్దరు అధికారులను నిందితులుగా చేర్చింది. ఆ ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలంటూ కేటీఆర్ ఈ నెల 20న హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై న్యాయమూర్తి కె.లక్ష్మణ్ శుక్రవారం విచారణ చేశారు. కేటీఆర్ తరఫున సీనియర్ న్యాయవాది గండ్ర మోహన్‌రావు, ప్రభుత్వం తరఫున ఏజీ సుదర్శన్‌రెడ్డి, ఏఏజీ తేరా రజనీకాంత్‌రెడ్డి కోర్టులో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏసీబీ కౌంటర్ దాఖలు చేసింది. కేటీఆర్‌ను అరెస్టు చేయవద్దంటూ గతంలో ఇచ్చిన ఆదేశాలను ఎత్తివేయాలంటూ అఫిడవిట్ దాఖలు చేసింది.

నిబంధనలకు విరుద్ధంగా నగదు బదిలీ..

కోర్టులో ఏసీబీ తరఫున కేసు విచారణాధికారి, డీఎస్పీ మాజీద్ అలీఖాన్ కౌంటర్ దాఖలు చేశారు. ''కేటీఆర్ మంత్రిగా ఉండి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు. తన పరిధిలోని ప్రజాధనాన్ని నిబంధనలకు విరుద్ధంగా బదిలీ చేయడానికి సహకరించి విశ్వాస ఘాతుకానికి పాల్పడ్డారు. దీనిపై ఈ నెల 18న మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్ ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు అందిన తర్వాత దర్యాప్తు ప్రారంభించడం కోసం ప్రభుత్వంలోని అధీకృత అధికారులకు ఏసీబీ డీజీ లేఖ రాశారు. వారి ఆమోదంతో ఈ నెల 19న ఎఫ్ఐఆర్ నమోదు చేశాం. ప్రాథమిక దశలోనే దర్యాప్తును తప్పుబడుతూ పిటిషనర్ (కేటీఆర్) హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ప్రారంభ దశలోనే దర్యాప్తులో జోక్యం చేసుకుని నిందితులకు ఊరట కలిగేలా ఉత్తర్వులు జారీచేసే అధికారం కోర్టులకు కూడా స్వల్పమే. ప్రాథమిక దశలోనే విచారణను అడ్డుకునేలా ఎలాంటి ఆదేశాలు ఇవ్వకూడదని సుప్రీం కోర్టు గతంలో తీర్పునిచ్చింది. దర్యాప్తును అడ్డుకునేందుకు, ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయాలంటూ పిటిషనర్ దాఖలు చేసిన పిటిషన్ విచారణార్హం కాదు. దాన్ని కొట్టివేయాలి. అలాగే ఈ నెల 20న ఇచ్చిన 'అరెస్టు వద్దు'అనే ఆదేశాలను ఎత్తివేయాలి''అని ఏసీబీ కౌంటర్‌లో పేర్కొన్నారు.

రాజకీయ పగతోనే కేసు పెట్టారు...

ఏసీబీ కౌంటర్‌పై న్యాయవాది ద్వారా కేటీఆర్ కోర్టుకు సమాధానమిచ్చారు. ''ఏసీబీ కౌంటర్‌లోని అన్ని అంశాలను పరిశీలించాను. ఆ ఆరోపణలు అవాస్తవాలు. నాపై ఎఫ్ఐఆర్‌కు ప్రాథమిక ఆధారమేమిటో పేర్కొనలేదు. ఎలాంటి అవినీతి జరగకున్నా ప్రభుత్వం రాజకీయ పగతోనే నేర పరిశోధన సంస్థలను రంగంలోకి దించింది. ఎఫ్ఐఆర్‌లో పెట్టిన సెక్షన్లు ఏవీ దీనికి వర్తించవు. కేసు నమోదులో తీవ్ర జాప్యానికి కారణాలు పేర్కొనలేదు. కేసును కొట్టివేసే అధికారం కోర్టుకు ఉంది. ఆర్థికపరమైన చిక్కులేమిటో చెప్పకుండా ప్రైవేట్ స్పాన్సర్ పాత్రను ప్రభుత్వంపై మోపారనే ఆరోపణ సరికాదు. రెగ్యులేటరీ అధికారుల నుంచి అవసరమైన అనుమతులు పొందకుండానే విదేశాలకు నగదు బదిలీ చేశారని ఆరోపిస్తున్నారు. ఎవరి ఆమోదమో స్పష్టంగా చెప్పలేదు. బ్యాంక్ అధీకృత డీలర్లు, ఏదైనా ముందస్తు అనుమతి అవసరమైతే సంబంధిత అధికారులు పరిశీలించాల్సి ఉంటుంది. ఎంఏయూడీ మంత్రిగా విధులు నిర్వహించిన నాపై నిందలు మోపారు. ఆ నిర్ణయంలో లోపాలుంటే ప్రభుత్వమే తన నిర్ణయాన్ని రద్దు చేసుకోవాలి. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి మంత్రిగా నన్ను బాధ్యుడ్ని చేయడం చట్ట వ్యతిరేకం. అవినీతి నిరోధక చట్టం–1988లోని సెక్షన్ 13(1)(ఎ), సెక్షన్ 13(2) ఈ కేసులో వర్తించవు. ఐపీసీలోని 120–బీ, 409 సెక్షన్ల కింద కేసు నమోదు వెనుక కుట్ర ఉంది. ఇలాంటి తీవ్ర నేరాభియోగాలతో కేసు నమోదు చేస్తే.. నోటీసులిచ్చి విచారణ చేయాల్సిన అవసరం లేకుండా ఉంటుందనే కుట్ర దాగి ఉంది. వ్యక్తిగతంగా నన్ను సర్కార్ టార్గెట్ చేసింది''అని కేటీఆర్ పేర్కొన్నారు. ఇరు వర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి విచారణను ఈ నెల 31కి వాయిదా వేశారు.

బీసీ రిజర్వేషన్లు పెంచాకే 'స్థానిక' ఎన్నికలు జరపాలి

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత
- లేదంటే ఎన్నికలు జరగనివ్వం
- హామీల అమలు కోసం జనవరి 3న ఇందిరాపార్కు వద్ద సభ



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచని పక్షంలో స్థానిక సంస్థల ఎన్నికలను జరగనివ్వబోమని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కామారెడ్డి డిక్లరేషన్ పేరిట ఇచ్చిన హామీని అమలు చేయకుంటే ఉద్యమిస్తామన్నారు. బీసీలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలనే డిమాండ్‌తో జనవరి 3న ఇందిరాపార్కు వద్ద భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని కవిత ప్రకటించారు. 40కి పైగా బీసీ సంఘాల నాయకులతో శుక్రవారం కవిత తన నివాసంలో భేటీ అయ్యారు. బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలు, కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుకు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు అనుసరించాల్సిన కార్యాచరణపై ఆమె బీసీ సంఘాల నాయకులతో చర్చించారు. అనంతరం సమావేశంలో చర్చించిన అంశాలను మీడియాతో పంచుకున్నారు. 'స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. కానీ ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్ల పెంపు అంశంపై స్పష్టత ఇవ్వడం లేదు'అని కవిత పేర్కొన్నారు.

జనవరి 3న సినిమా చూపిస్తాం

'స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచాలనే డిమాండ్‌తో మండల, జిల్లా కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు జరుపుతాం. బీసీ డెడికేషన్ కమిషన్ నివేదిక సమర్పణ, బీసీల జనాభా సంఖ్యను వెల్లడించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ దిశగా ప్రభుత్వం ఆలోచించాలి. బీసీల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన అనేక పథకాల అమలును కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసింది. మొత్తంగా బీసీల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని ప్రశ్నిస్తూ, స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు పెంచాలనే డిమాండ్‌తో జనవరి 3న జరిపే సభ ద్వారా ప్రభుత్వానికి సినిమా చూపిస్తాం'అని కవిత ప్రకటించారు.

రిజిస్ట్రేషన్ల రాబడిపై త్వరలో కీలక భేటీ!

- అధికారులతో మంత్రి పొంగులేటి సమావేశమయ్యే అవకాశం
- ఈ ఏడాది రూ.3 వేల కోట్ల లోటు బాటలో వెళుతున్న కీలక శాఖ

సాక్షి, హైదరాబాద్: స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖపై వచ్చే వారంలో కీలక భేటీ జరగనున్నట్టు తెలుస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరానికి గాను ఈ శాఖ ద్వారా రూ.18 వేల కోట్ల ఆదాయం వస్తుందని ప్రభుత్వం అంచనా వేయగా, ప్రస్తుతం అందులో 15 శాతానికి పైగా లోటు బాటలో వెళుతోంది. ప్రస్తుత అంచనాలను బట్టి ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి రూ.15 వేల కోట్ల ఆదాయం సమకూరడం కష్టమనే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో ఆ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి శాఖ పనితీరుపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నారని, అందులో భాగంగానే వచ్చే వారంలో ఉన్నతాధికారులు, జిల్లా రిజిస్ట్రార్లతో సమావేశం నిర్వహించనున్నారని సమాచారం. ఈ సమావేశంలో భాగంగా రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయం పెంచుకునే మార్గాలపై ఆయన దిశానిర్దేశం చేస్తారని, ముఖ్యంగా ఎల్ఆర్ఎస్, అనధికారిక లేఅవుట్ల రిజిస్ట్రేషన్లపై పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖలతో కలిసి సమన్వయంతో ముందుకెళ్లే కార్యాచరణ రూపొందిస్తారని తెలుస్తోంది. దీంతో పాటు పెండింగ్‌లో ఉన్న జీవో 59 దరఖాస్తుల పరిష్కారం, ఈ ఏడాది ఆగస్టులోనే జరగాల్సిన భూముల విలువల సవరణ అంశాలు చర్చకు వచ్చే అవకాశముందని, వీటి విషయంలో కూడా రిజిస్ట్రేషన్ల శాఖ అభిప్రాయం తీసుకుని నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయనే చర్చ జరుగుతోంది.

సంక్రాంతికి ఏపీఎస్ ఆర్టీసీ 2,400 ప్రత్యేక బస్సులు



సాక్షి, హైదరాబాద్: సంక్రాంతి సందర్భంగా సొంత ఊళ్లకు వెళ్లే ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని హైదరాబాద్ నుంచి ఏపీలోని వివిధ ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు నడిపేందుకు ఏపీఎస్ ఆర్టీసీ చర్యలు చేపట్టింది. రెగ్యులర్‌గా నడిచే సర్వీసులతో పాటు 2,400 బస్సులను అదనంగా ఏర్పాటు చేయనున్నట్లు డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ ఎల్.విజయలక్ష్మి తెలిపారు. ప్రత్యేక బస్సులు జనవరి 9 నుంచి 13వ తేదీ వరకు అందుబాటులో ఉంటాయి. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి ఈ బస్సులు బయలుదేరుతాయి. సాధారణ చార్జీలతోనే ప్రత్యేక బస్సులను నడుపుతారు. ప్రయాణికులు ఏపీఎస్ఆర్టీసీ వెబ్‌సైట్ నుంచి లేదా అధీకృత టికెట్ బుకింగ్ ఏజెంట్ల నుంచి ముందస్తుగా బుక్ చేసుకోవచ్చు. ఎంజీబీఎస్‌లో ప్రయాణికులు, బస్సుల రద్దీ దృష్ట్యా.. జనవరి 10వ తేదీ నుంచి 12 వరకు కర్నూలు, అనంతపురం, చిత్తూరు, నెల్లూరు, ఒంగోలు, మాచర్ల వైపు వెళ్లే రెగ్యులర్, ప్రత్యేక బస్సులను గౌలిగూడ సీబీఎస్ నుంచి నడుపుతారు.

మహాకుంభమేళాకు ప్రత్యేక రైళ్లు



సాక్షి, హైదరాబాద్: జనవరి 13వ తేదీ నుంచి ఫిబ్రవరి 26 వరకు ప్రయాగ్‌రాజ్‌లో జరగనున్న మహాకుంభమేళా సందర్భంగా ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు మౌలాలి–ఆజాంఘర్ (0707/0708) ప్రత్యేక రైలు జనవరి 18వ తేదీ, ఫిబ్రవరి 21 తేదీల్లో రాత్రి 11.55 గంటలకు బయల్దేరి మర్నాడు సాయంత్రం 5.15 గంటలకు ఆజాంఘర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో జనవరి 20, ఫిబ్రవరి 23 తేదీల్లో సాయంత్రం 7.45 గంటలకు బయల్దేరి మర్నాడు ఉదయం 7.30 గంటలకు మౌలాలి చేరుకుంటుంది. మౌలాలి–గయ (07711/7712) ప్రత్యేక రైలు జనవరి 19వ తేదీ సాయంత్రం 5.50 గంటలకు బయల్దేరి.. మర్నాడు ఉదయం 9 గంటలకు గయ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో జనవరి 21వ తేదీ సాయంత్రం 7.45 గంటలకు బయల్దేరి.. మర్నాడు ఉదయం 7.30 గంటలకు మౌలాలి చేరుకుంటుంది. మౌలాలి–గయ (07729/07730) ప్రత్యేక రైలు జనవరి 22వ తేదీ సాయంత్రం 5 గంటలకు బయల్దేరి.. మర్నాడు ఉదయం 9.30 గంటలకు గయ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో జనవరి 24వ తేదీ సాయంత్రం 7.45 గంటలకు బయల్దేరి.. మర్నాడు ఉదయం 7.30 గంటలకు మౌలాలి చేరుకుంటుంది. కాచిగూడ–పట్నా (07725/07726) ప్రత్యేక రైలు జనవరి 25వ తేదీ సాయంత్రం 4.45 గంటలకు బయల్దేరి.. మర్నాడు ఉదయం 10.30 గంటలకు పట్నా చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో జనవరి 27వ తేదీ ఉదయం 11.30 గంటలకు బయల్దేరి.. మర్నాడు ఉదయం 7 గంటలకు కాచిగూడ చేరుకుంటుంది. గుంటూరు–ఆజాంఘర్ (07701/07702) ప్రత్యేక రైలు జనవరి 24వ తేదీ రాత్రి 11 గంటలకు గుంటూరులో బయల్దేరి.. మర్నాడు సాయంత్రం 5.15 గంటలకు ఆజాంఘర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 26వ తేదీ సాయంత్రం 7.45 గంటలకు ఆజాంఘర్‌లో బయల్దేరి.. మర్నాడు ఉదయం 9 గంటలకు గుంటూరు చేరుకుంటుంది. గుంటూరు–గయ (07719/07720) ప్రత్యేక రైలు జనవరి 25వ తేదీ మధ్యాహ్నం 2.20 గంటలకు గుంటూరులో బయల్దేరి.. మర్నాడు ఉదయం 9 గంటలకు గయ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 27వ తేదీ మధ్యాహ్నం 2.15 గంటలకు గయలో బయల్దేరి.. మర్నాడు ఉదయం 4 గంటలకు గుంటూరు చేరుకుంటుంది.

పెండింగ్ బిల్లుల కోసం మహాత్ముడికి వినతి

మాజీ సర్పంచుల వినూత్న నిరసన

సాక్షి, హైదరాబాద్: పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ వినూత్న నిరసన తెలిపింది. బాపూఘాట్‌లోని మహాత్మా గాంధీ విగ్రహానికి శుక్రవారం ఉదయం వినతిపత్రాన్ని సమర్పించింది. ఈ సందర్భంగా తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ మాట్లాడుతూ.. తాము సర్పంచులుగా ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు విడుదల చేయకుండా ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోందన్నారు. పదవీ కాలం ముగిసిన తర్వాత కూడా బకాయిలు చెల్లించకపోవడంతో మాజీ సర్పంచులు తీవ్ర ఆందోళనలో ఉన్నారన్నారు.

ఎవరు సుఖదుఃఖ భేదములెంచరో,
ఎవరికి వ్యథ కలుగదో వారు అమృతత్వమునకు అర్హులు.
– హిందూ ధర్మం

సాక్షి
శనివారం, 28 డిసెంబర్ 2024

దేశం మరువలేని దార్శనికుడు

చరిత్ర సృష్టించటం, దాన్ని తిరగరాయటం, వినూత్న ఒరవడికి శ్రీకారం చుట్టడం అందరివల్లా కాదు. ప్రపంచాన కోట్లమందిలో ఒక్కరికి కూడా ఆ అవకాశం అంత సులభంగా దక్కదు. కొన్ని తరాలకు ఒకరైనా అలాంటివారు ఉద్భవిస్తారంటే నమ్మలేం. అలాంటి అరుదైన విశిష్ట వ్యక్తుల్లో గురువారం రాత్రి కన్నుమూసిన మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ ఒకరు. పేదింట పదిమంది సంతానంలో ఒకరిగా, కిరోసిన్ లాంతరు దగ్గర చదువుకున్న మన్మోహన్ జీవితంలో అధిరోహించిన శిఖరాలు ఉన్నతమైనవి. 1991లో నాటి ప్రధాని పీవీ నరసింహారావు ఆయనను ఆర్థికమంత్రిగా ప్రకటించినప్పుడు అందరూ విస్తుపోయారు. ఆయనే నమ్మలేదు. అప్పటికే ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో అధ్యాపకుడిగా పనిచేశారు. జెనీవా కేంద్రంగా పనిచేసే స్వతంత్ర ఆర్థిక మేధావుల బృందం సౌత్ కమిషన్‌కు సెక్రటరీ జనరల్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా, రిజర్వ్‌బ్యాంక్ గవర్నర్‌గా ఉన్నారు. యూజీసీ ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. రాజకీయాల్లో మనుగడ సాగించటానికి అవసరమైన వాగ్ధాటి, సులభంగా చొచ్చుకుపోయే తత్వంలేని ఒక విద్యావేత్త, ఆర్థిక నిపుణుడు దేశానికి ఆర్థికమంత్రేమిటని ఆశ్చర్యపోయారు. కానీ అందరూ అనుకున్నట్టు ఆయన సాధారణ వ్యక్తి కాదని త్వరలోనే అర్థమైంది. దేశాన్ని ప్రగతి పట్టాలెక్కించి శరవేగంతో పరుగులెత్తించగల నూతన ఆర్థిక విధానాలను సృజించటంలో అసాధారణ ప్రజ్ఞాపాటవాలు గలవాడని సర్వులూ గ్రహించారు. కేంద్ర ఆర్థికమంత్రిగా 1991లో ఆయన ప్రవేశపెట్టిన బడ్జెట్ స్వతంత్ర భారతంలో ఎన్నడూ ఎరుగనిది. ఫేబియన్ సోషలిజం భావనల ఆధారంగా నెహ్రూ విరచించిన సామ్యవాద ఆర్థిక విధానాల నుంచి లేశమాత్రం వైదొలగినా దేశం అధోగతి పాలవుతుందని అప్పట్లో కాంగ్రెస్ విశ్వసించేది. మరోపక్క రకరకాల నియంత్రణలతో 'లైసెన్స్ రాజ్'గా అపకీర్తి పాలైంది మన వ్యవస్థ. ఎన్నో ఆర్థిక క్లేశాలతో, మరెన్నో ఒడుదొడుకులతో ఉన్న ఆ వ్యవస్థకు తన వినూత్న బడ్జెట్‌తో సంపూర్ణ జవసత్వాలిచ్చినవారు మన్మోహన్. అన్యుల కీర్తిని అపహరించటానికి ససేమిరా ఇష్టపడని పీవీ... ఆర్థిక సంస్కరణల కర్త, కర్మ, క్రియ కూడా ఆయనేనని చాటారు. అందువల్లే సారథిగా పీవీయే ఉన్నా సంస్కరణల ఆద్యుడిగా మన్మోహన్‌నే గుర్తిస్తారు. ఆయన విధానాల పర్యవసానంగా అంతవరకూ నిలువెల్లా ఆవరించిన నిర్జయ రాహిత్యత కనుమరుగైంది. ఒక్కుమ్మడిగా ప్రైవేటు పెట్టుబడి రెక్కలు విప్పుకుంది. లాభార్జన మాత్రమే ధ్యేయంగా భావించే విదేశీ పెట్టుబడులు వెల్లువెత్తాయి. పబ్లిక్ రంగ సంస్థలు సైతం పోటీలో దీటుగా నిలిస్తే తప్ప మనుగడ లేదని గ్రహించాయి.

'చరిత్ర అయినా నన్ను దయతో గుర్తుపెట్టుకుంటుందని ఆశిస్తాను' అని ఒక సందర్భంలో అన్నారాయన. తనపై వచ్చిపడుతున్న విమర్శల జడికి ఆ హృదయం ఎంతగా తల్లడిల్లిందో చెప్పే మాట అది. నిజం... ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టినప్పుడైనా, పార్టీలోనూ వెలుపలా వచ్చిన అవాంతరాలను అధిగమించి దృఢంగా అమలు చేసినప్పుడైనా ఆయనకు శాపనార్థాలు ఎదురయ్యాయి. సొంత పార్టీలోనే వ్యతిరేకులు తయారయ్యారు. తొలినాళ్లలోనే ఏదోరకంగా పక్కకు తప్పించాలన్న ప్రయత్నాలూ జరిగాయి. మన రహస్యాలను ఐఎంఎఫ్‌కు చేరేస్తున్నారనీ, ఆ సంస్థ కనుసన్నల్లో విధానాలు రూపొందిస్తున్నారనీ ఎలాంటి ఆధారాలూ లేకుండానే కొందరు వండి వార్చారు. పార్లమెంటులో అలజడి ఖాయమనుకున్నారు. కానీ అప్పటికే మన్మోహన్ నిజాయితీ, నైతిక నిష్ఠ, నిష్కాపట్యత, సచ్ఛీలత అందరికీ అర్థమయ్యాయి గనుక అవన్నీ దూదిపింజెల్లా తేలిపోయాయి. వాటిని విపక్షం సభలో ప్రస్తావించినా పెద్దగా పట్టుబట్టలేదు. ఆ తర్వాత పీవీ సహచర మంత్రుల్లో కనీసం 20 మందిపై అనేక అవినీతి ఆరోపణలు వచ్చినా మన్మోహన్‌ను వేలెత్తిచూపే సాహసం ఎవరూ చేయలేదు. ఆ సుగుణాలే మన్మోహన్‌ను అనంతర కాలంలో ప్రధానిగా ఎంచుకునేందుకు దోహదపడ్డాయి. దేన్నయినా సాధించటంలో ఆయన పట్టుదల ఎంతటిదో చెప్పటానికి అమెరికాతో కుదిరిన అణు ఒప్పందమే ఉదాహరణ. మద్దతునిస్తున్న వామపక్షాలూ, ఇతర పార్టీలూ ససేమిరా కాదన్నా ఆ ప్రతిపాదనను పార్లమెంటు ముందుంచి ఆమోదింపజేసుకున్న సాహసి ఆయన.

మన్మోహన్ అత్యున్నత స్థాయి ఆర్థిక నిపుణుడు కావొచ్చు... ఆ రంగంలో ఎదురవుతున్న సవాళ్లకు పరిష్కారం విప్పిచెప్పిన అనేకానేక విశ్లేషణాత్మక గ్రంథాల రచయిత కావొచ్చు. కానీ సిద్ధాంత రాద్ధాంతాల్లో కూరుకుపోకుండా కళ్లెదుటి వాస్తవాలను ఆచరణీయ దృక్పథంతో పరిశీలించి సరిగా స్పందించగల విశాల దృక్పథం ఉన్న నాయకుడు. ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి 2004లో ఉచిత విద్యుత్ ప్రతిపాదన చేసినప్పుడు మొదట్లో దాన్ని ఇష్టపడకున్నా సాగు సంక్షోభాన్ని అధిగమించటానికి అది తోడ్పడిన తీరు గుర్తించాక మన్మోహన్ దాన్ని స్వాగతించిన తీరు మరువలేనిది. ప్రజాజీవన రంగంలో పారదర్శకత కోసం సమాచార హక్కు చట్టం, విద్యను ప్రాథమిక హక్కుగా గుర్తించే విద్యాహక్కు చట్టం, రెక్కాడితేగానీ డొక్కాడని బడుగుజీవులకు కరువురోజుల్లో పని కల్పన కోసం ఉపాధి హామీ చట్టం వంటివి తీసుకొచ్చి విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టినా ఏనాడూ ఆయన కీర్తిప్రతిష్ఠలను ఆశించలేదు. తన విధానాలతో దేశాన్ని వైభవోజ్జ్వల శకానికి తీసుకెళ్లినా చివరివరకూ నిగర్విగా, వినమ్రుడిగా జీవించిన దార్శనికుడు మన్మోహన్‌ను ఈ దేశం ఎన్నటికీ మరిచిపోదు. ఆ అసాధారణ, అపురూప విజ్ఞాన ఖనికి 'సాక్షి' నివాళులర్పిస్తోంది.

విలక్షణ జ్ఞాని... విధేయ ప్రధాని!

ఆర్థిక రంగంలో, మిశ్రమ రాజకీయాల్లో ఆయన భిన్న పాత్రలు పోషించినా... కేవలం సోనియా విధేయుడిగా మాత్రమే కొందరు మాట్లాడటం పాక్షికత్వాన్నే చెబుతుంది. నిస్సందేహంగా ఆయన దేశ సమగ్రతకూ, మానవీయ విలువలకూ విధేయుడిగా కనిపిస్తాడు. వైఎస్ రాజశేఖరరెడ్డిని ఆయన అత్యధికంగా గౌరవించారంటే ఈ కొలబద్దలే కారణం. 'వైఎస్ అక్కడ ఉన్నారు గనకే నేను ఇక్కడ ఉన్నాను' అని ప్రధాని తనతో చెప్పేవారని మీడియా సలహాదారు సంజయ్ బారు ఇటీవల కూడా వెల్లడించారు.

'మౌన ముని' కాదు... మొండిమనిషి


తెలకపల్లి రవి

అసహన రాజకీయాలూ, దూషణలూ–దుర్భాషలూ తాండవిస్తున్న ఈ రోజుల్లో కూడా... దశాబ్దకాలపు మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌ను దేశం మొత్తం ఏకోన్ముఖంగా గౌరవించడం ఆయన వ్యక్తిత్వాన్ని తెలుపుతుంది. తన అధ్యయనం, అనుభవం, అంతర్గత విలువలు ఆయనను అందరికీ ప్రీతిపాత్రుణ్ణి చేశాయి. సరళీకరణ విధానాలతో పూర్తిగా, కచ్చితంగా విభేదించే వామపక్షాల వంటివి కూడా ఆయన లౌకిక నిబద్ధతను గౌరవించాయి. రాజకీయంగా బద్ధ శత్రువైన బీజేపీ నేతలు కూడా ఆర్థిక రంగంలో మన్మోహన్ ముద్రలను కీర్తిస్తున్నారు. బొత్తిగా పొసగని ఈ భిన్న శిబిరాల మన్ననకు పాత్రుడవడం ఆయనకే చెల్లింది. ఆర్థిక రంగంలో, మిశ్రమ రాజకీయాల్లో ఆయన భిన్న పాత్రలు పోషించినా... కేవలం, సోనియా విధేయుడుగా మాత్రమే కొందరు మాట్లాడటం పాక్షికత్వాన్నే చెబుతుంది. నిస్సందేహంగా ఆయన దేశ సమగ్రతకూ, మానవీయ విలువలకూ విధేయుడిగా కనిపిస్తాడు. వైఎస్ రాజశేఖరరెడ్డిని ఆయన అత్యధికంగా గౌరవించారంటే ఈ కొలబద్దలే కారణం. 'వైఎస్ అక్కడ (ఉమ్మడి ఏపీలో) ఉన్నారు గనకే నేను ఇక్కడ ఉన్నాను' అని ప్రధాని తనతో ఎప్పుడూ చెప్పేవారని మీడియా సలహాదారు సంజయ్ బారు ఇటీవల కూడా వెల్లడించారు. యాదృచ్ఛిక లేదా అనూహ్య ప్రధాని అని ఆయనపై పుస్తకమే రాసిన సంజయ్ బారు స్వయంగా చేసిన ఈ వ్యాఖ్యలు మన్మోహన్ మనస్తత్వాన్నీ, వ్యక్తిత్వాన్నీ చెబుతాయి. వైఎస్ హయాంలో ఎన్నో పథకాలకూ, కార్యక్రమాలకూ మన్మోహన్ ఇష్టపూర్వకంగా వచ్చేవారు. వామపక్షాల చొరవతో మొదలైన 'గ్రామీణ ఉపాధి పథకా'న్ని అనంతపురంలోనే ప్రారంభించారు. విభజన ఉద్యమంతో తెలంగాణ విభజన చట్టాన్ని ఆమోదించడం ఒకటయితే... ఆలస్యంగానైనా ఏపీకి ప్రత్యేక హోదా ప్రకటించడం రెండు రాష్ట్రాలతో ఆయన బంధాన్ని బలోపేతం చేసింది.

1991లో సోవియట్ యూనియన్ విచ్ఛిన్నమవ్వడం, పీవీ నరసింహారావు ప్రధాని పదవి చేపట్టడం కాస్త అటూ ఇటుగా జరిగాయి. అప్పటి వరకూ అనుసరించిన అలీన, స్వావలంబన విధానాల నుంచి విడగొట్టుకుని... కార్పొరేట్, ప్రైవేటీకరణ విధానాల వైపు మరలే ప్రక్రియను జాగ్రత్తగా అమలు చేయడానికి మన్మోహన్ సరైన వ్యక్తి అని పీవీతో పాటు ఆ వర్గాలు కూడా భావించాయనేది నిర్వివాదాంశం. మళ్లీ 2004లో సోనియాగాంధీ ప్రధాని పదవి చేపట్టరాదని నిర్ణయించుకున్నాక ఆ స్థాయిలో విశ్వసనీయత, విషయజ్ఞత ఉన్న నేతగా మన్మోహన్‌నే ఎంచుకోవడంలో ఆశ్చర్యం లేదు. వ్యక్తిగతంగా ప్రణబ్ ముఖర్జీ సమర్థుడైనా ఆ విధంగా ఆమె ఆధారపడగల పరిస్థితి ఉండదు. వామపక్షాల మద్దతుపై ఆధారపడి ఏర్పడిన యూపీఏ–1కు సారథ్యం వహించడమంటే భిన్న కోణాలను సమన్వయం చేయవలసి ఉంటుందనీ తెలుసు. చిల్లర వ్యాపారంలో విదేశీ కంపెనీలకు ద్వారాలు తెరవడంతో మొదలై అమెరికాతో అణు ఒప్పందంతో పరాకాష్ఠకు చేరిన విభేదాలు వామపక్షాలను దూరం చేయడం ఊహించిన పరిణామమే. తర్వాత కాలంలో పదవులు, ప్రయోజనాల బేరాలు తప్ప మరే విధాన సమస్యలు లేని ప్రాంతీయ మిత్రులను నిలబెట్టుకోవడానికీ, ఇష్టం లేని వారిని మంత్రులను చేయడంతో సహా ఆయన చాలా విన్యాసాలే చేయవలసి వచ్చింది. రక రకాల ఆరోపణలు, కుంభకోణాల కేసులతో పెనుగులాడవలసి వచ్చింది. ఆ క్రమంలోనే మిశ్రమ ప్రభుత్వం గనక రాజీ పడాల్సి వచ్చిందని ఆయన బాహాటంగా ఒప్పేసుకున్నారు. చివరకు మీడియా ఛానళ్ల అధినేతలతో సమావేశమై... యూపీఏ అంటేనే అవినీతి అన్నట్టు చిత్రించవద్దని అభ్యర్థించాల్సి వచ్చింది. ఆశ్చర్యకరమైన విషయమేమంటే... ఇన్ని ఆరోపణల మధ్యనా ఎవరూ ఆయన నిజాయితీని శంకించడం గానీ, తనకు వ్యక్తిగత బాధ్యత ఆపాదించడం గానీ జరక్కపోవడం!

2014 ఎన్నికలకు సిద్ధమవుతున్న తరుణంలోనే వెలువడిన సంజయ్ బారు పుస్తకంలో... ప్రధానిగా మన్మోహన్ ఫైళ్లు సోనియాగాంధీకి పంపించిన తర్వాతే నిర్ణయాలు తీసుకునేవారని ఆరోపించడంతో బీజేపీ వారు రంగంలోకి దిగిపోయారు. ఇది మోదీ బృందం ప్రచారానికి అస్త్రంగా వేసిన అభాండమని నాటి ప్రధాని కార్యాలయం ఖండించింది. అణు ఒప్పందం కుదరకపోతే రాజీనామా చేస్తానని అధిష్ఠానానికి సంకేతాలు ఇవ్వడం కూడా ఆయన ఎంత మొండి మనిషో నిరూపించింది. ఆర్థిక మంత్రిగా ఇన్ని తీవ్ర నిర్ణయాలు ఎలా తీసుకున్నారంటే... ఎప్పుడూ జేబులో రాజీనామా లేఖ పెట్టుకుని తిరిగేవాడినని ఆయన ఇచ్చిన జవాబులో చాలా అర్థముంది. రాజీవ్ గాంధీ దారుణ హత్య తర్వాత అనూహ్య పరిస్థితుల్లో పీవీ నరసింహారావు ప్రధాని అవడం, తనను ఆర్థికమంత్రిగా ఎంపిక చేయడం వెనక ఉన్న బలీయమైన పాలక వర్గాలేవో ఆయనకు తెలుసు.

మోదీని ప్రధాని అభ్యర్థిగా ముందుకు తెచ్చిన కొత్తలో మన్మోహన్‌ను తీవ్రంగానే ఢీకొన్నారు. మోదీ వచ్చాక దర్యాప్తు సంస్థలు ఆయనకు నోటీసులు పంపించాయి. అయినా తగ్గకుండా నిలబడ్డారు. నోట్లరద్దును చారిత్రక ఘోరతప్పిదం అని నిప్పులు కక్కారు. చక్రాల కుర్చీలో వచ్చి మరీ సభలో ఓటేశారు. అనారోగ్యంలోనూ మొన్నటి ఏప్రిల్ దాకా రాజ్యసభలో కాంగ్రెస్ సభ్యుడిగానే


నివాళి
మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్

ఉన్నారు. ఆయనను 'మౌన ముని'గా బీజేపీ అపహాస్యం చేసింది కానీ కీలక విషయాల్లో మౌనంగా లేరు. వాస్తవానికి నోట్ల రద్దు నుంచి అదానీ వ్యవహారం వరకూ చాలా విషయాల్లో మోదీయే సభలో సమాధానమివ్వకుండా మౌనం పాటించారు. మన్మోహన్‌ను, గాంధీ కుటుంబాన్నీ ప్రత్యర్థులుగా చూపడానికి ఎన్నిసార్లు ఎంత రెచ్చగొట్టినా మాజీ ప్రధాని సంయమనం వీడలేదు. ఆయన విదేశాల్లో ఉన్నప్పుడు రాహుల్ గాంధీ తన ప్రభుత్వ ఉత్తర్వును చించి వేసి ఆధిక్యత చూపించినా భరించారే గాని భగ్గుమనలేదు. దీన్ని అతి విధేయత అనాలా సంయమనం అనాలా అన్నది వారి కోణాలను బట్టి ఉంటుంది. అయితే వాజ్‌పేయి వంటి దిగ్గజానికి మోదీ వంటి పరివార్ అగ్ని బరాటాకు మధ్యలో తొలి ఏకైక సిక్కు ప్రధానిగా తన స్థానం నిలబెట్టుకోవడం చిన్న విషయమేమీ కాదు. మన్మోహన్ స్వయంగా ఒకసారి కోరినట్టు... దేశం, చరిత్ర ఆయన పట్ల నిర్దయగా కాక వాస్తవికంగా గౌరవంగానే వ్యవహరిస్తున్నాయి. మూడో దీర్ఘకాల ప్రధానిగా ఇక ముందు కూడా మన్మోహన్ సింగ్‌కు ఓ ప్రత్యేక స్థానముండనే ఉంటుంది!

వ్యాసకర్త సీనియర్ సంపాదకులు, విశ్లేషకులు

సంస్కరణల సారథి


డా॥ తిరునహరి శేషు

భారతదేశం గర్వించదగిన వ్యక్తులలో భారత మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ ఒకరు. 90వ దశకంలో ఆర్థిక సంస్కరణలను ప్రారంభించి భారత దేశ ఆర్థిక గమనాన్ని మార్చిన వ్యక్తి మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరని లోటు. 1991లో భారత ఆర్థిక మంత్రిగా బాధ్యతలు చేపట్టే నాటికి సంక్షోభంలో పడిన భారత ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడానికి ఆయన చేపట్టిన ఆర్థిక సంస్కరణలు సాహసోపేతమైనవి. 1990లో చంద్రశేఖర్ నేతృత్వంలో ఆపద్ధర్మ ప్రభుత్వం కొనసాగుతున్న కాలంలో రెండు అంకెలతో ఆకాశాన్నంటుతున్న ద్రవ్యోల్బణం, రుణ భారంతో పెరిగిన కోశలోటు, మూడు వారాలకి కూడా సరిపోని విదేశీ మారక ద్రవ్య నిల్వలు, పడిపోతున్న ఆర్థిక వృద్ధిరేటు, పెరిగిపోతున్న నిరుద్యోగం, పేదరికంతో కుదేలవుతున్న ఆర్థిక వ్యవస్థను... దేశ ఆర్థిక మంత్రి అయిన తర్వాత గాడిలో పెట్టడం, 2008లో వచ్చిన ఆర్థిక మాంద్యాన్ని తట్టుకొని భారత్ నిలబడేలా చేయడం వంటివాటిలో మన్మోహన్ కృషి అజరామరం.

నేడు భారత్ ప్రపంచంలో ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగి మూడవ స్థానం వైపుకి అడుగులు వేయటానికి మన్మోహన్ సింగ్ ప్రారంభించిన ఆర్థిక సంస్కరణలే పునాది వేశాయి. రిజర్వ్ బ్యాంకు గవర్నర్‌గా, యూజీసీ ఛైర్మన్‌గా, అంతర్జాతీయ వ్యాపార అర్థశాస్త్రంలో నిష్ణాతుడైన ప్రొఫెసర్‌గా, ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారుగా, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడిగా, ఆర్థిక మంత్రిగా, భారత ప్రధాన మంత్రిగా... భారత ఆర్థిక వ్యవస్థకు బలమైన గోడలు నిర్మించారనే చెప్పాలి. ప్రపంచ వాణిజ్యంలో భారత్ వాటాను పెంచే క్రమంలో తాను రూపొందించిన ఎగుమతులు– దిగుమతుల (ఎగ్జిమ్ పాలసీ) విధానం, విదేశాంగ విధానం భారతదేశాన్ని ప్రపంచంలో ఒక అగ్రశ్రేణి ఆర్థిక వ్యవస్థగా నిలబెట్టాయి. 1991 బడ్జెట్‌లో 1992 నూతన సరళీకరణ ఆర్థిక విధాన ప్రకటనతో భారత ఆర్థిక వ్యవస్థ సంకెళ్లను తెంచి ప్రపంచంతో పోటీపడే విధంగా ఆర్థిక వ్యవస్థను తీర్చిదిద్దిన తీరు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు పొందింది. బంగారాన్ని తాకట్టుపెట్టి విదేశీ మారక ద్రవ్య నిల్వలను సమకూర్చుకునే స్థాయి నుండి నేడు ప్రపంచంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల ఆకర్షణలో భారత్‌ని 8వ స్థానంలో నిలబెట్టే స్థాయికి పునాదులు వేసిన వ్యక్తి మన్మోహన్ సింగ్.

పది సంవత్సరాలు వరుసగా ప్రధానమంత్రిగా తాను తీసుకున్న అనేక విప్లవాత్మక నిర్ణయాలు దేశ ప్రజల మనః ఫలకంపై చెరగని ముద్రవేశాయి. 2005లో సమాచార హక్కు చట్టం, అమెరికాతో పౌర అణు ఒప్పందం, జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ (ఎన్ఆర్‌హెచ్ఎం), గ్రామీణ ప్రాంతాలలో నైపుణ్యం లేని వారి ఉపాధి కోసం చేసిన 'ఉపాధి హామీ చట్టం' (ఎంజీఎన్ఆర్ఈజీఏ) ప్రత్యేక ఆర్థిక మండళ్ల (సెజ్), 2013లో తెచ్చిన భూ సేకరణ చట్టం, ఆహార భద్రతా చట్టాలు, ఆధార్ కార్డ్, రైతు రుణమాఫీ దేశ పాలన వ్యవస్థలో మైలు రాళ్లుగా నిలబడిపోయాయి.

'దేశాన్ని ఆర్థిక సంక్షోభం నుండి బయటపడవేసి ఆర్థిక వ్యవస్థను పునర్నిర్మించడానికీ, స్థిరమైన వృద్ధిని సాధించడానికీ ఆర్థిక సంస్కరణలను ప్రారంభిస్తున్నాము. ఎవరి మెప్పు కోసమో ఆర్థిక సంస్కరణలను ప్రారంభించడం లేద'ని నాడు తాను చెప్పిన మాటలు నేడు నిజమైనాయి. మాటల కంటే నిశ్శబ్దంగా పనిచేయటానికి ప్రాధాన్యత ఇచ్చే మన్మోహన్ సింగ్ నిరాడంబర వ్యక్తిత్వం గల వివాదరహితునిగా పేరు తెచ్చుకున్నారు. ఆర్థిక సంస్కరణలకు ఆద్యులైన పి.వి. నరసింహారావుని భారత ప్రభుత్వం భారతరత్న అవార్డుతో సత్కరించిన విధంగానే మన్మోహన్ సింగ్‌కి కూడా భారతరత్న అవార్డు ఇవ్వాలి. ఆ పురస్కారానికి ఆయన అన్ని విధాలా అర్హులు.

వ్యాసకర్త కాకతీయ విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ । 98854 65877

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు
మార్గశిర మాసం, **తిథి:** బ.త్రయోదశి రా.2.53 వరకు
తదుపరి చతుర్దశి, **నక్షత్రం:** అనూరాధ రా.10.05 వరకు
తదుపరి జ్యేష్ఠ, **వర్జ్యం:** తె.4.03 నుండి 5.43 వరకు (తెల్లవారితే ఆదివారం), **దుర్ముహూర్తం:** ఉ.6.31 నుండి 8.01 వరకు,
అమృతఘడియలు: ఉ.10.40 నుండి 12.24 వరకు, శనిత్రయోదశి

సూర్యోదయం : 6.33
సూర్యాస్తమయం: 5.30
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

సోషల్ మీడియా



ఫ్రాన్స్ స్నేహితుడు
మన్మోహన్ సింగ్ రూపంలో ఇండియా ఒక గొప్ప మనిషినీ, ఫ్రాన్స్ ఒక నిజమైన స్నేహితుడినీ కోల్పోయింది.
– ఇమాన్యుయేల్ మాక్రాన్, ఫ్రాన్స్ అధ్యక్షుడు



గొప్ప వివేకి
గత వారం మన్మోహన్ సింగ్‌ను ఆయన ఇంట్లో కలిసే భాగ్యం దక్కింది. మన జాతికి ఆయన చేసిన వెలకట్టలేని సేవల గురించి మాట్లాడాను. చిరునవ్వే సమాధానం అయింది.
– సుధామూర్తి, రాజ్యసభ సభ్యురాలు



క్రూరమైన నెల
డిసెంబర్ అత్యంత క్రూరమైన నెల. జాకిర్ హుస్సేన్, శ్యామ్ బెనెగల్, ఎం.టి. వాసుదేవన్ నాయర్, మన్మోహన్ సింగ్‌లను కోల్పోయాం.
– ఎన్.ఎస్. మాధవన్, మలయాళ రచయిత



ఉర్దూ తెలుసు
బహుశా ఉర్దూ అనర్గళంగా చదవగలిగిన, మాట్లాడగలిగిన చివరి ప్రధానమంత్రిగా మన్మోహన్ గుర్తుండిపోతారు.
– సుఖద, వ్యాఖ్యాత

ఇన్ బాక్స్

విప్లవ పార్టీల ఐక్యత అవసరం

భారతదేశంలో కమ్యూనిస్టు విప్లవకారుల ఐక్యత ఒక జరూరు సమస్యగా చాలా కాలం నాటి నుండే ఎజెండాలో కొనసాగుతున్నది. ఇప్పుడు అది సాకారం అయ్యే దిశలో ఒకడుగు పడింది. క్రూర నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా 1946 నుండి 1952 వరకు సాగించిన ఆ మహత్తర రైతాంగ సాయుధ పోరాటం భారత ప్రజల విముక్తికి మార్గం చూపింది. ఆ మార్గాన్ని ఆనాటి ఉమ్మడి భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) విస్మరించింది. ఎన్నికల ద్వారానే, అంటే–పార్లమెంటరీ పంథా ద్వారానే భారత ప్రజల విముక్తిని సాధించవచ్చనే వాదనను తలకెత్తుకున్నది. సీపీఐ బాటనే ఆ తరువాత ఏర్పడిన సీపీఐ(ఎం) కూడా అనుసరించింది. దీనిని త్రోసిపుచ్చి చారూ మజుందార్, సత్యనారాయణ సింగ్, చంద్ర పుల్లారెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు, తరిమెల నాగిరెడ్డి తదితర అగ్రశ్రేణి నాయకత్వం నక్సల్బరీ నాయకులతో విప్లవ సంస్థలను ఏర్పరచి ప్రజలను భూమి, భుక్తి, విముక్తి పోరాటాలలోకి ఉప్పెనలా కదిలించారు.


విప్లవోద్యమం గత మూడు, నాలుగు దశాబ్దాలుగా ఎన్నెన్నో చీలికలకు, పీలికలకు గురయ్యింది. ఉద్యమం బలహీనపడింది. ఈ నేపథ్యంలో విప్లవ సంస్థలన్నీ ఐక్యం కావలసిన ఆవశ్యకత పెరుగుతూనే ఉంది. 2013 నుండి 'సీపీఐ(ఎం–ఎల్) న్యూడెమోక్రసీ' పేరుతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్‌లలో రెండు పార్టీలు కొనసాగుతున్నాయి. అంతకు ముందు జాతీయ స్థాయిలో జనశక్తి, క్లాస్ స్ట్రగుల్‌తోపాటు... రెండు న్యూడెమోక్రసీ పార్టీల మధ్య నాలుగైదేళ్లుగా ఐక్యతా ప్రయత్నాలు సాగినా ముందడుగు వేయలేక పోయాయి. ఈ స్థితిలో రెండు న్యూడెమోక్రసీ పార్టీలు తమ మధ్య గల సిద్ధాంత, రాజకీయ, నిర్మాణ సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకుని, ఒకే సీపీఐ(ఎం–ఎల్) న్యూడెమోక్రసీగా ఐక్యం కావాలని నిర్ణయించుకున్నాయి. ఆ క్రమంలో 2024 డిసెంబర్ 28న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉభయ పార్టీల విలీన సభను నిర్వహిస్తున్నాయి.

– కె.గోవర్ధన్; రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు (ఎం–ఎల్) న్యూడెమోక్రసీ – తెలంగాణ రాష్ట్ర కమిటీ

మరుగునపడ్డ మహామేధావి

ఎంవీవీకే రంగాచారి భారతదేశంలోని తొలి ఆధునిక భావోద్యమకారుల్లో ఒకరు. 1889లో ముదునూరుపాడు అనే గ్రామంలో పుట్టిన ఆయన బాల్యంలోనే కుటుంబంలోని ఛాందస మతతత్వాన్ని చూశారు. సముద్ర యానం చేసే వారి బంధువుల్ని తోటివారే వెలేయడం చూసి చలించిపోయారు. మద్రాసు విశ్వవిద్యాలయం నుండి లా చేసినాయన 1910లో హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీసు ప్రారంభించారు. ఎన్నో సామాజిక వివక్షల్ని, అసాంఘిక కట్టుబాట్లనూ కళ్ళారా చూసి స్వతంత్ర చింతనాశీలిగా మారి మూఢాచారాల్ని నిరసించారు. వందేళ్ళ క్రితం 1920లోనే లండన్‌లోని 'రేషనలిస్ట్ ప్రెస్ అసోసియేషన్'లో సభ్యుడవ్వడమే కాకుండా ఆ అంతర్జాతీయ హేతువాద సంఘానికి మద్రాసు ప్రెసిడెన్సీలో గౌరవ కార్యదర్శిగా కూడా నియమితులయ్యారు.

అంతేకాదు, బొంబాయి కేంద్రంగా ఏర్పడిన భారతీయ హేతువాద సంఘంలో క్రియాశీల వ్యక్తి. అమెరికాకి చెందిన ప్రముఖ హేతువాది మాక్స్ ఐసెన్‌బర్గ్, ఇంగ్లాండ్‌కు చెందిన విఖ్యాత భావోద్యమ నాయకుడైన చార్లెస్ బ్రాడ్లా కుమార్తె చార్లెస్ బ్రాడ్లా బోనర్ వంటి మహామహులు కూడా రంగాచారి సాహిత్య కృషిని ప్రశంసించారంటే ఆనాడు ఆయన చేసిన భావోద్యమాలు ప్రపంచ వ్యాప్తంగా ఎంతటి ప్రభావం కలిగించాయో అర్థమవుతుంది.


ఎంవీవీకే రంగాచారి


ఆధునిక ఆలోచనాధారని పరిచయం చేస్తూ, 'ముకుందమాల' అనే గ్రంథం రాశారు. ప్రపంచ మతాల సమ్మేళనం అంతర్జాతీయ మహాసభలు పారిస్, శ్రీలంక, తదితర దేశాల్లో జరిగినప్పుడు పరిశోధనాత్మక వ్యాసాల్ని సమర్పించారు. రాజారామ్మోహన్ రాయ్ శతజయంతి ఉత్సవాల సందర్భంగా జరిగిన కార్యక్రమంలో రాజారామ్మోహన్ రాయ్‌ని 'నాస్తికుడు'గా విశ్లేషించారు.

ఐతే, దురదృష్టవశాత్తు ఇంతటి మహావ్యక్తి గురించి మనకి లభిస్తున్న సమాచారం చాలా తక్కువే. ఆయన సమకాలీకులు కానీ తదనంతరం కానీ రంగాచారి కోసం ఎక్కడా నమోదు చేయలేదు. అయితే 1960 ఫిబ్రవరి నాటి 'ఇండియన్ లిబరిటేరియన్' పత్రికలో రంగాచారి కుమారుడు సత్యం 1959 డిసెంబర్ 28న ఆయన మరణించినట్లు తెలియజేస్తూ... రంగాచారి గారి కోసం రాసిన సంక్షిప్త పరిచయం మాత్రమే ఆయన గురించిన ఏకైక ఆధారం. దాని ప్రకారం సాంప్రదాయిక వైష్ణవుడిగా పుట్టిన రంగాచారికి చిన్న వయసులోనే వివాహం జరిగిందనీ, ఆయనకి దేశదేశాల ఆలోచనాపరులు, భావోద్యమాలతో సంబంధాలు ఉన్నాయనీ, ఆయన చివరి రోజుల్లో పక్షవాతంతో బాధపడుతున్నప్పుడు కూడా సాహిత్య పఠనం, రచనా వ్యాసంగం విడనాడలేదనీ తెలుస్తుంది.

మతాలయినా, రాజకీయ తత్వాలయినా, శాస్త్రీయ మార్గాలయినా మమేకం కావల్సింది మానవతతోనే అని ఆయన భావన. యావత్ తెలుగు నేల మీద తొలితరం భావోద్యమ ప్రచారకుల్లో ఒకరిగా ఎం.వి.వి.కె. రంగాచారి గురించిన మరింత సమాచారం వెలికి తీయాల్సి ఉంది. ఆయన చూపిన మార్గంలో ఆలోచనోద్యమాల్ని నిర్మించుకోగలగడమే రంగాచారి కృషికి మనం ఇవ్వదగ్గ నిజమైన మానవీయ నివాళి.

– గౌరవ్
సామాజిక కార్యకర్త । 90320 94492
(నేడు ఎం.వి.వి.కె. రంగాచారి వర్ధంతి)

నమ్మకం


జ్యోతిర్మయం

ఓ గురువు తన శిష్యుడితో కలిసి అడవి మార్గంలో పోతూ కొలనులో స్నానం చేసి సూర్యుడికి నమస్కరించారు. అప్పుడు 'వేదగురువా! ఈరోజు నేను అస్తమించేలోపు ఓ పాము మీ శిష్యుడి ప్రాణాలను తీస్తుంది. చేతనైతే మీ శక్తితో అతనిని కాపాడుకోండి' అని సూర్య భగవానుడి వాణి వినిపించింది. గురువు ఎలాగైనా తన శిష్యుణ్ణి కాపాడాలనుకున్నారు. కొంత దూరం ప్రయాణించిన పిదప ఒక చెట్టు కింద విశ్రమించారు. శిష్యుడు ఆదమరచి నిద్రపోయాడు. ఇంతలో ఓ పాము శిష్యుడి దగ్గరకొచ్చి మెడపై కాటువేయబోతోంది. గురువు పాముని చూస్తూ 'నువ్వు నా శిష్యుడి ప్రాణం తీయడానికి వచ్చావని తెలుసు. శిష్యుణ్ణి కాపాడటం గురువు కనీస బాధ్యత. అందువల్ల నువ్వు నా శిష్యుడి ప్రాణం తీయడానికి అనుమతించను' అన్నారు.

అప్పుడా పాము 'ఓ వేదగురువా! మీ శిష్యుడి మెడ మీద రక్తం పీల్చాలన్నది యముడు నాకు విధించిన ఆజ్ఞ. అన్నీ తెలిసిన మీరు నన్ను అడ్డుకోవడం తగునా' అని అడిగింది. వెంటనే గురువు 'అది యముడి ఆజ్ఞ కావచ్చు. సరే. కాస్త ఆగు. నేనే అతని రక్తాన్ని నీకిస్తాను. దానిని స్వీకరించు. నువ్వు నీ ఆజ్ఞను పాటించిన ఫలాన్ని పొందుతావు' అని ఓ కత్తితో శిష్యుడి మెడపై చిన్న గాటుపెట్టి రక్తం తీశారు. ఇంతలో శిష్యుడు మేల్కొన్నాడు. ఒక్క మాటా మాట్లాడక అంతా తెలుసన్నట్లుగా మళ్ళీ కళ్ళు మూసుకున్నాడు. శిష్యుడి మెడ దగ్గర నుంచి కొన్ని చుక్కల రక్తం తీసి పాముకు సమర్పించారు గురువు.

నాగుపాము గురువు శాపానికి నేను గురి కాకుండా నా బాధ్యత నిర్వర్తించాలననుకుని ఆ రక్తం రుచి చూసి అక్కడ్నుంచి వెళ్ళిపోయింది. అనంతరం గురువు తన శిష్యుడి మెడ మీద పసరుతో పట్టు వేశారు. నిద్ర లేచిన శిష్యునితో 'నీ మెడ మీద నేను కత్తితో గాటు పెట్టినప్పుడు ఏమనుకున్నావు? నీకు భయం కలుగలేదా?' అని అడిగారు. అంతట శిష్యుడు 'నా గురువుగారైన మీరు నాకు ఏ కీడూ తలపెట్టరని నా గట్టి నమ్మకం. కనుక ఒకింత నొప్పి అనిపించినా ఆందోళన చెందలేదు. నన్ను మీరు కాపాడుకున్న తీరు అమోఘం. నన్ను నేను మీకు అర్పిస్తున్నాను. నేను మీకోసం ఏమైనా చేస్తాను' అన్నాడు. ఆ మాటలతో గురువు నిండు మనసుతో శిష్యుణ్ణి హత్తుకున్నారు. ఈ కథలో మనమే ఆ శిష్యుడు. గురువేమో భగవంతుడు. నాగుపాము మన విధి!

– యామిజాల జగదీశ్

నిరుపయోగ భూములపై నజర్

- పరిశ్రమల వద్ద వృథాగా ఉన్న భూముల లెక్కలు తీస్తున్న ప్రభుత్వం
- సర్కారు ఇచ్చిన భూముల దుర్వినియోగంపై దృష్టి
- లెక్కలు తేల్చేందుకు పరిశ్రమల శాఖ డైరెక్టర్ నేతృత్వంలో కమిటీ
- వచ్చే ఏడాది ఫిబ్రవరిలోగా నివేదిక ఇవ్వాలని ఆదేశం
- గతంలో 65 సంస్థల నుంచి 1,960 ఎకరాలు తిరిగి వెనక్కి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూ సేకరణ సవాలుగా మారుతున్న నేపథ్యంలో.. గతంలో పరిశ్రమలకు కేటాయించిన భూములపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. నిర్దేశించిన అవసరాలకు కాకుండా ఇతర అవసరాలకు వినియోగిస్తున్న భూములు, ఎలాంటి కార్యకలాపాలు చేపట్టకుండా నిరుపయోగంగా ఉన్న ప్లాట్ల లెక్క తేల్చేందుకు సిద్ధమైంది. నిరుపయోగంగా ఉన్న భూములను అవసరమైతే స్వాధీనం చేసుకుని.. కొత్తగా పరిశ్రమలు ఏర్పాటుచేసే సంస్థలకు కేటాయించాలని భావిస్తోంది. ఇందుకోసం పరిశ్రమల శాఖ డైరెక్టర్ డాక్టర్ మల్సూర్ నేతృత్వంలో ముగ్గురు సభ్యుల కమిటీని ఏర్పాటుచేసింది. రాష్ట్ర పారిశ్రామిక మౌలిక వసతుల కల్పన సంస్థ (టీజీఐఐసీ)కి చెందిన ఇద్దరు అధికారులను ఇందులో సభ్యులుగా నియమించింది. టీజీఐఐసీ ద్వారా పరిశ్రమలకు కేటాయించిన భూములను పరిశీలించి.. వచ్చే ఏడాది ఫిబ్రవరిలోగా నివేదిక ఇవ్వాలని ఈ కమిటీని ఆదేశించింది. ఆ నివేదిక అధారంగా నిరుపయోగంగా ఉన్న భూములను వెనక్కి తీసుకోవడంపై ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేయనుంది. ఉచితంగా భూమి కేటాయించినా ఎలాంటి కార్యకలాపాలు చేపట్టని 225 సంస్థల నుంచి 1,964 ఎకరాల భూమిని టీజీఐఐసీ గతంలో వెనక్కి తీసుకుంది. ఇందులో కొన్ని సంస్థలు కోర్టులను ఆశ్రయించడంతో ఈ ప్రక్రియ నిలిచిపోయింది.

కమిటీ పరిశీలించే అంశాలివే

- గతంలో జరిపిన భూ కేటాయింపులపై పూర్తిస్థాయిలో 'భూ తనిఖీ'(ల్యాండ్ ఆడిట్) చేసే బాధ్యతను కమిటీకి అప్పగించారు.
- టీజీఐఐసీ భూ కేటాయింపులను రద్దు చేసినా, కొన్నిచోట్ల సదరు భూములు పారిశ్రామిక సంస్థల చేతుల్లోనే ఉన్నాయి. నిబంధనలు ఉల్లంఘించి ఆ భూములను దుర్వినియోగం చేస్తున్న సంస్థలపై జరిమానా కూడా విధించారు. ఇలాంటి అంశాలను పరిశీలించి ఈ కమిటీ ప్రభుత్వానికి నివేదిక ఇస్తుంది.
- పారిశ్రామిక వాడల్లో విక్రయించగా మిగిలిన ప్లాట్లు ఏళ్ల తరబడి ఖాళీగా ఉన్నాయి. వాటి సంఖ్య, విస్తీర్ణం తేల్చే బాధ్యతను కూడా ఈ కమిటీకి అప్పగించారు.
- పరిశ్రమలకు కేటాయించిన భూములను ఇతరత్రా అవసరాలకు ఉపయోగిస్తున్నారా లేదా? అనే అంశాన్ని కమిటీ పరిశీలిస్తుంది.

దుర్వినియోగం కాకుండా పర్యవేక్షక వ్యవస్థ

టీజీఐఐసీ లెక్కల ప్రకారం రాష్ట్రంలో 170కి పైగా పారిశ్రామిక పార్కులు ఉన్నాయి. కొత్తగా మరో 35 పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు 13,741 ఎకరాల భూమి అవసరమని టీజీఐఐసీ గుర్తించింది. ఇందులో 2,338 ఎకరాలు ప్రభుత్వ, 7,638 ఎకరాలు అసైన్డ్, 3,765 ఎకరాల పట్టా భూములు ఉన్నాయి. పరిశ్రమల ఏర్పాటు కోసం గతంలో కేటాయించిన, ప్రస్తుతం సేకరిస్తున్న భూములతో కూడిన ల్యాండ్ బ్యాంక్ పర్యవేక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని భావిస్తోంది. ల్యాండ్ బ్యాంక్ నిర్వహణ, కేటాయింపులను పర్యవేక్షించడంతో పాటు దుర్వినియోగం కాకుండా ఈ వ్యవస్థ పనిచేస్తుంది.

పారిశ్రామిక జోన్లవారీగా ఖాళీ ప్లాట్లు

జోన్	ప్లాట్లు	షెడ్లు	ప్లాట్ల విస్తీర్ణం (చదరపు మీటర్లలో)
సైబరాబాద్	83	–	15,99,234
కరీంనగర్	246	–	24,61,805
ఖమ్మం	94	26	11,84,079
మేడ్చల్– సిద్దిపేట	627	–	53,12,39,336
నిజామాబాద్	221	–	20,65,630
పటాన్‌చెరు	117	–	44,26,096
శంషాబాద్	295	–	2,42,84,879
వరంగల్	641	–	57,32,945
యాదాద్రి	71	–	12,99,975

కండ్లల్ల మెదుల్తాన్నవ్ బిడ్డా..

- ఇంటికచ్చి ప్రశాంతంగా బతుకు తండ్రీ
- మావోయిస్టు అగ్రనేత దామోదర్ తల్లి బతుకమ్మ ఆవేదన
- స్వచ్ఛందంగా లొంగిపోతే పునరావాసం కల్పిస్తాం: ములుగు జిల్లా ఎస్పీ శబరీష్
- బతుకమ్మకు పరామర్శ.. నిత్యావసర సరుకులు అందజేత



దామోదర్ తల్లి బతుకమ్మతో మాట్లాడుతున్న ఎస్పీ శబరీష్

ఎస్ఎస్ తాడ్వాయి: 'బిడ్డా దామోదర్! నేను సావుకు దగ్గరైన.. కాళ్లు, చేతులు ఆడు తలేవు. మంచంలకెళ్లి లేత్తలేను. బుక్కెడు బువ్వ తినాలనిపిస్త లేదు. నువ్ అడవిలకు పోయి 20 ఏండ్లు అయితంది. దినాం కండ్లనే మెదుల్తాన్నవ్. నిన్ను కండ్లారా సూసినంకనే పాణం ఇడువాల్నానున్నది. ఏడున్నవ్ బిడ్డా! ఇంటికొచ్చి ప్రశాంతంగా బతుకు తండ్రీ. నువ్వు లొంగిపోతే.. గీ పెద్ద సార్లు అన్ని సౌలత్‌లు ఇత్తమంటున్నరు'అని మావోయిస్టు అగ్రనేత దామోదర్ తల్లి బతుకమ్మ కన్నీరుమున్నీరుగా విలపించింది. ములుగు జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండలంలోని కాల్వపల్లి గ్రామానికి చెందిన మావోయిస్టు అగ్రనేత బడే దామోదర్ అలియాస్ చొక్కారావు తల్లి బతుకమ్మను జిల్లా ఎస్పీ శబరీష్ శుక్రవారం పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితులు తెలుసుకున్నారు. అజ్ఞాతంలో ఉన్న దామోదర్‌ను లొంగిపోయేలా నచ్చజెప్పాలని బతుకమ్మను కోరారు. ఈ సందర్భంగా ఎస్పీ శబరీష్ మాట్లాడుతూ.. తెలంగాణలో 103 మంది మావోయిస్టులు పనిచేస్తున్నారని తెలిపారు. ఆచరణ సాధ్యం కాని సిద్ధాంతాలు, ఆశయాలతో అడవుల్లో ఉంటూ ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు తప్ప సాధించేదేమీ లేదన్నారు. కొంతమంది మావోయిస్టులకు వయసు మీద పడిందని, అనేక ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. మావోయిస్టులు స్వచ్ఛందంగా జనజీవన ప్రవంతిలో కలిస్తే పునరావాసం కల్పిస్తామన్నారు. అనారోగ్యంతో ఉన్న వారికి మెరుగైన వైద్యం అందిస్తామని తెలిపారు. అజ్ఞాతం వీడి జన జీవన ప్రవంతిలో కలిసి ప్రశాంత జీవితం గడపాలని పిలుపునిచ్చారు. అనంతరం బతుకమ్మకు వైద్య పరీక్షలు చేయించి మందులు అందజేశారు. 50 కిలోల బియ్యంతో పాటు నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రవీందర్, పస్రా సీఐ రవీందర్, తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్ పాల్గొన్నారు.

వృషణాల్లోంచి పొట్టలోకి చొచ్చుకెళ్లిన కర్ర

- ఆడుకుంటుండగా బాలునికి ప్రమాదం
- జీజీహెచ్‌లో శస్త్రచికిత్స చేసి కర్రముక్క తొలగింపు.. బాలుడు క్షేమం



అశ్వంత్ కడుపులో కర్ర ముక్క

కామారెడ్డి టౌన్: ఆడుకుంటూ ప్రమాదవశాత్తు పడిపోయిన ఒక బాలుడి వృషణాల్లోంచి పొట్టలోకి చొచ్చుకెళ్లిన కర్ర ముక్కను ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు విజయవంతంగా శస్త్రచికిత్స చేసి బయటకు తీశారు. కామారెడ్డి జిల్లా అడ్లూర్ ఎల్లారెడ్డికి చెందిన 13 ఏళ్ల అశ్వంత్ గురువారం స్నేహితులతో కలిసి గ్రామంలో ఆడుకుంటుండగా.. ప్రమాదవశాత్తు ఒక పదునైన కర్రపై పడ్డాడు. దీంతో కర్రముక్క కుడివైపు వృషణంలోంచి చీల్చుకుని పొట్ట లోపలి వరకు వెళ్లింది. కుటుంబ సభ్యులు హుటాహుటిన జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి బాలుడిని అంబులెన్స్‌లో తరలించారు. శుక్రవారం జనరల్ సర్జన్ డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీ డాక్టర్ రాంసింగ్ బృందం రెండు గంటల పాటు శ్రమించి శస్త్రచికిత్స చేసి.. పొట్టలోని కర్ర ముక్కను బయటకు తీశారు. బాలుని ఆరోగ్యం నిలకడగా ఉందని.. ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు తెలిపారు. కిడ్నీతో పాటు ఇతర ప్రధాన అవయవాలకు కర్ర తగలక పోవడంతో ప్రాణాపాయం తప్పిందని స్పష్టం చేశారు. అరుదైన చికిత్స విజయవంతంగా చేసి బిడ్డ ప్రాణాలు కాపాడిన వైద్యులు శ్రీనివాస్, మౌనిక, మనోజ్, శ్రీకాంత్, మక్బూల్ తదితరులకు బాలుని తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

గంటల కొద్దీ ఫోన్ కాల్స్!

- కామారెడ్డి మూడు మరణాల కేసులో కీలక విషయాలు
- ఎస్ఐ, మహిళా కానిస్టేబుల్, నిఖిల్ మధ్య సుదీర్ఘ ఫోన్ సంభాషణ
- శ్రుతి, నిఖిల్ మధ్య ప్రేమ వ్యవహారం ఉన్నట్లు అనుమానం
- ఇంకా వీడని మిస్టరీ.. కాల్‌డేటా పరిశీలిస్తున్న పోలీసులు



సాయికుమార్



శ్రుతి



నిఖిల్

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: కామారెడ్డి జిల్లాలో కలకలం సృష్టించిన ఎస్ఐ, కానిస్టేబుల్, మరో యువకుడి మృతి కేసులో వారి ఫోన్‌కాల్, వాట్సాప్ చాటింగ్ డేటా కీలకంగా మారింది. చనిపోయే రోజు భిక్కనూరు ఎస్ఐ సాయికుమార్, బీబీపేట కానిస్టేబుల్ శ్రుతి, కంప్యూటర్ ఆపరేటర్ నిఖిల్ ఫోన్‌లో గంటలకొద్దీ మాట్లాడుకున్నట్లు పోలీసులు గుర్తించారు. వీరు ముగ్గురు ఈ నెల 25న కామారెడ్డి జిల్లా కేంద్రానికి సమీపంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి పెద్ద చెరువులో నీటమునిగి చనిపోయిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై దర్యాప్తు ముమ్మరం చేసిన పోలీసులు.. వారి కాల్ డేటాను సేకరించారు.

చనిపోయేదాకా ఫోన్‌కాల్స్

బుధవారం వేకువజాము నుంచే వీరు ఫోన్‌లో మాట్లాడుకున్నట్లు కాల్ డేటా ద్వారా స్పష్టమైంది. సాయికుమార్ రెండు ఫోన్లలో కలిపి మూడు సిమ్‌లు వాడగా, నిఖిల్ రెండు ఫోన్లు వాడాడు. శ్రుతి ఒక ఫోన్ వాడుతుండేది. చనిపోయే వారం రోజుల ముందు నుంచి ఎక్కువ సార్లు ఫోన్‌లో మాట్లాడుకున్నట్లు తెలుస్తోంది. బుధవారం ఉదయం నుంచి ఒక్క చోటుకి చేరుకునేదాకా వీరు ఫోన్‌లో మాట్లాడినట్లు గుర్తించారు. జిల్లా అధికారులతో ఫోన్ కాన్ఫరెన్స్‌లో ఉన్న సమయంలో తప్ప.. మిగతా సమయమంతా శ్రుతి, నిఖిల్‌తో సాయికుమార్ ఫోన్‌లో మాట్లాడుతూనే ఉన్నట్టు తెలుస్తోంది.

ఒక్కచోటుకు చేరి..: భిక్కనూరు పోలీస్‌స్టేషన్ నుంచి సాయికుమార్ ఒక్కడే తన కారులో బయలుదేరి 44వ నంబర్ జాతీయ రహదారి మీదుగా కామారెడ్డి వైపు వెళ్లాడు. బీబీపేట నుంచి నిఖిల్ తన బైకుపై దోమకొండ, బీటీఎస్ మీదుగా హైవేకు చేరుకున్నట్టు తెలుస్తోంది. శ్రుతి బస్సులోనే బయలుదేరిందని, ఆమె నర్సన్నపల్లి శివారు వద్ద బస్సు దిగిందని అంటున్నారు. ఓ దాబా వద్ద ముగ్గురూ ఆగారని ప్రచారం జరుగుతుండగా.. అక్కడ సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో స్పష్టత రాలేదు. నిఖిల్ తన బైకును అక్కడే వదిలేసి ఎస్సై కారులో వెళ్లినట్టు స్పష్టత వచ్చింది. అదే కారులో శ్రుతి కూడా ఎక్కిందని అంటున్నారు. ముగ్గురూ బైపాస్ ద్వారా అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువు వద్దకు చేరుకొని, కొంతసేపు అక్కడ మాట్లాడుకొని ఉంటారని భావిస్తున్నారు. తరువాత ఏమైందో ఏమో ముగ్గురూ చెరువులో పడి చనిపోవడం మిస్టరీగా మారింది. ఎవరైనా ఒకరు దూకితే కాపాడేందుకు మిగతా ఇద్దరు దూకారా? అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రేమ వ్యవహారమే కారణమా?

శ్రుతి, నిఖిల్ వాట్సాప్ మెసేజ్‌లను పోలీసులు పరిశీలించారు. వీరి మధ్య ప్రేమ వ్యవహారం ఉన్నట్టు వాట్సాప్ మెసేజ్‌లు స్పష్టం చేస్తున్నాయని పోలీసు వర్గాల ద్వారా తెలుస్తోంది. అయితే, వీరి ప్రేమ వ్యవహారంలో సాయికుమార్ ఎందుకు తలదూర్చాడన్నది ఇప్పుడు కీలకంగా మారింది. నిఖిల్, శ్రుతి పెళ్లి చేసుకోవాలనుకున్నారని.. కానీ విభేదాలు తలెత్తి పెళ్లి వాయిదా వేయడం వల్లే గొడవ ముదిరింది అన్న ప్రచారం కూడా జరుగుతోంది.

ఉసురు తీసిన ఆన్‌లైన్ గేమ్‌లు

- రమ్మీ, బెట్టింగ్‌తో పాటు పలు రకాల యాప్‌లలో ఆటలకు అలవాటుపడి రూ.కోట్లలో బాకీ
- భూములు, ప్లాట్లు అమ్మినా తీరని వైనం
- మనస్తాపంతో ఉరివేసుకుని వ్యక్తి బలవన్మరణం



వెంకటయ్య

కోస్గి: సులువుగా డబ్బులు సంపాదించాలనే దురాశతో ఆన్‌లైన్ గేమ్‌లకు బానిసగా మారిన ఓ వ్యక్తి రూ.కోట్లలో అప్పులు చేశాడు. చివరికి భూములు, ప్లాట్లు అమ్మినా అప్పులు తీరకపోవడంతో మనస్తాపానికి గురై ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన నారాయణపేట జిల్లా కోస్గిలో చోటుచేసుకుంది. కోస్గి మున్సిపాలిటీ పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన గుడిసె వెంకటయ్య (42) కొన్నేళ్ల కిందట హైదరాబాద్‌కు వెళ్లి అక్కడే పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో సులువుగా డబ్బులు సంపాదించవచ్చనే ఆన్‌లైన్ ప్రకటనలు చూసి వెంకటయ్య ఆకర్షితుడయ్యాడు. ఈజీ మనీ కోసం ఆన్‌లైన్ రమ్మీ, బెట్టింగ్‌తో పాటు పలు రకాల యాప్‌లలో పెట్టుబడి పెట్టాడు. డబ్బులు పోగొట్టుకుంటున్నా.. ఆన్‌లైన్ ఆటలకు బానిస కావడంతో వడ్డీ వ్యాపారులు, బంధువులు, స్నేహితుల వద్ద రూ.లక్షల్లో అప్పులు చేసి నష్టపోయాడు. అప్పుల బాధ భరించలేక గతేడాది భార్యాపిల్లలతో స్వగ్రామానికి వచ్చాడు. కోస్గిలో ఓ అద్దె ఇంట్లో భార్యాపిల్లలతో నివాసం ఉంటుండగా.. ఆయన భార్య స్థానికంగా ఓ ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా చేరింది. ఈ క్రమంలో వెంకటయ్య స్వగ్రామంలో కూడా మళ్లీ అప్పులు చేసి ఆన్‌లైన్ గేమ్స్ ఆడి భారీస్థాయిలో పోగొట్టుకున్నాడు. రోజురోజుకూ అప్పులు పెరగడంతో వాటిని తీర్చేందుకు సొంత గ్రామంలో తన భాగానికి వచ్చిన వ్యవసాయ భూమితో పాటు ప్లాట్లను అమ్మి దాదాపు కోటి రూపాయలు అప్పుకట్టాడు. అయినా తీర్చాల్సిన అప్పు ఇంకా సగం ఉండటంతో మనస్తాపానికి గురయ్యాడు. గురువారం భార్యాపిల్లలు నిద్రపోయిన తర్వాత అర్ధరాత్రి అద్దెకు ఉంటున్న ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శుక్రవారం ఉదయం నిద్రలేచేసరికి.. భర్త ఉరేసుకున్న దృశ్యాన్ని చూసి రోదిస్తూ భార్య కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చింది. వెంటనే అక్కడికి చేరుకున్న వారు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వెంకటయ్య అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై మృతుడి భార్య షాలిని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. వెంకటయ్యకు ఓ కుమారుడు, కూతురు ఉన్నారు.

జోగుళాంబను దర్శించుకున్న సుప్రీంకోర్టు జడ్జి



జోగుళాంబ అమ్మవారి ఆలయంలో పూజలు చేస్తున్న సుప్రీంకోర్టు జడ్జి

అలంపూర్: అష్టాదశ శక్తిపీఠాల్లో ఒకటైన అలంపూర్‌లో వెలసిన జోగుళాంబ అమ్మవారిని సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టి కుటుంబసమేతంగా శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ ఈఓ పురేందర్‌కుమార్, ఆలయాల కమిటీ చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి అర్చక స్వాములతో కలిసి సుప్రీంకోర్టు జడ్జికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు జడ్జి.. జిల్లా జడ్జి కుషతో కలిసి జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామివారి ఆలయాలను సందర్శించారు. అక్కడ స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిపారు. అర్చకులు వారికి తీర్థ ప్రసాదాలను అందజేసి ఆశీర్వచనం పలికారు. క్షేత్ర ప్రాశస్త్యాన్ని వివరించారు. ఆలయ ఈఓ, చైర్మన్ జడ్జిని శేషవస్త్రాలతో సత్కరించారు. వీరితోపాటు డీఎస్పీ సత్యనారాయణ, సీఐ రవిబాబు, ఎస్సై వెంకటస్వామి, ఆలయ ధర్మకర్తలు విశ్వనాథరెడ్డి, జగదీశ్వర్ గౌడ్, గోపాల్, ఆలయ ఉప ప్రధాన అర్చకులు, ఎక్స్ అఫీషియో సభ్యుడు ఆనంద్‌శర్మ ఉన్నారు.

నాంపల్లి కోర్టుకు వర్చువల్‌గా అల్లు అర్జున్

- తదుపరి విచారణ జనవరి 10కి వాయిదా

సిటీ కోర్టులు/బంజారాహిల్స్: సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో ఆరోపణలు ఎదుర్కొంటున్న హీరో అల్లు అర్జున్ శుక్రవారం నాంపల్లిలోని 9వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు ఎదుట వర్చువల్‌గా హాజరయ్యారు. ఈ కేసులో ఏ-11గా ఉన్న ఆయనకు కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించగా హైకోర్టు 4 వారాల మధ్యంతర బెయిల్ మంజూరు చేయడం తెలిసిందే. జ్యుడీషియల్ రిమాండ్ గడువు శుక్రవారం ముగియడంతో ఆయన కోర్టుకు నేరుగా హాజరుకావాల్సి ఉంది. కానీ కోర్టు ప్రాంగణానికి భారీగా అభిమానులు రావొచ్చని అంచనా వేసిన పోలీసులు.. ఆయన్ను వర్చువల్‌గా కోర్టు విచారణకు హాజరుకావాలని సూచించారు. కాగా, ఈ కేసు తదుపరి విచారణను జడ్జి నిర్మల జనవరి 10కి వాయిదా వేశారు. మరోవైపు అల్లు అర్జున్‌కు రెగ్యులర్ బెయిల్ ఇవ్వాలని కోరుతూ నాంపల్లిలోని 2వ అదనపు మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి కోర్టులో ఆయన తరఫు న్యాయవాదులు శుక్రవారం పిటిషన్ దాఖలు చేశారు. దీని పై కౌంటర్ దాఖలుకు వీలుగా విచారణ వాయిదా వేయాలని పీపీ రామకృష్ణ కోరడంతో.. జడ్జి వినోద్‌కుమార్ విచారణను సోమవారానికి వాయిదా వేశారు.

ఒక్కరోజే మూడు అరుదైన ఆపరేషన్లు

- ముగ్గురు మహిళల కడుపులోంచి గడ్డలు తొలగింపు
- సిద్దిపేట జిల్లా దుబ్బాక ప్రభుత్వాస్పత్రి వైద్యుల ఘనత



బాలవ్వ కడుపులోంచి తొలగించిన 9 కిలోల గడ్డ

దుబ్బాక: సిద్దిపేట జిల్లా దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రిలో శుక్రవారం ఒక్కరోజే ఆస్పత్రి సూపరింటెండెంట్, ప్రముఖ సర్జన్ డాక్టర్ హేమరాజ్‌సింగ్ ఆధ్వర్యంలో వైద్య బృందం మూడు అరుదైన ఆపరేషన్లు చేసింది. రాజన్న సిరిసిల్ల జిల్లా లింగన్నపేటకు చెందిన గడ్డమీది బాలవ్వ రెండేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతోంది. చాలా ఆస్పత్రులకు తిరిగినా తగ్గలేదు. రెండు రోజుల కిందట దుబ్బాక ఆస్పత్రికి రాగా డాక్టర్ హేమరాజ్‌సింగ్ పరీక్షలు నిర్వహించి కడుపులో పెద్ద ఓవరియాన్ మాస్ గడ్డ ఉందని నిర్ధారించారు. శుక్రవారం ఆమెకు ఆపరేషన్ చేసి 9 కిలోల గడ్డను విజయవంతంగా తొలగించారు. అలాగే దుబ్బాక మండలం పెద్దగుండవెల్లికి చెందిన వెంకటవ్వకు ఆపరేషన్ చేసి 4.5 కిలోల ఓవరియాన్ సిస్ట్ గడ్డను తీసివేశారు. అదే విధంగా గంభీర్‌పూర్ గ్రామానికి చెందిన 26 ఏళ్ల మౌనిక తీవ్ర కడుపునొప్పితో బాధపడుతూ ఆస్పత్రికి రాగా పరీక్షించిన వైద్యులు.. సర్వయికల్ ఫైబ్రాయిడ్ గడ్డ ఉందని నిర్ధారించి వెంటనే ఆపరేషన్ చేసి తొలగించారు. ప్రస్తుతం ఈ ముగ్గురి ఆరోగ్యం నిలకడగానే ఉందని హేమరాజ్‌సింగ్ తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా మూడు అరుదైన ఆపరేషన్లు చేసి ప్రాణాలు కాపాడడంతో బాధిత కుటుంబాల సభ్యులు వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

రిజిస్ట్రేషన్ వివాదంలో ఆగిపోయిన తల్లి అంత్యక్రియలు

- రెండ్రోజులుగా ఫ్రీజర్‌లోనే మృతదేహం

భిక్కనూరు: భూమి రిజిస్ట్రేషన్ వివాదంలో తల్లి అంత్యక్రియలు ఆగిన ఘటన కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం రామేశ్వర్‌పల్లి గ్రామంలో చోటుచేసుకుంది. తమ్ముడు అన్నకు చెందాల్సిన భూమితో పాటు బంధువుల భూమిని కూడా తన పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకోవడంతో వివాదం నెలకొంది. దీంతో తల్లి శవం రెండ్రోజులుగా ఫ్రీజర్‌లోనే ఉంది. రామేశ్వర్‌పల్లి గ్రామానికి చెందిన లింగవ్వ (80)కు కుమారులు పెంటారెడ్డి, రాంరెడ్డి ఉన్నారు. చిన్నకుమారుడైన రాంరెడ్డి నాలుగేళ్ల కిందట తల్లికి మాయమాటలు చెప్పి అన్న పెంటారెడ్డి వాటాకు వెళ్లాల్సిన 35 గుంటల భూమిని తన పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. అలాగే బంధువులు, దాయాదులకు సంబంధించిన 25 గుంటల భూమిని తన పేరిట మార్పించుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న పెంటారెడ్డితో పాటు బంధువులు, దాయాదులు రాంరెడ్డిని పలుమార్లు నిలదీసినా ఎలాంటి సమాధానం ఇవ్వకపోగా ఏం చేస్తారో చేసుకోండి అంటూ దబాయించాడు. ఈ క్రమంలో లింగవ్వ గురువారం వేకువజామున మరణించింది. ఈ విషయాన్ని కుటుంబీకులు కామారెడ్డిలో ఉంటున్న రాంరెడ్డికి తెలిపారు. రాంరెడ్డి తన భార్యతో కలిసి గ్రామానికి వచ్చాడు. లింగవ్వ మరణ వార్త తెలుసుకున్న బంధువులు కూడా వచ్చారు. అన్న పెంటారెడ్డి, బంధువులు కలిసి రాంరెడ్డి రిజిస్ట్రేషన్ చేయించుకున్న భూమిని తిరిగి తమ పేరిట రిజిస్ట్రేషన్ చేయించాలని పట్టుబట్టారు. రిజిస్ట్రేషన్ చేసేవరకు లింగవ్వ అంత్యక్రియలు నిర్వహించరాదని నిర్ణయించారు. దీంతో రాంరెడ్డి ఎవరి భూమిని వారికి రిజిస్ట్రేషన్ చేసిచ్చేందుకు సమ్మతించాడు. అయితే రెండ్రోజులు ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు రావటంతో రిజిస్ట్రేషన్ ఆగిపోయింది. శనివారం రిజిస్ట్రేషన్ అయిన తర్వాతనే లింగవ్వ అంత్యక్రియలు నిర్వహించాలని బంధువులు పట్టుబట్టారు. లింగవ్వ మృతదేహం ఇంట్లో ఫ్రీజర్‌లోనే ఉంది.



శుక్రవారం ఢిల్లీలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ పార్థివ దేహం వద్ద నివాళులర్పిస్తున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, హోం మంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్, కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్, ప్రియాంకా గాంధీ, తమిళనాడు సీఎం స్టాలిన్

ఆర్థిక సంస్కర్తకు అశ్రు నివాళి

నివాళులర్పించిన రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ, సోనియా గాంధీ

మన్మోహన్ నివాసానికి తరలివచ్చిన వివిధ పార్టీల నేతలు, కేంద్ర మంత్రులు, ప్రముఖులు

సాక్షి, న్యూఢిల్లీ: దివికేగిన ఆర్థిక సంస్కర్త మన్మోహన్ సింగ్‌కి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ తదితర ప్రముఖులు ఘనంగా నివాళులర్పించారు. త్రివర్ణ పతాకం చుట్టిన మన్మోహన్ పార్థివదేహాన్ని ఢిల్లీలోని ఆయన నివాసమైన 3, మోతిలాల్ నెహ్రూ రోడ్డుకు తరలించారు. నివాళులర్పించడానికి శుక్రవారం పార్టీలకు అతీతంగా పెద్ద సంఖ్యలో నాయకులు, కేంద్ర మంత్రులు, ప్రజా ప్రతినిధులు, పలువురు ప్రముఖులు తరలివచ్చారు. ఈ సందర్భంగా దేశాభివృద్ధికి మన్మోహన్ అందించిన సేవలను స్మరించుకున్నారు. మన్మోహన్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన భార్య గురుశరణ్ కౌర్‌ను ఓదార్చారు. ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, జె.పి.నడ్డాతోపాటు కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియా గాంధీ, మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ తదితరులు మన్మోహన్ భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. ఆయనతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్, హిమాచల్‌ప్రదేశ్ సీఎం సుఖ్వీందర్ సింగ్ సుఖూ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఢిల్లీ సీఎం ఆతిశీ, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్‌ఎస్‌ఎస్) చీఫ్ మోహన్ భగవత్, ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబలే కూడా నివాళులర్పించారు.

నేడు నిగమ్‌బోధ్ ఘాట్‌లో అంత్యక్రియలు

దివంగత మాజీ ప్రధాని అంత్యక్రియలు శనివారం ఉదయం జరుగుతాయని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ చెప్పారు. మన్మోహన్ పార్థివదేహాన్ని ఉదయం 8 గంటలకు ఢిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యాలయానికి తరలిస్తామని, ఉదయం 8.30 గంటల నుంచి 9.30 గంటల వరకు ప్రజలు సందర్శించవచ్చని తెలిపారు. 9.30 గంటలకు అంతిమయాత్ర ప్రారంభమవుతుందని అన్నారు. అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు జరుగుతాయని వెల్లడించారు. శనివారం ఉదయం 11.45 గంటలకు ఢిల్లీలోని నిగమ్‌బోధ్ ఘాట్ శ్మశాన వాటికలో మన్మోహన్ అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కేంద్ర హోంశాఖ తెలియజేసింది. పూర్తి సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేయాలని రక్షణ శాఖకు సూచించినట్లు పేర్కొంది.

కేంద్ర మంత్రివర్గం సంతాపం

మన్మోహన్ మృతి పట్ల కేంద్ర మంత్రివర్గం సంతాపం ప్రకటించింది. ప్రధాని మోదీ నేతృత్వంలో కేబినెట్ శుక్రవారం సమావేశమైంది.



గురుశరణ్ కౌర్‌ను ఓదార్చుతున్న ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్ సతీమణి సుధేశ్

మన్మోహన్ ఆత్మశాంతి కోసం తొలుత రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. ప్రభుత్వంతోపాటు యావత్తు దేశం తరఫున సంతాపం తెలియజేశారు. అనంతరం సంతాప తీర్మానం ఆమోదించారు. మహోన్నత రాజనీతిజ్ఞుడు, ఆర్థికవేత్త, గొప్ప నాయకుడిని దేశం కోల్పోయిందని తీర్మానంలో పేర్కొన్నారు. ప్రధానమంత్రిగా ఆయన మనందరిపై బలమైన ముద్ర వేశారని కొనియాడారు. మన్మోహన్ గౌరవార్థం ప్రభుత్వం ఏడు రోజుల పాటు సంతాప దినాలుగా ప్రకటించింది.

సీడబ్ల్యూసీలో సంతాప తీర్మానం ఆమోదం

మన్మోహన్ సింగ్‌కు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) నివాళులర్పించింది. కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే అధ్యక్షతన సీడబ్ల్యూసీ శుక్రవారం ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో భేటీ అయ్యింది. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీ హాజరయ్యారు. మన్మోహన్‌కు సంతాపం ప్రకటిస్తూ ఒక తీర్మానం ఆమోదించారు. భారత రాజకీయాల్లో, ఆర్థిక వ్యవస్థలో అగ్రగణ్యుడు మన్మోహన్ అని కొనియాడారు. ఆయన కృషితో ప్రపంచ స్థాయిలో మన దేశానికి ప్రత్యేక గుర్తింపు, గౌరవం లభించాయని పేర్కొన్నారు. దేశంలో పెనుమార్పులకు శ్రీకారం చుట్టిన మన్మోహన్ చిరస్మరణీయులని ఉద్ఘాటించారు. ప్రజల తలరాతలు మార్చేలా ఎన్నో విప్లవాత్మక పథకాలు, కార్యక్రమాలు తీసుకొచ్చిన ఘనత ఆయనదేనని ప్రశంసించారు.

ఢిల్లీలో స్మారక చిహ్నం

మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్‌కు దేశ రాజధాని ఢిల్లీలో స్మారక చిహ్నం నిర్మించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ సమాచారాన్ని కాంగ్రెస్‌కు కూడా అందించినట్లు శుక్రవారం ప్రభుత్వ వర్గాలు వివరించాయి. ఇందుకు అనువైన స్థలాన్ని ఎంపిక చేసేందుకు కొంత సమయం పడుతుందని తెలిపాయి. అయినప్పటికీ ఈ అంశంపై కాంగ్రెస్ రాజకీయం చేస్తోందని విమర్శించాయి.

అదే సంప్రదాయం పాటించాలి: ఖర్గే

ఢిల్లీలో మన్మోహన్ సింగ్‌కు స్మారకం నిర్మించడానికి వీలైన చోటే ఆయన అంత్యక్రియలు నిర్వహించాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కోరారు. ఈ మేరకు శుక్రవారం ప్రధాని నరేంద్ర మోదీకి రెండు పేజీల లేఖ రాశారు. మన మాజీ ప్రధానమంత్రులకు, రాజనీతిజ్ఞులకు అంత్యక్రియలు జరిగిన చోటే స్మారకం నిర్మించారని గుర్తుచేశారు. ఇప్పుడు కూడా అదే సంప్రదాయం పాటించాలని విజ్ఞప్తి చేశారు. దేశానికి మన్మోహన్ అందించిన విశిష్టమైన సేవలను ఖర్గే తన లేఖలో ప్రత్యేకంగా ప్రస్తావించారు. అంతకముందు ఆయన ప్రధాని మోదీతో ఫోన్‌లో మాట్లాడారు. మన్మోహన్ స్మారక నిర్మాణంపై చర్చించారు. మన్మోహన్ శాశ్వత విశ్రాంతి తీసుకొనే ప్రదేశాన్ని గొప్పగా తీర్చిదిద్దాలని, అదొక పవిత్రమైన స్థలంగా ఉండాలని పేర్కొన్నారు.

ఆ మట్టి.. ఆ నీరు

శ్రీకృష్ణుడికి అటుకులు తీసుకొచ్చిన బాల్యమిత్రుడు కుచేలుడి కథ అందరికీ తెలిసిందే. అలాంటిదే డాక్టర్ మన్మోహన్‌సింగ్ జీవితంలోనూ జరిగింది. అవిభాజ్య భారత్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌లో ఉన్న గాహ్ (ప్రస్తుతం పాకిస్తాన్‌లో ఉంది) అనే గ్రామంలో సింగ్ జన్మించారు. పాఠశాల చదువు అక్కడే పూర్తి చేశారు. 1947 విభజన తరువాత కుటుంబం భారత్‌కు వచ్చింది. కానీ ఆయన బాల్యమంతా ఆ గ్రామంతోనే ముడిపడి ఉంది. స్నేహితులు అక్కడే ఉండిపోయారు. 2004లో ఆయన ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత ఆ వార్త స్వగ్రామానికి చేరకుండా ఉంటుందా? మిత్రులంతా ఆయనను గుర్తు చేసుకున్నారు. మన్మోహన్‌సింగ్‌కు ప్రాణమిత్రుడైన రాజా మహమ్మద్ అలీకి చిన్ననాటి స్నేహితుడు 'మోహన్నా'ను కలవాలనిపించింది. ఆయన చిన్నతనంలో మన్మోహన్‌సింగ్‌ను అలాగే పిలిచేవారు. తన సామర్థ్యం మేరకు కానుకలను పట్టుకుని 2008 మే నెలలో ప్రధాని నివాసానికి వచ్చారు. తనను కలవడానికి వచ్చిన చిరకాల మిత్రుడు అలీకి మన్మోహన్ మరిచిపోలేని ఆతిథ్యమిచ్చారు. అప్పుడు ఇద్దరిదీ డెబ్బై ఏళ్ల వయసు. కానీ బాల్య జ్ఞాపకాలతో ఇద్దరి కళ్లు మెరిసిపోయాయి. ఆ పూటంతా జ్ఞాపకాలతో గడిచిపోయింది. మిత్రుడికి తలపాగా, శాలువాతోపాటు టైటాన్ వాచ్‌ను తన గుర్తుగా ఇచ్చారు మన్మోహన్. ఇక అలీ తిరిగి వెళ్తూ.. మన్మోహన్‌కోసం తీసుకొచ్చిన ఊరి మట్టిని, నీటిని, గాహ్ ఫొటోను బహూకరించాడు. స్నేహంకోసం మట్టిని ఎల్లలు దాటించి ఒక మిత్రుడు తీసుకొస్తే.. సరిహద్దులు ఎన్నున్నా స్నేహం ఎల్లకాలం ఉంటుందనడానికి గుర్తుగా గడియారాలను పంపారు. అలా బాల్యమిత్రులు ఒకరిపై ఒకరి ప్రేమను చాటుకున్నారు.

'బీఎండబ్ల్యూ ప్రధాని కోసం.. నా కారు మారుతి 800'

ఈ మాటలన్నది మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్. ఆయన నిరాడంబరతను ప్రస్తుత యూపీ మంత్రి, ఒకప్పుడు మన్మోహన్‌సింగ్ బాడీగార్డ్‌గా పనిచేసిన ఐపీఎస్ ఆఫీసర్ అసిమ్ అరుణ్ సోషల్ మీడియాలో పంచుకున్నారు. ''2004 నుంచి దాదాపు మూడేళ్ల పాటు మన్మోహన్‌కు బాడీగార్డుగా పనిచేశాను. స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ (ఎస్పీజీ) ప్రధానికి భద్రత కల్పిస్తుంది. క్లోజ్ ప్రొటెక్షన్ టీమ్‌కు నాయకత్వం వహించే అవకాశం నాకు లభించింది. క్లోజ్ ప్రొటెక్షన్ టీమ్ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ జనరల్‌గా నేను ప్రధానికి దగ్గరగా ఉండాల్సి వచ్చేది. ఏదైనా కారణాలవల్ల ఆయన వెంట ఒక అంగరక్షకుడు మాత్రమే ఉండాల్సి వస్తే.. నేనే ఉండేవాడిని. నీడలా ఆయనతో ఉండటమే నా బాధ్యత. డాక్టర్ సింగ్ వద్ద కేవలం ఒక కారు ఉండేది. అది మారుతి 800. ప్రధానమంత్రి కాన్వాయ్‌లోని నల్ల బీఎండబ్ల్యూ కార్ల వెనుక అది పార్క్ చేసి ఉండేది. కాన్వాయ్ తీసే ప్రతీసారి ఆయన ఆ కారువైపు ఆత్మీయంగా చూసేవారు. ఎందుకని అడిగితే.. 'ఈ బీఎండబ్ల్యూ కారులో ప్రయాణించడం నాకు ఇష్టం లేదు అసిమ్. నా వాహనం అదే(మారుతి)' అనేవారు. ఈ కారు మీ లగ్జరీ కోసం కాదు.. సెక్యూరిటీ ఫీచర్లున్నాయి కాబట్టి మీరు ఇదే వాడాలి' అని వివరించేవాడిని'' అంటూ గుర్తు చేసుకున్నారు. 2004లో నేషనల్ సెక్యూరిటీ గార్డ్(ఎన్‌ఎస్జీ) బ్లాక్ క్యాట్ కమాండోగా శిక్షణ పొందిన తొలి ఐపీఎస్ అధికారి అసిమ్ అరుణ్.

నా పిల్లల ఫీజులు చెల్లిస్తానన్నారు: మలేసియా ప్రధాని

మన్మోహన్ సింగ్ మృతిపట్ల మలేసియా ప్రధానమంత్రి అన్వర్ ఇబ్రహీం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఆయనతో తనకు వ్యక్తిగత అనుబంధం ఉందని పేర్కొన్నారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టుచేశారు. మన్మోహన్‌తో తనకున్న గాఢమైన స్నేహానికి సంబంధించిన ఉదంతాన్ని పంచుకున్నారు. ''1990వ దశకంలో మలేసియా ఆర్థిక మంత్రిగా పనిచేశా. రాజకీయ కుట్రలతో జైలుపాలయ్యాను. ఆ సమయంలో నిజమైన మిత్రుడిగా మన్మోహన్ నాకు అండగా నిలిచారు. నా కుటుంబం ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి తెలుసుకొని నా పిల్లల చదువులకు ఫీజులు చెల్లించేందుకు ముందుకొచ్చారు. ముఖ్యంగా నా కుమారుడు ఇషాన్‌కు స్కాలర్‌షిప్ ఇస్తానన్నారు. అప్పటి పరిస్థితుల దృష్ట్యా మన్మోహన్ ఔదార్యాన్ని స్వీకరించలేకపోయా. సున్నితంగానే తిరస్కరించాల్సి వచ్చింది. మన్మోహన్ మంచితనం ఎప్పటికీ మర్చిపోలేనిది'' అని అన్వర్ ఇబ్రహీం పేర్కొన్నారు. భారత్‌లో ఆర్థిక సంస్కరణలకు బాటలు వేసి, ప్రపంచ దేశాలకు మార్గదర్శిగా నిలిచిన తన స్నేహితుడు, సోదరుడైన మన్మోహన్ ఇక లేరంటే నమ్మలేకపోతున్నానని వెల్లడించారు. రాబోయే తరాల కోసం ఘనమైన వారసత్వాన్ని వదిలివెళ్లారని కొనియాడారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువులు మధ్యలోనే ఆపేయాల్సిన దయనీయ పరిస్థితుల్లో ఉన్న విద్యార్థులకు మన్మోహన్ అండగా నిలిచిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి.

స్టాక్ మార్కెట్ కారణంగా నిద్ర కోల్పోవడం ఇష్టం లేదు

ప్రపంచ ప్రఖ్యాతి చెందిన ఆర్థికవేత్త మన్మోహన్ సింగ్ తన డబ్బును ఎక్కడ పెట్టుబడి పెట్టేవారు? 'స్టాక్ మార్కెట్ ఒడిదుడుకుల కారణంగా నిద్ర కోల్పోవడం నాకు ఇష్టం లేదు' అని ఆయన 1992లో పార్లమెంట్‌లో చెప్పారు. ఆయన తన డబ్బును స్టాక్ మార్కెట్‌లో ఏనాడూ పెట్టలేదు. ఆర్థిక క్రమశిక్షణ పాటించారు. ఫిక్స్‌డ్ డిపాజిట్లు, పోస్టాఫీసు సేవింగ్స్ పథకాలనే నమ్ముకున్నారు. 2019 నాటి ఎన్నికల అఫిడవిట్ ప్రకారం మన్మోహన్ దంపతుల మొత్తం ఆస్తుల విలువ రూ.15 కోట్లు. వారికి ఢిల్లీ వసంత్ కుంజ్‌లో ఒక ఇల్లు, చండీగఢ్‌లో మరో ఇల్లు ఉంది. బ్యాంకుల్లో ఉన్న ఫిక్స్‌డ్ డిపాజిట్లు రూ.7 కోట్లు. పోస్టాఫీసులో నేషనల్ సేవింగ్స్ స్కీమ్‌లో రూ.12 లక్షలు ఉన్నట్లు తెలిపారు. 2013లో సమర్పించిన ఎన్నికల అఫిడవిట్‌లో మన్మోహన్ సింగ్ దంపతులు ఆస్తుల విలువ రూ.11 కోట్లుగా ఉంది. మన్మోహన్ ఆర్థిక మంత్రి అయిన తర్వాతే భారత స్టాక్ మార్కెట్ ఊపందుకుంది. 1991లో ఆయన ఆర్థిక మంత్రి అయినప్పుడు సెన్సెక్స్ 999 పాయింట్లుగా ఉండేది. బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత అదే ఏడాది ఆఖరు నాటికి రెండింతలయ్యింది. 2006లో 10,000 పాయింట్లకు చేరుకుంది. ఆర్థికవేత్తగా స్టాక్ మార్కెట్ గురించి తెలిసినప్పటికీ ఆయన అందులో ఎలాంటి పెట్టుబడులు పెట్టకపోవడం గమనార్హం.

నా దేశం ఎలా ఉంది? కశ్మీర్ ఎలా ఉంది?

మన్మోహన్ సింగ్‌కు 2009లో హార్ట్ సర్జరీ జరిగింది. ఆయనకు చికిత్స అందించిన సీనియర్ కార్డియాక్ సర్జన్ డాక్టర్ రమాకాంత్ పాండా అప్పట్లో తన అనుభవం వెల్లడించారు. ఢిల్లీ ఎయిమ్స్‌లో మన్మోహన్‌కు దాదాపు 11 గంటలపాటు క్రిటికల్ కరోనరీ బైపాస్ సర్జరీ చేశామని చెప్పారు. శస్త్రచికిత్స పూర్తయిన తర్వాత రాత్రి బ్రీతింగ్ పైప్ తొలగించామని, దాంతో మన్మోహన్ మాట్లాడారని, తొలుత ఆరోగ్యం గురించి కాకుండా దేశం గురించి అడిగారని చెప్పారు. నా దేశం ఎలా ఉంది? కశ్మీర్ ఎలా ఉంది? అని ప్రశ్నించారని తెలిపారు. గుండె ఆపరేషన్ సంగతి కాకుండా దేశం గురించే ఆలోచిస్తున్నానని చెప్పారని రమాకాంత్ పాండా వెల్లడించారు. సాధారణంగా హార్ట్ సర్జరీ తర్వాత ఛాతీలో నొప్పి వస్తుందంటూ రోగులు చెబుతుంటారని, మన్మోహన్ మాత్రం అలాంటి ఫిర్యాదు చేయలేదని అన్నారు. ఆయన మానసికంగా చాలా బలంగా ఉండేవారని తెలిపారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

మన్మోహన్ జీవితం ఒక గొప్ప పాఠం: మోదీ

న్యూఢిల్లీ: దివంగత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మరణం దేశానికి అతిపెద్ద నష్టం అని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమం పట్ల ఆయన అంకితభావం చిరస్మరణీయమని వెల్లడించారు. మన్మోహన్‌పై ప్రజల అభిమానం, గౌరవం ఎప్పటికీ చెక్కు చెదరవని ఉద్ఘాటించారు. ఈ మేరకు మోదీ శుక్రవారం ఒక వీడియో సందేశం విడుదల చేశారు. మన్మోహన్ జీవిత ప్రయాణాన్ని ప్రస్తావించారు. ఆయన జీవితం రాబోయే తరాలకు ఒక విలువైన పాఠంగా నిలుస్తుందని వెల్లడించారు. పేద కుటుంబంలో జన్మించి, ఎన్నో కష్టనష్టాలు తట్టుకొని, ఎంతో కష్టపడి ఉన్నత స్థానానికి చేరుకున్న మన్మోహన్ ఎప్పటికీ స్ఫూర్తిదాయకమేనని చెప్పారు. ఆర్థికవేత్తగా, ప్రధానమంత్రిగా దేశానికి అందించిన సేవలు గుర్తుండిపోతాయని తెలి పారు. గొప్ప విద్యావేత్త, మానవతావాది, ఆర్థిక నిపుణుడు, సంస్కరణల రూపశిల్పిగా నిలిచిపోతారని పేర్కొన్నారు.

నా మిత్రుడు మార్గదర్శి, తాత్వికుడు


సోనియా సంతాప సందేశం

న్యూఢిల్లీ: మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ తనకు స్నేహితుడు, తత్వవేత్త, మార్గదర్శి అని సోనియా గాంధీ పేర్కొన్నారు. ఆయన మరణం తనకు వ్యక్తిగతంగా నష్టమని తెలిపారు. శుక్రవారం ఈ మేరకు సోనియా గాంధీ సంతాప సందేశం విడుదల చేశారు. అందులో ఆమె.. 'కాంగ్రెస్ పార్టీతోపాటు దేశ ప్రజలు డాక్టర్ మన్మోహన్ సింగ్ గురించి ఎల్లప్పుడూ గొప్పగా చెప్పుకుంటారు. ఆయన అందించిన సేవలకు కృతజ్ఞతలు తెలుపుకుంటారు. దేశ పురోగతి, అభివృద్ధికి ఆయన అందించిన సేవలు అపారం'అని తెలిపారు.

సూర్యుడి 'కరోనా'ను తాకింది...

- చరిత్రకెక్కిన పార్కర్ సోలార్ ప్రోబ్
- అంతా సవ్యంగా ఉందంటూ సందేశం

న్యూయార్క్: అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ 'నాసా' స్పేస్‌క్రాఫ్ట్ చరిత్ర సృష్టించింది. నాసా ప్రయోగించిన 'పార్కర్ సోలార్ ప్రోబ్' సూర్యుడికి అత్యంత సమీపానికి చేరుకుంది. ఈ విషయాన్ని నాసా శుక్రవారం ధ్రువీకరించింది. 2018లో ప్రయోగించిన ఈ అంతరిక్ష నౌక కొద్దిరోజుల క్రితమే భగభగ మండే సూర్యుడి ఉపరితలం నుంచి 3.8 మిలియన్ మైళ్ల(6.1 మిలియన్ కిలోమీటర్లు) దూరానికి విజయవంతంగా చేరుకుంది. సూర్యుడి బాహ్య వాతావరణమైన కరోనా గుండా ప్రయాణించింది. ఎలాంటి ముప్పు లేకుండా సురక్షితంగా ఉంది.



సూర్యుడి సమీపంలో పార్కర్ (ఊహాచిత్రం)

చరిత్రలో ఇప్పటిదాకా లోకబాంధవుడికి ఇంత సమీపానికి వెళ్లి, సురక్షితంగా ఉన్న అంతరిక్ష నౌక మరొకటి లేదు. అంతా సవ్యంగా ఉన్నట్లు పార్కర్ సోలార్ ప్రోబ్ నుంచి గురువారం రాత్రి నాసాకు సందేశం అందింది. పార్కర్ రాబోయే కొన్ని రోజులపాటు అత్యధిక ఉష్ణోగ్రతలో చక్కర్లు కొట్టనుంది. దాంతో అక్కడి నుంచి సంకేతాలు ఆగిపోతాయి. సురక్షిత ప్రాంతానికి తిరిగివచ్చిన తర్వాత మళ్లీ సంకేతాలు అందుతాయి. మానవులు ఇప్పటిదాకా నిర్మించిన అంతరిక్ష నౌకల్లో ఇదే అత్యంత వేగవంతమైంది కావడం గమనార్హం. గంటకు 6.90 లక్షల కిలోమీటర్ల వేగంతో ప్రయాణించగలదు. 2,500 డిగ్రీల సెల్సియస్ ఫారెన్‌హీట్(1,370 డిగ్రీల సెల్సియస్) ఉష్ణోగ్రతను సైతం తట్టుకొనేలా పటిష్టమైన హీట్ షీల్డ్‌ను పార్కర్‌పై అమర్చారు. సూర్యుడి నుంచి అత్యధిక ఉష్ణోగ్రత జనించడానికి కారణం ఏమిటన్నది మరింత బాగా అర్థం చేసుకోవడానికి ఈ అంతరిక్ష నౌకను ప్రయోగించారు. ఇదిలా ఉండగా, పార్కర్ సోలార్ ప్రోబ్ వచ్చే ఏడాది సెప్టెంబర్ వరకూ సూర్యుడి చుట్టూ కక్ష్యలో పరిభ్రమించనుంది.

తాత్కాలిక అధ్యక్షుడికీ తప్పని అభిశంసన

దక్షిణ కొరియా నేషనల్ అసెంబ్లీ తీర్మానం



సియోల్: దక్షిణ కొరియాలో రాజకీయ సంక్షోభం మరింత ముదిరింది. దేశ తాత్కాలిక అధ్యక్షుడు హన్ డక్-సూపై ప్రవేశపెట్టిన అభిశంసన తీర్మానాన్ని ప్రతిపక్షం మెజారిటీ కలిగిన నేషనల్ అసెంబ్లీ శుక్రవారం ఆమోదించింది. అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ దేశంలో అనూహ్యంగా మార్షల్ లా విధించడం, అనంతర పరిణామాల్లో ఆయన్ను నేషనల్ అసెంబ్లీ అభిశంసించడం తెలిసిందే. తాజాగా తాత్కాలిక అధ్యక్షుడు హన్‌ను నేషనల్ అసెంబ్లీ అభిశంసించిన నేపథ్యంలో ఆయనకు ఇకపై ఎలాంటి అధికారాలు, విధులు ఉండవు. పదవిలో కొనసాగించాలా లేదా దించేయాలా అనే విషయాన్ని రాజ్యాంగ న్యాయస్థానం తేల్చేదాకా ఇదే పరిస్థితి కొనసాగనుంది. యూన్ అభిశంసన అంశం ఇప్పటికే రాజ్యాంగ న్యాయస్థానం పరిశీలనలో ఉండటం తెలిసిందే. అధ్యక్షుడు, తాత్కాలిక అధ్యక్షుడి అభిశంసనలు దేశంలో రాజకీయపరమైన అయోమయాన్ని మరింత పెంచాయి. ఆర్థిక అనిశ్చితి ఫలితంగా అంతర్జాతీయంగా దక్షిణ కొరియా ప్రతిష్ట దెబ్బతిననుంది.

రష్యా క్షిపణి వల్లే కూలిందా?

అజెర్‌బైజాన్ ఎయిర్‌లైన్స్ అనుమానం

న్యూఢిల్లీ: కజకిస్తాన్‌లోని అక్తావ్ సమీపంలో బుధవారం విమానం కూలడానికి వెలుపలి శక్తుల ప్రమేయమే కారణమని అజెర్‌బైజాన్ ఎయిర్‌లైన్స్ తెలిపింది. వెలుపలి భౌతిక, సాంకేతిక పరమైన ప్రమేయం వల్లే విమానం కూలినట్లు తమ ప్రాథమిక దర్యాప్తులో తేలిందని శుక్రవారం వెల్లడించింది. ఈ విమానం కుప్పకూలడానికి రష్యా యాంటీ ఎయిర్ క్రాఫ్ట్ వ్యవస్థే కారణమని అంతకు ముందు వార్తలొచ్చాయి. రష్యా వైమానిక విభాగం ప్రతినిధి యడ్రోవ్ మీడియాతో మాట్లాడుతూ.. గ్రోజ్నీ, వ్లాడికవ్కాజ్‌లలోని మౌలిక వసతులు, జనావాసాలపై ఉక్రెయిన్ డ్రోన్ల దాడులు జరుగుతున్నాయి. అందుకే గ్రోజ్నీలో ల్యాండ్ చేయకుండా విమానాన్ని దారి మళ్లించారని తెలిపారు. 'దీన్నిబట్టి చూస్తే, ఆ ప్రాంతంలోని గగనతలాన్ని మూసివేసినట్లు అర్థమవుతోంది. అంటే, ఆ జోన్‌లోకి వచ్చే ఏదైనా విమానం తక్షణమే బయటకు రావాల్సి ఉంటుంది. లేకుంటే ప్రమాదమే'అని విశ్లేషకులు అంటున్నారు. 'విమానం గ్రోజ్నీలో ల్యాండయ్యేందుకు రెండుసార్లు ప్రయత్నించింది. అయితే, డ్రోన్ దాడుల భయంతో వేరే విమానాశ్రయాల్లో ల్యాండ్ చేయాలని అధికారులు పైలట్‌కు సూచించారు. అందుకే, పైలట్ అక్తావ్ ఎయిర్‌పోర్టు దిశగా విమానాన్ని మళ్లించారు. ఆ సమయంలో ఆ ప్రాంతంలో కురుస్తున్న దట్టమైన మంచు ప్రమాదానికి కారణమైంది'అని యడ్రోవ్ వివరించారు. కానీ, రష్యా మీడియా విమాన ప్రమాదం గురించిన అసత్యాలు ప్రచారం చేస్తోందని ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి సిబిహా ఆరోపించారు. క్షిపణి దాడిలో దెబ్బతిన్న విమానంలో ఆనవాళ్లు దొరక్కుండా చేయడానికి రష్యా అధికారులు సముద్రం దాటాలని పైలట్‌పై ఒత్తిడి చేశారని విమర్శించారు. విమానం కూలిన తర్వాత కేబిన్ నుంచి భారీగా పొగలు వస్తున్నట్లుగా చూపే వీడియోలు, ఫొటోలు కూడా ఇందుకు సాక్ష్యంగా ఉన్నాయన్నారు. విమానం ముక్కలై మంటలు అంటుకోవడం, కాస్పియన్ సముద్ర తీరానికి సమీపంలో నేలను తాకి నల్లని పొగలు కమ్ముకుంటున్న వీడియో ఒకటి ఆన్‌లైన్‌లో కనిపిస్తోంది. ఘటనా ప్రాంతంలో విమానం ధ్వంసమైన తీరును గమనిస్తే రష్యా మిలటరీ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ వల్లే నేలకూలినట్లు కనిపిస్తోందని యూకేకు చెందిన ఓస్ప్రే ఫ్లైట్ సొల్యూషన్స్ సంస్థ చీఫ్ మ్యాట్ బోరీ విశ్లేషించారని వాల్‌స్ట్రీట్ జర్నల్ పేర్కొంది. రష్యన్లే ఆ విమానాన్ని కూల్చేశారని ఉక్రెయిన్ జాతీయ భద్రతాధికారి అంద్రీ కొవలెంకో చెప్పారు. యుద్ధం జరుగుతున్న వేళ గ్రోజ్నీ గగనతలాన్ని రష్యా మూసివేయకపోవడం వల్లే ఈ విషాదం చోటుచేసుకుందన్నారు.

జర్మనీ పార్లమెంట్‌కు ఫిబ్రవరిలో ఎన్నికలు



చాన్స్‌లర్ షోల్జ్

ఫ్రాంక్‌ఫర్ట్: జర్మనీ అధ్యక్షుడు ఫ్రాంక్-వాల్టర్ స్టెయిన్‌మెయిర్ శుక్రవారం పార్లమెంట్(బుండెస్టాగ్)ను రద్దు చేశారు. చాన్స్‌లర్ ఒలాఫ్ షోల్జ్‌కు చెందిన మూడు పార్టీల సంకీర్ణ కూటమి నుంచి ఓ కీలక పార్టీ వైదొలగడంతో నవంబర్ 6న ప్రభుత్వం పడిపోయింది. నిబంధనలను అనుసరించి ఈ నెల 16న పార్లమెంట్‌లో బల పరీక్ష చేపట్టగా షోల్జ్ ఓటమి పాలయ్యారు. దీంతో, నిర్దేశించిన సమయానికి ఏడు నెలలు ముందుగానే ఫిబ్రవరి 23న ఎన్నికలు నిర్వహించే విషయంలో పార్లమెంట్‌లోని ప్రధాన పార్టీలు ఒక అంగీకారానికి వచ్చాయి. తాజాగా అధ్యక్షుడు పార్లమెంట్‌ను రద్దు చేయడంతో ఫిబ్రవరి 23న ఎన్నికలకు మార్గం ఏర్పడినట్లయింది. రాజ్యాంగ ప్రకారం పార్లమెంట్ రద్దయిన 60 రోజుల్లోగా ఎన్నికలు జరపాల్సి ఉంది.

కొరడాతో కొట్టుకున్న తమిళనాడు బీజేపీ చీఫ్

కోయంబత్తూర్/చెన్నై: తమిళనాడు బీజేపీ చీఫ్ కె.అన్నామలై వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. చెన్నైలోని ఓ కాలేజీ విద్యార్థినిపై లైంగిక దాడి కేసు విషయంలో డీఎంకే ప్రభుత్వం, రాష్ట్ర పోలీసుల వైఖరిని ఖండిస్తూ అన్నామలై కొరడాతో తనను తాను కొట్టుకున్నారు. శుక్రవారం కోయంబత్తూర్‌లోని తన నివాసం వెలుపల అన్నామలై పచ్చని ధోతీ ధరించి, చొక్కా లేకుండానే కొరడాతో పదే పదే కొట్టుకున్నారు. ఆయన చుట్టూ గుమికూడిన బీజేపీ కార్యకర్తలు లైంగిక దాడి బాధితురాలి ఎఫ్ఐఆర్‌ను పోలీసులు లీక్ చేయడాన్ని నిరసిస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఇదే అంశంపై గురువారం అన్నామలై మీడియా సమావేశంలో పాదరక్షలను వదిలేశారు. తమిళనాడులో క్షీణిస్తున్న శాంతి భద్రతలకు డీఎంకే ప్రభుత్వమే కారణమని ధ్వజమెత్తారు.



కొరడాతో కొట్టుకుంటున్న అన్నామలై

ఈ ప్రభుత్వాన్ని గద్దె దించేదాకా కాళ్లకు చెప్పులు వేసుకోనని ప్రతిజ్ఞ చేశారు. ఎన్నికల్లో డబ్బు పంచబోమని కూడా చెప్పారు. డీఎంకే ప్రభుత్వం పాల్పడిన పాపాలకు ప్రాయశ్చిత్తంగా 48 రోజులపాటు ఉపవాసంతో ఉండి రాష్ట్రంలోని ఆరు ప్రముఖ మురుగన్ ఆలయాలను దర్శించుకుంటానని తెలిపారు. ఉత్తరం-దక్షిణ రాజకీయాలు బూచిగా చూపుతూ వాస్తవ సమస్యల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు డీఎంకే సర్కార్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. డీఎంకే రాజకీయాలు చూసి రోత పుడుతోందని అన్నామలై చెప్పారు. అన్నామలై వర్సిటీలో 19 ఏళ్ల విద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడిన గుణశేఖరన్ పాతనేరస్తుడు. అతడు డీఎంకే వ్యక్తి కాబట్టే, పోలీసులు ఇప్పటిదాకా క్రిమినల్ కేసు నమోదు చేయలేదని ఆరోపించారు. పోలీసులు ఎఫ్ఐఆర్‌ను లీక్ చేయడం బాధితురాలిని అవమానించడం, ఆమె వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించడమేనన్నారు. అయితే, అన్నామలై చర్య నవ్వు తెప్పించేలా ఉందని డీఎంకే వ్యాఖ్యానించింది.

లష్కరే నేత అబ్దుల్ రెహ్మాన్ మక్కి మృతి




లాహోర్: ముంబై దాడుల సూత్రధారి హఫీజ్ సయీద్ బావమరిది, నిషేధిత జమాత్ ఉద్-దవా ఉపాధ్యక్షుడు హఫీజ్ అబ్దుల్ రహ్మాన్(76) మక్కి లాహోర్‌లో చనిపోయాడు. మధుమేహం ముదిరిపోవడంతో కొంతకాలంగా అతడు లాహోర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని, శుక్రవారం వేకువజామున గుండెపోటుకు గురై తుదిశ్వాస విడిచాడని జమాత్ ఉద్-దవా తెలిపింది. ఉగ్ర నిధుల కేసులో ఉగ్రవాద వ్యతిరేక కోర్టు ఇతడికి 2020లో ఆరు నెలల జైలు శిక్ష విధించింది. 2023లో ఇతడిని ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించింది. దీంతో, మక్కి ఆస్తుల సీజ్‌తోపాటు ప్రయాణ, ఆయుధ నిషేధం అమల్లో ఉంది. అప్పటి నుంచి మక్కి బహిరంగంగా కనిపించడం మానేశాడు. అప్పట్నుంచి, జమాత్ ఉద్ దవా పేరుతో విరాళాలు సేకరించడం, కొత్త వాళ్లను చేర్చుకోవడం ప్రారంభించాడు. 2008 డిసెంబర్ 26న సముద్ర మార్గం ద్వారా దొంగచాటుగా ముంబైలోకి ప్రవేశించిన ముష్కరులు యథేచ్ఛగా కాల్పులు జరుపుతూ భయానక వాతావరణం సృష్టించారు. వీరి కాల్పుల్లో 100 మందికిపైగా చనిపోవడం తెలిసిందే. పాకిస్తాన్‌లో ఉంటున్న హఫీజ్ సయీద్ అనారోగ్యంతో చనిపోయినట్లు ఏప్రిల్‌లో సామాజిక మాధ్యమాల్లో వార్తలు వచ్చాయి.

శుభమస్తు! ఆరోగ్యమస్తు!!



2025
హెల్దీ & హ్యాపీ

‘ఓమ్’ ప్రథమం గట్ బయోమ్



డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి
సీనియర్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ అండ్ చైర్‌పర్సన్ ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంటరాలజీ

జీర్ణ వ్యవస్థ చాలా సంక్లిష్టమైన వ్యవస్థ. గతంలో జీర్ణవ్యవస్థ అనేది కేవలం జీర్ణం చేయడానికి ఉపయోగపడతుందని అనుకున్నారు. ఇటీవలి పరిశోధనల్లో తేలిన విషయం ఏమిటంటే జీర్ణవ్యవస్థలో కోటాను కోట్ల బ్యాక్టీరియా, వైరస్‌లు, ఫంగీ వంటి జీవులు నివసిస్తుంటాయనీ, ‘గట్ బయోమ్’గా పేర్కొనే వీటి సమతౌల్యత వల్లనే మానసిక ఆరోగ్యం, వ్యాధి నిరోధక వ్యవస్థ సమర్థంగా పనిచేయడం వంటివన్నీ ఆధారపడి ఉంటాయని తెలిసింది. అంటే ఓ వ్యక్తి ఆహారం అరిగించడంలోనే కాకుండా, అతడు తినే పదార్థాల తీరు తెన్నులు అతడి మానసిక ఆరోగ్యాన్నీ, రోగనిరోధక వ్యవస్థ పనితీరును నిర్దేశిస్తుంటాయన్నమాట. ఈ బయోమ్ వ్యవస్థ బాగుంటేనే... ఓ వ్యక్తితాలూకు భావోద్వేగాలు (మూడ్స్), నిద్ర, అతడి మానసిక ఆరోగ్యం ఇవన్నీ బాగుంటాయి. మంచి జీవనశైలిని అనుసరిస్తూ, పూర్తిగా సమతులాహారం తీసుకుంటూ ఉంటే గట్ బయోమ్ సమతౌల్యత బాగుంటుంది. మన భారతీయ సంప్రదాయ ఆహారంలో మొక్కలూ, వృక్షాల నుంచి లభ్యమయ్యే ఆహారం తీసుకుంటుంటాం. అంటే... మనం తినే అన్నంలోనే కాయధాన్యాలు, పప్పులు, ఆకుకూరలు, కాయగూరలతో పాటు పులవడానికి సిద్ధంగా ఉండే ఇడ్లీ, దోశలు, భోజనం చివర్లో పెరుగు, మజ్జిగ వంటి ప్రోబయాటిక్ ఆహారాలను తీసుకుంటాం. ఇవన్నీ జీర్ణవ్యవస్థలో ఉండే గట్ బయోమ్‌ను ఆరోగ్యకరంగా, సమతౌల్యంగా ఉండేలా చూస్తాయి. ఇటీవల మనం తీసుకుంటున్న ప్రాసెస్‌డ్ ఫుడ్, చక్కెరతో చేసే తీపిపదార్థాల్లో ఇవి అంతగా ఉండవు. అందుకే మంచి సమతులాహారం తీసుకోవడంతో పాటు మంచి జీవనశైలిలో భాగంగా ఒంటికి తగినంత శ్రమ కలిగేలా తేలికపాటి వ్యాయామాలు, వేళకు కంటి నిండా నిద్రపోవడం వంటి చర్యలతో గట్ బయోమ్ సమతౌల్యత సమర్థంగా నిర్వహితమవుతూ ఉంటుంది. దీనివల్ల మంచి జీర్ణక్రియ, తిన్నది ఒంటికి పట్టడమే కాకుండా మంచి మూడ్ (భావోద్వేగాల) నిర్వహితమవుతుండటం, వ్యాధి నిరోధక వ్యవస్థ చురుగ్గా, క్రియాశీలకంగా మారడం, పూర్తిస్థాయి భౌతిక, మానసిక ఆరోగ్యాల నిర్వహణ జరుగుతాయి. అందుకే స్వాభావికమైన, పీచు ఎక్కువగా ఉండే ఆహారాలు, పులవడానికి సంసిద్ధంగా ఉండే పెరుగు, మజ్జిగ వంటి ప్రోబయోటిక్స్, తేలికపాటి వ్యాయామాలతో గట్ బయోమ్ సమతౌల్యతతో నిర్వ‘హిత’మయ్యేలా చూసుకోవాలని ఆకాంక్షిస్తున్నా.

కదలికే ‘కీళ్లా’కం



డాక్టర్ గురవారెడ్డి
కీళ్లమార్పిడి శస్త్రచికిత్సల నిపుణులు

పోషకాలు తీసుకోవడానికి జాయింట్స్‌కు నోరు లేదు. అదెలాగంటారా? మన దేహంలోని ప్రతి కణానికీ రక్తం ద్వారా పోషకాలూ, ఆక్సిజన్ అందుతాయి. రక్తప్రసరణ వ్యవస్థతో నేరుగా అనుసంధానమై ఉండటం వల్ల వాటికి నేరుగా న్యూట్రియెంట్స్ (పోషకాలు) అందుతాయి. కానీ, కీళ్ల విషయం వేరు. అవి రక్తప్రసరణ వ్యవస్థతో నేరుగా అనుసంధానమై ఉండవు. మరి వాటికి పోషకాలు అందడమెలా? కీళ్లు ఎంతగా కదులుతుంటే అంతగా వాటికి పోషకాలు అందుతాయి. ఒకవేళ శరీరం కదలికలు మందగించి, కీళ్లలో కదలిక లేకపోతేనో?... అప్పుడు వాటికి పోషకాలు అందవు. నేరుగా రక్తప్రసరణ వ్యవస్థతో అనుసంధానమై ఉన్న కణాలకు ఉన్నట్లు వాటికి సప్లై ఉండదు కాబట్టే... వాటికి నోరు లేదు అన్నది.

నోరున్న వాడు నోరు చేసుకు బతుకుతాడు. మరప్పుడు నోరు లేని కీళ్లు కష్టం చేసుకుని బతకాల్సిందే కదా. అందుకే కీలాడితే గానీ వాటికి బతుకాడదు. అందుకే కీళ్ల ఆరోగ్యం బాగుండాలంటే, వాటికీ పోషకాలు అందాలంటే వ్యాయామం తప్పనిసరి అన్నమాట.

ఇక మరోమాట... ఎవరిలోనైనా కీళ్లు బాగా అరిగిపోతే (అంటే కీళ్లపై ఉండే కార్టిలేజ్ అనే పొర అరిగితే) అప్పుడు కీళ్ల మార్పిడి శస్త్రచికిత్స అవసరం. ఇలాంటి సందర్భాల్లో కొంతమంది కీళ్లలోకి ఇంజెక్షన్ ఇస్తామంటూ పీఆర్‌పీలు, స్టెరాయిడ్స్ ఎక్కిస్తారు. అవి అందగానే నొప్పులన్నీ తగ్గుతాయి. దాంతో ఇంజెక్షన్‌తోనే నొప్పి అంతా తగ్గిపోయిందంటూ చాలామంది ఆనందపడతారు. అలాంటి ఇంజక్షన్స్ చేయమంటూ ఆర్థోపెడిక్ సర్జన్ల దగ్గరికి రోజూ పదుల సంఖ్యలో వస్తుంటారు. నాలుగో స్టేజీలో ఉన్న మోకాళ్ల ఆర్థరైటిస్‌కి ఏ డాక్టర్ అయినా పీఆర్‌పీ ఇంజెక్షన్ ఇస్తే అతడు డాక్టర్ కాదు... ఆపరేషన్ అంటే భయపడే అమాయకులైన పేషెంట్లను మోసం చేస్తున్నాడని గ్రహించాలి.

ఇంజెక్షన్ చేయడమనేది ఎంబీబీఎస్ చదువుతున్న వైద్య విద్యార్థులు మొదలు కాంపౌండర్లూ చేయగలిగేదే. స్టెరాయిడ్స్ ఇవ్వడంతో తొలుత నొప్పులు ఉపశమించినట్లు కనిపించినా... ఆ తర్వాత అవి బోలుగా మారడం, తేలిగ్గా విరగడం జరుగుతుంది. మహామహా కీళ్లమార్పిడి నిపుణులు చిన్నపాటి ఇంజెక్షన్ చేయలేరా? ఎందుకు చేయరంటే బాధితుల పాలిట అదో ద్రోహం. వాళ్ల ఎముకల్ని గుల్ల చేసేసే ఓ అనైతిక (అన్ ఎథికల్) పద్ధతి. అందుకే కీళ్లు పూర్తిగా అరిగాక ఎవరైనా ఇంజెక్షన్స్‌తో మాన్పిస్తామంటే... వాళ్లు నొప్పి నివారణ మందులూ, స్టెరాయిడ్స్ కలిపి ఇంజెక్షన్ చేస్తూ, దీర్ఘకాలికంగా ఎముకల్ని గుల్ల గుల్ల చేస్తున్నారని అర్థం చేసుకోవాలి.



డాక్టర్ బొల్లినేని భాస్కర్‌రావు
చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కిమ్స్ హాస్పిటల్స్

మీరు బరువైతే గుండె చెరువే

గుండెను అందరూ పదిలంగా చూసుకోవాల్సిన అవసరముంది. అందుకు కొన్ని సూచనలు...

- మనం మన ఒత్తిడి (స్ట్రెస్)కి కారణమైన అంశాలని చెబుతున్న వాటిల్లో 90 శాతం అంశాలు అంతగా ఒత్తిడికి గురిచేసేవే కాదు. అసలు స్ట్రెస్ కంటే... మనం దానికి భయపడుతున్న తీరే ఎక్కువగా ఒత్తిడికి గురిచేస్తుంది. దాన్ని ఎలా ఎదుర్కోవాలనే పరిష్కార మార్గాలు ఆలోచిస్తే స్ట్రెస్ దానంతట అదే తగ్గిపోతుంది.
- మహిళలకు ప్రత్యేకంగా చెబుతున్న విషయమేమిటంటే... నిత్యజీవితంలోని ఒత్తిడి (స్ట్రెస్) పురుషులకంటే మహిళలకే ఎక్కువగా హాని చేస్తుందని అధ్యయనాల్లో తేలింది. మహిళలు ఒత్తిడి నుంచి దూరంగా ఉండటం గుండెకు మేలు చేస్తుంది. మరీ ముఖ్యంగా మహిళల్లో మెనోపాజ్ తర్వాత ఈస్ట్రోజెన్ వల్ల గుండెకు కలిగే రక్షణ తొలగిపోతుంది కాబట్టి వయసు పెరుగుతున్న కొద్దీ మానసిక స్థైర్యాన్ని మరింతగా పెంచుకుంటూ, సమస్యలను తేలిగ్గా పరిష్కరించుకుంటూ మానసికంగా ప్రశాంతంగా ఉండాల్సిన అవసరముంది. ఇందుకోసం చేయాల్సిన పనులూ సులువు కూడా. మొబైల్ ఫోన్‌ను పరిమితంగా వాడితే ఒత్తిడి తగ్గుతుంది. అలాగే టెలివిజన్‌కే అంటిపెట్టుకొని ఉండటం. ఒకేచోట కూర్చుని అదేపనిగా వీటిని వాడుతుంటే స్థూలకాయం వస్తుంది. ఇది కేవలం గుండెకే కాదు... అనేక ఆరోగ్య అనర్థాలకు కారణం. ఆరోగ్యకరమైనవి తింటూ, తగినంత వ్యాయామం చేస్తూ, ఒత్తిడికి దూరంగా ఉంటే కేవలం గుండెజబ్బులే కాదు... ఇతర వ్యాధులూ తగ్గుతాయి.

ఈ ఎన్ టీ ‘తల’మానికం



డాక్టర్ ఈసీ వినయ కుమార్
హెచ్‌ఓడీ అండ్ సీనియర్ ఈఎన్‌టీ సర్జన్, అపోలో హాస్పిటల్స్

మన ముక్కు చెవులనూ, అలాగే మన తలను మిగతా దేహంతో అనుసంధానం చేసే మెడ... వీటన్నింటి ఆరోగ్యాలను జాగ్రత్తగా కాపాడుకోవాలి.

మీ చెవుల సంరక్షణ కోసం...

- అతి భారీ శబ్దాలు వినికిడి సమస్యను తెచ్చిపెట్టే ప్రమాదం ఉంది. పెద్ద పెద్ద శబ్దాలు వచ్చే చోట్లలో / పనిప్రదేశాలలో ఇయర్ ప్లగ్స్ వాడుకోవాలి.
- చెవులు వినబడుతుంటేనే చిన్నారులు మాటలు నేర్చుకునేది. అందుకే చిన్నారి పుట్టగానే ఆ పిల్లలకు వెంటనే వినికిడి పరీక్షలు చేయించాలి. ఇలాచేయడం వల్ల అటు వినికిడి సమస్యనూ, ఇటు మాటలు రాకపోవడాన్నీ ఏకకాలంలో అరికట్టవచ్చు.

ఇక ముక్కు ఆరోగ్యం కోసం...

- అన్ని అవయవాలనుంచి తేమను లాగేసినట్టే... ముక్కు నుంచి కూడా తేమను లాగేస్తుంది ఈ సీజన్. అందుకే ముక్కు తాలూకు తేమ బాగానే నిర్వహితమయ్యేలా చూసుకునేందుకు నీళ్లు తాగుతూ హైడ్రేటెడ్‌గా ఉండాలి.
- ముక్కులు బిగదీసుకుపోయే తత్త్వం ఉన్నవారు (ఇది ఈ సీజన్‌లో మరీ ఎక్కువ) సెలైన్ నేసల్ స్ప్రేలు వాడటం వల్ల ముక్కు ఆరోగ్యం బాగుంటుంది.

గొంతు ఆరోగ్యం (థ్రోట్ హైజీన్) కోసం...

- స్మోకింగ్, మద్యం అలవాటు మానుకుంటే కేవలం గొంతు ఆరోగ్య మాత్రమే కాదు... మొత్తం దేహం ఆరోగ్యమంతా బాగుంటుంది.
- గొంతు ఆరోగ్యం కోసం గొంతును శుభ్రంగా ఉంచుకోవడం మేలు చేస్తుంది. ఇందుకు గోరువెచ్చని నీటిలో కాస్త ఉప్పు వేసుకుని పుక్కిలించడం ఓ మంచి చిట్కా. మసాలాలు ఎక్కువగా తీసుకోకపోవడం వల్ల గొంతులో ఇరిటేషన్లు, యాసిడ్ గొంతులోకి వచ్చి గొంతు మండటం అనే సమస్యలు నివారితమవుతాయి. ఇక వీటితో పాటు ఈ చలి సీజన్‌లో మరింత చల్లటి గాలికీ, నీటికి దూరంగా ఉండటం, కాలుష్యానికి ఎక్స్‌పోజ్ కాకుండా జాగ్రత్తవహించడం వంటి జాగ్రత్తలు మేలు చేస్తాయని గ్రహించాలి.

ఇదిగో...
ఈ కొత్త ఏడాదిలో ...
పెద్ద డాక్టర్లు మీ కోసమే ప్రత్యేకంగా
ఎఫర్ట్ పెట్టమని ఎలర్ట్ చేస్తూ
ఇస్తున్న గిఫ్ట్‌బాక్స్ ఇది...
రిటర్న్ గిఫ్ట్‌గా
వాళ్లు మీనుంచి ఆశించేది...
మీ ఆరోగ్యమే...
విష్ యు హ్యాపీ న్యూ ఇయర్

మూత్ర పిండం బ్రహ్మాండంగా ఉండాలంటే..



డాక్టర్ మల్లికార్జున
ఎండీ అండ్ చీఫ్ కన్సల్టెంట్ యూరాలజిస్ట్, ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ

గతంలో పెద్దవయసు వారిలోనే కనిపించే చాలా ఆరోగ్య సమస్యలు ఇప్పుడు చిన్నవయసు వారిలోనూ ఎక్కువగానే కనిపిస్తున్నాయి. ఇటీవల పెరిగిన ఆరోగ్య స్పృహ కారణంగా ముందుగానే చేయిస్తున్న వైద్య పరీక్షల వల్ల అనేక జబ్బులు బయటపడటమూ జరుగుతోంది. దీనివల్ల రెండు పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. మొదటిది... జబ్బులు బయటపడటం వల్ల వాటి సంఖ్య విపరీతంగా పెరిగిందనేది ఆందోళన కాగా... ఇక రెండో అంశం... ఆరోగ్యస్పృహ ఇంతగా పెరగకపోయి ఉంటే, అవి మరింత ముదిరాక బయటపడి ఇంకా సమస్యాత్మకంగా మారేవనే పాజిటివ్ అంశం. ఉదాహరణకు గతంలో మూత్రవ్యవస్థకు సంబంధించిన జబ్బుల్లోనూ కిడ్నీల్లో రాళ్లు, పెద్దవయసువారిలో మూత్ర విసర్జన కష్టం కావడం ఇక డయాబెటిస్, హైపర్‌టెన్షన్ బాధితుల్లో కిడ్నీ ఫెయిల్యూర్ వంటివి సాధారణంగా కనిపించే సమస్యలు. కానీ ఇటీవల యుక్తవయసువారిలోనూ, ఆమాటకొస్తే చాలా చిన్నపిల్లల్లోనూ కిడ్నీలో రాళ్ల సమస్య కనిపిస్తోంది. దీనికి అనేక అంశాలు కారణం కావచ్చు. మన ఆహారపు అలవాట్లు, కలుషిత వాతావరణం, జీవనశైలి మార్పులు వంటివి కారణాలు కావచ్చు.

అయితే ఇప్పుడు ఓ ఆరోగ్య సమస్య వచ్చిందంటే... ఉదాహరణకు ‘కిడ్నీలో రాళ్లు’ సమస్యను తీసుకుంటే... ఇటీవల అత్యాధునికమైన వైద్య ప్రక్రియలూ, లేజర్లు, రొబోటిక్ సర్జరీలూ అందుబాటులోకి రావడంతో కోత, గాటూ లేకుండా, రక్తం చిందకుండా సర్జరీ చేస్తున్నామని అనుకోవడం తప్ప అసలివి రాకుండా చేసుకోవడానికి నివారణలేమిటి అనే ఆలోచనకు తావులేకుండా పోయింది. నిజానికి మనం ఆలోచించాల్సింది వ్యాధుల నివారణ గురించే. ఉదా: కిడ్నీలు, మూత్ర వ్యవస్థ విషయానికి వస్తే... రాళ్లు ఏర్పడటానికి ఆస్కారమిచ్చే ఆహారానికి దూరంగా ఉండటం, నీళ్లు ఎక్కువగా తాగుతుండటం వంటి నివారణ చర్యల గురించి గురించి ఆలోచించాలి. సమాజంలో ఇప్పుడు ఇన్‌ఫెర్టిలిటీ సమస్య కూడా పెరిగింది. వీటన్నింటికీ కారణం మన జీవనశైలిలోని మార్పులే. దీనికి తోడు మన జీవితాల్లో పెరుగుతున్న తీవ్రమైన ఒత్తిడి (స్ట్రెస్) కూడా మరో ప్రధాన కారణం. దీనివల్లనే హైబీపీ, డయాబెటిస్... మళ్లీ వీటివల్లనే కిడ్నీ జబ్బులు... ఇలా ఓ చైన్ రియాక్షన్‌లా కొనసాగుతున్నాయి. ఇవన్నీ జీవనశైలిలో మార్పుల వల్ల జరుగుతున్నాయని గ్రహించి మన లైఫ్‌స్టైల్‌ను పునర్నిర్వచించుకొని హెల్దీ జీవనశైలిని అనుసరించాలి.

ఇంటి పని ఒంటికి మంచిది



డాక్టర్ గాయత్రి కామినేని
చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అండ్ ఆర్థోపెడిక్ సర్జన్, కామినేని హాస్పిటల్స్

మంచి వ్యాయామంతో ఇటు కీళ్లూ, అటు గుండె రెండూ ఒకేసారి ఆరోగ్యంగా ఉంటాయి. రోజూ వ్యాయామాలు చేయడానికి తమకు సమయం లేదంటూ చాలామంది చెబుతుంటారు. ఈరోజుల్లో కొన్ని ఇంటి పనులు అందరూ చేయాలి. ముఖ్యంగా ఇంట్లోని ఇల్లాళ్లతో పాటు ఇంటి మగవాళ్లు కూడా. ఉదాహరణకు... తోటపనీ, వస్తువులు తేవడం, లేవగానే బెడ్‌షీట్స్ మడతపెట్టడం, ఇల్లు ఊడ్చటం, తుడవడం ఇవన్నీ ఇంట్లోని మహిళలు చేయాల్సిన పనులుగా చాలామంది పురుషులు అనుకుంటారు. కానీ ఇవన్నీ చేస్తే కీళ్లకు కదలికలు సమకూరి వాటి ఆరోగ్యం మెరుగుపడటం, పోషకాలు అందడం జరుగుతాయి. ఇవే పనులు గుండెజబ్బుల ముప్పునూ తప్పిస్తాయి. అంటే ఒకే పనితో ఎన్నో ప్రయోజనాలుంటాయి. ఉదా: క్రమం తప్పని వ్యాయామం వల్ల గుండె బలంగా అవుతుంది. (కీళ్లు కూడా) అంతేకాదు... పది లక్షల సార్లు గుండె కొట్టుకుంటే కలిగే శ్రమను ఒక్కసారి చేసే వ్యాయామం దూరం చేస్తుంది. వ్యాయామం వల్ల రక్త ప్రసరణ ప్రక్రియ మెరుగవుతుంది. శరీరంలో కొవ్వు తగ్గుతుంది. ఎముకలు బలంగా మారతాయి. ఒత్తిడీ, నిద్రలేమి వంటివీ తగ్గుతాయి. చాలామంది పురుషులు పొగతాగడం, మద్యంతాగడం తమ జన్మహక్కుగా భావిస్తారు. పైగా కొద్దిపాటి మద్యం గుండెకు మేలు చేస్తుందని సమర్థించుకుంటారు. కానీ... పొగ, మద్యం ఆరోగ్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తాయి.

చాలామంది కొన్ని నిర్ణయాలు తీసుకుని అమలు పరచడానికి కొత్త సంవత్సరాన్ని ఒక సందర్భంగా తీసుకుంటారు. మీ నిర్ణయం ఏదైనా... అంటే వ్యాయామం చేయడం, బరువు తగ్గడం, పొగ, మద్యం వంటి అలవాట్లు మానేయడం... ఇవన్నీ వాయిదా వేయకండి. ఇప్పుడే ఈ కొత్త సంవత్సరంలో మొదలుపెట్టండి.

డబ్బు జబ్బుకు ‘బీమా’త్రలు



డాక్టర్ బి. కిశోర్‌రెడ్డి
ఎండీ అమోర్ హాస్పిటల్స్, అండ్ చీఫ్ ఆర్థో ఆంకాలజిస్ట్ అమోర్ హాస్పిటల్

గత కొన్నేళ్లుగా పర్యావరణంలో వస్తున్న మార్పుల కారణంగా క్యాన్సర్లు అలాగే లైఫ్‌స్టైల్ డిసీజెస్ అని పిలిచే హైపర్‌టెన్షన్, డయాబెటిస్ వంటివి విపరీతంగా పెరుగుతూ పోతున్నాయి. జబ్బు వచ్చాక చికిత్స ఎలాగూ తప్పదు. ఇప్పుడు వీటి చికిత్సల గురించి ఆలోచించడం కంటే అసలివి రాకుండా ఉండేలా నివారణ చర్యలపై దృష్టి కేంద్రీకరించడానికి ఇదో మంచి సమయం. ప్రస్తుత కాలం చాలా అనిశ్చితంగా ఉంది. మన ఆర్థిక పరిస్థితుల్లోగానీ రోజువారీ కార్యక్రమాల్లోగానీ ఎలాంటి మార్పులు వస్తాయో తెలియని అనిశ్చితి. అందుకే ముమ్మందు మనందరి ఆరోగ్యాల రక్షణ కోసం, చికిత్సల కోసం మెడికల్ ఇన్స్యూరెన్స్‌ను సిఫార్సు చేస్తున్నాను. మీతో పాటు మీ కుటుంబమంతటికీ ఇన్స్యూరెన్స్ వచ్చేలా పాలసీ తీసుకోండి.

క్యాన్సర్లు వస్తే అయ్యే ఖర్చులకు బెంబేలెత్తడం కంటే అవి రాకుండా నివారించడానికి అనుసరించాల్సిన మార్గాలు చాలా సులువైనవి. సమాజంలోని అందరూ... ముఖ్యంగా నలభై దాటిన ప్రతివారూ తరచూ ముందస్తు స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకుంటూ ఉండాలి.

అయితే ప్రస్తుతం సాంకేతిక మార్పులతో అందుబాటులోకి వచ్చిన చికిత్సలకు అయ్యే ఖర్చు తడిసిమోపెడు కానుంది. ఆ ఖర్చులు తట్టుకోవాలంటే ఇన్స్యూరెన్స్ ఒక మార్గం. వాటితో పాటు మన జీవనశైలిలో మార్పులు చేసుకుంటూ ఆరోగ్యకరమైన జీవనాన్ని సాగిస్తూ నివారించుకోవడం మరో మార్గం. ఈ రెండు మార్గాలను ఎంచుకుని మనల్ని మనం అటు ఆరోగ్యపరంగా, ఇటు ఆర్థికంగా కాపాడుకోవడం మన చేతుల్లో ఉన్న పని.

ఆరోగ్యానికి బోన్.. మెయిన్



డాక్టర్ సుధీర్‌రెడ్డి
సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్ ల్యాండ్‌మార్క్ హాస్పిటల్

ఒక భవనం పడిపోకుండా స్థిరంగా ఉండాలన్నా, ఈ దేహం ఒంగిపోకుండా నిటారుగా నిలబడాలన్నా... చిత్రంగా ఈ రెంటికీ అవసరమైనది క్యాల్షియమ్. దాదాపు 30 ఏళ్ల వయసులో ఇది గరిష్ఠంగా ఉండి, ఆ తర్వాత అనేక అంశాల కారణంగా ఇది కొద్దికొద్దిగా తగ్గుతూ పోతుంటుంది. అయితే దాన్ని మరింత కాలం నిలుపుకుంటూ దేహపు ఫ్రేమ్ వర్క్ అయిన ఎముకల సాంద్రతను (బోన్ డెన్సిటీని) గరిష్ఠకాలం పాటు నిలుపుకోవాలంటే చేయాల్సింది చాలా సులువైన పనులే. మంచి సమతులాహారం తీసుకోవడం, తేలికపాటి వ్యాయామాలు చేసుకోవడం. ఎముకల ఆరోగ్యాన్నీ, సాంద్రతనూ నిలుపుకోవడానికి తీసుకునే ఆహారంలోనూ రుచికరమైనవే ఎక్కువ. ఉదాహరణకు పాలు, వెన్న లాంటి డెయిరీ ఫుడ్స్; చిక్కుళ్లు, బెండకాయ, క్యాబేజీ, బ్రాకలీ లాంటి రుచికరమైన కూరగాయలు; టేస్టీగా ఉండే అంజీర్ లాంటి ఎండుఫలాలు, జీడిపప్పు, బాదం, పిస్తా వంటి నట్స్‌తో పాటు చాలామంది టేస్టీగా ఫీలై తినే చేపలు. ఇవి ఎముకలతో పాటు మొత్తం దేహ సంపూర్ణ ఆరోగ్యాన్నీ కాపాడతాయి. అయితే వ్యాయామాలు లేకుండా కేవలం ఆహారాలు మాత్రమే ఎముకల సాంద్రత పెంచలేవు. అందుకే... నడక వంటి తమకు అనువైన వ్యాయామాలతో పాటు శ్రమ ఎక్కువగా చేయలేనివారు నడకతో పాటు ఇతరులు సైక్లింగ్, జాగింగ్, ఈత, తమకు ఇష్టమైన స్పోర్ట్స్ ఆడటం వంటి స్ట్రెంగ్త్ ట్రెయినింగ్ వ్యాయామాలు చేస్తుంటే ఎముకలలోని క్యాల్షియమ్ చాలాకాలం పదిలంగా ఉంటుంది.

క్లుప్తంగా...

మన్మోహన్‌ది చెరగని ముద్ర

గవర్నర్, మండలి చైర్మన్, డిప్యూటీ సీఎంల సంతాపం

సాక్షి, హైదరాబాద్: జాతీయ స్థాయి గుర్తింపు పొందిన గొప్ప రాజకీయ నాయకుల్లో మన్మోహన్ ఒకరని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఒక ప్రకటనలో కొనియాడారు. తాను నిర్వహించిన ప్రతి పదవిలోనూ చెరగని ముద్ర వేశారని పేర్కొన్నారు. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతిపై తన ప్రగాఢ సంతాపం తెలియజేశారు. భారతదేశంలో ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడై.. తన అద్భుత పనితీరుతో.. దేశాన్ని ప్రపంచ పటంలో నిలబెట్టారని గుర్తు చేశారు. మాజీ ప్రధాని మన్మోహన్ మృతిపై శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సంతాపం తెలిపారు. గొప్ప ఆర్థిక వేత్తగా సంస్కరణలను అమలు చేసి దేశం అభివృద్ధి పథంలో నడిచేందుకు పునాది వేశారని పేర్కొన్నారు. ఆర్థిక సంక్షోభం నుంచి భారతదేశాన్ని గట్టెక్కించి.. నవ భారతాన్ని నిర్మించిన మహానాయకుడిని ఈ దేశం కోల్పోయిందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా జీవితంలో పాటించాల్సిన గౌరవ మర్యాదలను తన ప్రవర్తన ద్వారా చూపిన మన్మోహన్ మృతి తీరని లోటని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పాలమూరు-రంగారెడ్డిపై అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలి: శ్రీనివాస్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా నీళ్లు వచ్చే పరిస్థితి లేదని, దీనిపై వెంటనే అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు కేంద్రం అనుమతులు ఇవ్వడంలేదని, డీపీఆర్‌ను వెనక్కి తీసుకున్నట్లు సమాచారం ఉందని తెలిపారు. ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వాలని మోదీని సీఎం రేవంత్‌రెడ్డి అడగాలని, లేదంటే పాలమూరు ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని క్షమించబోరని శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మాణం కోసం రైతు సంఘాలతో కలిసి ఆందోళనలు చేస్తామని, త్వరలోనే ఉమ్మడి జిల్లా బీఆర్‌ఎస్ నేతలతో కలిసి కార్యాచరణ చేపడతామని వెల్లడించారు. ఏపీ ప్రభుత్వం పాలమూరు-రంగారెడ్డిపై కృష్ణా ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు చేసిందని, తెలంగాణకు రావాల్సిన మూడు అనుమతులను ఏపీ ప్రభుత్వం ఆపిందని ధ్వజమెత్తారు. ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు సీఎంగా ఉండి పాలమూరు జిల్లాను దత్తత తీసుకుని ఏం చేయలేదని శ్రీనివాస్‌గౌడ్ మండిపడ్డారు. శ్రీశైలం ప్రాజెక్టుపై పెత్తనం చేయాలని, శ్రీశైలం ప్రాజెక్టులో ఉన్న నీటిని వాడుకోవాలని ఏపీ ప్రభుత్వం చూస్తోందని ఆరోపించారు. ప్రభుత్వం కక్ష సాధింపులు బంద్ చేసి పరిపాలనపై దృష్టి పెట్టాలని, యాదాద్రి టెంపుల్‌లో కొద్ది దూరం ఉన్న బ్రిడ్జిని ఏడాది నుంచి పూర్తి చేయడం లేదని శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.


మన్మోహన్‌ను తెలంగాణ మరువలేదు

రాష్ట్ర ఉద్యోగుల సంఘం ప్రతినిధులు

సాక్షి, హైదరాబాద్: మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ హయాంలోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని, తెలంగాణ ప్రజలు ఆయనను ఎప్పటికీ గుర్తుంచుకుంటారని రాష్ట్ర ఉద్యోగుల సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. మన్మోహన్‌సింగ్ మృతికి తెలంగాణ ఉద్యోగుల సంఘం తరఫున ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. సంతాపం తెలిపిన వారిలో తెలంగాణ ఉద్యోగుల సంఘం చైర్మన్ ఎ.పద్మాచారి, రాష్ట్ర అధ్యక్షుడు ఎం.రవీంద్ర కుమార్, ప్రధాన కార్యదర్శి సీహెచ్ హరీశ్‌కుమార్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ సురేందర్, ఉపాధ్యక్షులు పి.కృష్ణారావు, జి.జాకబ్, బోరెడ ప్రవీణ్ కుమార్, కిశోర్ కుమార్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎస్.నర్సింగ్ రావు, ఇతర కార్యవర్గ సభ్యులున్నారు.

ఆర్‌ఆర్‌ఆర్ పరిధి కుదింపులో మతలబు

బీజేపీ రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్



సాక్షి, హైదరాబాద్: రీజినల్ రింగ్ రోడ్డు పరిధిని కుదించడంలో మతలబు ఉందని బీజేపీ రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్ ఆరోపించారు. రీజినల్ రింగ్ రోడ్డు భూ బాధితులు శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఎంపీ కె.లక్ష్మణ్‌ను కలిసి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌లో మార్పులు తీసుకురావాలని గత ప్రభుత్వాన్ని రైతులు కోరారన్నారు. గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయం వల్ల పెద్ద సంఖ్యలో రైతులు నష్టపోయారన్నారు. కొన్ని ప్రాంతాల్లో రీజినల్ రింగ్ రోడ్డు దూరాన్ని కుదించడంలో మతలబు ఉందని, కేవలం హెచ్‌ఎండీఏ అవతలే రింగ్ రోడ్డు నిర్మించాలని స్పష్టం చేశారు. అశాస్త్రీయ అలైన్‌మెంట్ ద్వారా నష్టం జరుగుతోందని, అధికారంలోకి వస్తే న్యాయం చేస్తామని ప్రియాంకా గాంధీ, కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఇప్పటికే కేంద్ర మంత్రులు జి.కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు ఈ విషయాన్ని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ దృష్టికి తీసుకెళ్లారన్నారు. అంతకుముందు మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మరణంపై లక్ష్మణ్ సంతాపం తెలిపారు.

మన పొట్టేలు మాయం!

పల్లెల్లోనే మస్త్ డిమాండ్.. పట్నానికి చేరని వైనం.. పెరుగుతున్న ధరలు

- హైదరాబాద్ మార్కెట్లలోనూ కన్పించని తెలంగాణ గొర్రె పొట్టేలు మాంసం
- మంచి రుచితో పాటు ఎక్కువ సమయం నిల్వ..దీనిపై మాంసం ప్రియుల మక్కువ
- మెజార్టీ రైతులు జీవాల పెంపకానికి దూరం..ఉన్నవాళ్లు కూడా బక్రీద్ నాటికే విక్రయం
- ఉత్తరప్రదేశ్, రాజస్తాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర నుంచి మేక పొట్టేళ్లు దిగుమతి

తెలంగాణ గొర్రె పొట్టేలు మాంసం మాయమైంది. రాష్ట్రవ్యాప్తంగా సాధారణ దుకాణాల్లోనే కాదు.. హైదరాబాద్‌లోని జియాగూడ, గోల్నాక, చెంగిచర్ల, నాదర్‌గుల్ లాంటి హోల్‌సేల్ జీవాలు/ మాంసం విక్రయ మార్కెట్లలోనూ ఈ మాంసం దొరకని పరిస్థితి. మారుమూల గ్రామాల్లో ఒకరిద్దరి వద్ద ఈ పొట్టేళ్లు ఉంటున్నా..అవి ఊరుదాటి బయటికి రావడం లేదు. దీంతో మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఉత్తరప్రదేశ్‌ల నుంచి దిగుమతి చేసుకున్న గొర్రె, మేక, మేక పొట్టేలు మాంసమే ఎక్కువగా లభిస్తోంది.



సాక్షి, రంగారెడ్డి జిల్లా: వేడుక ఏదైనా మాంసాహారం తప్పని సరైంది. ముఖ్యంగా శారీరక ధృడత్వానికి, ఆరోగ్యానికి పొట్టేలు మాంసం మంచిదని వైద్యులు చెబుతుండటంతో మాంసాహార ప్రియులు దీనివైపు మొగ్గు చూపుతుంటారు. కానీ ప్రస్తుతం అది అందుబాటులో ఉండటం లేదు. ముఖ్యంగా రుచికి ప్రసిద్ధిగాంచిన తెలంగాణ గొర్రె పొట్టేలు మాంసం మచ్చుకు కూడా కన్పించడం లేదు.

మేత కరువై..రోగాలు ఎక్కువై..

రియల్ ఎస్టేట్ కారణంగా కొండలు, గుట్టలు మాయం అయ్యాయి. మైదాన ప్రాంతాలన్నీ సాగు భూములుగా మారాయి. జీవాలు తరచూ జబ్బుల బారిన పడుతుండటానికి తోడు చెరువుల్లోని తుమ్మలు మాయం కావడం, మేత కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి రావడం, రోజంతా వాటి వెంట నిలబడాల్సి వస్తుండటం, ఇప్పటివరకు జీవాల వెంట వెళ్లిన వారు వయసు మీదపడి నడవ లేకపోవడం, కూలీల కొరత తదితర కారణాలు జీవాల పెంపకానికి ఆటంకంగా మారాయి. వృత్తిదారుల పిల్లలు కూడా చదువుకుని, వివిధ రంగాల్లో స్థిరపడుతుండటంతో కొత్తగా ఈ రంగంలోకి వచ్చేవారు కరువవుతున్నారు. ఫలితంగా తెలంగాణలో జీవాల సంఖ్య క్రమంగా తగ్గుతోంది. ముఖ్యంగా తెలంగాణ పొట్టేలుకు విపరీతమైన డిమాండ్ ఏర్పడుతోంది. దీంతో ఇతర జీవాల మాంసం ధరలు కూడా అంతకంతకూ పెరిగిపోతున్నాయి.



రాజస్తాన్ పొట్టేళ్లు

జియాగూడ మార్కెట్లో జీవాల లైవ్ హోల్‌సేల్ ధరలు (కేజీ ధర రూ.లలో)

రాష్ట్రం	గొర్రె	గొర్రె పొట్టేలు	మేక	మేక పొట్టేలు
తెలంగాణ	250	400-410	280-300	350-370
రాజస్తాన్	220	300-330	230-250	320-350
మహారాష్ట్ర	250	320-350	250-280	350-370
ఉత్తరప్రదేశ్	220	320-350	250-280	350-370
మధ్యప్రదేశ్	220	320-350	250-280	350-370

జియాగూడ హోల్‌సేల్ మార్కెట్లో మాంసం కేజీ ధర ఇలా

మేక మాంసం	రూ.500-550
గొర్రె మాంసం	రూ.450-500
మేక పొట్టేలు	రూ.700-750
సాధారణ పొట్టేలు	రూ.700-750
తెలంగాణ గొర్రె పొట్టేలు	రూ.750-800

మండీలకు జీవాల లారీలు ఇలా..

మార్కెట్	మంగళవారం	శుక్రవారం	శనివారం
జియాగూడ	100-110	150-160	50-60
చెంగిచర్ల	110-120	140-150	70-80
గోల్నాక	05-10	15-20	8-10

మూడు రోజులు.. 600 లారీలు దిగుమతి

ప్రస్తుతం జీవాలను పెంచే వారితో పోలిస్తే..తినేవారి సంఖ్య విపరీతంగా పెరుగుతుండటంతో విధిలేని పరిస్థితుల్లో మహారాష్ట్ర, రాజస్తాన్, యూపీ, మధ్యప్రదేశ్‌ల నుంచి జీవాలను దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. ఒక్కో లారీలో సగటున 400 జీవాలు దిగుమతి అవుతుంటాయి. ఒక్కో జీవం సగటున 12–15 కేజీల బరువు ఉంటుంది. మూడు రోజుల్లో..మూడు ప్రధాన మార్కెట్లలోకి 600 లారీల జీవాలు (2.40 లక్షల జీవాలు) దిగుమతి అవుతున్నాయి. గతంలో ఒంగోలు నుంచి హైదరాబాద్ మార్కెట్‌కు జీవాలు వచ్చేవి. కానీ ప్రస్తుతం రావడం లేదు.



మధ్యప్రదేశ్ పొట్టేళ్లు

మేత దొరకడం లేదు



తాతల కాలం నుంచి జీవాల పెంపకమే మా ప్రధాన వృత్తి. ఏకధాటి వర్షాలకు గాలికుంటు వ్యాధితో జీవాలు చనిపోతున్నాయి. ఒకప్పటి బీడు భూములన్నీ ప్రస్తుతం పంట పొలాలుగా మారాయి. జీవాలకు మేత దొరకని పరిస్థితి. దీనికి తోడు నాకు వయసు మీదపడి, నిలబడలేని పరిస్థితి. కూలీలు కూడా దొరకడం లేదు. విధిలేని పరిస్థితుల్లో ఇటీవలే ఉన్న వాటిని అమ్మేశా.

- తీరుపారి బలరాములు, తక్కెళ్లపహాడ్, నల్లగొండ జిల్లా

ఆ పొట్టేళ్లు దొరకడం లేదు



తెలంగాణలో డెక్కన్ పీఠ భూములు ఎక్కువ. కొండలు, గుట్టలతో నిండి ఉంటుంది. జీవాలు ఈ ప్రాంతాల్లోని గడ్డి, ఆకులు, తీగజాతి మొక్కలు తిని పెరుగుతుంటాయి. వీటి మాంసం రుచికరంగా ఉంటుంది. మార్కెట్లో 100 జీవాలను పరిశీలిస్తే..వాటిలో పది కూడా తెలంగాణ పొట్టేళ్లు ఉండటం లేదు.

- ఎన్.సైదులు, హోల్‌సేల్ వ్యాపారి, జియాగూడ, హైదరాబాద్

జీవాల ఉత్పత్తి లేక మాంసం ధరలు పెరిగాయి

గతంలో కేవలం పండుగలు, పర్వదినాల్లోనే మాంసం తినేవారు. కానీ ప్రస్తుతం ప్రతి ఆదివారం తప్పని సరైంది. అలాగే వేడుక ఏదైనా మాంసం తప్పనిసరైంది. డిమాండ్ మేరకు ఉత్పత్తి లేకపోవడంతో మాంసం ధరలు అమాంతం పెరిగాయి.

- బాలరాజు, రిటైల్ వ్యాపారి, నాదర్‌గుల్, హైదరాబాద్

మంచి రుచి వల్లే ఎక్కువ వినియోగం



గొర్రె పొట్టేలు దక్కన్ పీఠ భూమిలో పెరుగుతుంది. క్రాస్ బ్రీడింగ్‌తో పాటు ఆహారం కోసం ఎక్కువ దూరం ప్రయాణిస్తుంది. భూమిపై లభించే తీరొక్క గడ్డిని తినడంతోనే దీని మాంసానికి రుచి వస్తుంది. హైదరాబాద్ బిర్యానీ, హలీంలో దీనిని ఎక్కువగా వాడుతుంటారు.

- రాంసింగ్ లకవత్, అసిస్టెంట్ ప్రొఫెసర్, వెటర్నరీ వర్సిటీ, రాజేంద్రనగర్

ఉమ్మడి వరంగల్‌లో పులుల సంచారం

కోనాపూర్ అటవీ ప్రాంతంలో ఆడ, మగపులి తిరిగిన ఆనవాళ్లు

- ఆడపులి వెంట పిల్ల..
- వరంగల్ జిల్లా కొండాపూర్ అటవీ ప్రాంతంలో అడవి పందిపై దాడి
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించిన ఫారెస్ట్ అధికారులు



వరంగల్ జిల్లా కొండాపూర్ అటవీ ప్రాంతంలో ఆడపులి, పిల్ల పులి పాదముద్రలు

నల్లబెల్లి/కొత్తగూడ: వరంగల్, మహబూబాబాద్ జిల్లాల అటవీ ప్రాంతంలో ఆడపులి, దానివెంట పిల్ల, మగపులి సంచరిస్తున్నాయి. శుక్రవారం ఈ విషయాన్ని అటవీ శాఖ అధికారులు నిర్ధారించారు. వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలోని కొండాపూర్, మూడుచెక్కలపల్లి, రుద్రగూడెం, కొండాయిల్‌పల్లి గ్రామాల శివారులోని పంట పొలాలు, అటవీ ప్రాంతంలో పెద్దపులులు తిరిగినట్లు ఫారెస్ట్ శాఖ అధికారులు గుర్తించారు. ములుగు మండలం అటవీ ప్రాంతం నుంచి నల్లబెల్లి మండలంలోని మూడుచెక్కలపల్లి, కొండాపూర్ అటవీ ప్రాంతం మీదుగా మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలోని కోనాపూర్ వైపు ఆడ పెద్దపులి తన పిల్లతో కలిసి వెళ్లినట్లు భావిస్తున్నారు. ఈ క్రమంలో కొండాపూర్ శివారులోని పెద్దలొద్ది అటవీ ప్రాంతంలో అడవి పందిపై దాడి చేసి తిన్నట్లు ఫారెస్ట్ అధికారులు గుర్తించారు. కొండాపూర్ అటవీ ప్రాంతం నుంచి మగ పెద్దపులి రుద్రగూడెం, కొండాయిపల్లి గ్రామాల మధ్యలోని పలుగు ఏనే (కొండ ప్రాంతం) వరకు వచ్చినట్లు నిర్ధారించారు. ఆడపులి, పిల్ల కొత్తగూడం మండలంలోని కోనాపూర్ వైపు వెళ్లగా మగపులి రుద్రగూడెం, కొండాయిపల్లి గ్రామాల మధ్యలోని పలుగు ఏనేలోనే ఉంటుందని భావిస్తున్నారు. కానీ కోనాపురం ముసలి మడుగు అటవీ ప్రాంతంలోని పొలాల్లో పులి సంచరించినట్లు అడుగులను గుర్తించామని ఎఫ్ఆర్వో వజ్రహత్ తెలిపారు. పొలం గట్లపై వరుసగా పెద్ద అడుగులు ఉండటంతో అనుమానం వచ్చిన రైతులు.. అటవీ అధికారులకు సమాచారం అందించారు. అధికారులు అక్కడి పాదముద్రలను పరిశీలించి పెద్దపులివిగా తేల్చారు. వచ్చింది మగపులి అని, ఆడపులి కోసం వెతుకుతూ ఇక్కడికి వచ్చినట్లు అంచనా వేస్తున్నామని చెప్పారు. కాగా, వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం కొండాపూర్ అటవీ ప్రాంతం నుంచి రుద్రగూడెం, కొండాయిపల్లి గ్రామాల మధ్యలోని పలుగు ఏనే వరకు వచ్చిన పులి, ఆ తరువాత కోనాపూర్ వైపునకు వెళ్లినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

అడవి జంతువును తింటున్న పులిని చూశా..

రోజు మాదిరిగానే గురువారం మేకలను తీసుకొని కొండాపూర్ శివారులోని పెద్దలొద్ది ప్రాంతంలోకి వెళ్లా. సాయంత్రం మేకలు, కుక్క ఒక్కసారిగా భయపడి బెదిరి చెల్లాచెదురయ్యాయి. ఏమి జరిగిందోనని అటువైపుగా చూడగా పెద్దలొద్ది ఆవతలి ఒడ్డున పెద్దపులి కనిపించింది. అడవి జంతువును తింటుండటంతో పులి నా వైపు దృష్టి సారించలేదు. ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వెనుదిరిగాను.

- మల్లబోయిన కొమురయ్య, మేకల కాపరి, కొండాపూర్



మన్మోహన్ పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో దీపాదాస్‌మున్షీ, దామోదర, మహేశ్‌కుమార్ గౌడ్, మల్లు రవి, బలరాంనాయక్, అనిల్ కుమార్ తదితరులు

మన్మోహన్ సింగ్‌కు రేవంత్ నివాళి

శ్రద్ధాంజలి ఘటించిన మంత్రులు, పలువురు నేతలు

సాక్షి, న్యూఢిల్లీ: మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి నివాళులు అర్పించారు. శుక్రవారం ఢిల్లీలోని మన్మోహన్ నివాసానికి వెళ్లిన రేవంత్.. మన్మోహన్ పార్థివ దేహానికి శ్రద్ధాంజలి ఘటించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. అనంతరం ముఖ్యమంత్రి మీడియాతో మాట్లాడుతూ.. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మరణం.. కుటుంబం, కాంగ్రెస్ పార్టీతో పాటు దేశానికి తీరని లోటని అన్నారు. 'లిబరలైజేషన్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్ దేశాన్ని బలోపేతం చేశాయి. సమాచార హక్కు, విద్యా హక్కు, ఆహార భద్రత చట్టాలు, నరేగా, న్యూక్లియర్ డీల్ తీసుకొచ్చారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఆయన ఏర్పాటు చేశారు. మన్మోహన్‌సింగ్ వల్ల ఈ దేశం ఎంతో ప్రగతి సాధించింది. ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోతుంది. ఈ లోటు ఎవరూ భర్తీ చేయలేనిది. ఈ దేశం ఆయన్ను ఎప్పుడూ గుర్తుంచుకుంటుంది' అని పేర్కొన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్, రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జ్ దీపా దాస్ మున్షీ, మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్, బల్‌రామ్ నాయక్, ఎమ్మెల్యేలు వివేక్, వినోద్, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, కాంగ్రెస్ సీనియర్ నేత కేవీపీ రాంచందర్‌రావు తదితరులు మన్మోహన్ సింగ్‌కు నివాళులర్పించారు.

ఏపీ వాదనలో పసలేదు

- సెక్షన్–89, సెక్షన్–3 నోటిఫికేషన్లు భిన్నమైనవి కావు
- నీటి తరలింపు కోసమే ఏపీ అభ్యంతరం.. బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌కు తెలంగాణ నివేదన

సాక్షి, హైదరాబాద్: కృష్ణా జలాలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలోని సెక్షన్–89లోని మార్గదర్శకాల ప్రకారమే తొలుత వాదనలు వినాలన్న ఏపీ ప్రభుత్వ వాదనను తెలంగాణ సర్కార్ వ్యతిరేకించింది. విభజన చట్టంలో సెక్షన్–89లోని మార్గదర్శకాలు, 2023 అక్టోబర్ 6న అంతర్రాష్ట్ర నదీ జల వివాదాల చట్టం–1956లోని సెక్షన్–3 ప్రకారం జారీ చేసిన అదనపు నియమ, నిబంధనలు పరస్పరం భిన్నమైనవి కావని.. రెండు ఒకటేనని తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసింది. ఉమ్మడి రాష్ట్రానికి కేటాయించిన కృష్ణా జలాలను 66:34 నిష్పత్తిలో పంచుతూ కృష్ణా బోర్డు చేసిన తాత్కాలిక సర్దుబాటును అడ్డుపెట్టుకొని ఏపీ ప్రభుత్వం 72 శాతం నీటిని తరలించుకుపోతోందని తెలంగాణ సర్కార్ ఆరోపించింది. ఈ తాత్కాలిక ఏర్పాటును అడ్డం పెట్టుకొని నీటిని తరలించేందుకు వీలుగా కాలయాపన కోసమే ఏపీ సర్కార్ ఈ వ్యవహారంపై వితండవాదం చేస్తోందని విమర్శించింది. ఇప్పటికే పూర్తయిన, నిర్మాణంలో ఉన్న, ప్రతిపాదన దశలో ఉన్న ప్రాజెక్టులకు నీటి కేటాయింపులు చేయాలని ఏపీ పునర్విభజన చట్టం, కేంద్రం గతంలో జారీ చేసిన అదనపు నియమ, నిబంధనలు స్పష్టం చేస్తున్నాయని తెలిపింది. ఒకవేళ సెక్షన్–89, సెక్షన్–3 కింద జారీ చేసిన మార్గదర్శకాలు వేర్వేరని భావిస్తే తొలుత సెక్షన్–3 కింద వాదనలను వినాలంటూ జస్టిస్ బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ నేతృత్వంలోని కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్–2లో తెలంగాణ సర్కార్ శుక్రవారం అఫిడవిట్ దాఖలు చేసింది.

ఇదీ నేపథ్యం..: కృష్ణా జలాల పంపిణీకి సంబంధించి సెక్షన్–89, సెక్షన్–3 నియమ, నిబంధనలు కలిపి వాదనలు వినాలని కేడబ్ల్యూడీటీ–2లో ఈ నెల 2న తెలంగాణ సర్కార్ ఇంటర్‌లొక్యుటరీ అప్లికేషన్ (ఐఏ) దాఖలు చేసింది. దీనిపై కేడబ్ల్యూడీటీ–2 ఏపీ ప్రభుత్వ అభిప్రాయం కోరగా ఆ రెండు నియమ, నిబంధనలు వేర్వేరని, తొలుత సెక్షన్–89 ప్రకారమే వాదనలు వినాలంటూ ఈ నెల 20న ఏపీ ప్రభుత్వం సమాధానం ఇచ్చింది. దీనిపై కేడబ్ల్యూడీటీ–2 కోరిన మేరకు తెలంగాణ సర్కార్ తాజాగా అఫిడవిట్ సమర్పించింది.

అఫిడవిట్‌లో తెలంగాణ పేర్కొన్న అంశాలివీ

- కేంద్రం గతంలో జారీ చేసిన నిబంధనలను సవాల్ చేస్తూ ఏపీ వేసిన రిట్ పిటిషన్‌పై 2023 నవంబర్ 7న సుప్రీంకోర్టు విచారణ చేపట్టినా స్టే ఇవ్వలేదు. అందువల్ల దీనిపై విచారణ వీల్లేదన్న ఏపీ వాదన అసంబద్ధం.
- కేడబ్ల్యూడీటీ–2 జనవరి 16, 17న విచారణ చేపడుతుందని తెలిసి కేంద్రం గతంలో జారీ చేసిన నిబంధనలపై జనవరి 16న విచారించాలంటూ ఏపీ సుప్రీంలో ఐఏ వేసింది. దానిపై సుప్రీం జనవరి 23న విచారిస్తామని పేర్కొంది.
- ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకొని సెక్షన్–3 కింద కేడబ్ల్యూడీటీ–2 వాదనలు వినవచ్చు.

వారంపాటు కాంగ్రెస్ సంతాప దినాలు

- మాజీ ప్రధాని మన్మోహన్ మృతి నేపథ్యంలో వ్యవస్థాపక దినోత్సవాలను రద్దు చేసిన టీపీసీసీ
- జనవరి మూడో తేదీ వరకు అన్ని రాజకీయ కార్యక్రమాలు రద్దు
- గాంధీభవన్‌లో మాజీ ప్రధానికి నివాళులర్పించిన టీపీసీసీ నేతలు



గాంధీభవన్‌లో మన్మోహన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

సాక్షి, హైదరాబాద్: మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి నేపథ్యంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వారం రోజుల పాటు సంతాప దినాలను పాటించనుంది. శనివారం నిర్వహించాల్సిన పార్టీ వ్యవస్థాపక దిన వేడుకలు సహా జనవరి 3 వరకు చేపట్టాల్సిన అన్ని రాజకీయ కార్యక్రమాలను రద్దు చేసుకుంటున్నట్టు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ శుక్రవారం ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని స్థాయిల్లో ఎలాంటి పార్టీ కార్యక్రమాలు నిర్వహించవద్దని నేతలు, కార్యకర్తలకు సూచించారు. కాగా మన్మోహన్ మృతి పట్ల మంత్రి కొండా సురేఖ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి తదితరులు సంతాపం ప్రకటించారు. దేశం ఆర్థికంగా కష్టాల్లో ఉన్నప్పుడు తన మేధస్సును ధారపోసి దేశ అభ్యున్నతికి దారులు వేసిన మహనీయుడు మన్మోహన్ అని కొండా సురేఖ కొనియాడారు. ఎంత ఎదిగినా ఎలా ఒదిగి ఉండాలో తన చర్యల ద్వారా నిరూపించిన నేత మన్మోహన్ అని మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి పేర్కొన్నారు.

గాంధీభవన్‌లో నివాళులు

గాంధీభవన్‌లో మాజీ ప్రధాని మన్మోహన్‌కు టీపీసీసీ నేతలు ఘనంగా నివాళులు అర్పించారు. గాంధీభవన్ ప్రధాన ద్వారం వద్ద మన్మోహన్ భారీ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి, పూలమాలలు వేశారు. దేశానికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. మాజీ ఎంపీ వీహెచ్, నేతలు కుమార్‌రావు, బండ్రు శోభారాణి, మెట్టు సాయికుమార్, బొల్లు కిషన్, లక్ష్మణ్ యాదవ్, చరణ్‌కౌశిక్ యాదవ్, సూర్యానాయక్ తదితరులు నివాళులు అర్పించారు. బీఆర్కే భవన్‌లోని తెలంగాణ రైతు కమిషన్ కార్యాలయంలో చైర్మన్ ఎం.కోదండరెడ్డి, పలువురు సభ్యులు మన్మోహన్‌కు నివాళులర్పించారు. మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా మాజీ ప్రధాని మన్మోహన్‌కు కాంగ్రెస్ శ్రేణులు నివాళులు అర్పించాయి.

దేశానికి వన్నె తెచ్చిన నేత

- మన్మోహన్‌సింగ్ లాంటి మహానుభావుడిని కోల్పోవడం తీరని లోటు
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- పార్టీ ఎంపీలతో కలిసి మాజీ ప్రధానికి నివాళి
- మన్మోహన్‌కు తెలంగాణతో ప్రత్యేక అనుబంధం ఉందన్న కేసీఆర్



మన్మోహన్ పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న కేటీఆర్, సురేశ్‌రెడ్డి, వద్దిరాజు

సాక్షి, న్యూఢిల్లీ/సాక్షి, హైదరాబాద్: మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ లాంటి మహానుభావుడిని కోల్పోవడం దేశానికి తీరని లోటు అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు అన్నారు. ప్రధానిగా దేశానికి దిశానిర్దేశం చేయడం మాత్రమే కాకుండా ఆర్థిక వేత్తగా, పరిపాలన దక్షుడిగా పేరు తెచ్చుకున్న మహానుభావులు మన్మోహన్ సింగ్ అని కొనియాడారు. 'భారతదేశానికి ప్రపంచంలోనే వన్నె తెచ్చిన నాయకుడు డాక్టర్ మన్మోహన్.. ఏనాడూ ఏ వివాదం జోలికిపోకుండా కేవలం దేశం బాగోగులు, మంచిని కాంక్షించిన వ్యక్తి..' అని చెప్పారు. మాజీ సీఎం, పార్టీ అధినేత కె.చంద్రశేఖర్‌రావు ఆదేశాల మేరకు శుక్రవారం రాత్రి ఢిల్లీలో మన్మోహన్ సింగ్ పార్థివదేహాన్ని కేటీఆర్‌తో పాటు బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ కె.ఆర్.సురేష్‌రెడ్డి, డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర, విప్ దీవకొండ దామోదర్ రావులు సందర్శించారు. పూలమాలలు వేసి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. పార్టీ అధినేత కేసీఆర్‌కు మన్మోహన్ సింగ్‌తో ఎంతో సాన్నిహిత్యం ఉండేదని గుర్తుచేశారు. దాదాపు రెండు సంవత్సరాల పాటు మన్మోహన్ సింగ్ కేబినెట్‌లో పని చేశారని.. మన్మోహన్ కూడా తెలంగాణ కోసం ప్రధానిగా దిశానిర్దేశం చేశారన్నారు ప్రపంచంలోనే మన దేశానికి మంచి పేరు తీసుకురావడంతో పాటు, సౌమ్యుడిగా, వివాద రహితుడుగా పేరుగాంచారన్నారు.

నేడు అంత్యక్రియలకు హాజరు

ఢిల్లీలో శనివారం మన్మోహన్ అంత్యక్రియలకు బీఆర్‌ఎస్ హాజరుకానుంది. కేసీఆర్ ఆదేశంతో కేటీఆర్ నేతృత్వంలోని బీఆర్‌ఎస్ బృందం ఢిల్లీ చేరుకుంది. 'మన్మోహన్ దేశానికి అమోఘమైన సేవలందించారు. ఆయనతో తెలంగాణకు ప్రత్యేక అనుబంధం ఉంది. స్థితప్రజ్ఞత కలిగిన దార్శనికుడు ఆయన. తెలంగాణ ఉద్యమ సమయం నుంచి రాష్ట్ర ఏర్పాటు దాకా ఆయన అందించిన సహకారం తెలంగాణ సమాజం మరువదు. ఆయన ప్రధానిగా ఉన్న సమయంలోనే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జరిగింది. ఈ విధంగా తెలంగాణ సమాజానికి అత్యంత ఆప్తుడైన మన్మోహన్ సింగ్ గారికి ఘన నివాళులు అర్పించాలని బీఆర్‌ఎస్ పార్టీ నిర్ణయించింది' అని కేసీఆర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

నాంపల్లి కోర్టుకు బీఆర్‌ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్

రూ.5 వేలతో రెండు పూచీకత్తులు అందజేసిన న్యాయవాదులు

సిటీ కోర్టులు: పోలీసు విధులను అడ్డుకోవడమే కాకుండా బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్రను బెదిరించారనే ఆరోపణలపై మాజీ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ శుక్రవారం నాంపల్లి కోర్టుకు హాజరయ్యారు. బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్రను బెదిరించారనే ఆరోపణల నేపథ్యంలో శ్రీనివాస్‌పై ఈనెల 4న పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో గురువారం ఉదయం శ్రీనివాస్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు సాయంత్రం నాంపల్లి కోర్టులో హాజరుపర్చారు. పోలీసుల తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాంరెడ్డి, శ్రీనివాస్ తరఫున న్యాయవాదులు కిరణ్, జక్కుల లక్ష్మణ్ వాదనలు వినిపించారు. విచారణ చేపట్టిన నాంపల్లిలోని 3వ అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు జడ్జి కుమారస్వామి పర్సనల్ బాండ్‌తోపాటు రూ.5 వేలతో రెండు పూచీకత్తులు ఇవ్వాలని సూచిస్తూ బెయిల్ మంజూరు చేశారు. అయితే గురువారం పూచీకత్తులు పెట్టడానికి సమయం లేకపోవడంతో పర్సనల్ బాండ్‌నే అందజేశారు. దీంతో శుక్రవారం శ్రీనివాస్ తరఫు న్యాయవాదులు రూ.5 వేల రెండు పూచీకత్తులు అందజేశారు. అనంతరం దీనిపై విచారణ చేపట్టిన నాంపల్లిలోని 3వ అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు జడ్జి కుమారస్వామి విచారణను మార్చి 28కి వాయిదా వేశారు.



రోడ్డు ప్రమాదంలో..

యాదగిరిగుట్టకు వెళ్లి తిరిగి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు మృతిచెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. -10లో



లీలా వినోదం..

నగరంలో ఇయర్ ఎండ్ వేడుకల సందడి మరూ అయింది. ఇప్పటికే బాలీవుడ్ డీజేలు పలువురు నగరానికి చేరుకున్నారు. గ్లామర్ స్టార్ శ్రీలీల, సింగర్ సునీత పాల్గొననున్నారు. - సిటీప్లస్‌లో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 27.0/20.0

నగరంలో శనివారం ఆకాశం కారుమబ్బులతో కమ్ముకుని ఉంటుంది. ఓ మోస్తరు వర్షం కురవవచ్చు, గరిష్ఠంగా 27, కనిష్ఠంగా 20 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.


ఇందిరమ్మ ఇళ్ల సర్వే ముమ్మరం



సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే కార్యక్రమం ముమ్మరంగా జరుగుతున్నట్లు జీహెచ్‌ఎంసీ పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయగా, ఆ మేరకు జీహెచ్‌ఎంసీ పరిధిలోని 24 నియోజకవర్గాల్లో 84 వేల మంది లబ్ధిదారులకు ప్రయోజనం కలుగనుంది. గతంలో ప్రజాపాలనలో అందిన దరఖాస్తుదారుల ఇళ్లను మాత్రమే సర్వే చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. అలాంటి వారు జీహెచ్‌ఎంసీలో 10,70,446 మంది ఉన్నారు. వారి ఇళ్లను సర్వేచేసేందుకు వార్డుల వారీగా టీమ్‌లు ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు 94 వేలకు పైగా దరఖాస్తుదారుల ఇళ్ల సర్వే పూర్తయింది. జోనల్ కమిషనర్ల పర్యవేక్షణలో, డిప్యూటీ కమిషనర్ల నేతృత్వంలో సర్వే ముమ్మరంగా జరుగుతోందని జీహెచ్‌ఎంసీ పేర్కొంది.

సిటీ చూసొద్దామని బయలుదేరి.. మృత్యు ఒడికి..

① ప్రమాదం జరగడానికి ముందు..



② డివైడర్‌తో పాటు చెట్టును ఢీ కొట్టిన బైక్



③ వాహనం పైనుంచి ఎగిరి అక్కడే పడిపోయిన రఘుబాబు



④ బైక్‌తో పాటు కాస్త దూరం వెళ్లి పడిపోయిన ఆకాంక్ష్



ఇద్దరి ప్రాణం తీసిన అతివేగం

- మాదాపూర్‌లో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న బైకు
- తీవ్రగాయాలతో చికిత్స పొందుతూ మృతిచెందిన ఐటీ ఉద్యోగులు



ఆకాంక్ష్ (ఫైల్)



రఘుబాబు (ఫైల్)



⑤ యువకులు ప్రయాణించిన బైక్

మాదాపూర్: సరదాగా రాత్రి వేళ నగరాన్ని చూసొద్దామని బయలుదేరిన ఇద్దరు ఐటీ ఉద్యోగులు 'అతివేగం' కారణంగా మృత్యు ఒడికి చేరారు. అదుపు తప్పిన వేగంతో బైకు నడిపి అనంతలోకాలకు చేరారు. ఈ సంఘటన మాదాపూర్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ తెలిపిన వివరాల ప్రకారం..కరీంనగర్‌కు చెందిన ఆకాంక్ష్ (24), నెల్లూరుకు చెందిన రఘుబాబు స్నేహితులు. వీరిద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా పనిచేస్తున్నారు. గురువారం అర్ధరాత్రి దాటాక దాదాపు 12.30 గంటల సమయంలో ఇద్దరు మోటార్ సైకిల్ (టీఎస్ 02 ఎఫ్‌ఈ 8983)పై బోరబండ నుంచి మాదాపూర్‌కు బయలుదేరారు. మార్గమధ్యలో పర్వత్‌నగర్ సిగ్నల్ దాటిన తరువాత ఆకాంక్ష్ నడుపుతున్న బైక్ అదుపుతప్పి రోడ్ డివైడర్‌ను వేగంగా ఢీకొని.. ఇద్దరు రోడ్డుపై పడిపోయారు. బైకు కొద్దిదూరం రోడ్డుపై ఈడ్చుకుంటూ వెళ్లింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన వీరిని చికిత్స నిమిత్తం మెడికవర్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చర్లపల్లి రైల్వే టెర్మినల్ ప్రారంభం వాయిదా

కుషాయిగూడ: చర్లపల్లి రైల్వే టెర్మినల్ ప్రారంభోత్సవం వాయిదా పడింది. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ అకాల మరణం కారణంగా శనివారం జరగాల్సిన టెర్మినల్ ప్రారంభ కార్యక్రమం వాయిదా వేశారు. వారంరోజుల పాటు సంతాప దినాలుగా ప్రకటించడంతో ప్రారంభోత్సవ తేదీని తిరిగి ఖరారు చేసే అవకాశం ఉందని రైల్వేవర్గాలు పేర్కొన్నాయి.

డ్రగ్స్ ఆనవాళ్లు కనిపిస్తే సమాచారం ఇవ్వండి



సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ డాక్టర్ వినీత్

గచ్చిబౌలి: నగర పరిధిలో డ్రగ్స్ ఆనవాళ్లు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని మాదాపూర్ డీసీపీ డాక్టర్ వినీత్ సూచించారు. కొత్త సంవత్సర వేడుకల్లో పోలీసుల నిబంధనలు అందరూ విధిగా పాటించాలని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం సాయంత్రం ఈవెంట్ల నిర్వాహకులు, పబ్ యజమానులు, మేనేజర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవెంట్లు, పబ్ నిర్వాహకులు విధిగా ప్రత్యేక పార్కింగ్‌ను, సొంతంగా సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మద్యం సేవించిన వారి వాహనాలకు డ్రైవర్లను నిర్వాహకులే ఏర్పాటు చేయాలన్నారు. ఒకవేళ వాహనాలు లేకపోతే ట్రాన్స్‌పోర్టు సౌకర్యాన్ని కూడా కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.


'చిరునామా' చిక్కేనా?



నత్తనడకన ఇంటింటి జీఐఎస్ సర్వే

- ఇప్పటికింకా మూడు లక్షల ఇళ్లే పూర్తి
- పాతబస్తీలో ప్రారంభమే కాలేదు
- 'డిజిటల్ అడ్రస్'లు ఇప్పట్లో అసాధ్యమే..

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ నగరంలో ఇళ్ల చిరునామాలు ఈజీ అయ్యేందుకు, ప్రజలు వివిధ రకాల సేవలు ఇంటివద్దే పొందేందుకు ప్రతి ఇంటికీ యూనిక్ ఐడీ నెంబర్ (డిజిటల్ అడ్రస్)ఇస్తామన్న జీహెచ్‌ఎంసీ ప్రకటన కార్యరూపం దాల్చడం ఇప్పట్లో సాధ్యమయ్యేలా లేదు. ఇందుకుగాను శాటిలైట్ సర్వే, డ్రోన్ సర్వేలతో పాటు క్షేత్రస్థాయిలో ఇంటింటి సర్వే నిర్వహిస్తామని అధికారులు చెప్పినా..ఇంటింటి సర్వేనే ఆశించిన స్థాయిలో జరగడం లేదు. ఈ కార్యక్రమం ప్రారంభమైనప్పటి నుంచీ అడుగడుగునా ఆటంకాలతో కుంటుతోంది. గత జూలై 30న ఈ సర్వే ప్రారంభం కాగా, వచ్చే మార్చిలోగా సర్వే పూర్తిచేయాలనేది జీహెచ్‌ఎంసీ లక్ష్యం. కానీ ఇప్పటి వరకు కేవలం మూడు లక్షల ఇళ్ల సర్వే మాత్రమే జరిగింది. జీహెచ్‌ఎంసీ పరిధిలో దాదాపు 24 లక్షల ఇళ్లను ఇటీవలి సమగ్ర కుటుంబ సర్వే సందర్భంగా గుర్తించారు. సర్వే ప్రారంభించినప్పటి నుంచి దాదాపు ఐదు నెలల్లో మూడు లక్షల ఇళ్ల సర్వే చేశారంటే.. ఈ లెక్కన మొత్తం ఇళ్ల సర్వే పూర్తిచేసేందుకు మూడేళ్లకు పైగా పట్టనుంది. జీహెచ్‌ఎంసీ కమిషనర్, సర్వే పనులు పర్యవేక్షిస్తున్న ఐటీ విభాగం అడిషనల్ కమిషనర్ మారడంతో రూ.22 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ సర్వే కుంటుతోంది. సర్వే కాంట్రాక్టు దక్కించుకున్న ఏజెన్సీ తగినంతమంది సిబ్బందిని నియమించకపోవడంతో సర్వే మందగించింది. సంబంధిత విభాగం అధికారులు మాత్రం..ప్రస్తుతం సర్వే పరిస్థితి మారిందని, ఎక్కువమంది సిబ్బంది సర్వేలో పాల్గొంటున్నందున వేగం పెరిగిందని చెబుతున్నారు.



ఎక్కువ ఇళ్ల సర్వే జరిగిన డివిజన్లు

డివిజన్	ఇళ్లు
గాజుల రామారం	19839
హైదర్‌నగర్	15952
కేపీహెచ్‌బీ కాలనీ	12684
హఫీజ్‌పేట్	10570

తక్కువ ఇళ్ల సర్వే జరిగిన డివిజన్లు

డివిజన్	ఇళ్లు
షేక్‌పేట	20
సోమాజిగూడ	32
అడ్డగుట్ట	93
కూకట్‌పల్లి	101
అల్లాపూర్	124

ఇంకా ప్రారంభం కాని ధ్రువీకరణ

ప్రస్తుతం కాంట్రాక్టు ఏజెన్సీ సిబ్బంది సర్వే నిర్వహిస్తున్నారు. ఈ సర్వేలో వెల్లడయ్యే వివరాలను ధ్రువీకరించేందుకు జీహెచ్‌ఎంసీ ఉద్యోగులు క్షేత్రస్థాయిలో పర్యటించాల్సి ఉంది. ఇప్పటి వరకు వారు సర్వేకు వెళ్లలేదు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటి సమగ్ర సర్వే ముగిసిందో లేదో ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రారంభమైంది. జీహెచ్‌ఎంసీ యంత్రాంగం ప్రస్తుతం ఆ విధుల్లో ఉంది. ఈ నేపథ్యంలో కాంట్రాక్టు ఏజెన్సీ నిర్వహించిన ఇళ్ల వివరాల ధ్రువీకరణ ఇంకా ఆలస్యమయ్యే అవకాశం ఉంది.

పాతబస్తీలో ప్రారంభమే కాని సర్వే..

జీహెచ్‌ఎంసీ పరిధిలో 30 సర్కిళ్లలోని 150 డివిజన్లలో సర్వే నిర్వహించాల్సి ఉండగా, పాతబస్తీలో ఇంత వరకు సర్వే ప్రారంభమే కాలేదు. అక్కడ సర్వే నిర్వహించాలంటేనే సంబంధిత సిబ్బంది వెనుకాడుతుండటంతో, మిగతా ప్రాంతాల్లో పూర్తయ్యాక చేయవచ్చుననే ఆలోచనలో కాంట్రాక్టు ఏజెన్సీతోపాటు జీహెచ్‌ఎంసీ అధికారులు కూడా ఉన్నట్లు తెలుస్తోంది.

ఎన్నో ప్రయోజనాలున్నా..

సర్వే పూర్తయితే డిజిటల్ ఇంటి నెంబర్‌తో వివిధ సేవలు నేరుగా ప్రజల ముందుకు వెళ్లడంతోపాటు జీహెచ్‌ఎంసీకి ఇంటింటి నుంచి చెత్త సేకరణ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయడం సాధ్యమవుతుందని అధికారులు పేర్కొన్నారు. అంతే కాదు, సర్వే వల్ల ఇళ్ల అసెస్‌మెంట్లలో లోపాలు, వ్యత్యాసాల్ని సరిచేయడం ద్వారా జీహెచ్‌ఎంసీ ఖజానాకు ఆస్తిపన్ను ఆదాయమూ పెరుగుతుందని భావించారు. ముఖ్యంగా నివాస భవనాలుగా ఉండి వాణిజ్య కార్యకలాపాలు నిర్వహిస్తున్న భవనాల నుంచి భారీ ఆదాయం వచ్చేందుకు అవకాశం ఉంది. ఈ సర్వే పూర్తయితే ఇన్ని ప్రయోజనాలున్నప్పటికీ, సర్వే ఎప్పటికి పూర్తవుతుందో చెప్పలేని పరిస్థితి నెలకొంది.

ఆ భయం వల్లేనా..!

భారీగా పడిపోయిన గ్రేటర్ టౌన్‌ప్లానింగ్ ఆదాయం

భవన నిర్మాణాలపై 'హైడ్రా' ప్రభావం

- గత ఆర్థిక సంవత్సరం ఫీజుల రూపేణా రూ.1695 కోట్లు
- ఈసారి ఇప్పటి వరకు సగం కూడా రాని వైనం..
- వాస్తవంగా రియల్టర్ల జోలికి వెళ్లని హైడ్రా
- అనవసర అపోహల వల్లే నిర్మాణాల్లో మందగమనం అని అంచనా..



సాక్షి, సిటీబ్యూరో: హైడ్రా భయం భవన నిర్మాణాలపై ప్రభావం చూపుతోంది. ఈ నేపథ్యంలో జీహెచ్‌ఎంసీకి గతంలో వచ్చిన ఆదాయం ఈ సంవత్సరం రాలేదు. చెరువులు, సరస్సులు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు ప్రభుత్వం ఈ సంవత్సరం ఏర్పాటు చేసిన హైడ్రా ఎందుకనోగానీ ప్రజల్లో..ముఖ్యంగా రియల్టర్లలో వణుకు పుట్టిస్తోంది. వాస్తవానికి హైడ్రా రియల్టర్ల జోలికి వెళ్లడం లేదు. ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదుల మేరకు చెరువులను కబ్జాలు చేసి నిర్మిస్తున్న భవనాలనే కూల్చివేస్తోంది. కానీ అనవసర భయాలతో రియల్టర్లు కొత్త ప్రాజెక్టులకు వెనుకడుగు వేస్తున్నట్లు కనిపిస్తోంది. జీహెచ్‌ఎంసీకి గత సంవత్సరాలతో పోలిస్తే ఈ సంవత్సరం భవన నిర్మాణ ఫీజుల ద్వారా రావాల్సిన ఆదాయం గణనీయంగా తగ్గడం ఇందుకు ఉదాహరణ. పెద్దపెద్ద నిర్మాణాలు జరిగితేనే ఫీజుల రూపేణా అధిక ఆదాయం వస్తుంది. పెద్ద నిర్మాణాలు స్తంభించడంతో ఆదాయం తగ్గినట్లు తెలుస్తోంది. గడచిన ఆర్థిక సంవత్సరం (2023–24)లో జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగం ద్వారా రూ.1695 కోట్ల ఆదాయం జీహెచ్‌ఎంసీ ఖజానాకు చేరింది. ఈ ఆర్థిక సంవత్సరం (2024–25) అక్టోబర్ నెలాఖరు వరకు వచ్చింది రూ.459 కోట్లు మాత్రమే. నవంబర్, డిసెంబర్‌లలోనూ పెద్ద నిర్మాణాల అనుమతులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. 2023–24 తోపోలిస్తే ఇంకా సగం ఆదాయం కూడా రాలేదు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు మిగిలిన మూడునెలల్లో ఏమేర ఆదాయం వస్తుందో చెప్పలేని పరిస్థితి. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే రూ.1000 కోట్లు సమకూరడం కూడా కష్టమేననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

లేనిపోని భయాలు

కొత్త నిర్మాణాలకు రియల్టర్లు వెనుకడుగు వేస్తుండటంతో మెజార్టీ రియల్టర్లు ఇంతకాలం చెరువులు, సరస్సులను కబ్జాచేసే నిర్మాణాలు చేశారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. జీహెచ్‌ఎంసీ పరిధిలో ఇప్పటికే భారీ నిర్మాణాలు జరిగినందున ఖాళీ స్థలాలంటూ లేనందున కొత్తగా నిర్మాణాలు జరగడం లేవని టౌన్‌ప్లానింగ్ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే సాచురేషన్ స్థాయి మించిపోయిందని అంటున్నాయి. పాతభవనాలను కూల్చి అధునాతనంగా నిర్మించే వారుంటే తప్ప పెద్ద నిర్మాణాలు వచ్చే అవకాశాల్లేవని కూడా చెబుతున్నాయి.

కూల్చివేతలకే కాదు..

హైడ్రా అనగానే ప్రజలకు కూల్చివేతలే గుర్తుకొస్తుండటం దారుణం. మూసీ పునరుజ్జీవనానికి సంబంధించి ఆస్తులు కూల్చివేసింది రెవెన్యూ విభాగం అయినప్పటికీ, హైడ్రా కూల్చివేసిందనే ప్రచారంతో అదే ముద్ర పడింది. హైడ్రా ఉన్నది కేవలం కూల్చివేతలకే కాదు..దానికున్న విధుల్లో అదొక భాగం మాత్రమే. అన్ని రకాల ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ, విపత్తు నిర్వహణలు కూడా ఉన్నాయి. ట్రాఫిక్ చిక్కుల పరిష్కారానికీ పనిచేస్తుంది. వీటి గురించి సామాన్య ప్రజలకు తగిన అవగాహన లేకపోవడం హైడ్రా నిందల పాలయ్యేందుకు కారణమైంది. ఈ అంశంలో ప్రజలకు పూర్తిస్థాయి అవగాహన కల్పించాల్సిన అవసరముందని పట్టణ ప్రణాళిక నిపుణులు చెబుతున్నారు.

ఎలివేటెడ్ కారిడార్లకు పచ్చజెండా

మార్చిలో టెండర్లు ఆహ్వానించనున్న హెచ్‌ఎండీఏ

- ప్యారడైజ్ నుంచి శామీర్‌పేట్ ఓఆర్‌ఆర్ వరకు 18.124 కి.మీ
- ప్యారడైజ్ నుంచి డెయిరీఫామ్ వరకు 5.320 కి.మీ
- రెండు ప్రాజెక్టులకు సుమారు రూ.5106 కోట్లతో అంచనాలు
- తుదిదశకు భూసేకరణ ప్రక్రియ
- ఆస్తులు కోల్పోయేవారికి త్వరలో పరిహారం చెల్లింపు



సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ పరిధిలో ఎలివేటెడ్ కారిడార్ల పనుల్లో కదలిక మొదలైంది. వచ్చే మార్చి నెలలో ఆసక్తి గల నిర్మాణ సంస్థల నుంచి టెండర్లను ఆహ్వానించనున్నారు. ఈ దిశగా హెచ్‌ఎండీఏ కార్యాచరణను వేగవంతం చేసింది. సికింద్రాబాద్ ప్యారడైజ్ నుంచి శామీర్‌పేట్ ఓఆర్‌ఆర్ జంక్షన్ వరకు 18.124 కి.మీలు, ప్యారడైజ్ నుంచి డైరీ ఫామ్ వరకు 5.320 కిలోమీటర్ల కారిడార్లను నిర్మించనున్నారు. రెండు మార్గాల్లో హెచ్‌ఎండీఏ కార్యాచరణను వేగవంతం చేసింది. రక్షణ శాఖతో కలిసి హెచ్‌ఎండీఏ అధికారులు క్షేత్రస్థాయిలో సర్వేలు నిర్వహించారు. సేకరించవలసిన భూములను గుర్తించారు. అలాగే రహదారుల విస్తరణలో భాగంగా తొలగించాల్సిన ఆస్తులపైన కూడా అధికారులు ఒక అంచనాకు వచ్చారు. భూసేకరణ తుదిదశకు చేరిందని, జనవరి నెలాఖరు నాటికి ఆస్తులు కోల్పోయిన వారికి పరిహారం చెల్లింపు వంటి పనులు చేపట్టనున్నట్లు హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ తెలిపారు. అనంతరం మార్చి నెలలో బిడ్‌లను ఆహ్వానిస్తూ నోటిఫికేషన్ విడుదల చేస్తామని చెప్పారు. ఈ కారిడార్లలో ఆస్తులు కోల్పోయే వారికి నగదు రూపంలో చెల్లించేందుకు, టీడీఆర్‌లు అందజేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. మేడ్చల్, హైదరాబాద్ జిల్లాల కలెక్టర్లు స్థలాల ధరలు నిర్ణయించిన అనంతరం హెచ్‌ఎండీఏ చెల్లింపులు చేపట్టనుంది. ఈ రెండు కారిడార్ల వల్ల జంట నగరాలతో పాటు ఉత్తర తెలంగాణలోని ఐదు జిల్లాల ప్రజల కష్టాలు తీరనున్నాయి. ట్రాఫిక్ రద్దీ తగ్గుముఖం పట్టనుంది. ఈ రెండు కారిడార్ల నిర్మాణం కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ ఏడాది మార్చి నెలలో శంకుస్థాపన చేసిన సంగతి తెలిసిందే.

సికింద్రాబాద్ టూ డైరీఫామ్...

జాతీయ రహదారి (ఎన్‌హెచ్)–44పై సికింద్రాబాద్‌లోని ప్యారడైజ్ జంక్షన్ నుంచి తాడ్‌బండ్ జంక్షన్, బోయినపల్లి జంక్షన్ మీదుగా డెయిరీ ఫాం రోడ్డు వరకు ఆరు లైన్‌లతో 5.32 కిలోమీటర్ల పొడవైన కారిడార్ నిర్మించనున్నారు. ఇందులో 4.65 కిలోమీటర్లు ఎలివేటెడ్ కారిడార్. కాగా, 600 మీటర్లు అండర్‌గ్రౌండ్ టన్నెల్ ఉంటుంది. బేగంపేట్ వద్ద ఈ టన్నెల్ నిర్మాణం కోసం ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) నుంచి తాజాగా అనుమతి లభించినట్లు అధికారులు తెలిపారు. వాహనదారులు కారిడార్‌పైకి రాకపోకలు సాగించేందుకు బోయినపల్లి జంక్షన్ సమీపంలో ఇరువైపులా 248 మీటర్లు, 475 మీటర్ల చొప్పున రెండు చోట్ల ర్యాంపులు నిర్మించనున్నారు.

ఎలివేటెడ్ కారిడార్–1 విశేషాలు..

- మొత్తం పొడవు: 5.320 కి.మీ.
- ఇందులో ఎలివేటెడ్ : 4.650 కి.మీ.
- అండర్‌గ్రౌండ్ టన్నెల్: 600 మీటర్లు..
- అవసరమైన భూమి: 55.19 ఎకరాలు
- ప్రాజెక్టు వ్యయం: రూ.1487 కోట్లు
- భూసేకరణకు అవసరమైన నిధులు: రూ.357 కోట్లు

ప్యారడైజ్ టు శామీర్‌పేట్ ఓఆర్‌ఆర్ జంక్షన్..


రాష్ట్ర రహదారి (ఎస్‌హెచ్–1) మార్గంలో ప్యారడైజ్ నుంచి తూంకుంట మీదుగా శామీర్‌పేట్ ఔటర్‌రింగ్‌రోడ్డు జంక్షన్ వరకు సుమారు 18.124 కిలోమీటర్ల మార్గంలో మరో ఎలివేటెడ్ కారిడార్ మారేడుపల్లి, కార్ఖానా, తిరుమలగిరి, బొల్లారం, అల్వాల్, హకీంపేట్, తూంకుంట రూట్‌లో నిర్మించనున్నారు. ఈ కారిడార్ కోసం 163.33 ఎకరాల భూమి సేకరించాల్సి ఉంటుందని అధికారులు నిర్ణయించారు. ఇప్పటి వరకు 124 ఎకరాల భూసేకరణ పూర్తయింది. త్వరలో మిగతా భూములను కూడా సేకరించి పరిహారం చెల్లింపు ప్రక్రియను చేపట్టనున్నారు. రక్షణ శాఖతో కలిసి క్షేత్రస్థాయి సర్వేలు పూర్తి చేసినట్లు హెచ్‌ఎండీఏ అధికారులు తెలిపారు. ఎలివేటెడ్ కారిడార్‌లలో రక్షణశాఖ కోల్పోనున్న భూములకు ప్రత్యామ్నాయంగా మరోచోట భూములను ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిన సంగతి తెలిసిందే. ప్రైవేట్ వ్యక్తులకు జనవరిలో పరిహారం అందజేస్తారు.

రెండు కారిడార్లతో ప్రయోజనాలు..

- హైదరాబాద్ నుంచి ఉత్తర తెలంగాణ జిల్లాలకు రాకపోకలు సులభతరమవుతాయి.
- ప్యారడైజ్ జంక్షన్ వద్ద రోజుకు సగటున 1,57,105 వాహనాలు (ప్యాసింజర్ కార్ యూనిట్ ఫర్ డే –పీసీయూ)చొప్పున పయనిస్తుంటే, ఓఆర్ ఆర్ జంక్షన్ వద్ద 72,687 వాహనాలు పయనిస్తున్నాయి. ప్యారడైజ్ నుంచి తూంకుంట వరకు ఇరుకైన రహదారి కావడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ రూట్‌లో కారిడార్ వల్ల ప్రజల కష్టాలు తీరనున్నాయి.
- జాతీయ రహదారి–44లో సికింద్రాబాద్ నుంచి మెదక్, కామారెడ్డి, నిజామాబాద్, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలకు రాకపోకలు సులభం కానున్నాయి.

కారిడార్–2

- పొడవు: 18.124 కిలోమీటర్లు
- నిర్మాణవ్యయం: రూ.3619 కోట్లు
- సేకరించాల్సిన భూమి: 163.33 ఎకరాలు
- భూమి కోసం చెల్లించవలసిన పరిహారం : రూ.1565 కోట్లు



సిటీలో పెరిగిన 'చెత్త'

గ్రేటర్‌లో రోజుకు 8,500 టన్నుల వ్యర్థాల విడుదల

- ఇందులో 55 శాతం పొడి, 45 శాతం బయో డీగ్రేడబుల్ వ్యర్థాలు
- వీటి ద్వారా ఇంధనం, ఎరువుల తయారీ
- జవహర్‌నగర్ కేంద్రాన్ని సందర్శించిన జీహెచ్‌ఎంసీ కమిషనర్

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ హైదరాబాద్ చెత్తమయంగా మారుతోంది. ఘన వ్యర్థాల విడుదల గత దశాబ్ద కాలంలో రెట్టింపు కంటే ఎక్కువగా ఉంది. 2014లో హైదరాబాద్‌లో రోజుకు 3,500 టన్నుల మున్సిపల్ సాలిడ్ వేస్ట్ (ఎంఎస్‌డబ్ల్యూ) విడుదల అవగా..ఇప్పుడది 8,500 టన్నుల ఎంఎస్‌డబ్ల్యూలకు పెరిగింది. శివారు మున్సిపాలిటీల నుంచే రోజుకు వెయ్యి టన్నుల చెత్త వచ్చి చేరుతోంది. శుక్రవారం జవహర్‌నగర్‌లోని మున్సిపల్ సాలిడ్ వేస్ట్ (ఎంఎస్‌డబ్ల్యూ) ప్రాసెసింగ్, డిస్పోజల్ కేంద్రాన్ని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి సందర్శించారు. ఈ సందర్భంగా ఆటోమేటెడ్ ఆర్‌ఎఫ్‌ఐడీ సిస్టమ్‌తో వాహన బరువును నిర్వహించే వెయింగ్ బ్రిడ్జిలు, వ్యర్థాల క్రమబద్ధీకరణ తదితర విధానాలను పరిశీలించారు. రోజూ విడుదలవుతున్న చెత్తలో 45 శాతం అంటే 3,825 టన్నులు బయో డీగ్రేడబుల్ వ్యర్థాల నుంచి కంపోస్ట్ ఉత్పత్తి అవుతుండగా.. మిగిలిన 55 శాతం వ్యర్థాలను వేస్ట్ టు ఎనర్జీగా మారుస్తున్నారు. సుమారు 4,675 పొడి వ్యర్థాలను సిమెంట్ ప్లాంట్‌లలో ఇంధనంగా వినియోగించేందుకు వీలుగా రిఫ్యూజ్ డెరైవ్ ఫ్యూయల్ (ఆర్‌డీఎఫ్)గా మార్చుతున్నారు. 24 మెగావాట్ల వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌లో ఆర్‌డీఎఫ్‌ను ఇంధనంగా ఉపయోగించి విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఫేజ్–2 వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ కూడా అందుబాటులోకి వస్తే.. ఆర్‌డీఎఫ్ వినియోగం ప్రస్తుతం ఉన్న 1,250 టన్నుల నుంచి 2,500 టన్నులకు పెరుగుతుంది. రోజుకు 300 టన్నుల తడి వ్యర్థాల ద్వారా 4.5 టన్నుల కంప్రెస్ట్ బయో గ్యాస్, 60 టన్నుల కంపోస్ట్ ఉత్పత్తి అవుతోంది.

జవహర్‌నగర్ ఎంఎస్‌డబ్ల్యూ ప్రాసెసింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఇలంబర్తి, ఇతర అధికారులు



నగరంలో నేడు

◆ హైదరాబాద్ బుక్‌ఫెయిర్ ఆధ్వర్యంలో 37వ జాతీయ పుస్తక ప్రదర్శన ఎన్టీఆర్ స్టేడియంలో మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంటుంది. సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల వరకు తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో సాంస్కృతిక ప్రదర్శనలు జరుగుతాయి.

◆ బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని హోటల్ తాజ్ కృష్ణాలో ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఆకృతి లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్ జరుగుతుంది.

◆ మాదాపూర్‌లోని హైటెక్స్‌లో ఎస్‌బీఐ మెగా ప్రాపర్టీ షో ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు జరుగుతుంది.

◆ నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా వేదికగా వింటర్ ఉత్సవ్ మేళా సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు జరుగుతుంది.

◆ సికింద్రాబాద్ ఆర్పీ రోడ్డులోని ప్యారడైజ్ ఫుడ్ కోర్టు ఆధ్వర్యంలో మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు రాయల్ ఫుడ్ ఫెస్టివల్ జరుగుతుంది.

◆ మాదాపూర్‌లోని పల్లెటూరి వాతావరణంతో కూడిన శిల్పారామం సందర్శకులకు ఉదయం 10.30గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

◆ మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఉదయం 10.30గంటల నుంచి రాత్రి 7 గంటలకు ఇండియన్ ఫోటో ఫెస్టివల్ జరుగుతుంది.

◆ మాదాపూర్‌లోని శిల్పారామంలో అంతర్జాతీయ హస్తకళా మేళా ఉదయం 10.30గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజు నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

చిరు వ్యాపారికి భరోసా!



- టౌన్ వెండింగ్ కమిటీ ఏర్పాటుకు సన్నాహాలు
- సిటీలో ఆక్రమణల తొలగింపునకు 'ఆపరేషన్ రోప్'
- ఫలితంగా వీధిన పడుతున్న ఫుట్‌పాత్ వ్యాపారులు
- వారి సమస్యలపై దృష్టి సారించిన నగర కొత్వాల్
- పరిష్కారం చూపనున్న టీవీసీలు
- టార్గెట్–2025లో చేర్చిన సిటీ పోలీసు విభాగం



సాక్షి, సిటీబ్యూరో: ఏదైనా రహదారిపై ట్రాఫిక్ సజావుగా సాగాలంటే ఫుట్‌పాత్‌కు–ప్రధాన రహదారికి మధ్య ఉండే ప్రాంతం అవసరమైన స్థాయిలో క్లియర్‌గా ఉండాలి. దీనినే సాంకేతికంగా క్యారేజ్ వే అని పిలుస్తుంటారు. రాజధానిలోని అత్యధిక ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లతో పాటు ఈ క్యారేజ్ వేలు సైతం ఖతమైపోయాయి. దీనికి చిరు వ్యాపారులు, బడా బిజినెస్ సంస్థలూ కారణమే. రాజధానిలోని రోడ్లపై ట్రాఫిక్ జామ్స్ తగ్గించడంతో పాటు అక్రమ పార్కింగ్ నిరోధం, ఆక్రమణల తొలగింపునకు ఉద్దేశించిన ఆపరేషన్ రిమూవల్ ఆఫ్ అబ్‌స్ట్రక్టివ్ పార్కింగ్ అండ్ ఎన్‌క్రోజ్‌మెంట్స్‌ను (రోప్) ట్రాఫిక్ విభాగం ఇటీవల పునఃప్రారంభించింది. దీనివల్ల చిరు వ్యాపారులకు ఎదురవుతున్న ఇబ్బందులపై దృష్టి సారించిన నగర కొత్వాల్ సీవీ ఆనంద్ వారికీ తగిన న్యాయం చేసేందుకు కొత్త సంవత్సరంలో టౌన్ వెండింగ్ కమిటీలు (టీవీసీ) ఏర్పాటు చేయనున్నారు.

ఎవరికి వారు... ఎక్కడికక్కడ...

నగరంలోని రహదారుల వెంట వ్యాపారాలు చేసుకునే వారిలో చిరు వ్యాపారులే ఎక్కువగా ఉంటారు. బతుకుతెరువు కోసం ఫుట్‌పాత్‌లతో పాటు క్యారేజ్ వేలను ఆధారంగా చేసుకుని వీరు జీవిస్తుంటారు. అయితే బడా వ్యాపారులు, సంస్థల విషయం అలా కాదు. వీరికంటూ ప్రత్యేకంగా దుకాణాలు, నిర్దేశిత ప్రాంతాలు ఉంటాయి. అయినా తమ ముందు ఉన్న ఫుట్‌పాత్, క్యారేజ్ వేలను 'అదనపు స్థలం' కోసం ఆక్రమిస్తుంటారు. వాటిపై సరుకులు పెట్టడం, వినియోగదారులకు పార్కింగ్, కూర్చోవడానికి సదుపాయాల కోసం అక్రమంగా ఆక్రమించేస్తున్నారు. ఫుట్‌పాత్‌లు, క్యారేజ్ వేల ఆక్రమణ అనేది కేవలం 'పాత నగరం' హైదరాబాద్‌లోనే కాదు... గడిచిన కొన్నేళ్లల్లోనే కొత్తరూపు సంతరించుకున్న సైబరాబాద్‌లోనూ ఉంది. ఐటీ కారిడార్‌లో వందల మంది వీధి వ్యాపారులు రోడ్లు, క్యారేజ్ వేలనే ఆధారంగా చేసుకుని వ్యాపారం నిర్వహిస్తున్నారు. పగలు రాత్రి తేడా లేకుండా ఇది కొనసాగుతుండటంతో వాహనాల రాకపోకలు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. అందుబాటు ధరల్లో ఉండటంతో ఐటీ కారిడార్‌లో వీధి వ్యాపారుల వద్ద ఉంటున్న రద్దీ తీవ్రమైన ట్రాఫిక్ సమస్యకు కారణంగా మారుతోంది.

ఇటీవల పునఃప్రారంభించిన కొత్వాల్...

ఆపరేషన్ రోప్‌ను నగర పోలీసు విభాగం 2022లోనే ప్రారంభించినా ఆ తర్వాత మూలనపడింది. నగర కొత్వాల్‌గా సీవీ ఆనంద్ పునరాగమనం తర్వాత మళ్లీ ఇటీవల దీన్ని పట్టాలెక్కించారు. దీనికోసం స్వయంగా రంగంలోకి దిగిన ఆయన పరిస్థితులు పర్యవేక్షిస్తున్నారు. ఆపరేషన్ రోప్ విజయవంతం కావడానికి స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో పాటు ప్రజల పోలీసులకు సహకరించాల్సిన అవసరం ఉంది. దీనిపై ఇటీవల ఆయన పాతబస్తీలోని దక్షిణ మండల డీసీపీ కార్యాలయంలో ప్రజాప్రతినిధులతో సమావేశం కూడా ఏర్పాటు చేశారు. చిరు వ్యాపారులకు భరోసా ఇవ్వడం కోసం టీవీసీలను తెరపైకి తీసుకువస్తున్నారు. వీటి ఏర్పాటుపై గతంలో సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలను సీపీ అమలు చేస్తున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులతో ఉండే ఈ కమిటీలు క్షేత్రస్థాయి పరిస్థితుల ఆధారంగా వెండింగ్ జోన్లను నిర్దేశిస్తాయి. ఆరెంజ్, రెడ్, బ్లూగా ఉండే ఈ జోన్లలో ఎక్కడ ఎలాంటి వ్యాపారాలు చేయాలి? అనే అంశాలను టీవీసీలు నిర్దేశిస్తాయి. 2025లో నగర ట్రాఫిక్‌పై కమిటీలు ప్రభావం చూపనున్నాయి.

హైదరాబాద్ మెట్రో దిక్సూచి మన్మోహన్ సింగే

మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ ఆర్థికవేత్తగా, ఆర్థిక సంస్కరణల పితామహుడిగా, ప్రధానమంత్రిగా భారత దేశ ఆర్థిక పురోగతికి డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎనలేని కృషి చేశారని హైదరాబాద్ మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి అన్నారు.ఈ మేరకు ఆయన శుక్రవారం ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. పీవీ నరసింహారావు, డాక్టర్ మన్మోహన్ సింగ్ కలిసి ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణల ద్వారా దేశంలో అధునాతన విమానాశ్రయాలు, నౌకాశ్రయాలు, జాతీయ రహదారులు, టెలీకమ్యూనికేషన్ తదితర రంగాల్లో ప్రపంచ స్థాయి సౌకర్యాలు అభివృద్ధి చెందుతుండగా, మెట్రో రైల్ ప్రాజెక్టులు ఆర్థిక భారంతో కూడినవి కావడంతో ప్రపంచమంతటా నగరాల అవసరాల దృష్ట్యా వాటిని ప్రభుత్వ రంగ ప్రాజెక్టులుగానే నిర్మించేవారని గుర్తు చేశారు. అలాంటి పరిస్థితుల్లో హైదరాబాద్ మెట్రోను ప్రధానిగా డాక్టర్ మన్మోహన్ సింగ్, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ మాంటెక్ సింగ్ అహ్లువాలియా, కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఎస్.జైపాల్ రెడ్డి ప్రోద్బలంతో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆదేశాలతో తాము హైదరాబాద్ మెట్రోను పీపీపీ విధానంలో రూపొందించామని ఎన్వీఎస్ రెడ్డి గుర్తు చేసుకున్నారు. కేంద్ర ప్రభుత్వ గ్రాంట్‌గా రూ.1,458 కోట్ల వైబిలిటీ గ్యాప్ ఫండింగ్‌ను కూడా డాక్టర్ మన్మోహన్ సింగ్ సారథ్యంలో అప్పటి కేంద్ర ప్రభుత్వం ఆమోదించిందన్నారు. హైదరాబాద్‌లో సఫలమైన పీపీపీ బిడ్డింగ్ విధానంపై అహ్లువాలియాకు లేఖ ద్వారా వివరించగా, దానిపై మన్మోహన్ సింగ్ స్పందిస్తూ హైదరాబాద్ మెట్రో ఒక దిక్సూచిగా నిలుస్తుందని, దేశంలో ఇతర ప్రాజెక్టులు కూడా ఈ విధానాన్ని అనుసరించాలని ఆదేశాలు జారీ చేశారన్నారు. మేటాస్ వైఫల్యంతో అనేక మంది హైదరాబాద్ మెట్రోపై విమర్శలు గుప్పించినా , ఇదే సరైన విధానమని ఇదే పద్ధతిని కొనసాగిస్తూ అంతర్జాతీయ టెండర్లకు వెళ్లాలని మద్దతు ఇచ్చారన్నారు. ఆయన ప్రోద్బలం, మద్దతు, సహాయం లేకుండా ఈ రోజు ప్రపంచ చరిత్రలో ఒక అరుదైన పీపీపీ మెట్రో ప్రాజెక్టుగా హైదరాబాద్ మెట్రో అవతరించేది కాదని, వారికి హైదరాబాదీయులు ఎప్పటికీ రుణపడి ఉంటారని ఎన్వీఎస్ రెడ్డి పేర్కొన్నారు.

క్లిష్ట సమస్యలకు ఏఐతో పరిష్కారం



అబిడ్స్: ఇచ్చి పుచ్చుకోవడంతోనే శాస్త్ర సాంకేతిక రంగాలు అభివృద్ధి చెందుతాయని హనోయి యూనివర్సిటీ ఆఫ్ ఇండస్ట్రీ వియత్నాం హెడ్ డాక్టర్ న్యూఎన్ హంసం అన్నారు. కంప్యూటర్ రంగంలో ప్రపంచ వ్యాప్తంగా నేడు కృత్రిమ మేథ (ఏఐ) ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుందన్నారు. శుక్రవారం అబిడ్స్ చాపల్ రోడ్డులోని స్టాన్లీ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు (ఆర్ఐసీఈ 2024)ను కళాశాల కార్యదర్శి కరస్పాండెంట్ కే.కృష్ణారావు, మలేషియా దేశానికి చెందిన లింకన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ మిథున్ చక్రవర్తి, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ అతుల్ నేగిలతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్‌కు నివాళులర్పించారు. అనంతరం డాక్టర్ న్యూఎన్ హంసం మాట్లాడుతూ..కంప్యూటర్ రంగంలో ఎన్నో పరిష్కారం కాని సమస్యలకు కృత్రిమ మేథ పరిష్కారం చూపుతుందన్నారు. సాంకేతికత అన్ని రంగాల అభివృద్ధికి దోహద పడుతుందన్నారు. గౌరవ అతిథులు డాక్టర్ మిథున్ చక్రవర్తి, డాక్టర్ అతుల్ నేగి మాట్లాడుతూ సమాచార భద్రత రూఢీ చేసేందుకు కృత్రిమ మేథ ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. కళాశాల కరస్పాండెంట్ కృష్ణారావు మాట్లాడుతూ తమ కళాశాలలో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా విద్యాబోధన చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా వివిధ దేశాల యూనివర్సిటీల ప్రొఫెసర్లు, కంప్యూటర్ సైన్స్, కృత్రిమ మేథపై సలహాలు, సూచనలు అందజేశారు. కార్యక్రమం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సత్యప్రసాద్, డీన్ అకడమిక్స్ డాక్టర్ వినయ్‌బాబు, డైరెక్టర్ డాక్టర్ అనురాధ, డాక్టర్ విజయేందర్ సోలంకి, డాక్టర్ శివానీ, డాక్టర్ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తల్లి, కుమారుడి దుర్మరణం

- తండ్రి, కుమార్తెకు గాయాలు
- బైక్‌ను ఢీకొన్న గుర్తుతెలియని వాహనం
- దైవదర్శనానికి వెళ్లి వస్తుండగా ఘటన



ప్రమాదానికి ముందు రాయగిరి చెరువు వద్ద కుటుంబసభ్యులు దిగిన ఫొటో

భువనగిరి : యాదగిరిగుట్ట లక్ష్మీనర్సింహస్వామి దర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు మృతిచెందగా మరో ఇద్దరికి తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. హైదరాబాద్, చంపాపేట్‌కు చెందిన బైగళ్ల జగన్ భార్య పావని(30), కుమార్తె సాత్విక, కుమారుడు ప్రణయ్(2)తో కలిసి శుక్రవారం ఉదయం బైక్‌పై యాదగిరిగుట్ట లక్ష్మీనర్సింహస్వామి దర్శనానికి వెళ్లాడు. దర్శనం అనంతరం శుక్రవారం రాత్రి యాదగిరిగుట్ట నుంచి నగరానికి తిరిగి వస్తుండగా భువనగిరి మండల పరిధిలోని హైదరాబాద్–వరంగల్ ప్రధాన రహదారిపై దీప్తి హోటల్ సమీపంలో వారు ప్రయాణిస్తున్న బైక్‌ను వెనకనుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో పావని అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు తీవ్రంగా గాయపడిన ప్రణయ్‌తో పాటు స్వల్పంగా గాయపడిన జగన్, సాత్వికను జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. ప్రణయ్ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. వారి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. జగన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

సెలవు రోజు కావడంతో..

జగన్ నగరంలోని ఓ ప్రైవేటు కళాశాలలో పనిచేస్తున్నాడు. వరుస సెలవులు రావడంతో యాదగిరిగుట్టతో పాటు స్వర్ణగిరిలో స్వామి వారి దర్శనానికి వచ్చారు. సాయంత్రం రాయగిరి చెరువు వద్ద సంతోషంగా గడిపిన వారు భోజనం చేసిన అనంతరం అక్కడి నుంచి బయలుదేరారు. ఈ క్రమంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు.

గంజాయి విక్రయిస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అరెస్ట్

సాక్షి, సిటీబ్యూరో: గంజాయి విక్రయిస్తున్న సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌ను ఎక్సైజ్ ఎస్టీఎఫ్ పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి 1.1 కిలోల గంజాయి, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం జిల్లాకు చెందిన మూడు సంతోష్ అనే వ్యక్తి తరచూ ఖమ్మం నుంచి గంజాయిని తీసుకువచ్చి భరత్ రమేష్‌బాబు అనే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌కు అప్పగించేవాడు. శుక్రవారం అతను వసంతనగర్ బస్టాప్ వద్ద శుక్రవారం భరత్ రమేష్ బాబుకు గంజాయి అప్పగిస్తుండగా పోలీసులు దాడి చేసి రమేష్ బాబును అదుపులోకి తీసుకున్నారు. సంతోష్ వారికి చిక్కకుండా తప్పించుకున్నాడు.

చనిపోయినట్లు పత్రాలు సృష్టించి...

- సంతకాలు ఫోర్జరీచేసి... వారసులను సృష్టించి..
- రూ.కోట్ల విలువైన స్థలం రిజిస్ట్రేషన్
- మాజీ ఉన్నతాధికారి ఫిర్యాదుతో ఇద్దరి అరెస్టు

ఫిలింనగర్: ఓ మాజీ ప్రభుత్వ డిప్యూటీ కార్యదర్శి, ఆయన భార్య చనిపోయినట్లు నకిలీ పత్రాలు సృష్టించి, వారి వారసులుగా సంతకాలు ఫోర్జరీ చేసి రూ. కోట్ల విలువైన స్థలాన్ని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కొత్తపేట పీఅండ్‌టీ కాలనీకి చెందిన రఘురాంశర్మ 1989లో ఓయూ కాలనీలో ప్లాట్ నెంబర్ 426/2 ను కొనుగోలు చేశాడు. డబ్బులు చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. కాగా 1992లో సక్కుబాయి సొసైటీతో సరిహద్దు విషయంలో వివాదం ఏర్పడిందని వాటిని సరిచేసి అందచేస్తామని ఓయూ కాలనీ సొసైటీ నిర్వాహకులు అతడి నుంచి సేల్ డీడ్‌ను తీసుకున్నారు. ఆ తర్వాత రఘురాం శర్మ ఈ విషయాన్ని మరిచిపోయారు. ఇటీవల ఆయన తన ప్లాటుకు సంబంధించి ఈసీ తీయించగా తన వారసురాలిగా సునీత శర్మ అనే మహిళ 2022లో దూల్‌పేటకు చెందిన శాంతికుమార్ అనే వ్యక్తి సదరు స్థలాన్ని విక్రయించినట్లు గుర్తించాడు. తనకు ఇద్దరు కుమారులే ఉండగా కుమార్తె ఎక్కడి నుంచి వచ్చిందో రఘురాంశర్మకు అర్థం కాలేదు. దీంతో ఆయన విచారణ చేపట్టగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. సొసైటీలో ఉన్న డాక్యుమెంట్ల ఆధారంగా అక్కడే పనిచేస్తున్న బోయినపల్లి సంతోష్ కుమార్, దూల్‌పేట వికాస్ శ్రీవాస్తవ అనే వ్యక్తులు స్థలాన్ని కాజేసేందుకు పథకం వేశారు. ఇందులో భాగంగా అసలు యజమానులు మరణించినట్టు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించారు. సునీత శర్మ అనే మహిళను వారి వారసురాలిగా పేర్కొంటూ ఫోర్జరీ సంతకాలు చేసి స్థలాన్ని ఆమె పేరున మార్చారు. అనంతరం ఆమెతో శాంతికుమార్‌కు స్థలాన్ని విక్రయించారు. రఘురాంశర్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఫిలింనగర్ పోలీసులు సంతోష్‌కుమార్, శ్రీవాస్తవను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సునీత శర్మ, శాంతికుమార్ పరారీలో ఉన్నట్లు తెలిపారు.

మందా జగన్నాథంకు మంత్రి పొన్నం పరామర్శ



నిమ్స్‌లో చికిత్స పొందుతున్న జగన్నాథంను పరామర్శిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

లక్డీకాపూల్ : నిమ్స్‌లో చికిత్స పొందుతున్న నాగర్ కర్నూల్ మాజీ ఎంపీ మందా జగన్నాథంను రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పరామర్శించారు. శుక్రవారం ఆస్పత్రికి వచ్చిన ఆయన ఆర్ఐసీయూలో అత్యవసర వైద్య సేవలందుకుంటున్న మందాను పరామర్శించారు. ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అనంతరం మందా ఆరోగ్య పరిస్థితిపై డైరెక్టర్ బీరప్పను అడిగి తెలుసుకున్నారు. గుండెపోటుకు గురైన జగన్నాథం మూత్రపిండాలు, ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్నట్లు తెలిపారు. నెఫ్రాలజీ విభాగం అధిపతి డాక్టర్ గంగాధర్ ఆధ్వర్యంలో ఆయా విభాగాల వైద్యులు మెరుగైన వైద్యసేవలను అందిస్తున్నట్లు ఆయన మంత్రికి వివరించారు.

యాసిడ్ తాగి వ్యాపారి ఆత్మహత్య

రహమత్‌నగర్: మద్యం మత్తులో ఓ వ్యాపారి యాసిడ్ తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి ఎర్రగడ్డ శంకర్‌లాల్‌నగర్‌కు చెందిన మహేష్(35) గప్‌చుప్ వ్యాపారం చేసేవాడు. ఇతడికి కల్లు తాగే అలవాటు ఉంది. ఈ క్రమంలో గురువారం రాత్రి కల్లుతాగి ఇంటికి వచ్చిన అతను మరుగుదొడ్లను శుభ్రంచేసే యాసిడ్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని కుటుంబ సభ్యులు గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు బోరబండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాయం చేసినందుకు.. చావగొట్టారు..

- నిమ్స్ సెక్యూరిటీ సిఫార్సుతో పోలీసుల అత్యుత్సాహం
- దొంగతనం పేరుతో విచారణ లేకుండానే థర్డ్ డిగ్రీ
- రోగి వద్దనే వస్తువు ఉందని చివరికి గ్రహించారు..
- ఎమర్జెన్సీ వార్డులో చికిత్స పొందుతున్న లింగయ్య
- నిమ్స్ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ వర్కర్ల ఆందోళన



లింగయ్యను పరామర్శిస్తున్న అవుట్‌సోర్సింగ్ వర్కర్లు

లక్డీకాపూల్ : రోగి మెడలో గొలుసు పోయిందని చెప్పగానే ముందస్తు విచారణ లేకుండానే పోలీసులు ఓ వర్కర్‌ను చితకబాదిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అసలు దొంగతనం జరక్కపోయినా సెక్యూరిటీ అధికారులు చెప్పారని పంజాగుట్ట పోలీసులు అత్యుత్సాహాన్ని ప్రదర్శించారు. ఫలితంగా నిమ్స్ ఔట్‌సోర్సింగ్ వర్కర్ నిమ్స్ ఈఎండీలో కదలలేని స్థితిలో ఉన్నాడు. నిమ్స్‌లో శుక్రవారం మధ్యాహ్నం జరిగిన సంఘటనపై అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ వర్కర్ల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శుక్రవారం దుండిగల్ ప్రాంతానికి చెందిన రవికుమార్ అనే వ్యక్తి నిమ్స్‌లో ఓపీ వైద్య సేవల నిమిత్తం వచ్చాడు. అతడిని వైద్యులు ఎంఆర్ఐకి సిఫార్సు చేశారు. ఎంఆర్ఐ పరీక్ష కోసం వచ్చిన రవికుమార్ వెంట సహాయకులు ఎవరూ లేకపోవడంతో అక్కడే విధులు నిర్వహిస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి లింగయ్య సహకారంతో ఎంఆర్ఐ చేయించుకునేందుకు లోపలికి వెళ్లాడు. ఈ సందర్భంగా తన వద్ద ఉన్న గొలుసు, సెల్‌ఫోన్‌తో సహా ఇతర వస్తువులను లింగయ్యకు అప్పగించడంతో పరీక్ష అనంతరం అతను వాటిని భద్రంగా రవికుమార్‌కు అప్పగించారు. అయితే అతను తనకు కేవలం సెల్‌ఫోన్ మాత్రమే ఇచ్చారని గొలుసు ఇవ్వలేదని ఆరోపిస్తూ సెక్యూరిటీ ఆఫీస్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో సెక్యూరిటీ సిబ్బంది ఎలాంటి ప్రాథమిక విచారణ చేయకుండానే పంజాగుట్ట పోలీసులకు సమాచారం అందించారు. దీంతో అక్కడికి వచ్చిన పంజాగుట్ట పోలీసులు లింగయ్యను స్టేషన్‌కు తీసుకెళ్లి చితకబాదారు. తాను గొలుసు తీయలేదని మొత్తుకున్నా పట్టించుకోలేదు. చివరికి పేషెంట్‌ను మరోసారి చెక్ చేసుకోవాలని చెప్పడంతో తన బ్యాగ్‌ను పరిశీలించిన రవికుమార్ గొలుసు తన వద్దనే ఉందని చెప్పడంతో లింగయ్యను వదిలేశారు. తీవ్రంగా గాయపడిన లింగయ్య నిమ్స్ ఈఎండీలో చికిత్స పొందుతున్నాడు.. ఈ విషయం తెలుసుకున్న నిమ్స్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఆందోళనకు దిగారు. అసిస్టెంట్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ చరణ్, ఆర్ఎంఓ సల్మాన్ సమస్యను పరిష్కరిస్తామని, విషయాన్ని డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళనను విరమించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

వెంగళరావునగర్: ఎర్రగడ్డ, పాటిగడ్డ, చికోటి గార్డెన్ 11 కెవీ ఫీడర్ల జనప్రియ, సంజీవయ్య పార్క్, ఎయిర్‌పోర్ట్ సబ్‌స్టేషన్ల పరిధిల్లో జరుగుతున్న మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు బీఎస్‌పురికాలనీ, సుల్తాన్‌నగర్, శంకర్‌లాల్‌నగర్, నటరాజ్‌నగర్, పాటిగడ్డ, కల్లు కాంపౌండ్, ప్రకాశ్‌నగర్, బజాజ్, చికోటీ గార్డెన్స్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని గ్రీన్‌లాండ్స్ సీబీడీ ఏడీఈ కిశోర్‌కుమార్ శుక్రవారం తెలిపారు. అదేవిధంగా ఎయిర్‌పోర్ట్ హ్యాంగర్స్, శ్రీరామ్‌నగర్ 11కెవీ ఫీడర్లు, ఎయిర్‌పోర్ట్, కళ్యాణ్‌నగర్ సబ్‌స్టేషన్ల పరిధిల్లో జరుగుతున్న మరమ్మతుల వల్ల ఐసీఐసీఐ బ్యాంక్ లైన్, భగవంత్‌పుర్, గంగా విహార్ కాలనీ, షేర్‌ఖాన్‌బస్తీ, రాజీవ్‌నగర్, శ్రీరామ్‌నగర్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ ఉండదని తెలిపారు.

ఖైరతాబాద్‌లో..

ఖైరతాబాద్: సైఫాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా నిమ్స్ సబ్‌స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎర్రమంజిల్ రోడ్డు, బాలాపురా బస్తీ, ఎర్రమంజిల్ చమాన్, పంచాయతీరాజ్ కార్యాలయం, కావేరి సాంబశివరావు రెసిడెన్సి, జీవీకె మాల్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

యువకుడిపై కత్తితో దాడి

వెంగళరావునగర్: ప్రేమిస్తున్న అమ్మాయితో చనువుగా ఉంటున్నాడని యువకుడిపై కత్తితో దాడిచేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... ప్రకాశం జిల్లాకు చెందిన సాయి ప్రవీణ్ వెస్ట్ శ్రీనివాస్‌నగర్‌లోని హాస్టల్‌లో ఉంటూ విద్యనభ్యసిస్తున్నాడు. అదే ప్రాంతంలోని బాలికల హాస్టల్‌లో ఒడిశాకు చెందిన నజీరుద్దీన్‌ఖాన్, మరో యువతి విధులు నిర్వహిస్తుంది. ఆ యువతిని నజీరుద్దీన్‌ఖాన్ ప్రేమిస్తున్నానని చెప్పగా ఆమె తిరస్కరించింది. దీంతో గత రెండు నెలలుగా ఆమెను వేధిస్తున్నాడు. కాగా ఆ యువతి సాయి ప్రవీణ్‌తో చనువుగా ఉంటుంది. దీనిని తట్టుకోలేకపోయిన నజీరుద్దీన్‌ఖాన్ గురువారం రాత్రి తన హాస్టల్ వద్ద కలవాలని సాయిప్రవీణ్‌కు ఫోన్ చేశాడు. ఆ యువకుడు అక్కడకు రాగానే కత్తితో అతనిపై దాడి చేసి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితుడిని మధురానగర్ పోలీసులు అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నగ్నంగా ఫొటోలు తీసి.. డబ్బులు వసూలు

ఫిలింనగర్: నగ్నంగా ఫొటోలు తీసి ఓ 'గే'ను బెదిరించి డబ్బులు డిమాండ్ చేసిన ఓ వ్యక్తిపై ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. షేక్‌పేట ప్రాంతంలో నివసించే ఓ వ్యక్తి స్వలింగ సంపర్కుడు (గే). ఇటీవల గ్రిండర్ అనే డేటింగ్ యాప్‌లో అతనికి ఓ గుర్తు తెలియని వ్యక్తి పరిచయం అయ్యాడు. ఈ క్రమంలో అతన్ని ఈ నెల 23న తన ఫ్లాట్ రావాలని ఆహ్వానించాడు. ఆ సమయంలో ఇద్దరూ శారీరకంగా కలుసుకునే క్రమంలో సదరు గుర్తు తెలియని వ్యక్తి అతనిని నగ్నంగా ఫొటోలు తీశాడు. తనకు రూ.15,000లు ఇవ్వాలని బాధితుడిని ఆ వ్యక్తి డిమాండ్ చేశాడు. దీంతో తన వద్ద అంత లేవని రూ.10,000లను యూపీఐ పేమెంట్ ద్వారా చెల్లించాడు. తనను బెదిరించి డబ్బులు వసూలు చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసును దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



పంజగుట్ట: గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన సంఘటన పంజగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సోమాజిగూడలోని ఫార్చ్యున్ -9 బిల్డింగ్ సమీపంలోని బస్టాప్‌లో శుక్రవారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పదంగా పడి ఉన్నాడని స్థానికులు పంజగుట్ట పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అక్కడకు చేరకున్న పోలీసులు అతడిని పరిశీలించగా అప్పటికే అతను మృతి చెందినట్లు నిర్ధారించారు. చనిపోయిన వ్యక్తి సుమారు 60 నుంచి 65 సంవత్సరాల వయస్సు ఉంటుందని, బ్లాక్ పాయింట్, ఆరెంజ్ కలర్ షర్ట్ వేసుకుని ఉన్నాడని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించినట్లు ఆచూకీ తెలిసిన వారు 8712661097 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలి

కాచిగూడ: పార్లమెంట్‌లో బీసీ బిల్లుపెట్టి చట్ట సభలలో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ సంక్షేమ సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇన్‌చార్జి నూకాలమ్మ అధ్యక్షతన జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలన్నారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకొని వెళ్లి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు.

ఏళ్లుగా ఎదురుచూపు..!

- ఖైరతాబాద్‌లో 69,776 మంది పడిగాపులు
- రేషన్‌కార్డు లేక పథకాలకు చాలా మంది దూరం
- గత ప్రభుత్వ హయాంలోనూ దరఖాస్తుల సమర్పణ
- ప్రజాపాలనలో క్యూ కట్టిన జనం

కొత్త సంవత్సరంలోనైనా 'కార్డు' వచ్చేనా..




ప్రజా పాలనలో రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకుంటున్న ప్రజలు

బంజారాహిల్స్: చాలా ఏళ్ల తర్వాత రాష్ట్రంలో కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు సంక్రాంతి నుంచి స్వీకరిస్తామని ఇటీవల ప్రభుత్వం ప్రకటించింది. దీంతో రేషన్‌కార్డుల కోసం ఎదురుచూస్తున్న వారిలో ఆశలు చిగురించాయి. కార్డు లేక చాలా కుటుంబాలు సంక్షేమ, అభివృద్ధి పథకాలకు దూరమవుతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇప్పుడు..అప్పుడు అంటూ మూడుసార్లు మీ-సేవా కేంద్రాల ద్వారా దరఖాస్తులు తీసుకోగా ఆ దరఖాస్తులు అలాగే మూలనపడ్డాయి. గత ప్రభుత్వ హయాంలో దరఖాస్తు చేసుకున్న లబ్ధి చేకూరలేదు. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన ప్రకటనతో మళ్లీ క్షేత్ర స్థాయిలో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కానుంది. పౌర సరఫరాల శాఖ ఖైరతాబాద్ సర్కిల్-7 పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజీగూడ, ఖైరతాబాద్, యూసుఫ్‌గూడ, రహమత్‌నగర్, బోరబండ, ఎర్రగడ్డ, వెంగళరావునగర్, అమీర్‌పేట, సనత్‌నగర్ డివిజన్ల పరిధిలో ఉన్న 81 రేషన్ దుకాణాల పరిధిలో గత ప్రభుత్వ హయాంలోనే 22 వేల మంది కొత్తగా తమకు అర్హత ఉందంటూ రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ప్రజాపాలన కార్యక్రమంలో ఈ డివిజన్ల పరిధిలో సుమారుగా 45 వేల మంది కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నారు. అన్ని దరఖాస్తులు కలిపి ఇప్పటికే 69,776 సర్కిల్ కార్యాలయంలో మూటగట్టి ఉన్నాయి. తాజాగా సమగ్ర కుటుంబ సర్వేలో కూడా ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో కార్డు కోసం మరో 32 వేల మంది తమకు రేషన్ కార్డు లేదంటూ దరఖాస్తులో తెలియజేశారు. ఇది కూడా కలుపుకుంటే ఈ రెండు నియోజకవర్గాల పరిధిలో సుమారుగా లక్ష వరకు రేషన్‌కార్డులు ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొంటుంది. ఇక సంక్రాంతి నుంచి కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు తీసుకునే ప్రక్రియ మొదలుకానుండగా అప్పుడు కూడా పెద్ద ఎత్తున మరోసారి దరఖాస్తులు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ప్రజావాణిలోనూ దరఖాస్తులు..

ప్రతి సోమవారం ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో రేషన్‌కార్డు కోసం పలువురు అర్జీలు ఇస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గతంలో ఉన్న ప్రగతి భవన్‌ను ప్రజాభవన్‌గా మార్చగా ప్రతి మంగళ, శుక్రవారాల్లో ఇక్కడ కూడా ప్రజావాణి నిర్వహిస్తున్నారు. ఇందులో కూడా ఈ రెండు నియోజకవర్గాల నుంచి రేషన్ కార్డు కోసం దరఖాస్తులు అందుతున్నాయి. గత ప్రజాపాలనలో నిర్దేశించిన ఫారంలో రేషన్ కార్డు కోసం వివరాలు పొందుపరిచినప్పటికీ అవి తాజాగా నిర్ణయించిన మేరకు పరిగణలోనికి తీసుకుంటారా? లేదా అన్నది చూడాల్సి ఉంది. ఆ దరఖాస్తులు అధికారుల వద్ద భద్రంగా ఉన్నాయి.

పథకాలకు దూరం..

ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలో వేలాది కుటుంబాలు రేషన్‌కార్డు లేకపోవడంతో కొన్ని పథకాలకు దూరమవుతున్నాయి. బ్యాంక్ రుణాలు, ఆరోగ్యశ్రీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 20 వేల లీటర్ల ఉచిత మంచినీరు, రూ.500 గ్యాస్ సిలిండర్, ప్రభుత్వ స్కాలర్‌షిప్పులు తదితర పథకాలకు నోచుకోలేకపోతున్నారు. ఆదాయ పరిమితిని నిర్ధారించి దరఖాస్తులు స్వీకరించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు సమాచారం. ప్రజాపాలనలో తీసుకున్న, గత ప్రభుత్వంలో దరఖాస్తు చేసుకున్న వారిని పరిగణలోనికి తీసుకుంటారా? కొత్తగా దరఖాస్తు చేసుకోవాలా? అనేది ఇంకా స్పష్టత రాలేదు. కార్డు కోసం అర్హతకు సంబంధించి ఇంకా విధి విధానాలను కూడా ఖరారు చేయలేదు.

ప్రజావాణిలో 154 అర్జీలు

లక్డీకాపూల్: భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణించిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం సెలవు దినంగా ప్రకటించినప్పటికీ మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో శుక్రవారం యథావిధిగా ప్రజావాణి కార్యక్రమం కొనసాగింది. సెలవు సమాచారం తెలియక పెద్ద సంఖ్యలో ప్రజావాణి కార్యక్రమానికి తరలివచ్చారు. దీంతో ప్రజలు ఇబ్బంది పడకుండా ఉండేందుకు ప్రజావాణి కార్యక్రమాన్ని ఎప్పటిలాగే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 154 అర్జీలు అందాయి. పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖకు సంబంధించి 59, విద్యుత్ శాఖకు 26, రెవెన్యూ శాఖకు 18, హోం శాఖకు 8, వ్యవసాయ శాఖకు 5, ఇతర శాఖలకు సంబంధించి 38 అర్జీలు వచ్చాయి. ప్రజావాణి ఇన్చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్యలు ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. వివిధ అంశాలపై సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి సమస్యలను పరిష్కరించారు.



సంతాపం తెలుపుతున్న చిన్నారెడ్డి, దివ్య తదితరులు

గొప్ప ఆర్థిక సంస్కర్తకు ఘన నివాళి
ప్రజావాణి ఇంచార్జి చిన్నారెడ్డి

పదేళ్లపాటు దేశ ప్రధాన మంత్రిగా మన్మోహన్ సింగ్ చేపట్టిన అనేక సంస్కరణలు భావితరాలకు స్ఫూర్తిగా నిలిచాయని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జీ. చిన్నారెడ్డి అన్నారు. మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో శుక్రవారం ఏర్పాటు చేసిన సంతాప కార్యక్రమంలో మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రజాపాలన నోడల్ అధికారి దివ్య దేవరాజన్‌తో కలిసి శ్రద్ధాంజలి ఘటిస్తూ.. రెండు నిమిషాలు మౌనం పాటించారు.

విస్తరిస్తున్న కృత్రిమ మేధస్సు

ఖైరతాబాద్: కృత్రిమ మేధస్సు అన్ని విభాగాలకు విస్తరిస్తోందని ప్రముఖ శాస్త్రవేత్త యు. రాజాబాబు అన్నారు. శుక్రవారం సాయంత్రం ఖైరతాబాద్ విశ్వేశ్వరయ్య భవన్‌లో ఐఈఐ తెలంగాణ స్టేట్ సెంటర్, మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సంయుక్త ఆధ్వర్యంలో ఎరోస్పేస్, రక్షణ రంగంలో కృత్రిమ మేధస్సు పరిజ్ఞాన వినియోగం అనే అంశంపై సదస్సు నిర్వహించారు. సదస్సుకు శాస్త్రవేత్త రాజాబాబు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ఎఐ ఎరోస్పేస్‌లో డిజైన్ తయారీ, ఇంధన పొదుపు, పరికరాల్లో లోపాలను గుర్తించడం, నాణ్యతను మెరుగుపర్చుకోవడంలో టెక్నాలజీ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. రక్షణ రంగంలో సరిహద్దుల భద్రత, ఆయుధాలు, మానవరహిత వాహనాల వినియోగంలో దోహదపడుతుందన్నారు. డీఆర్డీవో విశ్రాంత శాస్త్రవేత్తలు డాక్టర్ వై. శ్రీనివాసరావు, డాక్టర్ ఎం.రామ్మోహన్ బాబులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం, విశిష్టతను వివరించారు. ఈ సదస్సులో ఐఈఐ తెలంగాణ స్టేట్ సెంటర్ చైర్మన్ డాక్టర్ జి.వెంకట సుబ్బయ్య, కార్యదర్శి డాక్టర్ కె. సీతారాంబాబు, సహాయ కార్యదర్శి డాక్టర్ ఎల్. నిర్మలా దేవి, వైఎస్ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.



సదస్సు సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న శాస్త్రవేత్త రాజాబాబు తదితరులు

వైభవంగా అయ్యప్పస్వామి పల్లకీ ఊరేగింపు



ఊరేగింపులో చిన్నారుల వేషధారణ

రహమత్‌నగర్: బోరబండ ఎస్ఆర్ఆర్‌పురం సైట్-2 హరిహరపుత్ర అయ్యప్పస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన స్వామివారి పల్లకీ ఊరేగింపు గురువారం అయ్యప్ప భక్తుల కీర్తనలు, ఆటపాటలతో వైభవంగా సాగింది. ఈ సందర్భంగా చిన్నారుల దేవతామూర్తుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. మాజీ కార్పొరేటర్ వనజా లక్ష్మణ్‌గౌడ్, ఆలయ కమిటీ అధ్యక్షుడు లక్ష్మణ్‌గౌడ్, కమిటీ సభ్యులు బాలకృష్ణ, తివారి, కాశీరావు, సత్యనారాయణ, నాగరాజ్, సోమేష్, బబ్లుగౌడ్, గోవింద్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

చెత్తకుండీలో మగశిశువు



ఖైరతాబాద్: ఖైరతాబాద్‌లో రైల్వే ట్రాక్ సమీపంలో గుర్తు తెలియని వారు శిశువును వదిలివెళ్లిన సంఘటన ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. శుక్రవారం సాయంత్రం 4 గంటల ప్రాంతంలో ఖైరతాబాద్‌లో నివాసముండే పోతుల కనకరాజు మారుతీనగర్‌లోని భూలక్ష్మమ్మ దేవాలయంలో అయ్యప్ప పడి పూజకు వచ్చి పూజ అనంతరం మూత్రవిసర్జన కోసం పక్కనే ఉన్న రైల్వే ట్రాక్ వైపునకు వెళ్లాడు. అక్కడ శిశువు ఏడుపు వినిపించి చూడగా చెత్తకుండీలో మగశిశువు కనిపించింది. దీంతో వెంటనే పోలీసులకు సమాచారమిచ్చాడు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మగశిశువు పుట్టి రెండు మూడు రోజులు అయి ఉండవచ్చని, గుర్తుతెలియని వారు ట్రైన్‌లో వచ్చి పసికందును ఇక్కడ వదిలివెళ్లి ఉండవచ్చని భావిస్తున్నారు. ఈ మేరకు మగశిశువును నిలోఫర్ హాస్పిటల్‌కు తరలించి అనంతరం శిశువిహార్‌కు అప్పగించారు.

సంస్కరణల సృష్టికర్త మన్మోహన్‌సింగ్

మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ మృతి పట్ల ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ కాంగ్రెస్ నాయకులు సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం మన్మోహన్‌సింగ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు ఆయన ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చారన్నారు. అలాగే పేదల కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టిన మహనీయుడన్నారు.



మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు నివాళులర్పిస్తున్న షేక్‌పేట కాంగ్రెస్ నేతలు



మన్మోహన్ సింగ్ చిత్రపటానికి నివాళ్లు అర్పిస్తున్న సంగీత యాదవ్..



ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో..



నివాళులు అర్పిస్తున్న విజయారెడ్డి తదితరులు



నివాళులు అర్పిస్తున్న భవానిశంకర్

రెండురోజులపాటు 'ఫౌండర్స్ ఫెస్ట్'

పంజగుట్ట: నూతన సంవత్సర వేడుకలు అంటే డీజేలు, పాటలు, ఆటలే కాదు వచ్చే ఏడాది నుంచైనా ఏదైనా మంచి వ్యాపారం పెట్టుకుని జీవితంలో స్థిరపడేలా చేసేందుకు అడ్వెంచర్ పార్క్ అనే సంస్థ వారు 'ఫౌండర్స్ ఫెస్ట్ 2.0' అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఫెస్ట్ బ్రోచర్‌ను శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వాహకులు వికాస్ కాట్రగడ్డ, సానియా, ఇలియాజ్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన ఆవిష్కరణలతో పరిశ్రమలు స్థాపించిన యువ పారిశ్రామికవేత్తలు, చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే వారిని ఒక్కచోట చేర్చడమే ఈ ఫెస్ట్ ఉద్దేశమమని వారు పేర్కొన్నారు. స్టార్టప్ ప్రారంభించేముందు ఎదుర్కొనే సవాళ్లు, ప్రభుత్వతోడ్పాటు, మార్కెటింగ్ లాంటి అంశాలు ఇందులో వివరిస్తారన్నారు. గ్రామీణ నేపథ్యం ఉండి ఎక్కువగా చదువుకోకున్నా వ్యాపారంలో స్థిరపడ్డ వారిని కూడా ఈ ఫెస్ట్‌కు ఆహ్వానించినట్లు వారిని ఆదర్శంగా తీసుకుని యువత ప్రభుత్వ ఉద్యోగాలవైపు చూడకుండా కొత్త స్టార్టప్‌ను ప్రారంభించాలని వారు తెలిపారు. డిసెంబర్ 31వ తేదీ మధ్యాహ్నం నాంపల్లి, పబ్లిక్‌గార్డెన్‌లో ఫెస్ట్‌ను ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ప్రారంభిస్తారని, జనవరి 1వ తేదీ వరకు కొనసాగుతుందని కార్యక్రమానికి 200 పైగా చిన్న, పెద్ద స్టార్టప్ యువ పారిశ్రామికవేత్తలు పాల్గొంటారన్నారు. సుమారు 30 వేల మందికి పైగా యువత, విద్యార్థులతో పాటు కొత్తగా వ్యాపారం చేయాలనుకునేవారు హాజరు కానున్నట్లు, ఎంట్రీ ఉచితమన్నారు.



ఫెస్ట్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

శ్రీవారికి ప్రత్యేక పుష్పాలంకరణ




వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్డునెంబర్-14లోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలోని ధనుర్మాస మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం ఉదయం స్వామివారికి ప్రత్యేక పుష్పాలంకరణ అత్యంత వైభవంగా జరిగింది. విష్వక్సేన ఆరాధన, వాసుదేవ పుణ్యాహవచనం, ధనుర్మాస వ్రత దీక్షలు, తిరుప్పావై సేవాకాలం, తీర్థ ప్రసాద గోష్ఠి తదితర కైంకర్యాలను ఆలయ ప్రధాన అర్చకుడు అద్దంకి శశికాంతాచార్యులు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే పుష్పాభిషేకంలో కనువిందు చేసిన శ్రీనివాసుడిని దర్శించుకునేందుకు భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేశారు. ఆలయ ఆవరణలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

ముగిసిన మండల పూజా మహోత్సవం

వెంగళరావునగర్: వెంగళరావునగర్ డివిజన్ జీటీఎస్ కాలనీలోని జీటీఎస్ టెంపుల్‌లో జరుగుతున్న మండల పూజా మహోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. దీనిలో భాగంగా ఉదయం 5 గంటల నుంచే స్వామివారికి వివిధ రకాల పూజాది కార్యక్రమాలను నిర్వహించారు. దేవాలయంలో ఏర్పాటు చేసిన భజనలు, పూజలు, హోమాలతో భక్తులు పరవశించిపోయారు. సాయంత్రం జరిగిన రథోత్సవం కనుల పండువగా సాగింది. దేవాలయం నుంచి ప్రారంభమైన ఊరేగింపు కళ్యాణ్‌నగర్ చౌరస్తా వరకు కొనసాగింది. దారి పొడవునా అయ్యప్ప నామస్మరణతో మారుమోగింది. ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గుమ్మడిదల సుధాకర్ భక్తులకు కావాల్సిన ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో కొనసాగించారు.



అయ్యప్పస్వామి ఊరేగింపులో భక్తుల సందడి

నిమ్స్ ఓపీ సేవల్లో గందరగోళం..!

- మొదట సెలవు అని ప్రకటన.. ఆ తరువాత వైద్య సేవల కొనసాగింపు
- ఓపీ కోసం వచ్చిన రోగులకు ఇబ్బందులు




లక్డీకాపూల్: భారత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మరణించిన నేపథ్యంలో నిమ్స్‌లో శుక్రవారం ఉదయం ఓపీ వైద్య సేవలకు సెలవు అని అధికారులు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సమాచారం తెలియని ఓపీ సేవలు పొందేందుకు రోగులు పెద్ద సంఖ్యలో ఉదయమే ఆస్పత్రికి చేరుకున్నారు. వైద్య సేవలు లేవని చెప్పడంతో అనేక మంది రోగులు ఆందోళనకు గురయ్యారు. ఎంతో దూరం నుంచి వచ్చాం.. తమకు వైద్య సహాయం చేయడంటూ అక్కడి సిబ్బందిని వేడుకున్నారు. ప్రభుత్వం సెలవు ప్రకటించింది మేమేం చేయాలని చేతులెత్తేశారు. అయితే కొద్దిసేపటి తరువాత రోగుల ఆందోళనతో జరిగిన తప్పిదాన్ని యాజమాన్యం సరిదిద్దుకునే ప్రయత్నం చేసింది. ఈ క్రమంలో నిమ్స్‌లో వైద్య సేవలు యథాతథమంటూ హడావుడిగా మరో ప్రకటనను విడుదల చేశారు. అప్పటికే ఓపీ కార్డుల జారీ చేసే సమయం కూడా ముగిసిపోయింది. ఉదయం వచ్చిన రోగులు 9 గంటల వరకు ఎదురు చూసి.. ఇక చేసేది ఏం లేక నిరాశతో వెనుతిరగాల్సి వచ్చింది. ఈ పరిణామాల నేపథ్యంలో అనేక మంది రోగులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఈ పరిస్థితి బయటపడకుండా ఉండేందుకు నిమ్స్ సెక్యూరిటీ సిబ్బంది తీవ్రస్థాయిలో ప్రయత్నాలు కొనసాగించారు. ఒక దశలో మీడియా ప్రతినిధులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఇటీవల కాలంగా నిమ్స్‌లో భద్రత విధులు నిర్వహిస్తున్న ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బంది రోగుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారు. అందులోనూ యాజమాన్యం ఏదైనా నిర్ణయం తీసుకుందంటే.. ఇక సెక్యూరిటీ సిబ్బందిని పట్టలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో ఆస్పత్రికి వచ్చే రోగులు అనేక ఇక్కట్లకు గురవుతున్నారు. అయినా సిబ్బంది అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరించడంతో ఆస్పత్రికి వచ్చే రోగులకు నిత్యం అనేక అవస్థలను ఎదుర్కోవాల్సి వచ్చింది. ఇప్పటికైనా ఈ పరిస్థితిని చక్కదిద్దాల్సిందిగా పలువురు రోగులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఏదిఏమైనప్పటికీ కొంత సమయం తర్వాత నిమ్స్ సేవలను యథావిధిగా కొనసాగించారు.

ఆపరేషన్ రోప్ సక్సెస్ ..!

- ఫుట్‌పాత్‌ల ఆక్రమణల తొలగింపుపై స్థానికుల హర్షం
- బస్తీ, కాలనీలు అనే తేడా లేకుండా ఆక్రమణల తొలగింపులు

బంజారాహిల్స్: నగర ట్రాఫిక్ పోలీసులు నిర్వహిస్తున్న ఆపరేషన్ రోప్ సత్ఫలితాలనిస్తోంది. గడిచిన నెల రోజులుగా బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజగుట్ట, ఖైరతాబాద్, సోమాజిగూడ, అమీర్‌పేట్, వెంకటేశ్వరకాలనీ తదితర ప్రాంతాల్లో పోలీసులు నిర్వహించిన ఆక్రమణల తొలగింపు కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. తొలగింపులతో అప్పటి వరకు ఇరుకుగా ఉన్న బస్తీ, కాలనీ రోడ్లు ఇప్పుడు విశాలంగా మారి వాహనాల రాకపోకలతో పాటు పాదచారులకు అనుకూలంగా మారింది. ఈ ఆపరేషన్ రోప్ నిర్వహిస్తున్న అధికారులను పోలీసు శాఖను బస్తీవాసులు, కాలనీవాసులు అభినందిస్తున్నారు. అధికారులు సైతం చిన్నా పెద్దా అనే తేడా లేకుండా జీహెచ్ఎంసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో సమన్వయంగా ఆక్రమణలను తొలగిస్తూ ముందుకు సాగుతున్నారు. ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే నేతృత్వంలో వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్, బంజారాహిల్స్ ట్రాఫిక్ సీఐ సాయి ప్రకాశ్ గౌడ్, జూబ్లీహిల్స్ సీఐ ప్రవీణ్ కుమార్, పంజగుట్ట సీఐ బోస్ కిరణ్‌లు తమ తమ ప్రాంతాల్లో నిత్యం స్పెషల్ డ్రైవ్‌లో ప్రత్యేక పోలీసు బందోబస్తు మధ్య ఆక్రమణలను తొలగిస్తున్నారు. ఎన్బీటీనగర్, ఫిలింనగర్ బస్తీల్లో గతంలో బస్సు తిరిగే రోడ్లు ఉండేవని కానీ ఆక్రమణల వల్ల రోడ్లు మొత్తం కుంచించుకుపోయి కనీసం అంబులెన్స్ సైతం రాలేని పరిస్థితి నెలకొందని స్థానికుల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు రావడంతో ఈ ప్రాంతాల్లో నాలుగు పోలీస్ స్టేషన్ల అధికారులతో పాటు సిబ్బంది, హైడ్రా సిబ్బందితో కలిసి స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి ఆక్రమణలు తొలగించారు. మరోసారి రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తే క్రిమినల్ చర్యలు తప్పవని స్థానిక వ్యాపారులను పోలీసులు హెచ్చరించారు. జూబ్లీహిల్స్ అపోలో ఆస్పత్రి వద్ద నిత్యం అంబులెన్స్‌లు, వాహనాలు రాకపోకలు నెమ్మదిగా సాగుతుండటంతో ఇక్కడ పర్యటించిన ఉన్నతాధికారులు స్థానికంగా ఉన్న ఆక్రమణలు మొత్తం తొలగించడంతో పాటు రోడ్డుకు అడ్డంగా ఉన్న ఆటో స్టాండ్‌ను పక్కకు తప్పించమని ఆదేశాలు ఇచ్చారు. ఫిలింనగర్ ఫిలించాంబర్ వద్ద వరుసగా స్పెషల్ డ్రైవ్‌లు చేసి ఆక్రమణలు తొలగించడంతో అక్కడ పరిస్థితి అదుపులోకి వచ్చిందని అధికారులు తెలిపారు. ఎటువంటి పార్కింగ్ సదుపాయం లేకుండా వ్యాపారులు నిర్వహిస్తున్న వారికి నోటీసులు ఇస్తున్నామని సరైన పార్కింగ్ ఏర్పాటు చేసుకొని వ్యాపారాలు చేసుకోవాలని సూచిస్తున్నట్లు ఏసీపీ హరి ప్రసాద్ తెలిపారు.



ఆపరేషన్ రోప్ తర్వాత విశాలంగా కనిపిస్తున్న బంజారాహిల్స్‌లోని ఎన్బీటీనగర్ రోడ్డు



పోటా పోటీ ఛాంపియన్‌షిప్..

అగ్రస్థానంలో సెయిలర్లు గోవర్ధన్, శ్రవణ్ ..

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని హుస్సేన్ సాగర్ వేదికగా కొనసాగుతున్న తెలంగాణ రాష్ట్ర సెయిలింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో టాప్ సీడెడ్ సెయిలర్లు సత్తా చాటారు. శుక్రవారం సబ్ జూనియర్ సెయిలర్లు ఆప్టిమిస్ట్ క్లాస్ ఆఫ్ బోట్స్ విభాగంలో, జూనియర్ సెయిలర్లు ఐఎల్‌సీఏ-4 లేజర్ క్లాస్ బోట్స్‌లో పోటీ పడ్డారు. ఈ పోటీల్లో హైదరాబాద్ జిల్లాకు చెందిన గోవర్ధన్ పల్లార సబ్ జూనియర్ ఓవరాల్ ఆప్టిమిస్ట్ విభాగంలో పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో కొనసాగుతూ స్వర్ణ పతకానికి చేరువవుతున్నాడు. ఇదే విభాగంలో హైదరాబాద్‌కు చెందిన దీక్షిత కొమరవెల్లి రెండు విజయాలు సాధించి రెండో స్థానంలో కొనసాగుతోంది. బాలికల జూనియర్ ఫ్లీట్‌లో దీక్షిత రెండు రేసుల్లో గెలిచినా రెండో రోజు చివరకు మూడో స్థానానికి పడిపోయింది. మరో సెయిలర్ లాహిరి కొమరవెల్లి సబ్ జూనియర్ ఓవరాల్ ఆప్టిమిస్ట్ విభాగంలో మూడో స్థానంలో ఉంది. జూనియర్ లేజర్ ఫ్లీట్‌లో నల్గొండకు చెందిన శ్రవణ్ కత్రావత్ అగ్రస్థానంలో నిలిచాడు. టాప్ సీడ్ మాన్య రెండు విజయాలతో బాలికల జూనియర్ లేజర్ ఫ్లీట్‌పై తన పట్టును నిలుపుకుంది. నల్లగుట్ట ప్రభుత్వ పాఠశాలకు చెందిన భాను రెండో స్థానంలో, పార్సీ పాఠశాలకు చెందిన జ్ఞానేశ్వరి మూడో స్థానంలో నిలిచారు.

అర్యభట్ట గణిత ఛాలెంజ్‌లో ఆరవ్ ప్రతిభ



100 మంది విద్యార్థులకు ప్రతిష్ఠాత్మక మెరిట్ సర్టిఫికెట్

సాక్షి, సిటీబ్యూరో: తెల్లాపూర్ మంథన్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న ఆరవ్ అనే విద్యార్థి 'అర్యభట్ట గణిత ఛాలెంజ్ 2024'లో జాతీయ స్థాయిలో సత్తా చాటాడని పాఠశాల ప్రిన్సిపాల్ సుర్జీత్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో మొదటి, రెండో దశలను విజయవంతంగా పూర్తి చేసి ప్రతిష్ఠాత్మక మెరిట్ సర్టిఫికెట్ అందుకున్నాడని పేర్కొన్నారు. దేశంలోని 5,050 పాఠశాలల నుంచి 5.50 లక్షల మంది విద్యార్థులు పోటీలో పాల్గొన్నారని, 8,590 మంది రెండో దశకు అర్హత సాధించారని తెలిపారు. సీబీఎస్ఈ 18 రీజియన్స్ నుంచి 100 మంది విద్యార్థులు ఈ ప్రతిష్ఠాత్మక మెరిట్ సర్టిఫికెట్ అందుకున్నారని వివరించారు.


లీలా వినోదం..

నగరంలో ఇయర్ ఎండ్ వేడుకల సందడి షురూ..

ఎప్పటిలానే మన గ్లామర్ సిటీ నూతన సంవత్సరాన్ని ఘనంగా ఆహ్వానించడానికి సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో నగరంలో నిర్వహించనున్న ఇయర్ ఎండ్ వేడుకలకు వేదికలు రెడీ అయ్యాయి. ఇందులో లైవ్ మ్యూజిక్ సెటప్‌లు, సెలిబ్రిటీ గెస్టులు వంటి ఇతర వినోద కార్యక్రమాలకు సన్నాహాలు మొదలయ్యాయి. నగర యువత ఈ వేడుకలను ఎక్కడెక్కడ చేసుకోవాలో ఇప్పటి నుంచే ప్లాన్‌లు చేసుకోవడం మొదలుపెట్టేశారు. ఇప్పటికే పలువురు బుక్ మై షోలో పాస్‌లు రిజిష్టర్ చేసేసుకున్నారు. వీరి ఆసక్తి, ఆదరణను దృష్టిలో ఉంచుకుని ఇప్పటికే నిర్వాహకులు సైతం తమ ప్రణాళికలను సిద్ధం చేశారు. ఈ నేపథ్యంలో దీని గురించిన మరిన్ని విశేషాలు..

- సాక్షి, సిటీబ్యూరో





నగరంలో పలు కార్యక్రమాలు..

- హెచ్ఐసీసీ నోవోటెల్‌లో నూతన సంవత్సర వేడుకలకు ప్రముఖ సినీ నటి శ్రీలీల హాజరుకానున్నారు. లైవ్ బ్యాండ్, డ్యాన్స్, బాలీవుడ్ డీజే, మ్యాజిక్‌షో, కిడ్స్ జోన్, ఫ్యాషన్ షో, తదితర కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు చెబుతున్నారు. 'న్యూ ఇయర్ ఈవ్' పేరిట రాత్రి 8 గంటల నుంచి కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. ఇంగ్లిష్, తెలుగు, హిందీ పాటలు ఉంటాయి.
- ప్రిజమ్ క్లబ్ అండ్ కిచెన్‌లో రామ్ మిరియాల బ్యాండ్ అమృతం 'ది ప్రిజమ్ సర్కస్ 4.0' కార్యక్రమన్ని ఏర్పాటు చేస్తున్నారు.
- ఎల్‌బి నగర్ ఇండోర్ స్టేడియంలో యూబీ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యాండ్ కాప్రిసియోని ప్రత్యక్షంగా ప్రదర్శిస్తుంది. సంగీతం, ఎనర్జీ, ఉత్సాహంతో కూడిన విద్యుత్ వెలుగుల్లో నూతన సంవత్సరాన్ని స్వాగతించడానికి సిద్ధంగా ఉండండి. చార్ట్-టాపింగ్ హిట్‌లు, హై-ఎనర్జీ పెర్ఫార్మెన్స్‌ల మిక్సింగ్ ఉంటుందని నిర్వాహకులు చెబుతున్నారు.
- బోల్డర్ హిల్స్‌లోని ప్రిజమ్ ఔట్ డోర్స్‌లో ప్రముఖ సింగర్స్ కార్తీక్, సునీత హాజరవుతున్నారు.
- హైటెక్స్ ఎరీనాలో హైదరాబాద్ బిగ్గెస్ట్ న్యూ ఇయర్ బాష్ 2025 (ఓపెన్ ఎయిర్) కార్యక్రమానికి నేహ ఆర్ గుప్తా ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నారు.





- ఇప్పటికే నగరానికి చేరుకున్న బాలీవుడ్ డీజేలు..
- నోవోటెల్‌లో స్టెప్పులేయనున్న గ్లామర్ స్టార్ శ్రీలీల..
- సందడి చేయనున్న సునీత, రామ్ మిర్యాల, కార్తీక్ వంటి సింగర్లు..
- బుకింగ్స్ ప్రారంభించిన ఈవెంట్ ఆర్గనైజర్లు..

ఇప్పటికే నగరంలో నూతన సంవత్సరానికి స్వాగతం పలికేందుకు, ప్రస్తుత సంవత్సరానికి వీడ్కోలు పలికేందుకు యువత సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా కొన్ని థీమ్స్‌ను సైతం సోషల్ మీడియా వేదికగా ప్రచారం చేస్తున్నారు పలువురు ఈవెంట్ ఆర్గనైజర్లు. ముఖ్యంగా సినీ తారలు, ప్రముఖ సింగర్స్, డ్యాన్సర్స్.. ఎవరు ఎక్కడ హాజరవుతున్నారనే సమాచారాన్ని సామాజిక మాధ్యమాల వేదికగా జోరుగా ప్రచారం జరుగుతోంది. ప్రత్యేకించి ఢిల్లీ, ముంబయి తదితర ప్రాంతాల నుంచి నగరానికి చేరుకున్న డీజే స్పెషలిస్టులు, లైవ్ మ్యూజిక్ స్పెషలిస్టులు వారి ప్రోమోలను వదులుతున్నారు. తెలుగు, ఇంగ్లిష్, హిందీ భాషలో లైవ్ బ్యాండ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. అయితే.. ఈ ఈవెంట్లకు బుకింగ్స్ ప్రారంభం కావడమే కాదు కొన్నింటికి ఇప్పటికే సోల్డ్ ఔట్ బోర్డులు పెట్టడం విశేషం.



స్టార్ గ్లామర్ ఈవెంట్స్..

వేడుకలు ఏవైనా సరే... అందులో గ్లామర్ ఉంటేనే వినోదమైనా, ఉల్లాసమైనా. ఈ నేపథ్యంలో ఇయర్ ఎండ్ వేడుకల నిర్వహణలో సెలిబ్రిటీలను భాగం చేస్తున్నారు నిర్వాహకులు. సాధారణంగా ఇటువంటి ఈవెంట్స్‌లో సినీతారలకు ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఇందులో భాగంగానే నగరంలో పలు వేదికల్లో గ్రాండ్‌గా నిర్వహించే లైవ్‌మ్యూజిక్ కాన్సర్ట్‌లు, పబ్, రిసార్ట్, ఓపెన్ ఏరియా ఈవెంట్లలో పలువురు సినీతారలు, సింగర్లు తళుక్కున మెరవనున్నారు. ముఖ్యంగా ఈ ఏడాది న్యూ ఇయర్ సెలబ్రేషన్స్‌లో ప్రముఖ నటి శ్రీలీల, గాయకులు సునీత, రాకింగ్ సింగర్ రామ్ మిరియాల, తదితర టాలీవుడ్, బాలీవుడ్ సింగర్స్ నగరంలో ప్రేక్షకులకు తమ గాత్రంతో అలరించనున్నారు.

డీజేల సందడి..

నూతన సంవత్సర వేడుకలకు సినిమా గ్లామర్ తోడైతే ఆ కిక్కే వేరబ్బా అంటోంది నగర యువత. తమకు నచ్చిన భాష, హీరోల సినిమా పాటలు ఎక్కడ అందుబాటులో ఉన్నాయి అంటూ సామాజిక మాధ్యమాల్లో శోధిస్తున్నారు. తెలుగు లైవ్ కాన్సర్ట్స్‌కు ఎక్కువ మంది మొగ్గుచూపుతుండగా, ఉత్తర భారతం నుంచి వచ్చి ఇక్కడ నివాసం ఉంటున్నవారు మాత్రం హిందీ, ఇంగ్లిష్‌కార్యక్రమాలను కోరుకుంటున్నారు. దీంతో ఈవెంట్ నిర్వాహకులు సైతం అందుకు అనుగుణంగానే కార్యక్రమాలు ఏర్పాటు చేస్తూ.. జాగ్రత్తలు తీసుకుంటున్నారు. దీంతో నిపుణులైన డీజే ఆర్టిస్టులకు డిమాండ్ నెలకొంది. సాయంత్రం 8 గంటల నుంచి కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయని నిర్వాహకులు ప్రచారం చేస్తున్నారు.



'నై' వేడుకల్లో శ్రీలీల...

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో నిర్వహించనున్న ఇయర్ ఎండ్ వేడుకలకు అప్పుడే గ్లామర్ వచ్చేసింది. ఆల్వేస్ ఈవెంట్స్, ఎస్‌వీ ప్రొడక్షన్స్ ఆధ్వర్యంలో ఈ నెల 31న నగరంలోని నోవోటెల్ వేదికగా నిర్వహించనున్న నై (ఎన్‌వైఈ) 2025 వేడుకల్లో టాలీవుడ్ గ్లామర్ క్వీన్ శ్రీలీల తన స్టెప్పులతో అలరించనున్నారు. ఈ ఈవెంట్ పోస్టర్‌ను శుక్రవారం నోవాటెల్ వేదికగా ఆవిష్కరించారు. ఇందులో ప్రముఖ యాంకర్ రవి, నటి సౌమ్య జాను పాల్గొని సందడి చేశారు. నిర్వాహకులు సుమంత్ మాట్లాడుతూ.. బాలీవుడ్ లైవ్ మ్యూజిక్, కలర్‌ఫుల్ వేదికతో పాటు టాప్ మోడల్స్‌తో నిర్వహిస్తున్న ఫ్యాషన్ షోతో నై (ఎన్‌వైఈ) 2025 వేదిక కానుందన్నారు. నిరావల్ లైవ్ బ్యాండ్ నగరానికి ప్రత్యేకంగా రానుందని, వేడుకల్లో ప్రముఖ సినీతార శ్రీలీల పాల్గొని అలరించనున్నారని తెలిపారు. ప్రత్యేకమైన ఎస్ఎఫ్ఎక్స్ ప్రదర్శనలతో, న్యూ ఇయర్ కౌంట్ డౌన్‌తో పాటు విభిన్న రుచుల ఆహారం, ప్రీమియం డ్రింక్స్, టాటూ, ఫొటో బూత్‌లు అందుబాటులో ఉంటాయని సహ నిర్వాహకులు వినోద్ పేర్కొన్నారు. అంతేకాకుండా పలువురు సెలిబ్రిటీలు ఇందులో భాగం కానున్నారని అన్నారు.

లక్ష్యంపై.. శాన్వి గురి

అంతర్జాతీయ స్థాయికి ఎదిగేలా సాధన





- తొమ్మిదేళ్ల వయసులోనే అండర్ 13 మెయిన్‌లో డ్రాకు అర్హత
- ప్రతి రోజూ 9 గంటల పాటు సాధన చేస్తూ..
- పూర్తిగా బ్యాడ్మింటన్‌కే పరిమితం

క్రీడలపై మక్కువ ఉండి నిత్యం సాధన చేస్తే ఎంతటి లక్ష్యాన్ని అయినా చేరుకోవచ్చని నిరుపించింది.. ఈ చిచ్చరపిడుగు.. తొమ్మిది సంవత్సరాల వయసులోనే తన కంటే నాలుగేళ్ల పెద్ద వాళ్లతో తలపడి గెలుపొందింది. పిట్ట కొంచెం.. కూత ఘనం అన్న.. సామెతను నిజం చేస్తూ.. అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తూ ఆటల్లో భేరా అనిపించుకుంటుంది. ఆమె నగరంలోని మణికొండకు చెందిన క్రీడాకారిణి లట్టాల శాన్వి. అతి చిన్న వయసులోనే బ్యాడ్మింటన్ ఆటలో అద్భుతాలను సృష్టిస్తోంది. చిన్నప్పటి నుంచే తల్లిదండ్రులు మణికొండలోని మ్యాచ్‌పాయింట్ బ్యాడ్మింటన్ అకాడమీలో శిక్షణ ఇప్పిస్తున్నారు.

- గన్‌ఫౌండ్రీ

ప్రస్తుతం నాల్గో తరగతి చదువుతున్న శాన్వి ఆటపై పూర్తిగా ఫోకస్ పెట్టేందుకు విద్యను సైతం మానేసింది. ప్రతి రోజు ఉదయం 5 గంటల నుండి సాయంత్రం వరకూ స్టేడియంలోనే ప్రాక్టీస్ చేస్తూ.. పూర్తిగా బాడ్మింటన్‌కే పరిమితమైంది. శాన్వి ఇప్పటి వరకూ రాష్ట్ర, జాతీయ స్థాయి టోర్నీలలో పాల్గొని విశేషంగా రాణించింది. ఇటీవల అస్సాంలో జరిగినటువంటి అండర్-13 అంతర్జాతీయ బ్యాడ్మింటన్ ర్యాంకింగ్ టోర్నమెంట్‌లో మెయిన్ డ్రాకు అర్హత పొంది సంచలనం సృష్టించింది. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి టోర్నమెంట్ లోనూ మెయిన్ డ్రాకు అర్హత పొందింది. అంతేకాకుండా జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలలో అనేక బంగారు పతకాలను సాధించింది.

ఒలింపిక్స్ లక్ష్యంగా..

ఒలింపిక్స్‌లో భారతదేశం తరఫున బంగారు పతకం సాధించడమే లక్ష్యంగా సాధన చేస్తున్నాను. ప్రపంచంలోనే అత్యుత్తమ బ్యాడ్మింటన్ క్రీడాకారిణిగా నిలవడమే నా కోరిక. పాఠశాలకు వెళ్లకపోవడం కొంత బాధ అయినప్పటికీ జీవిత లక్ష్యాన్ని చేరుకోవడంలో నిజమైన సంతృప్తి కలుగుతుంది. గతంలో స్కూల్‌కు వెళ్లడం కోసం ఉదయాన్నే లేవాలంటే కాస్త ఇబ్బందిగా అనిపించేది. కానీ ప్రస్తుతం మాత్రం ఉదయాన్నే 5 గంటలకు లేచి బ్యాడ్మింటన్ సాధన చేస్తున్నా. బాడ్మింటన్ మీద నాకు ఉన్నటువంటి ఇష్టమే 5 గంటలకు నిద్ర లేచేలా చేస్తుంది. నేను పూర్తిగా బ్యాడ్మింటన్ క్రీడను ఆస్వాదిస్తున్నాను.

- శాన్వీ లట్టాల, బ్యాడ్మింటన్ క్రీడాకారిణి



ఉత్తమ క్రీడాకారులను తయారు చేయడమే లక్ష్యం



బ్యాడ్మింటన్‌లో ఉత్తమమైన క్రీడాకారులను తయారు చేయడమే మా లక్ష్యం. మ్యాచ్‌పాయింట్ బాడ్మింటన్ అకాడమీ నుంచి ఒలింపిక్స్‌లో దేశం తరఫున తమ శిష్యులు ఆడడమే నా కోరిక. ఆ కోరికను నా శిష్యుల ద్వారా నెరవేర్చుకుంటున్నా. బాడ్మింటన్‌పై చిన్నప్పటి నుంచే మక్కువ ఉండాలి. ఒలింపిక్స్ చాలా క్లిష్టమైన విషయం కావడంతో నిత్యం సాధన చేయాలి.

- ముప్పాల వేణు, బ్యాడ్మింటన్ కోచ్

ఫ్యాషన్ గ్లామర్

ఆకట్టుకున్న నటి కామాక్షి భాస్కర్ల, సుభశ్రీ







మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో మూడు రోజులపాటు నిర్వహించనున్న హైలైఫ్ ఎగ్జిబిషన్‌ను నటి కామాక్షి భాస్కర్ల, సుభశ్రీ రాయగురులు నిర్వాహకుడు డొమినిక్‌తో కలిసి శుక్రవారం ప్రారంభించారు. వివాహాది శుభ కార్యాలు, పండుగలకు దాదాపు 350 మంది ప్రముఖ డిజైనర్లు రూపొందించిన వస్త్రాభరణాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఫ్యాషన్‌వేర్‌లతో పాటు గృహాలంకరణ ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎగ్జిబిషన్‌ను నగరవాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నటి స్రవంతి చోకరపులతో పలువురు మోడల్స్ పాల్గొన్నారు. - మాదాపూర్

సాక్షి రియల్టీ
శనివారం
28-12-2024







'మా వాడికేం తెలుసు, వాడింకా చిన్నపిల్లోడే..'
'పెద్దవాళ్ల నిర్ణయాల్లో చిన్నోడివి తలదూర్చటం ఎందుకు..?'
'నీకింకా నిర్ణయం తీసుకునేంత వయస్సు రాలేదులే..'

..పిల్లల విషయంలో మన పెద్దల అభిప్రాయాలివీ. కానీ, నేటి జనరేషన్ పేరెంట్స్ ఇలాంటి మాటలకు టాటా చెప్పేశారు. ఎందుకంటే ఇప్పుడు ప్రాపర్టీ ఎంపికలో పిల్లలే అంతిమ నిర్ణేతలయ్యారు. పిల్లల అవసరాలు, అభిరుచులకు తగ్గట్టుగా ఉన్న ప్రాజెక్ట్లకే తల్లిదండ్రులు జై కొడుతున్నారు. దీంతో ప్రాజెక్ట్ ఎలివేషన్ నుంచి వసతుల వరకూ పిల్లలను ఆకట్టుకునే ప్రత్యేక థీమ్లు, క్లబ్హౌస్లతో నిర్మాణ సంస్థలు ప్రాజెక్ట్లను చేపడుతున్నాయి. ఇల్లంటే నాలుగు గోడలు కాదు.. పిల్లల నుంచి పెద్దల వరకూ ప్రతి ఒక్కరి అవసరాలు, అభిరుచులకు తగ్గట్టుగా ఉండాలి. అందుకే మూస ధోరణిలో నిర్మించే ప్రాజెక్ట్లను కొనుగోలుదారులు ఆదరించడం లేదు. ఇది వరకు అంతగా పట్టించుకోని చిన్నారుల అవసరాలే ఇప్పుడు గృహ కొనుగోలు నిర్ణయాలను చాలా వరకు ప్రభావితం చేస్తున్నాయి. విదేశీ తరహాలో నిర్మాణం, ఆధునిక వసతులు ఉండే ప్రాజెక్ట్లలో కొనుగోళ్లకే మొగ్గు చూపిస్తున్నారు. అవును.. సొంతిల్లు కొంటున్నామంటే ఇప్పుడు పిల్లల అభిరుచులు, అవసరాలు తీరడం కూడా ముఖ్యమే.

– సాక్షి, సిటీబ్యూరో

పిల్లలూ.. కీలకమే..

ఇంటి కొనుగోలులో వారి ఇష్టాలు, అవసరాలకు ప్రాధాన్యం

- డిస్నీ, జంగిల్ వంటి థీమ్లతో నివాస సముదాయాలు
- పిల్లల అభిరుచులను తీర్చే క్లబ్హౌస్లకు పేరెంట్స్ ఆసక్తి

వైద్యం, వినోద సౌకర్యాలు చేరువలో ఉండాల్సిందే..

పెద్దలు వృత్తి, ఉద్యోగ రీత్యా అధిక సమయం బయటే గడుపుతారు. వాస్తవానికి ఇంట్లో ఎక్కువ సమయం గడిపేది చిన్నారులే. పాఠశాల సమయం మినహా మిగతా సమయం ఇంట్లోనే ఉంటారు. ఇంట్లో, పరిసరాల్లో వీరి అవసరాలు తీరే వసతులు ఏ మేరకు ఉంటున్నాయనేది కీలకం. సౌకర్యాలంటే ప్రత్యేకంగా వారికంటూ ఒక గది, అందులో నచ్చేట్లుగా ఉండే రంగులు, ఇంటీరియర్ మాత్రమే కాదన్నది నేటితరం పిల్లల భావన. బయట పరిసరాలు వీరిని ఎక్కువ ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి కేవలం బాల్యం వరకే కాదు పెరిగి పెద్దయ్యే వరకూ చుట్టుపక్కల తగిన వసతులు ఉండేలా చూడటం పెద్దల బాధ్యత. కొత్తగా పెళ్లయిన దంపతులు సైతం ఇల్లు కొనేటప్పుడు పిల్లల గురించి పరిగణలోకి తీసుకోవడం మర్చిపోవద్దు.

కిడ్స్ థీమ్లతో ప్రాజెక్ట్లు..

నివాస సముదాయంలోని క్లబ్హౌస్లు కమ్యూనిటీ లివింగ్ను ప్రోత్సహించడంతో పాటు పిల్లలకు మంచి అలవాట్లు పెంపొందేందుకు సహాయపడతాయి. దీంతో నిర్మాణ సంస్థలు డిస్నీ, హ్యారీపోర్టర్ వంటి కిడ్స్ థీమ్లతో కూడిన ప్రాజెక్ట్లను నిర్మిస్తున్నాయి. వీటిల్లో చిన్న పిల్లలు ఆడుకునే క్రమంలో కిందపడిపోయినా గాయాలు కాకుండా మృదువైన ఆట పరికరాలు, ఇంటరాక్టివ్ అండ్ ఎడ్యుకేషనల్ టాయ్స్ ప్లే ఏరియాలు, ఆర్ట్, డ్యాన్స్ ఇతరత్రా హాబీల శిక్షణ తరగతుల కోసం యాక్టివిటీ జోన్లు, చిట్టడవి, శాండ్ పిట్స్, ట్రీ బెంచ్, మినీ సాకర్ ఫీల్డ్, యాంఫీ థియేటర్ వంటి ఇతరత్రా వసతుల జోన్లను కల్పిస్తున్నారు.

మంచి కమ్యూనిటీ, ప్లేగ్రౌండ్

ఒకవైపు విశాలమైన ఆట స్థలాలు, వినూత్నమైన ఎలివేషన్లతో పిల్లలను ఆకట్టుకుంటే.. మరోవైపు ప్రాజెక్ట్లోనే క్రచ్, ప్లేగ్రౌండ్, మంచి కమ్యూనిటీ వంటి వాటితో తల్లిదండ్రులనూ కట్టిపడేస్తున్నారు బిల్డర్లు. అనారోగ్య సమస్యలు తలెత్తితే ఆస్పత్రికి వెళ్లేందుకు ఎక్కువ దూరం ప్రయాణం చేయడం, వర్షం కురుస్తున్నప్పుడు ఇంటి నుంచి కిలో మీటర్ల దూరం ఉండే స్కూల్కు పిల్లలను పంపించేందుకు తల్లిదండ్రులు ఏమాత్రం ఇష్టపడట్లేదు. అందుకే అపార్ట్మెంట్ కొనుగోలు చేసేముందు పిల్లల అవసరాలు, ఆరోగ్యాలకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రాజెక్ట్లోనే స్విమ్మింగ్ పూల్, జిమ్ వంటి వసతులే కాదు, ఇందులోనే కమ్యూనిటీ మంచి సర్కిల్, ప్లేగ్రౌండ్ వంటివి ఉంటేనే కొనేందుకు ముందు కొస్తున్నారు. పార్కులు, థియేటర్లు, మాల్స్, రెస్టారెంట్లు ఉన్నాయో లేవో కూడా కొనుగోలుదారులు చూస్తున్నారని నిర్మాణదారులు అంటున్నారు.

ధరలపై ప్రభావం..

వసతులన్నీ ఉంటే ఆ ప్రాంతం అభివృద్ధి చెంది ఉంటుంది. సహజంగానే దీని ప్రభావం ధరలపై ఉంటుంది. పేరున్న పాఠశాలలు, ఆస్పత్రులు, ప్రజా రవాణా, మాల్స్ ఉన్నట్లయితే ఎక్కువ మంది ఆ చుట్టుపక్కల నివాసం ఉండేందుకు ఆసక్తి చూపుతుంటారు. దీంతో కొత్త నిర్మాణాలకు డిమాండ్ ఎక్కువగానే ఉంటుంది. ఇవన్నీ చూపెట్టి ఆయా ప్రాంతంలో ఉన్న ధరల కంటే ఎక్కువ ధరకు విక్రయించేవారు ఉంటారు. నాణ్యమైన నిర్మాణం, గడువులోగా పూర్తి చేసే నిర్మాణదారులనే అంతిమంగా ఎంపిక చేసుకోవాలి.





ప్రస్తుతం మార్కెట్లో చాలా ప్రాజెక్ట్లు పిల్లల వసతులపై దృష్టిపెడుతున్నాయి. వారు ఆటలాడుకునేందుకు ప్రత్యేకంగా స్థలం కేటాయిస్తున్నాయి. తక్కువ లోతులో ఈత కొలనులు నిర్మిస్తున్నాయి. పెద్దలకే కాదు పిల్లల కోసం వేర్వేరు ప్లే కోర్టులను తమ ప్రాజెక్ట్లో చేరుస్తున్నాయి. తక్కువ స్థలంలో నిర్మాణాలు చేపడుతూ ఖాళీ స్థలం ఎక్కువ ఉండేలా పచ్చదనానికి పెద్దపీట వేస్తున్నాయి. కొంతమంది తల్లిదండ్రులు పిల్లల కోసం ప్రత్యేకంగా ట్యూషన్లు చెప్పిస్తుంటారు. ఈ దృష్ట్యా కొన్ని నిర్మాణ సంస్థలు అపార్ట్మెంట్లలోనే ట్యూషన్ గదులను నిర్మిస్తున్నాయి. వ్యాపకాలు, అభిరుచులకు పదును పెట్టేలా చిన్నారుల కోసం ప్రత్యేకంగా క్లబ్హౌస్లను నిర్మించడం నేటి పోకడ. ఉద్యోగాలకు వెళ్లిన తల్లిదండ్రుల కంటే పిల్లలు పాఠశాల నుంచి ముందుగానే ఇంటికి చేరుకుంటారు. అమ్మానాన్న వచ్చే వరకు వీరు క్లబ్హౌస్లో ఇతర నైపుణ్యాలను పెంపొందించుకునే కార్యక్రమాల్లో పాల్గొనే సదుపాయం కల్పిస్తున్నాయి.

అభిరుచుల కోసం క్లబ్హౌస్లు..



నేటి పేరెంట్స్ నిర్ణయంలో మార్పులు

మెట్రో నగరాల్లో భార్యభర్తలిద్దరూ ఉద్యోగాలు చేయక తప్పని పరిస్థితి. దీంతో పిల్లలకు సమయం కేటాయించలేని పరిస్థితి. అందుకే కనీసం నివాసం ఉండే ప్రాజెక్ట్లోనైనా పిల్లల అవసరాలు, అభిరుచులను తీర్చేవిధంగా ఉండాలని భావిస్తున్నారు. చిన్నారులకు భద్రమైన, ఆధునిక వసతులను అందించే ప్రాజెక్ట్లను కోరుకుంటున్నారు.



– వంశీకృష్ణ, డైరెక్టర్, ప్రైమార్క్ డెవలపర్స్

త్వరలో.. టీజీ రెరా యాప్..

TG RERA
TELANGANA REAL ESTATE REGULATORY AUTHORITY

దీని ద్వారానే రియల్ ఎస్టేట్ ప్రాజెక్ట్లు, ఏజెంట్ల రిజిస్ట్రేషన్

- కొనుగోలుదారులకు మరింత సౌలభ్యం, పారదర్శకత
- ఇప్పటివరకు టీజీ రెరాలో 9,129 ప్రాజెక్ట్ల రిజిస్ట్రేషన్
- అత్యధికంగా రంగారెడ్డిలో 2,954. అత్యల్పంగా ఆసిఫాబాద్లో 2 ప్రాజెక్ట్లు

రియల్ ఎస్టేట్ రంగంలో పారదర్శకత, జవాబుదారీతనంతో పాటు కొనుగోలుదారుల ప్రయోజనాలను రక్షించేందుకు ఉద్దేశించినదే తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ(టీజీ రెరా). సాంకేతికత వినియోగం పెరిగిన ఈ రోజుల్లో టీజీ రెరా సేవలకు కూడా ఆధునికత చేర్చాలని నిర్ణయించారు. రియల్ ఎస్టేట్ ప్రాజెక్ట్లు, ఏజెంట్ల రిజిస్ట్రేషన్, ఫిర్యాదుల ట్రాకింగ్, రియల్ టైం నోటిఫికేషన్ల క్రమబద్ధీకరణ కోసం టీజీ రెరా యాప్ను తీసుకురానున్నట్లు టీజీ రెరా చైర్మన్ డాక్టర్ ఎన్.సత్యనారాయణ 'సాక్షి రియల్టీ'తో చెప్పారు. అలాగే ప్రాజెక్ట్లు, ఏజెంట్ల రిజిస్ట్రేషన్ల తక్షణ ధ్రువీకరణ కోసం క్యూఆర్ కోడ్ సాంకేతికతనూ అందుబాటులోకి రానుంది. ప్రస్తుతం టీజీ రెరా వెబ్సైట్లో రిజిస్ట్రేషన్లు, ఫిర్యాదులను సమర్థవంతంగా నిర్వహిస్తున్నప్పటికీ.. వినియోగదారులకు మరింత సౌలభ్యాన్ని అందించడమే దీన్ని ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు. 'సాక్షి రియల్టీ' ఇంటర్వ్యూ పూర్తి వివరాలివీ.. – సాక్షి, సిటీబ్యూరో

రెరా ఉల్లంఘనదారులపై రూ.40.95 కోట్ల జరిమానాలు విధింపు

'సాక్షి రియల్టీ'తో టీజీ రెరా చైర్మన్ డాక్టర్ ఎన్.సత్యనారాయణ



సాక్షి రియల్టీ: నివాస సముదాయాలు మాత్రమే రెరాలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలా? వాణిజ్య భవనాలకు రెరా రిజిస్ట్రేషన్ అవసరం లేదా?

జవాబు: నివాస, వాణిజ్య ఏ భవనమైనా సరే రెరాలో రిజిస్ట్రేషన్ చేయాల్సిందే. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, డీటీసీపీ, యూడీఏ, టీజీఐఐసీ, మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీ నుంచి అనుమతి పొందిన 500 చ.మీ. లేదా 8 యూనిట్ల కంటే ఎక్కువ ప్లాట్లు ఉన్న ప్రతీ ప్రాజెక్ట్ కూడా ఆర్ఈ(ఆర్అండ్డీ) చట్టంలోని సెక్షన్–3 కింద రిజిస్ట్రేషన్ చేయాలి.

సాక్షి రియల్టీ: రెరాలో రిజిస్ట్రేషన్ చేయకుండానే విక్రయాలు చేస్తే ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

జవాబు: బ్రోచర్లు, కరపత్రాలతో సహా అన్ని ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాలో ప్రచురించే ప్రకటనలు, ప్రాజెక్ట్లకు తప్పనిసరిగా రెరా రిజిస్ట్రేషన్ నంబరు ఉండాలి. దాన్ని ప్రదర్శించాలి. నిబంధనలు ఉల్లంఘిస్తే తొలుత షోకాజ్ నోటీసు జారీ చేస్తారు. 15 రోజుల వ్యవధిలో ప్రత్యుత్తరాన్ని సమర్పించాలి. లేని పక్షంలో ప్రాజెక్ట్ వ్యయంలో 10 శాతం వరకు జరిమానా విధిస్తారు. ఉల్లంఘనలు పునరావృతమైతే సంబంధిత ప్రమోటర్కు మూడేళ్ల వరకు జైలు శిక్ష లేదా జరిమానా విధిస్తారు.

సాక్షి రియల్టీ: ఇల్లు కొనేందుకు కొనుగోలుదారులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

జవాబు: ప్రాపర్టీ కొనుగోలు చేసే ముందు కొనుగోలుదారులు సంబంధిత ప్రాజెక్ట్కు జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, డీటీసీపీ, యూడీఏ, టీజీఐఐసీ వంటి స్థానిక సంస్థల నుంచి నిర్మాణ అనుమతులు ఉన్నాయా? లేదా అని తెలుసుకోవడంతో పాటు రెరాలో రిజిస్ట్రేషన్ అయ్యిందో లేదో నిర్ధారించుకోవాలి. రెరా వెబ్సైట్ ద్వారా ప్రాజెక్ట్ రెరా రిజిస్ట్రేషన్ నంబర్ను పరిశీలించవచ్చు. అలాగే లీగల్ టైటిల్, ఆమోదిత లేఔట్ ప్లాన్, ప్రాజెక్ట్ పేరు, వసతులు, ప్రాంతం వివరాలు, చట్టపరమైన టైటిల్ డీడ్స్, ప్రాజెక్ట్ నిర్మాణ గడువు వంటి అన్ని రకాల వివరాలను పరిశీలించవచ్చు.

సాక్షి రియల్టీ: బాధితులు రెరాకు ఎలా ఫిర్యాదు చేయాలి?

జవాబు: రెరా రిజిస్ట్రేషన్ లేకుండా, ప్రీలాంచ్, బైబ్యాంక్ స్కీమ్ల పేరిట ప్రచారం చేసినా, విక్రయాలు చేసినా టీజీ రెరాకు ఫిర్యాదు చేయవచ్చు. 040–29394972 లేదా 9000006301 వాట్సాప్ నంబరులో ఫిర్యాదు చేయవచ్చు. అలాగే https://rera.telangana.gov.in/complaint వెబ్సైట్ నుంచి గానీ rera-maud@telangana.gov.in or secy-rera-maud@telangana.gov.inలకు ఈ–మెయిల్స్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చు. అంతేకాకుండా అగ్రిమెంట్ ఆఫ్ సేల్ లేదా సేల్డీడ్లో పేర్కొన్న గడువులోగా ప్రాజెక్ట్ను పూర్తి చేయకపోయినా, అడ్వాన్స్గా 10 శాతం కంటే ఎక్కువ సొమ్ము వసూలు చేసినా రెరాకు ఫిర్యాదు చేయవచ్చు.

సాక్షి రియల్టీ: ఇప్పటి వరకు రెరాలో ఎన్ని ప్రాజెక్ట్లు రిజిస్ట్రేషన్ అయ్యాయి?

జవాబు: ఇప్పటివరకు టీజీ రెరాలో 9,129 ప్రాజెక్ట్లు రెరాలో రిజిస్ట్రేషన్ అయ్యాయి. వీటిలో అత్యధికంగా రంగారెడ్డిలో 2,954, అత్యల్పంగా ఆసిఫాబాద్లో 2 ప్రాజెక్ట్లు రిజిస్టర్ అయ్యాయి. జిల్లాల వారీగా చూస్తే.. మేడ్చల్– మల్కాజ్గిరి 2,199, సంగారెడ్డి 986, హైదరాబాద్ 516, వరంగల్ అర్బన్ 414, యాదాద్రి భువనగిరి 349, మహబూబ్నగర్ 257, ఖమ్మం 280, నిజామాబాద్ 158, కరీంనగర్ 144, సిద్దిపేట 101, వికారాబాద్ 101, సూర్యాపేట 98, నల్లగొండ 87, నాగర్కర్నూల్ 66, మెదక్ 61, కామారెడ్డి 53, మంచిర్యాల 37, భద్రాది కొత్తగూడెం 34, జగిత్యాల 32, ఆదిలాబాద్ 31, మహబూబాబాద్ 27, పెద్దపల్లి 26, జనగాం 24, వనపర్తి 21, రాజన్న సిరిసిల్ల 19, జోగులాంబ గద్వాల్ 17, నిర్మల్ 12, వరంగల్ రూరల్ 12, జయశంకర్ 11 ప్రాజెక్ట్లు రిజిస్టరయ్యాయి.

సాక్షి రియల్టీ: ఇప్పటి వరకు రెరా ఎంత జరిమానా విధించింది? ఎంత వసూలైంది?

జవాబు: ఇప్పటి వరకు రెరా నిబంధనల ఉల్లంఘనదారులపై రూ.40.95 కోట్ల జరిమానాలు విధించాం. ఇందులో రూ.15.64 కోట్లు వసూలు చేశాం.

సాక్షి రియల్టీ: నిర్మాణ సంస్థలు జరిమానా చెల్లించకపోతే రెరా తదుపరి చర్యలు ఏంటి?

జవాబు: రెరా విధించిన జరిమానా లేదా వడ్డీ పరిహారం చెల్లించడంలో ప్రమోటర్ విఫలమైతే.. అది రెవెన్యూ బకాయిగా పరిగణిస్తారు. ఈ తరహా కేసులను ఆర్ఈ(ఆర్అండ్డీ) చట్టం–2016లోని సెక్షన్ 40(1) కింద జరిమానా లేదా వడ్డీ రికవరీ చేయాలని సంబంధిత జిల్లా కలెక్టర్కు ఆదేశాలు జారీ చేస్తాం.

సాక్షి రియల్టీ: ఇప్పటి వరకు ఎంత మంది రియల్ ఎస్టేట్ ఏజెంట్లు రెరాలో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు?

జవాబు: రియల్ ఎస్టేట్ ఏజెంట్లు కూడా తప్పనిసరిగా రెరాలో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిందే. రెరా రిజిస్ట్రేషన్ నంబరు లేకుండా ఏజెంట్లు ప్లాట్లు, ఫ్లాట్, ఇల్లు ఏ రియల్ ఎస్టేట్ ప్రాజెక్ట్ను విక్రయించకూడదు. ఇప్పటి వరకు టీజీ–రెరాలో 3,925 మంది రియల్ ఎస్టేట్ ఏజెంట్లు రిజిస్టరయ్యారు.

సాక్షి రియల్టీ: ఈమధ్య కాలంలో బిల్డర్ల చీటింగ్ కేసులు ఎక్కువగా బయటపడుతున్నాయి. వీటిలో చాలా మంది బిల్డర్లు ఏజెంట్ల ద్వారా విక్రయాలు చేసినవాళ్లే.. మరి, ఏజెంట్ల మీద రెరా ఎలాంటి చర్యలు తీసుకుంటుంది?

జవాబు: రెరా చట్టంలోని 9, 10లను ఉల్లంఘించిన రియల్ ఎస్టేట్ ఏజెంట్లపై కూడా రెరా జరిమానా విధిస్తుంది. ఇప్పటి వరకు భృగు ఇన్ఫ్రా, సాయిసూర్య డెవలపర్స్, భారతి ఇన్ఫ్రా డెవలపర్స్, రియల్ ఎస్టేట్ అవెన్యూ కన్సల్టెంట్ సర్వీసెస్, యంగ్ ఇండియా హౌసింగ్ ప్రై.లి. వంటి ఏజెంట్లపై రెరా చర్యలు తీసుకున్నాం. రెవెన్యూ రికవరీ చట్టం కింద జరిమానా రికవరీ చేసేందుకు సంబంధిత జిల్లా కలెక్టర్ చర్యలు కూడా ప్రారంభించారు.

సాక్షి రియల్టీ: ఇప్పటి వరకు రెరా ఎన్ని ఫిర్యాదులను పరిష్కరించింది?

జవాబు: టీజీ రెరా పోర్టల్ ద్వారా ప్రాజెక్ట్లు, ఏజెంట్ల రిజిస్ట్రేషన్ మాత్రమే కాకుండా ఆన్లైన్లో కేసుల విచారణ కూడా చేపడున్నాం. దీంతో ఎక్కడి నుంచైనా సరే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మౌఖిక వాదనాలు వినిపించవచ్చు. ఇప్పటి వరకు 1,216 ఫిర్యాదులను పరిష్కరించాం.

సొంతిల్లు ప్రతి ఒక్కరి స్వప్నం.. దానికి తగ్గట్టుగానే ఇంటిని అభిరుచికి తగ్గట్లు నిర్మించుకోవడంతో పాటు సరికొత్త ఇంటీరియర్ ఏర్పాటు చేసుకుంటున్నారు. విల్లా, ఫ్లాట్, ఇండిపెండెంట్ హౌజ్ ఇలా ఏదైనా సరే.. కొత్తదనం కొట్టొచ్చినట్లు కనిపించేలా తీర్చిదిద్దుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు నగరవాసులు. ఇంట్లోకి అడుగు పెట్టగానే వావ్ అనిపించేలా హాల్, మోడ్రన్ కిచెన్, బెడ్రూమ్స్తో పాటు బాల్కనీని ముస్తాబు చేసుకుంటున్నారు. కాఫీ కప్పుతో అలా బాల్కనీలోకి వెళ్తే మనసుకు హాయినిచ్చేలా మలుచుకుంటున్నారు. చాలా మంది గ్రీనరీ ఫీల్ కోసం ప్రత్యేకంగా ఆర్టిఫిషియల్ లాన్ ఏర్పాటు చేసుకొని అందమైన మొక్కలతో అలంకరిస్తున్నారు. బాల్కనీ, పెంట్హౌస్ సైజును దృష్టిలో ఉంచుకొని కొన్ని సంస్థలు ప్రత్యేక డిజైన్లతో మైమరపిస్తున్నాయి. – శ్రీనగర్కాలనీ

భలే బాల్కనీ



- కొత్త థీమ్స్ కోరుకుంటున్న సిటీజనులు
- రోజురోజుకూ పెరుగుతున్న క్రేజ్
- కాఫీ కప్పుతో అలా వెళ్తే ఎంతో హాయి

కరోనా కాలం తర్వాత నగరవాసులు ఎన్నో నూతన ఒరవడుల వైపు ఆసక్తి కనబరిచారు. ముఖ్యంగా సాఫ్ట్వేర్ ఉద్యోగులు ఇలాంటి వాటికి అధికంగా మొగ్గుచూపారు. దీనికి ఓ కారణం ఉంది.. లాక్డౌన్ తర్వాత వర్క్ ఫ్రమ్ హోమ్ కారణంగా అధిక సంఖ్యలో ఉద్యోగులు ఇళ్లలో ఉండటం, వర్క్ స్ట్రెస్ తగ్గించుకోవడం కోసం ఇంట్లో ఇంటీరియర్తో పాటు బాల్కనీ ఆహ్లాదకరంగా ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. వర్క్ మధ్యలో ఫ్యామిలీతో అలా బాల్కనీ, పెంట్హౌస్లో కూర్చొని సరదాగా కాసేపు గడిపి మళ్లీ పని చేసుకుంటున్నారు. నగరంలో వేగంగా విస్తరిస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారంతో సమానంగా ఇంటీరియర్, పలు థీమ్స్తో కొన్ని సంస్థలు రంగంలోకి దిగాయి. ఇప్పటి వరకు ఒకలా.. ఇప్పటి నుంచి మరోలా అనే విధంగా ముస్తాబు చేస్తున్నాయి.

అపార్ట్మెంట్స్ బాల్కనీ..

అపార్ట్మెంట్ బాల్కనీ కొద్ది స్పేస్ అయినా వాటిని మరింత సుందరీకరణకు మొగ్గు చూపుతున్నారు. కొందరు వారికి నచ్చిన థీమ్స్తో డిజైన్ చేయించుకుంటారు. థీమ్ నేమ్స్, లైటింగ్ కొటేషన్స్, సేఫ్టీ కోసం ఇన్విజిబుల్ గ్రిల్స్, వాల్ ఆర్ట్ను ఎంచుకుంటున్నారు. వర్క్ఫ్రమ్ హోమ్ ఉన్న వారు బాల్కనీని ఆఫీస్ థీమ్స్తో పాటు పలు విభిన్న థీమ్స్తో సిటీ వ్యూ చూస్తూ డిజైన్స్ కోరుకుంటున్నారు. పిల్లలకు స్టడీస్ ఇంట్రెస్ట్ రావడానికి సరికొత్త డిజైన్స్ ఎంచుకుంటున్నారు. గ్రీనరీతో పాటు ఉన్న స్పేస్లో మొక్కలు, రెండు మూడు రకాల కూరగాయలు పెంచుతున్నారు. త్రీ బెడ్రూమ్స్లో ఒక బెడ్రూమ్లో కొత్త థీమ్స్కి ఇంపార్టెన్స్ ఇస్తున్నారు. విల్లాస్ కల్చర్ పెరిగింది. పెంట్హౌస్లో ఉన్న స్పేస్కి చాలా ఖర్చు పెడుతున్నారు. సిటీ వ్యూ కనబడేలా అవుట్ డోర్ స్విమ్మింగ్ పూల్, జెకూజీ, బార్ కౌంటర్, హోమ్ థియేటర్ తదితర సౌకర్యాలు ఏర్పాటు చేసుకుంటున్నారు.



ఫ్యూచర్లో బాల్కనీ స్పేస్ పెరుగుతుంది



విల్లాస్, అపార్ట్మెంట్స్లో ఇంటీరియర్కి ఎంతో ఖర్చు చేస్తున్నారు. అందులో భాగంగానే బాల్కనీని చేరుస్తున్నారు. ఫ్యూచర్లో బాల్కనీ స్పేస్ రెట్టింపు అవుతుంది. గ్రీనరీ, ఇంట్లోనే వెజిటబుల్స్ పెంచుకొనేలా ఉన్న స్పేస్తో కాకుండా కొత్త స్పేస్ ఇచ్చే ఆలోచన అపార్ట్మెంట్, గేటెడ్ కమ్యూనిటీలో వస్తోంది. వచ్చిన అతిథులు బాల్కనీ, పెంట్హౌస్ చూసి వావ్ అనేలా ఉండాలని కోరుకుంటున్నారు. వారు బాల్కనీ, పెంట్హౌస్లనే ఇష్టపడేలా డిజైన్ చేసుకుంటున్నారు. వర్క్ఫ్రమ్ హోమ్ ఉన్న వారు ఆఫీస్ థీమ్స్తో పాటు పలు విభిన్న థీమ్స్తో సిటీ వ్యూ ఉండేలా డిజైన్స్ కోరుకుంటున్నారు. పిల్లలకు స్టడీస్ పట్ల ఇంట్రెస్ట్ రావడానికి వారికి నచ్చినట్లు డిజైన్ చేస్తున్నారు. గ్రీనరీతో పాటు ఉన్న స్పేస్లో మొక్కలు, రెండు మూడు రకాల కూరగాయలు పెంచుతున్నారు.

– హేమలత రామా, స్వర్గ బాల్కనీ మేకోవర్స్, సీఈఓ



ఇందిరమ్మ కమిటీలను నిలిపివేయలేం

- మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరణ
- కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి ఆదేశం
- తదుపరి విచారణ జనవరి 24కు వాయిదా

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి లబ్ధిదారుల ఎంపిక కోసం ప్రభుత్వం నియమించిన ఇందిరమ్మ కమిటీలను నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం నిరాకరించింది. సింగిల్ జడ్జి ఇచ్చిన ఆదేశాలపైనా స్టే ఇవ్వలేమని తేల్చిచెప్పింది. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను జనవరి 24కు వాయిదా వేసింది.

జీవో 33ని సవాల్ చేస్తూ..

ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద లబ్ధిదారులకు రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందజేయాలని, తొలిదశలో 4.5 లక్షల ఇళ్లను నిర్మించాలని సంకల్పించిన ప్రభుత్వం.. ఇందుకోసం గ్రామ పంచాయతీ, మున్సిపల్ వార్డు స్థాయిలో ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేస్తూ అక్టోబర్ 11న జీవో 33 జారీ చేసింది. ఈ జీవోను సవాల్ చేస్తూ నిజామాబాద్ జిల్లాకు చెందిన ఎ. నితీశ్‌కుమార్‌తోపాటు మరొకరు హైకోర్టులో పిటిషన్ వేయగా విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి పిటిషన్‌ను నవంబర్ 14న కొట్టేశారు. పథకాల అమలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి స్వేచ్ఛ, విచక్షణ ఉంటుందని.. ప్రజల ప్రాథమిక హక్కులకు భంగం వాటిల్లితే తప్ప ప్రభుత్వ విధాన నిర్ణయాల్లో కోర్టులు జోక్యం చేసుకోలేవని స్పష్టం చేశారు.

సభ్యుల ఎంపిక చట్టవిరుద్ధమంటూ అప్పీల్..

ఈ తీర్పును సవాల్ చేస్తూ నితీశ్‌కుమార్ దాఖలు చేసిన అప్పీల్‌పై జస్టిస్ సుజోయ్ పాల్, జస్టిస్ కె.శరత్ శుక్రవారం విచారణ చేపట్టారు. అర్హతలను ప్రకటించకుండానే ఇందిరమ్మ కమిటీల్లోని సభ్యుల ఎంపిక చట్టవిరుద్ధమని.. ఇష్టం వచ్చిన వారిని, రాజకీయ పార్టీల కార్యకర్తలను ప్రభుత్వం సభ్యులుగా నియమించే ప్రమాదం ఉందని పిటిషనర్ వాదించారు. అందువల్ల కేసు విచారణ ముగిసే వరకు ఇందిరమ్మ కమిటీలను నిలుపుదల చేయాలని కోరారు. ఈ వాదనను ఏఏజీ తేరా రజనీకాంత్‌రెడ్డి తోసిపుచ్చారు. పారదర్శకంగా పథకం అమలు ప్రక్రియ కొనసాగుతోందని.. పథకాలను ఎలా అమలు చేయాలనే అధికారం ప్రభుత్వానికి ఉంటుందని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ కొనసాగుతున్నందున ఈ దశలో కమిటీలను నిలుపుదల చేయొద్దని విజ్ఞప్తి చేశారు. వాదనలు విన్న ధర్మాసనం.. కమిటీల ఏర్పాటుపై స్టే ఇచ్చేందుకు నిరాకరించింది.

జనవరి ఆఖరులోపు వివరాలు ఇవ్వండి

- 'అధిక పెన్షన్' ఉద్యోగులకు నోటీసులు జారీ చేయండి
- బకాయిల వసూలుకు చర్యలు తీసుకోండి
- సంస్థల యాజమాన్యాలకు ఈపీఎఫ్‌ఓ ఆదేశం

సాక్షి, హైదరాబాద్: అధిక పెన్షన్ (హయ్యర్ పెన్షన్) కోసం దరఖాస్తు చేసుకున్న వారికి నోటీసుల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్‌ఓ) సంస్థల యాజమాన్యాలకు స్పష్టం చేసింది. వచ్చే నెలాఖరు కల్లా దరఖాస్తు చేసుకున్న ప్రతి ఉద్యోగికి నోటీసుల జారీతో పాటు వారి నుంచి రావాల్సిన బకాయిలను సైతం వసూలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. అధిక పెన్షన్ దరఖాస్తులు స్వీకరించి ఇప్పటికి రెండేళ్లు అయింది. దేశవ్యాప్తంగా 17.49 లక్షల మంది అధిక పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. కాగా, వీటిలో 3.1 లక్షల దరఖాస్తులకు సంబంధించి యాజమాన్యాలు పూర్తిస్థాయి సమాచారాన్ని ఈపీఎఫ్‌ఓకు సమర్పించలేదు. మరో 4.66 లక్షల దరఖాస్తులకు సంబంధించి అదనపు సమాచారం, స్పష్టత కోరిన నేపథ్యంలో ఆ వివరాలను కూడా వచ్చే ఏడాది జనవరి 15 కల్లా ఆన్‌లైన్‌లో నవీకరించి పంపాలని సూచించింది. అదేవిధంగా దరఖాస్తుదారులకు కూడా అధిక పెన్షన్ నోటీసులు ఇవ్వలేదు. దీంతో వాటి పరిష్కార ప్రక్రియ ఎక్కడికక్కడ నిలిచిపోయింది. తాజాగా ఆయా దరఖాస్తులను పరిష్కరించే దిశగా చర్యలకు ఉపక్రమించిన ఈపీఎఫ్‌ఓ.. సంబంధిత యాజమాన్యాలకు సూచనలు చేసింది. జనవరి నెలాఖరులోపు దరఖాస్తుదారులకు నోటీసులు ఇవ్వాలని స్పష్టం చేసింది. అలాగే అధిక పెన్షన్ దరఖాస్తుదారుల వేతన వివరాలు, సర్వీసు.. తదితర పూర్తిస్థాయి సమాచారాన్ని వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించింది. జనవరి నెలాఖరు లోపు ఈ ప్రక్రియ పూర్తి చేస్తే.. ఆ తర్వాత వాటి పరిష్కారానికి సంబంధించి విచారణను వెంటనే ప్రారంభించి అధిక పెన్షన్ అర్హతలను నిర్ధారించాలని ఈపీఎఫ్‌ఓ భావిస్తోంది.

స్కూళ్ల ఫీ'జులుం'కు చెక్!

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు పాఠశాలలకు ముకుతాడు వేసేలా రాష్ట్ర విద్యా కమిషన్ ప్రభుత్వానికి కీలక సూచనలు, సిఫార్సులు చేసేందుకు సిద్ధమైంది. ప్రైవేటు స్కూళ్లను వర్గీకరించడంతోపాటు ఆయా స్కూళ్లలో ఫీజుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని నివేదిక సమర్పించనున్నట్లు తెలిసింది. ముఖ్యంగా స్కూళ్లపై విద్యాశాఖకు పూర్తి అధికారం ఇవ్వాలని.. ప్రైవేటు స్కూళ్లను ఎంఈవో స్థాయి అధికారి తనిఖీ చేయాలనే సిఫార్సు చేయనుంది. అలాగే మౌలిక వసతుల కల్పన, అనుభవజ్ఞులైన టీచర్లు, ఇతర సిబ్బందికి అయ్యే ఖర్చును ప్రామాణికంగా తీసుకుంటే బాగుంటుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తోంది. అన్ని స్కూళ్లను ఆడిట్ పరిధిలోకి తేవడాన్ని సరైన విధానంగా భావిస్తోంది. ముఖ్యంగా కార్పొరేట్ స్కూళ్ల ఫీజుల విషయంలో మరికొన్ని షరతులు విధించాలనే యోచనలో ఉంది. విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యాశాఖ సిఫార్సు మేరకే ఫీజులు ఉండాలనే ప్రభుత్వానికి సూచించాలని భావిస్తోంది.

రాష్ట్రంలో కేటగిరీలవారీగా ప్రైవేటు స్కూళ్ల విభజనకు అవకాశం

- స్కూళ్లపై విద్యాశాఖకు పూర్తి అధికారం?.. తల్లిదండ్రులు, విద్యాశాఖ సిఫార్సు మేరకే ఫీజులు!
- ఇకపై ఎంఈవో స్థాయి అధికారి ద్వారా ప్రైవేటు స్కూళ్ల తనిఖీ
- త్వరలో రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించనున్న విద్యా కమిషన్

రూ. లక్షల్లో ఫీజులు: ప్రైవేటు స్కూళ్ల భారీగా వసూలు చేస్తున్న ఫీజులను నియంత్రించాలంటూ కొన్నేళ్లుగా ప్రభుత్వాలకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. అలాగే పుస్తకాలు, దుస్తులు, ఇతర అవసరాల పేరుతో అదనంగా వసూళ్లు చేస్తున్నాయన్న ఆరోపణలు వస్తున్నాయి. ఇక కార్పొరేట్ స్కూళ్లు అయితే రూ. 5 లక్షల నుంచి రూ. 9 లక్షల వరకు వార్షిక ఫీజులు దండుకుంటున్నాయని విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆయా స్కూళ్లను కట్టడి చేసేందుకు సిఫార్సులు చేయాలని విద్యా కమిషన్‌ను ప్రభుత్వం ఆదేశించింది. కమిషన్ నివేదిక అనంతరం వచ్చే ఏడాది నుంచి ఫీజుల కట్టడికి ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు.

ప్రైవేటు స్కూళ్ల వాదన ఇలా..

- రూ. లక్షల్లో ఫీజులు వసూలు చేసే స్కూళ్లను.. రూ. 50 వేలలోపు ఫీజులు తీసుకొనే స్కూళ్లను ఒకే గాటన కట్టకూడదు.
- ఏటా 15 శాతం ఫీజు పెంచుకోవడానికి అవకాశం ఇవ్వాలి.

కార్పొరేట్ స్కూళ్ల డిమాండ్ ఇదీ..

- మారిన విద్యా విధానంలో కంప్యూటర్ విద్యకు ఎక్కువ ఖర్చు చేస్తున్నాం. సబ్జెక్టు టీచర్ల వేతన భారం పెరిగింది.
- ఏటా ఫీజులు పెంచుకొనే అవకాశం ఇవ్వాలి.



సుమారు 26 వేలు	రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల సంఖ్య
35 లక్షల మంది	ప్రైవేటు స్కూళ్లలో చదువుతున్న వారు
సుమారు 28 లక్షలు	వాటిలో చదువుతున్న విద్యార్థుల సంఖ్య
సుమారు 1,500	రాష్ట్రంలోని కార్పొరేట్ స్కూళ్లు
సుమారు 11 వేలు	ప్రైవేటు స్కూళ్ల సంఖ్య
సుమారు 5,000	రూ. 50 వేలలోపే వార్షిక ఫీజులు ఉన్న స్కూళ్లు
దాదాపు 9,500	ఏటా రూ. లక్షలోపు ఫీజు వసూలు చేస్తున్న ప్రైవేటు స్కూళ్లు

అందరికీ ఆమోద యోగ్యంగా నివేదిక..



ప్రైవేటు స్కూళ్లలో ఫీజుల విధానం ఎలా ఉండాలనే అంశంపై త్వరలో ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తాం. విద్యా సంఘాలు, విద్యార్థుల తల్లిదండ్రులు, వివిధ స్కూళ్ల యాజమాన్యాలతో విస్తృత సంప్రదింపులు జరిపాం. అందరికీ ఆమోదయోగ్యమైన అంశాలతోనే నివేదిక రూపొందిస్తున్నాం. ఫీజుల నియంత్రణ వల్ల పేద వర్గాలకు ఊరట ఉంటుందని ఆశిస్తున్నాం. - ఆకునూరి మురళి, రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్

కరెంట్ చార్జీలను నిరసిస్తూ కర్నూలు జిల్లా మంత్రాలయంలో జరిగిన ర్యాలీలో పాల్గొన్న ప్రజలు, వైఎస్సార్‌సీపీ నేతలు, శ్రేణులు



ఎగిసిపడ్డ ప్రజాగ్రహం

చంద్రబాబు సర్కారు బిల్లుల బాదుడు, నయవంచక పాలనపై సర్వత్రా మండిపాటు

పెంచిన కరెంట్ చార్జీలను తక్షణమే రద్దు చేయాల్సిందే

- ప్రభుత్వ వేధింపులు.. పోలీసుల బెదిరింపులకు వెరవకుండా ఉవ్వెత్తున ఉద్యమం
- చార్జీల భారంతో అల్లాడుతున్న ప్రజలకు మద్దతుగా నిలిచిన వైఎస్సార్‌సీపీ నేతలు
- రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో నిరసన ర్యాలీలకు ఉప్పెనలా కదలివచ్చిన జనం
- కరెంటు చార్జీల బాదుడును నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ చేపట్టిన పోరుబాట విజయవంతం

సాక్షి, అమరావతి: కరెంట్ చార్జీలను పెంచబోమని... ఇంకా తగ్గిస్తామని ఎన్నికల్లో నమ్మించి అధికారంలోకి వచ్చిన ఆర్నెల్లలోనే రూ.15,485.36 కోట్ల షాకులిచ్చిన సీఎం చంద్రబాబు మోసాలపై ప్రజా ఉద్యమం ఉవ్వెత్తున ఎగసింది. టీడీపీ కూటమి సర్కారు విద్యుత్తు చార్జీల బాదుడుపై నిరసన జ్వాలలు భగ్గుమన్నాయి. ప్రభుత్వ వేధింపులు.. పోలీసుల బెదిరింపులకు వెరవకుండా.. నయవంచన పాలనను నిరసిస్తూ కిరోసిన్ లాంతర్లతో జనవాహిని కదం తొక్కింది. కరెంటు చార్జీలు పెంచి ఇప్పటికే వసూలు చేస్తున్న రూ.6,072.86 కోట్లను తిరిగి వెనక్కి ఇవ్వాలని డిమాండ్ చేశారు. జనవరి నుంచి మోపనున్న రూ.9,412.50 కోట్ల భారాన్ని తక్షణమే రద్దు చేయకుంటే ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని అల్టిమేటం జారీ చేశారు. కూటమి సర్కారు మంగళం పాడిన ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాన్ని తక్షణమే పునరుద్ధరించాలని నినదించారు. 'ఓటు'దాటాక హామీలను తగలేయడాన్ని నరనరాన జీర్ణించుకున్న చంద్రబాబునాయుడు మోసాలను ఎండగడుతూ విద్యుత్తు బిల్లుల బాదుడుకు నిరసనగా వైఎస్సార్‌సీపీ శుక్రవారం నిర్వహించిన పోరుబాటకు ప్రజలు తఉప్పెనలా కదలివచ్చారు. పోలీసుల ఆంక్షలకు వెరవకుండా కిరోసిన్ లాంతర్లు చేతబట్టి కూటమి ప్రభుత్వం చేసిన దగాపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కరెంట్ చార్జీల పెంపును వెంటనే రద్దు చేయాలి.. నయవంచక చంద్రబాబు డౌన్ డౌన్.. అంటూ గర్జించారు. దిక్కులు పిక్కటిల్లేలా నినదిస్తూ వేలాది మంది కిలోమీటర్ల తరబడి విద్యుత్ శాఖ కార్యాలయాల వరకూ ర్యాలీగా కదిలి వచ్చా రు. విద్యుత్ కార్యాలయాల వద్ద భారీ ఎత్తున నిరసన ప్రదర్శనలు నిర్వహించి అధికారులకు డిమాండ్ పత్రాలను అందజేశారు. సీఎం చంద్రబాబు ఆర్నెళ్ల పాలనపై పెల్లుబుకుతున్న ప్రజావ్యతిరేకతను ఈ ర్యాలీలు ప్రతిబింబించాయని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఈనెల 13న నిర్వహించిన రైతు పోరును మించి కరెంటు చార్జీల బాదుడుపై పోరుబాటలో జనం ఉవ్వెత్తున ఉద్యమించడంతో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో కదనోత్సాహం నెలకొంది.

శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి టోల్‌ప్లాజా వద్ద అభిమానులకు అభివాదం చేస్తున్న వైఎస్ జగన్



దారి పొడవునా బ్రహ్మరథం

వైఎస్సార్ జిల్లాలో ముగిసిన వైఎస్ జగన్ పర్యటన

అనంతరం రోడ్డు మార్గంలో బెంగళూరుకు పయనం

మార్గ మధ్యలో రోడ్డుపైకి తరలి వచ్చిన అభిమాన జనం

అందరినీ పలకరిస్తూ, సెల్ఫీలు దిగుతూ ముందుకు సాగిన జననేత

కూటమి సర్కారు బాధితులకు అండగా ఉంటామని భరోసా

సాక్షి ప్రతినిధి, కడప/ సాక్షి నెట్‌వర్క్: వైఎస్సార్ జిల్లాలో నాలుగు రోజుల పర్యటన ముగించుకుని రోడ్డు మార్గంలో బెంగళూరు వెళ్లిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దారిపొడవునా పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. శుక్రవారం పులివెందుల– బెంగళూరు మార్గంలోని పల్లెల జనమంతా రోడ్డుపైకి వచ్చేశారు. జై జగన్ అంటూ నినాదాలు చేశారు. దారి పొడవునా జననేతకు బ్రహ్మరథం పట్టారు. వైఎస్ జగన్ సైతం ఏ ఒక్కరినీ నిరాశ పరచకుండా అందరినీ పలకరిస్తూ, సెల్ఫీలు దిగుతూ, అభివాదం చేస్తూ ముందుకు సాగారు. మార్గం మధ్యలో ఆయా గ్రామాల్లో నేతలందరినీ పేరు పేరునా పలకరిస్తూ ముందుకు సాగారు. జగన్‌తో మాట్లాడటానికి, కరచాలనం చేయడానికి ప్రజలు పోటీ పడ్డారు. జగన్‌ను చూసేందుకు వచ్చిన జనాన్ని, పార్టీ శ్రేణుల్ని నిలువరించడానికి ఏపీ, కర్ణాటక పోలీసులు శ్రమించాల్సి వచ్చింది.

ఇదేం దా'రుణం'?

▶ మొదటి పేజీ తరువాయి

వ్యక్తం చేస్తున్నారు. తాము ప్రతినెలా జీతంలో 7% కోత పెట్టుకుని నిధి సమకూర్చుకుంటే.. తమ నిధి నుంచి తమకే రుణాలు అందక ఇలా అప్పుల బారి నపడటం దారుణమని పేర్కొంటున్నారు.

జాతీయ స్థాయి గుర్తింపు నుంచి..

ఆర్టీసీలోని సహకార పరపతి సంఘానికి ఉమ్మడి రాష్ట్రంలో జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు లభించింది. ఆర్టీసీ ఉద్యోగుల జీతాల్లో ప్రతినెలా 7 శాతం మొత్తం దీనికి జమ చేయటం ద్వారా నిధి ఏర్పడుతుంది. అందులోంచే ఉద్యోగులకు తక్కువ వడ్డీకి రుణాలు ఇస్తారు. దాదాపు రూ.3 వేల కోట్ల నిధితో వేల సంఖ్యలో ఉద్యోగులకు రుణాలు ఇస్తూ, కార్మికులను ఆదుకునే సంస్థగా గిన్నిస్ బుక్ రికార్డుతోపాటు పలు పురస్కారాలు దక్కించుకుంది. కానీ ఆర్టీసీ కొన్నేళ్లుగా ఈ నిధిని సొంతానికి వాడేసుకుని ఖాళీ చేసింది. ప్రస్తుతం వడ్డీతో కలిపి రూ.900 కోట్లకుపైగా ఆర్టీసీ చెల్లించాల్సి ఉంది. సీసీఎస్‌లో నిధులు లేకపోవడంతో... ఆర్టీసీ ఉద్యోగులకు లోన్లు అందని పరిస్థితి నెలకొంది. సీసీఎస్ గతంలో ఈ వ్యవహారంపై హైకోర్టును ఆశ్రయించడంతో బకాయిలు చెల్లించాలని ఆర్టీసీని ఆదేశించింది. ఈ మేరకు గత జూన్‌లో సీసీఎస్‌కు రూ.200 కోట్లు అందాయి. మరో రూ.150 కోట్లు బ్యాంకు నుంచి రుణం తెచ్చింది. ఈ మొత్తం నుంచి ఉద్యోగులకు లోన్లు ఇచ్చింది. ఇలా జూన్ వరకు పేరుకుపోయిన దరఖాస్తుదారులకు ఊరట లభించింది. ఆ తర్వాత బకాయిల చెల్లింపు లేకపోవటంతో లోన్ దరఖాస్తులు పేరుకుపోతూ వస్తున్నాయి. ప్రస్తుతం 7 వేల మంది రుణాల కోసం ఎదురుచూస్తున్నారు.

డ్రైవర్ కొండారెడ్డి కుమార్తె పెళ్లి పెట్టుకున్నాడు. రూ.9 లక్షల లోన్ కోసం సీసీఎస్‌కు దరఖాస్తు చేశాడు. ప్రభుత్వం నుంచి బకాయిలు వచ్చేవరకు లోన్ దొరికే పరిస్థితి లేదని, తొలుత రిటైర్మెంట్ కేసులను పరిష్కరించాకే లోన్ చెల్లింపులు ఉంటాయన్న సమాధానం వచ్చింది. అప్పటిదాకా ఎదురు చూసే పరిస్థితి లేక, డ్రైవర్ కావటంతో వెంటనే అప్పు పుట్టక తిరిగి తిరిగి చివరకు అధిక వడ్డీకి అప్పు తెచ్చుకోవాల్సి వచ్చింది.

ఎన్నో అవసరాల కోసం..

ప్రస్తుతం ఆర్టీసీలో 40 వేల మంది ఉద్యోగులుంటే... అందులో దాదాపు సగం మంది వరకు వివిధ అవసరాల కోసం సీసీఎస్ రుణాలపై ఆధారపడుతుంటారు. దాన్ని చెల్లించి, మళ్లీ అత్యవసరం పడితే రుణం తీసుకుంటూ ఉంటారు. విద్యా సంవత్సరం ముగియనున్నందున ఫైనల్ సెమిస్టర్ ఫీజులు చెల్లించాల్సి ఉంది. దీంతో చాలా మంది ఉద్యోగులు పిల్లల ఫీజుల కోసం అత్యవసర లోన్లు కావాలని దరఖాస్తులు సమర్పించారు. పిల్లల పెళ్లిళ్లు, ఆస్పత్రి ఖర్చులు, ఇంటి రిపేర్లు.. ఇలా మరెన్నో అవసరాల కోసం దరఖాస్తు చేసినవారు ఉన్నారు. అయితే ఆర్టీసీ ఉద్యోగులు ఇంతగా ఇబ్బందిపడుతున్నా ప్రభుత్వం నుంచి స్పందన కనిపించడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

మళ్లీ కోర్టు తలుపుతట్టే ఆలోచన

ఉద్యోగుల ఒత్తిడి భరించలేక బకాయిలు చెల్లించాలంటూ కొన్నిరోజులుగా సీసీఎస్ యంత్రాంగం ఆర్టీసీపై ఒత్తిడి పెంచుతోంది. కనీసం బ్యాంకు నుంచి రుణం పొందేందుకు పూచీకత్తు అయినా ఇవ్వాలని కోరుతోంది. కానీ ఆర్టీసీ యాజమాన్యం నుంచి సానుకూలత రావటం లేదు. సీసీఎస్ బకాయిలు చెల్లించాలని ఇప్పటికే హైకోర్టు ఆదేశించి ఉన్నందున... మళ్లీ హైకోర్టు తలుపుతట్టి, కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేయాలని సీసీఎస్ యంత్రాంగం భావిస్తున్నట్టు తెలిసింది.

'వేయి గొంతులు.. లక్ష డప్పులు'తో గుండె చప్పుడు వినిపిస్తాం

- మంద కృష్ణ మాదిగ

సాక్షి, హైదరాబాద్: మాలలు తమకున్న రాజకీయ పలుకుబడితో ఎస్సీ వర్గీకరణను అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్నారని, అడ్డంకులను ఎదుర్కోవడానికి ఫిబ్రవరి 3న 'వెయ్యి గొంతులు–లక్ష డప్పులు'తో మాదిగల గుండె చప్పుళ్లను వినిపించడానికి శ్రీకారం చుట్టామని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లో ప్రజా కళాకారుడు ఏపూరి సోమన్న అధ్యక్షతన కళాకారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంద కృష్ణ మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాల సాధనలో భాగంగానే ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం చేస్తున్నామన్నారు. ఈ పోరాటం న్యాయమైందనే సమాజం మద్దతు ఇస్తోందని, అన్ని సామాజిక వర్గాల్లో ఉన్న కళా నేతలంతా ఉద్యమానికి మద్దతుగా నిలబడాలని పిలుపునిచ్చారు.

ఫోరెన్సిక్ ఆడిటింగ్‌పై 'రెవెన్యూ'లో గుబులు

▶ మొదటి పేజీ తరువాయి

ఎప్పుడు ఏం జరుగుతుంది? అనే అంశాలు ఇప్పుడు రెవెన్యూ శాఖ పరిధిలో హాట్‌టాపిక్‌గా మారాయి.

అసలేంటీ... ఆడిటింగ్?: ఆన్‌లైన్‌తో ముడిపడి ఉన్న ప్రతి వ్యవస్థలో జరిగే లావాదేవీలను డిజిటల్ ఫుట్‌ప్రింట్స్ ఆధారంగా సరి పోల్చడాన్ని ఫోరెన్సిక్ ఆడిటింగ్ కింద పరిగణించవచ్చు. ఇందుకోసం ట్రాన్సాక్షన్ హిస్టరీ (లావాదేవీ జరిగిన తీరు)ని పరిగణనలోకి తీసుకుంటారు. లావాదేవీ ఎక్కడ, ఎలా జరిగింది? ఏ రికార్డుల ఆధారంగా నిర్వహించారు? ఎవరెవరు ఏ సమయంలో జరిపారు? ఆ కంప్యూటర్ ఐపీ అడ్రస్ ఏంటి?... ఇలా సదరు లావాదేవీ జరిగిన తీరును కూలంకశంగా పరిశీలించి నిబంధనల మేరకు జరిగిందా లేక నిబంధనలు ఉల్లంఘించారా అన్నది నిగ్గు తేల్చడమే ఈ ఆడిటింగ్ ప్రధాన ఉద్దేశమని సాంకేతిక నిపుణులు చెబుతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన దాన్ని బట్టి ఇప్పుడు ధరణి పోర్టల్ లావాదేవీలను కూడా డిజిటల్ ఫుట్‌ప్రింట్స్ లేదా ట్రాన్సాక్షన్ హిస్టరీ ద్వారా మదింపు చేయనున్నారు. ఆ లావాదేవీల్లో ఎవరెవరు భాగస్వాములయ్యారనే దాన్ని ఈ ఆడిటింగ్ కీలకంగా పరిగణించనుంది. క్రయ, విక్రయదారుల నుంచి ధరణి ఆపరేటర్, తహశీల్దార్, ఆర్డీవో, కలెక్టర్, సీసీఎల్‌ఏ వరకు ఎవరి పాత్ర ఏంటన్న దానిపై ఫోకస్ చేస్తారని తెలుస్తోంది.

పాత రికార్డులు... కొత్త లావాదేవీలు

ధరణి పోర్టల్ వేదికగా నిషేధిత జాబితాలో ఉన్న భూముల్లో అక్రమ లావాదేవీలు జరిగాయని ప్రభుత్వం భావిస్తోంది. రాత్రికిరాత్రి నిషేధిత జాబితాను అన్‌లాక్ చేసి వారికి కావాల్సిన సర్వే నంబర్‌ను తొలగించి మళ్లీ ఆ జాబితాను లాక్ చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో నిషేధిత జాబితా భూములే టార్గెట్‌గా ఈ ఆడిటింగ్ జరగొచ్చనే చర్చ రెవెన్యూ వర్గాల్లో జరుగుతోంది. ధరణి పోర్టల్ అమల్లోకి వచ్చిన నాటికి ఉన్న రికార్డుల వివరాలు, పోర్టల్‌లో నమోదు చేసిన వివరాలు, ఈ రికార్డుల ఆధారంగా జరిపిన లావాదేవీలు ఫోరెన్సిక్ ఆడిటింగ్‌లో కీలకమవుతాయని రెవెన్యూ శాఖ అధికారి ఒకరు వెల్లడించారు. 'పోర్టల్ అమల్లోకి వచ్చిన నాటికి నిషేధిత జాబితా కింద ఉన్న భూముల రికార్డులు తీసుకుంటారు. ఆ తర్వాత ధరణి పోర్టల్‌లో నమోదైన వివరాలను సరిచూస్తారు. ఈ క్రమంలో సందేహాస్పదంగా ఉన్న లావాదేవీలను మరింత లోతుగా పరిశీలించి నిగ్గు తేలుస్తారు' అని పేరు వెల్లడించడానికి ఇష్టపడని ఆ అధికారి చెప్పారు.

ట్రాన్సిట్ పీరియడ్ పూర్తి కాగానే...!

ఫోరెన్సిక్ ఆడిటింగ్‌ను రెవెన్యూ శాఖ ముఖ్యఅధికారులతో చేయిస్తారా? లేక ఇతర శాఖల్లోని ముఖ్య అధికారులతో కలిపి చేయిస్తారా? అన్నదానిపై ఇంకా స్పష్టత రాలేదు. దీనిపై వచ్చే నెలలో విధాన ప్రకటన చేసే అవకాశం ఉంది. వాస్తవానికి, ధరణి పోర్టల్ నిర్వహణను ప్రస్తుత ప్రభుత్వం నేషనల్ ఇన్ఫర్మాటిక్స్ సెంటర్ (ఎన్‌ఐసీ)కి అప్పగించింది. గతంలో ఈ పోర్టల్ నిర్వహించిన టెర్రాసిస్ నుంచి ఎన్‌ఐసీ ఈ బాధ్యతలు తీసుకుంటోంది. ఈ క్రమంలో టెర్రాసిస్ నుంచి పోర్టల్‌కు సంబంధించిన అన్ని వివరాలను ఎన్‌ఐసీ తీసుకుంటోంది. ఈ ప్రక్రియ దాదాపు పూర్తయిందని తెలుస్తోంది. ఈ వివరాల పంపిణీ (ట్రాన్సిట్) కోసం ప్రభుత్వం ఇచ్చిన రెండు నెలల గడువు.. డిసెంబర్ 31తో ముగియనుంది. అంటే జనవరి 1 నుంచి భూభారతి (ధరణి స్థానంలో) పోర్టల్‌ను ఎన్‌ఐసీ నిర్వహించనుంది. ఫోరెన్సిక్ ఆడిట్‌లో వచ్చిన సమాచారం ఆధారంగా 'సిట్'ను ఏర్పాటు చేయొచ్చని, తద్వారా ఎవరెవరు అక్రమాలకు పాల్పడ్డారన్న అంశాలను తేలుస్తారని చెబుతున్నారు.

తహసీల్దార్ల డిజిటల్ సంతకాలు

ధరణి పోర్టల్ అమల్లోకి వచ్చిన తర్వాత భూ సమస్యల పరిష్కార బాధ్యతలు కలెక్టర్లకు అప్పగించారు. కానీ సదరు పరిష్కారాలను ధ్రువీకరిస్తూ సవరించే రికార్డులపై తహసీల్దార్ల డిజిటల్ సంతకాలే నమోదు చేశారు. ఈ విషయంలో పలుమార్లు తహసీల్దార్ సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. కనీసం తమ ప్రమేయం లేకుండా తీసుకునే నిర్ణయాలను తమ డిజిటల్ సంతకాలతో ధ్రువీకరించడమేంటని, వెంటనే తమ సంతకాలు తొలగించాలని కూడా డిమాండ్ చేశాయి. కానీ, అది సాధ్యపడలేదు. ఇప్పుడు ఈ డిజిటల్ సంతకాలేం చేస్తాయోననే గుబులు తహసీల్దార్లలో మొదలైంది. ముఖ్యంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి, వరంగల్, కరీంనగర్ జిల్లాల్లో పనిచేసిన తహసీల్దార్లు ఎప్పుడు ఏం జరుగుతుందోననే ఆందోళనతో ఉన్నారు. ఇదిలాఉంటే.. అసలు తహసీల్దార్ల డిజిటల్ సంతకాలు కూడా లేకుండా రాత్రికిరాత్రే డాక్యుమెంట్లు మారిపోయాయనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఫోరెన్సిక్ ఆడిటింగ్‌ను ప్రభుత్వం ఎలా నిర్వహిస్తుందో.. ఏం తేలుస్తుందో.. ఎవరిని బాధ్యులను చేస్తుందో... అనే అంశాలు ఇప్పుడు రెవెన్యూ శాఖను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

ఖాకీల లిక్కర్ దందా

- ఆర్‌జీఐఏలో డ్యూటీ ఫ్రీ మద్యం కొని బయట అమ్ముకుంటున్న కానిస్టేబుల్, హోంగార్డు
- వీరి ఆటకట్టించిన ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు.. రూ.15 లక్షల మద్యం పట్టివేత.. నలుగురి అరెస్ట్



పట్టుబడిన మద్యం బాటిళ్లు, నిందితులు

శంషాబాద్: శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో పనిచేస్తున్న ఇద్దరు ఖాకీల లిక్కర్ దందా గుట్టు రట్టయింది. ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు వీరి ఆట కట్టించారు. విమానాశ్రయంలో విధులు నిర్వహిస్తున్న వీరు, డ్యూటీ ఫ్రీ మద్యం షాపు ఉద్యోగితో కుమ్మక్కయి.. ప్రతిరోజూ బయటకు తీసుకొస్తున్న మద్యంతో వ్యాపారం చేస్తూ, తమ జేబులు నింపుకుంటున్నారు. శంషాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కృష్ణప్రియ కథనం ప్రకారం.. ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ గెమ్యానాయక్, ఇదే పీఎస్‌లో హోంగార్డుగా పనిచేస్తున్న బండారి లింగయ్య ఎయిర్‌పోర్టులో వీఐపీల రాకపోకల సమయంలో వారికి బోర్డింగ్ తదితర ప్రక్రియలకు సంబంధించిన విధులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో వీరు విదేశాల నుంచి వచ్చే కొందరు ప్రయాణికులకు సంబంధించిన పాస్‌పోర్టు, బోర్డింగ్ పాస్‌లతో డ్యూటీఫ్రీ మద్యం షాపులో పనిచేస్తున్న వ్యక్తి ద్వారా రోజూ మద్యం కొనుగోలు చేసి.. బయటికి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

పక్కా సమాచారంతో..

ఈ వ్యవహారంపై పక్కా సమాచారం సేకరించిన ఎక్సైజ్ టాస్క్‌ఫోర్సు పోలీసులు.. శుక్రవారం ఉదయం 9 గంటలకు విధులు ముగించుకుని కారులో బయలుదేరిన కానిస్టేబుల్ గెమ్యానాయక్, ఓఆర్ఆర్ ఎగ్జిట్ గేటు వద్ద తన వ్యాపార భాగస్వామి అయిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ హరీశ్‌కుమార్‌రెడ్డికి 4 మద్యం సీసాలు ఇచ్చేక్రమంలో ఇద్దరిని అరెస్ట్ చేశారు. కారులో 6 విదేశీ మద్యం సీసాలు, 4 డిఫెన్స్ మద్యం సీసాలున్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. గెమ్యానాయక్ ఇచ్చిన సమాచారం మేరకు గోలిదొడ్డిలోని ఆర్ట్ బోటిక్‌కు వెళ్లగా అక్కడ మేనేజర్‌గా పనిచేస్తున్న పొట్లూరి రాఘవేందర్‌రావు తన కారులో దాచుకున్న నాలుగు మద్యం బాటిళ్లతో దొరికిపోయాడు.

హోంగార్డు కారులో.. : ఎయిర్‌పోర్టులో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న బండారి లింగయ్య మద్యం తీసుకుని బయలుదేరుతున్నట్లు సమాచారం రావడంతో అతడిని వెంబడించిన ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరాంఘర్ వద్ద కారు ఆపి సోదా చేయగా 23 డ్యూటీ ఫ్రీ మద్యం బాటిళ్లు, 2 డిఫెన్స్ మద్యం బాటిళ్లు దొరికాయి. ఈ వ్యవహారంలో మొత్తం నలుగురిని అరెస్ట్ చేయగా, డ్యూటీ ఫ్రీ మద్యం షాపులో పనిచేస్తూ వీరికి సహకరిస్తున్న మహేశ్వర్ పరారీలో ఉన్నాడు. పట్టుబడిన డ్యూటీఫ్రీ, డిఫెన్స్ మద్యం విలువ రూ. 15 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. కాగా, నూతన సంవత్సరం వేడుకల కోసం ఈ ముఠా డ్యూటీ ఫ్రీ మద్యాన్ని పెద్ద ఎత్తున బయటకు తీసుకొచ్చినట్లు ఎక్సైజ్ పోలీసులు అనుమానిస్తున్నారు.



కాలక్షేప సాహిత్యానికి కాలం చెల్లిన కాలం ఇది.
ఈ ఉరుకు పరుగుల కాలంలో పుస్తకం నిలబడాలంటే సత్తా ఉండాలి.
సామాజిక అంశాలు ఉండాలి. అలాంటి సత్తా ఉన్న పుస్తకాలతో ఈ సంవత్సరం
జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మెరిశారు మన మహిళా రచయిత్రులు.
లింగవివక్ష నుంచి స్త్రీ సాధికారత వరకు...
అట్టడుగు శ్రామిక జీవితాలను నుంచి లౌకికవాదం వరకు...
ఎన్నో అంశాలపై ప్రామాణికమైన పుస్తకాలు రాశారు...

అక్షరాలై వెలిగారు

2024 ఉమెన్ పవర్



రెజ్లర్ టు రైటర్

విట్‌నెస్
- సాక్షి మాలిక్

సాక్షి మాలిక్ పేరు వినబడగానే 'స్టార్ రెజ్లర్' అనే శబ్దం ప్రతిధ్వనిస్తుంది. రెజ్లర్ సాక్షి కాస్తా 'విట్‌నెస్'తో రైటర్‌గా మారింది. సాక్షి మాలిక్‌ది నల్లేరు మీద నడక కాదు. ఘర్షణ లేకుండా ఆమె నడక లేదు. ఆ ఘర్షణలో పితృస్వామ్య వ్యవస్థను సవాలు చేయడం కూడా ఒకటి. పేదరికాన్ని, ప్రతికూల పరిస్థితులను తట్టుకొని ఉన్నతస్థాయికి చేరడానికి తాను పడిన కష్టాలకు జోనాథన్ సెల్వరాజ్‌తో కలిసి ఈ పుస్తకం ద్వారా అక్షర రూపం ఇచ్చింది సాక్షి మాలిక్. ఆటలో పడి లేవడం సాధారణం. అయితే పడిన ప్రతిసారీ మరింత బలంగా పైకి లేవడం సాక్షి శైలి. ఒలింపిక్స్‌లో పతకం గెలుచుకున్న తొలి భారత మహిళా రెజ్లర్‌గా ఎంతోమందికి స్ఫూర్తిని ఇచ్చింది. 'నేను తల్లి అయిన తరువాత భవిష్యత్తులో ఏదో ఒకరోజు గోడకు వేలాడుతున్న ఒలింపిక్ మెడల్‌ను చూస్తూ అది ఏమిటి? అని నా బిడ్డ నన్ను అడగవచ్చు. నేను ఆ మెడల్‌ను బిడ్డ చేతిలో పెట్టి అది ఏమిటో, అది గెలవడానికి ఎంతదూరం ప్రయాణించాల్సి వచ్చిందో వివరంగా చెబుతాను' అంటుంది సాక్షి మాలిక్.



జ్ఞాపకాల జ్ఞాన సముద్రం

దిస్ ల్యాండ్ ఉయ్ కాల్ హోమ్:
ది స్టోరీ ఆఫ్ ఏ ఫ్యామిలి, క్యాస్ట్, కన్వర్షేషన్స్ అండ్ మోడర్న్ ఇండియా
- నుస్రత్ ఎఫ్.జాఫ్రీ

ఇది పుస్తకం అనడం కంటే నాలుగు తరాల జ్ఞాపకాల సంపుటి అనడం సబబుగా ఉంటుంది. ఎంతో పరిశోధిస్తే కాని ఇలాంటి పుస్తకం రాయలేము. పరిశోధనకు తోడు నుస్రత్ ఎఫ్ జాఫ్రీలోని అద్భుత సృజనాత్మకత పుస్తకానికి మంచి పేరు వచ్చేలా చేసింది. తన పూర్వీకుల మతమార్పిడి అనేది ఎలాంటి పరిస్థితుల్లో జరిగిందో ఈ పుస్తకంలో వివరిస్తుంది జాఫ్రీ. 'నా బంధువులు వారి జీవితంలో వివిధ సందర్భాలలో కొత్త మతాలను స్వీకరించాలని నిర్ణయించుకోవడం వెనుక ఉన్న కారణాలను అన్వేషించడానికి కష్టపడాల్సి వచ్చింది. ఆ కారణాలలో రాజకీయం నుంచి సామాజికం వరకు ఎన్నో ఉన్నాయి. ప్రతి ఒక్కరి మత మార్పిడి ప్రయాణం ప్రత్యేకమైనది' అంటుంది జాఫ్రీ. అయితే వారి కుటుంబ చరిత్ర అంతా దేశ విస్తృత చరిత్రతో లోతుగా ముడిపడినందు వల్లే పుస్తకం ప్రత్యేకంగా నిలిచింది, వలస పాలన, స్వాతంత్ర్య పోరాటం, వలసానంతర రాజకీయాలు... మొదలైనవి 'దిస్ ల్యాండ్ ఉయ్ కాల్ హోమ్'లో కనిపిస్తాయి.



ఇదేం భాష?!

ఎమియోటిక్స్ ఆఫ్ రేప్: సెక్సువల్ సబ్జెక్టివిటీ అండ్ వయొలేషన్ ఇన్ రూరల్ ఇండియా
- రూపాల్ ఓజా

న్యూయార్క్‌లోని హంటర్ కాలేజీలో 'ఉమెన్ అండ్ జెండర్ స్టడీస్'లో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న రూపాల్ ఓజా రాసిన పుస్తకం ఎమియోటిక్స్ ఆఫ్ రేప్. బాధితురాలు, సర్వైవర్‌లాంటి పదాలకు అతీతంగా లైంగిక హింస కేసులకు సంబంధించిన భాషలో మూసధోరణులు, పితృస్వామిక భావజాలాన్ని ఈ పుస్తకంలో విశ్లేషిస్తుంది రూపా ఓజా. ప్రభుత్వ అధికారుల నుంచి గ్రామ వార్డు మెంబర్‌లు, కుల సంఘాల వరకు అత్యాచార కేసులను లైంగిక విషయాలపై చర్చించే వేదికలుగా ఎలా చూస్తారో ఈ పుస్తకంలో వివరిస్తుంది రుపాల్ ఓజా.



ఉద్యమమే జీవితమై..

ది పర్సనల్ ఈజ్ పొలిటికల్: యాన్ యాక్టివిస్ట్ మెమోయిర్
- అరుణా రాయ్

ఉన్నత విద్యావంతుల కుటుంబంలో పుట్టిన అరుణ ఢిల్లీ సబ్–డివిజనల్ మెజిస్ట్రేట్, లెఫ్టినెంట్ గవర్నర్ ఆఫ్ ఢిల్లీకి సెక్రటరీగా ఉన్నతోద్యోగాలు చేసినా 'ఉద్యమ నాయకురాలు'గానే ఆమె సుపరిచితురాలు. సోషల్ వర్క్ రిసెర్చ్ సెంటర్ (బేర్‌ఫుట్ కాలేజీ)తో మొదలైన ఆమె ప్రయాణం ఎంతోదూరం వెళ్లింది. ఎన్నో మలుపులు తిరిగింది. తన ఉద్యమజీవితాన్ని, ఉద్యమాల బాటలో తాను కలిసి పనిచేసిన వ్యక్తుల గురించి 'ది పర్సనల్ ఈజ్ పొలిటికల్'లో రాసింది అరుణా రాయ్. ఉద్యమం అనే మహా పాఠశాలలో తాను నేర్చుకున్న పాఠాలు ఈ పుస్తకంలో కనిపిస్తాయి.



అట్టడుగు కోణం నుంచి...

ఇండియాస్ ఫర్గాటెన్ కంట్రీ: ఏ వ్యూ ఫ్రమ్ ది మార్జిన్స్
- బేలా భాటియా

దేశంలోని అత్యంత మారుమూల, అణగారిన వర్గాల గురించి బేలా భాటియా రాసిన పుస్తకం ఇది. మన దేశంలోని నిరుపేద ప్రజలపై జరిగే హింసాకాండపై వెలుగును ప్రసరిస్తుంది. వర్గ, లింగ, భౌగోళిక అంశాలను మేళవించి రాసిన పుస్తకం ఇది.



హింసధ్వని

భీమా-కోరేగావ్ అండ్ ది సెర్చ్ ఫర్ డెమోక్రసీ ఇన్ ఇండియా: అల్పా షా

మన దేశంలోని తాజా రాజకీయ వాతావరణాన్ని దృష్టిలో పెట్టుకొని రాసిన పుస్తకం ఇది. భీమా– కోరేగావ్ ఘటనలో కొందరిని కేసులో ఎలా ఇరికించారో, సాక్ష్యాధారాలు ఎలా సృష్టించారో, కేసు లేకపోయినా రాజకీయ కారణాలతో ఎలా హింసించారో ఈ పుస్తకంలో అల్పా షా రాసింది.



ఎర్రజెండ నీడలో... ఎన్నో జీవితాల గురించి

రెవల్యూషనరీ డిజైర్స్: ఉమెన్ కమ్యూనిజం అండ్ ఫెమినిజం ఇన్ ఇండియా
- అనియా లూంబా

1920 దశకంలో భారత రాజకీయాల్లో కమ్యూనిజం స్పష్టమైన అస్తిత్వంగా మారడం నుంచి కమ్యూనిస్ట్ మహిళల జీవితాలను సాంస్కృతిక, రాజకీయ నేపథ్యంలో విశ్లేషించడం వరకు ఎంతో సమాచారం 'రెవల్యూషనరీ డిజైర్స్'లో కనిపిస్తుంది.



శ్రామిక జనజీవన చిత్రం

ది మెనీ లైవ్స్ ఆఫ్ సైదా ఎక్స్
- నేహా దీక్షిత్

సాధారణ శ్రామిక వర్గ భారతీయురాలి జీవితం ఎలా ఉంటుందో కళ్లకు కట్టినట్టు చూపే ఈ పుస్తకాన్ని జర్నలిస్ట్ నేహా దీక్షిత్ రాసింది. బాబ్రీ మసీదు కూల్చివేతతో చెలరేగిన అల్లర్ల నేపథ్యంలో తన కుటుంబంతో కలిసి సైదా ఎక్స్ బెనారస్ నుంచి ఢిల్లీకి వెళుతుంది. ఢిల్లీలో బతకడానికి రోజుకు ఎన్నో ఉద్యోగాలు చేస్తుంది. ఒక రోజు సెలవు తీసుకుంటే కూడా 'రేపు బతకడం ఎలా' అనే భయం నుంచి రాత్రి, పగలు కష్టపడిన సైదా కథ ఈ పుస్తకంలో కనిపిస్తుంది, ఢిల్లీలోని చాందిని చౌక్‌లో రిక్షా తొక్కే కార్మికుడు ఉగ్రవాదుల బాంబు పేలుళ్లలో మరణిస్తాడు. 'ది మెనీ లివ్స్ ఆఫ్...' లో సయిదా, బాంబు పేలుళ్లలో చనిపోయిన అమాయక రిక్షాకార్మికుడిలాంటి ఎంతోమంది సామాన్యుల, శ్రామికుల జీవితాలు కనిపిస్తాయి.



స్వతంత్ర భారత స్వరం

ది కలర్స్ ఆఫ్ నేషనలిజం
- నందితా హక్సర్

ఒక్క ముక్కలో చెప్పాలంటే ఈ పుస్తకం స్వతంత్ర భారత దేశ సంక్షిప్త చరిత్ర. జాతీయవాదంలోని అనేక అంశాల గురించి తన భావాలను వెల్లడి చేస్తుంది నందిత హక్సర్. మన దేశం ఎలా ముందుకు సాగాలనే దాని గురించి కౌమార దశలో తన అమాయక ఆలోచనలు ఈ పుస్తకంలో గుర్తు తెచ్చుకుంది నందిత. అమాయక ఆలోచనల నుంచి వాస్తవికదృష్టితో ఆలోచించడం వరకు తన ఆలోచన ధోరణిలో వచ్చిన మార్పును గురించి కూడా 'ది కలర్స్ ఆఫ్ నేషనలిజం'లో రాసింది నందితా హక్సర్.





'తమాషా' వెనుక ఎంత విషాదమో!

ది వల్గారిటీ ఆఫ్ క్యాస్ట్
- శైలజ పైక్

మహారాష్ట్రలోని తమాషా డ్యాన్సర్‌ల గురించి రాసిన పుస్తకం ది వల్గారిటీ ఆఫ్ క్యాస్ట్. ఒక విధంగా చెప్పాలంటే తమాషా కళాకారుల సామాజిక, మేధోచరిత్రను రికార్డ్ చేసిన మొదటి పుసక్తంగా చెప్పుకోవచ్చు. హిస్టరీ ప్రొఫెసర్ అయిన డా.శైలజ పైక్ తొలి పుస్తకం... దళిత్ ఉమెన్స్ ఎడ్యుకేషన్ ఇన్ మోడ్రన్ ఇండియా: డబుల్ డిస్క్రిమినేషన్. నలుగురు ఆడపిల్లల్లో ఒకరిగా యెరవాడ మురికి వాడలోని ఒకేగది ఇంట్లో పెరిగిన శైలజకు పేదల కష్టాలు తెలియనివేమీ కాదు. ఆ అనుభవ జ్ఞానంతోనే మహారాష్ట్రలోని తమాషా కళాకారుల జీవితానికి అద్దం పట్టేలా 'ది వల్గారిటీ ఆఫ్ క్యాస్ట్' పుస్తకం రాసింది.

అదర్‌సైడ్

డ్యూటీ... డ్యాన్సుల్లో ట్రాక్ రికార్డ్



విశిష్ట రైల్వే సేవా పురస్కారానికి ఎంపికైన ఉద్యోగిగా గుంటూరుకు చెందిన జవ్వాది వెంకట అనూష వార్తల్లో నిలిచింది.
ఢిల్లీ ప్రగతి మైదాన్‌లో జరిగిన 69వ రైల్వే సేవా పురస్కారాల కార్యక్రమంలో అతి విశిష్ట రైల్వే సేవా పురస్కారాన్ని అందుకున్న అనూష కూచిపూడి నృత్యకారిణి కూడా.
మనసు ఉంటే మార్గం ఉన్నట్టే... ఒక్క పడవ అని ఏమిటి ఎన్ని పడవల మీద అయినా ప్రయాణం అద్భుతంగా సాధ్యం అవుతుంది!

నేర్చుకోవడానికి వ్యక్తులకు మించిన పాఠశాలలు ఉంటాయా?

అనూషకు నాన్న ఒక పాఠశాల. ఆయన రైల్వేలో ఇంజినీర్. వృత్తిపట్ల అంకిత భావం తండ్రి నుంచే నేర్చుకుంది. తాను కూడా నాన్న లాగే రైల్వేలో ఉద్యోగం చేయాలనుకుంది. జవ్వాది వెంకట నాగ సుబ్రమణ్యంతో అనూషకు వివాహం జరిగింది. ఆయన అప్పుడు కేరళ ఐపీఎస్ అధికారిగా ఉన్నారు. 2008లో మళ్లీ సివిల్స్ రాసి ఐఎఎస్‌కు ఎంపిక అయ్యారు. 'మరింత కష్టపడాలి' అనే పాఠాన్ని భర్త నుంచి నేర్చుకున్న అనూష ఇండియన్ రైల్వే సర్వీస్ ఆఫ్ ఇంజినీర్ (ఐఆర్ఎస్ఈ)గా ఎంపిక అయింది.

ఇక కళలకు సంబంధించి అమ్మ తనకు పాఠశాల.

తల్లి స్ఫూర్తితో కూచిపూడి నేర్చుకుంది. సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత వేదాంతం రామలింగ శాస్త్రి శిష్యురాలైన అనూష యూరోపియన్ తెలుగు అసోసియేషన్, అమెరికన్ తెలుగు అసోసియేషన్ కార్యక్రమాలలో చిన్నప్పుడే ప్రదర్శనలు ఇచ్చింది. ఈ ఏడాది జూన్‌లో మధ్యప్రదేశ్ ప్రభుత్వం, సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో భోపాల్‌లో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరై కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చింది.

నృత్యంలో 'భేష్' అనిపించుకున్న అనూష ఉద్యోగ జీవితంలో 'ది బెస్ట్' అనిపించుకుంది.

'గుంటూరు డివిజన్‌కు 2022లో వచ్చాను. కృష్ణకెనాల్ జంక్షన్ నుంచి కృష్ణా నదివైపు ఉన్న ట్రాక్ వీక్‌గా ఉండేది. దీనికోసం ప్రతి ఏటా 50 లక్షలు ఖర్చు చేయాల్సి వచ్చేది. జియో టైల్స్, జియో బ్రిడ్జెస్ వేసి కొత్త తరహాలో ట్రాక్‌ను పటిష్టపరిచాము. దీనివల్ల ఇప్పుడు ఏడాదికి రెండు లక్షలు కూడా ఖర్చు అవ్వడం లేదు. పెద్ద పెద్ద యంత్రాలు వాడకుండా ఎన్నో పనులను వినూత్న రీతిలో పూర్తి చేశాము. దీనికి కూడా జీఎం నుంచి ప్రశంసలు అందుకున్నాను. ఈ ప్రయోగాలు గుంటూరు డివిజన్‌కు బోలెడంత పేరు తీసుకొచ్చాయి. ఈ నేపథ్యంలోనే రైల్వేబోర్డు నన్ను గుర్తించింది. అతి విశిష్ట రైలు సేవా పురస్కారం దక్కింది. మన కష్టం వల్ల వచ్చిన ఫలితాన్ని చూసినప్పుడు వృత్తిపట్ల అంకితభావం మరింతగా పెరుగుతుంది' అంటుంది అనూష.

వృత్తి జీవితంలో, కూచిపూడి నృత్యకారిణిగా ఆమె మరిన్ని పురస్కారాలు అందుకోవాలని ఆశిద్దాం.

– దాళా రమేష్‌బాబు, సాక్షి ప్రతినిధి గుంటూరు
ఫోటోలు: షేక్ సుభానీ, లక్ష్మీపురం

ఎన్నో అడ్డంకులు... అయినా సరే ముందుకు వెళ్లాం!

నా భర్త అస్సాం కేడర్ ఐఏఎస్ కావడంతో నాకు కూడా నార్త్ ఈస్ట్ రైల్వేలో పోస్టింగ్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్‌గా వచ్చింది. అక్కడ తీవ్రవాదంతో పాటు బ్రహ్మపుత్ర వరదల సమస్య ఎక్కువగా ఉన్న కారణంగా ఏడాదిలో ఎనిమిది నెలలు ప్లానింగ్, నాలుగు నెలలు మాత్రమే ఎగ్జిక్యూషన్ ఉండేది. అక్కడ ఉన్న పరిస్థితుల్లో రైలు నడిచేలా చర్యలు తీసుకోవడంతో పాటు సిబ్బందిని కాపాడుకోవడం కూడా ఒక పెద్ద టాస్క్‌లా ఉండేది. ఎన్నో ఇబ్బందులను అధిగమిస్తూ ముందుకు సాగాము. రెండు వర్గాల మధ్య పెద్ద ఎత్తున ఘర్షణలు చోటు చేసుకున్నాయి. ఈ సమయంలో రైల్వే కూడా రాష్ట్ర పరిధిలోకి వచ్చింది. మేం కూడా వారితో కలిసి ప్రశాంతత నెలకొల్పే విషయంలో గట్టిగా పనిచేశాం. గౌరీపూర్ నుంచి బిలాస్‌పూర్ వరకూ కొత్త రైల్వే లైన్ వేసిన సమయంలో బ్రహ్మపుత్రపై పెద్ద పెద్ద బ్రిడ్జీల నిర్మాణం విషయంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నాము. భూసేకరణ కూడా చాలా ఇబ్బందికరంగా మారింది. అన్నింటిని అధిగమించి రైల్వే లైన్ పూర్తి చేయడం పెద్ద అచీవ్‌మెంట్. దీనికి గుర్తింపుగా రైల్వే జీఎం అవార్డు వచ్చింది.

– జవ్వాది వెంకట అనూష



2025 వంటిల్లు

యూత్‌కి కిచెన్ వంట పడుతోంది

ఇల్లు అంటే మొదట చెప్పుకోవాల్సింది వంటిల్లే. ఇల్లు ఎంత పెద్దదైనా చిన్నదైనా ప్రధానంగా ఉండాల్సిన గది వంటగది. ఆ వంటగదిలోకి అడుగుపెట్టకుండా పెద్దయిపోయే పిల్లల తరం కాదిది. సరదాగా వంటగదిలో ప్రయోగాలు చేస్తున్న కొత్త యువతరం మొదలైంది. రాబోయే ఏడాది యూత్ ట్రెండ్ అంతా వంటగది కేంద్రంగా ఉండబోతోంది. అలాగే టీనేజ్‌లో ఉన్న పిల్లలకు తల్లితో అనుబంధం పెరిగేది వంటగదిలోనే. ఇందుకోసం చదువుకున్న తల్లి పాటిస్తున్న నాలుగు సూత్రాలివి.

- పిల్లలను వంటగదిలోకి ఆహ్వానించేటప్పుడు, వారి చేత వంట చేయించేటప్పుడు వాళ్లకు ఇష్టమైన వంటనే చేయాలి, వారి చేత చేయించాలి. వంటల పుస్తకం లేదా ఇంటర్నెట్ ద్వారా తెలుసుకోమని సూచించాలి.
- ఇంటికోసం వంట చేయడమే కాకుండా చారిటీ కోసం వంట చేయడం అలవాటు చేయాలి. ఏదైనా వండి వాటిని అమ్మగా వచ్చిన డబ్బును అనాథలకు ఇవ్వడం ఒక పద్ధతి. అలాగే అనాథాశ్రమం, వృద్ధాశ్రమంలో ఉండే వాళ్ల కోసం వండి తీసుకెళ్లి పంచడం అలవాటు చేయాలి.
- తల్లి తనతోపాటు పిల్లలను కూడా కుకరీ క్లాసులకు తీసుకెళ్లడం ద్వారా అందరూ కలిసి ఒక కొత్త వంటను నేర్చుకోవడం, కలిసి వండడం గొప్ప అనుభూతి. అనుబంధాల అల్లిక కూడా.
- పిల్లలకు ఒక మోస్తరుగా వంట వచ్చిన తర్వాత ఓ చిట్కా పాటించవచ్చు. ఒక రోజు పూర్తిగా లంచ్‌కి అవసరమైన మెనూ అంతా వాళ్లే సిద్ధం చేయాలి. అంటే ఆ ఒక్కరోజుకు చెఫ్‌గా నియామకం అన్నమాట. ఏం వండాలో నిర్ణయించుకుని, అవసరమైన వాటిని మార్కెట్ నుంచి తెచ్చుకుని, వండి, వడ్డించడం వరకు వారిదే బాధ్యత అన్నమాట. ఆ రోజు సర్వీస్‌కి గాను బయటి నుంచి వచ్చిన షెఫ్‌కి ఇచ్చినట్లే పిల్లలకు కూడా పేమెంట్ ఇవ్వాలి. మోడరన్ ఉమెన్ చాలామంది ఇలా పిల్లలను వారానికోరోజు షెఫ్ డ్యూటీకి సిద్ధం చేస్తున్నారు కూడా.



ఏం వెతికారో తెలుసా?

మన యువత 2024లో కూడా ఇంటర్నెట్‌లో వంటల కోసం విపరీతంగా సెర్చ్ చేసినట్లు చెప్తోంది గూగుల్. ఇంతకీ ఈ ఏడాది ఏయే వంటకాల కోసం వెతికారో తెలుసా?

- పోర్న్‌స్టార్ మార్టినీ... దీని పేరు మీద అనేక అభ్యంతరాలున్నాయి. కానీ అదే పేరుతో వ్యవహారంలో ఉంది. ఈ లండన్ లోకల్ డ్రింక్‌ని వెనీలా వోడ్కా, ఫ్రూట్ లిక్కర్, వెనీలా షుగర్‌లతో చేస్తారు.
- రెండవ స్థానంలో మన మామిడికాయ పచ్చడి ఉంది. మూడవ స్థానంలో ఉత్తరాది వంటకం ధనియా పాంజిరి ఉంది. ధనియాల పొడి, చక్కెర, నెయ్యి, రకరకాల గింజలతో చేస్తారు. ఇది కృష్ణాష్టమి రోజు చేసే నైవేద్యం. ఆయుర్వేదం సూచించిన ఆరోగ్య మూలికలతో చేసే ఔషధాహారం.
- నాలుగో స్థానంలో ఉన్న మన ఉగాది పచ్చడే. ఐదవస్థానంలో ఉన్న ఆహారం ఉత్తరాది రాష్ట్రాల చర్నామృత్. పాలు, చక్కెర, పెరుగు, తేనె, నెయ్యి, తులసి ఆకులు, డ్రై ఫ్రూట్స్, కుంకుమపువ్వుతో చేస్తారు. మన పంచామృతం వంటిది. పూజాదికాలలో భగవంతునికి నివేదన చేసి ప్రసాదంగా పంచుతారు.
- ఆరో స్థానంలో ఉన్నది భూటాన్ వాళ్ల ఇమాదత్షి. మీగడ పెరుగులో పచ్చిమిర్చి, ఉల్లిపాయ ముక్కలు నానబెట్టి తింటారు. ఆహారప్రియులు లొట్టలేసుకుంటూ తింటారు. ఇక ఉదయాన్నే తాగే వెచ్చటి కాఫీ కోసం అది కూడా రెస్టారెంట్ స్టైల్ క్రీమీ కాఫీ ఎలా చేయాలోనని సెర్చ్ చేశారు.
- ఎనిమిదో స్థానంలో ఉన్నది కంజి. ఇది ఉత్తరాదిన హోలీ సందర్భంగా తాగే డ్రింక్‌లాంటిదే. బీట్‌రూట్, క్యారట్, ఆవాలు, ఇంగువతో చేసి రాత్రంతా పులియ బెడతారు. యాంటీ ఆక్సిడెంట్స్, ప్రో బయాటిక్స్ సమృద్ధిగా ఉంటాయి. జీర్ణశక్తిని పెంచుతుంది.
- శక్కర్ పారా... ఇది మహారాష్ట్ర వంటకం. గోధుమ పిండి, చక్కెర కలిపి చేస్తారు. గోధుమ పిండిలో చక్కెర బదులు ఉప్పు, జీలకర్ర కలిపి కూడా చేస్తారు. పిల్లలకు చక్కటి చిరుతిండి, పెద్దవాళ్లకు టీ టైమ్ స్నాక్. ఇక పదవ వంటకం చమ్మంతి... ఇది కేరళ కొబ్బరి పచ్చడి. మన తెలుగు వాళ్లకు కూడా అలవాటే. కొబ్బరి, పచ్చిమిర్చి, చింతపండుతో చేస్తారు. ఇడ్లీ, దోశ, అన్నంలోకి కూడా బాగుంటుంది.

గూగుల్ ఇచ్చిన లిస్ట్ చూస్తే ఈ వంటకాల గురించి సెర్చ్ చేసింది యూత్ అని చెప్పకతప్పదు. ఎందుకంటే ఇవన్నీ సులువుగా చేయగలిగిన వంటలే. పండుగల సమయంలో మాత్రమే చేసే ధనియా పాంజిరి, ఉగాది పచ్చడి, చర్నామృత్‌ల కోసం సెర్చ్ చేశారంటే వాళ్లు వంటలో చెయ్యి తిరిగిన వాళ్లు కాదని ఒప్పుకోవాల్సిందే. అలాగే మామిడికాయ పచ్చడి, కొబ్బరి పచ్చడి కూడా. ఇక మనవాళ్లు ఆసక్తిగా బయటి వంటకాల కోసం తొంగి చూసింది లండన్ డ్రింక్, క్రీమీ కాఫీల విషయంలో మాత్రమే. ఇవి కూడా యూత్ ఇంటరెస్ట్ జాబితాలోనివే.

మరో విషయం... బాదం పప్పులు నానబెట్టి రోజూ తినడానికి కారణాలు, ప్రయోజనాలను తెలుసుకున్నారు. అలాగే ఆలివ్ ఆయిల్ గురించి కూడా.

కొత్త ఏడాదికి వింత స్వాగతాలు

కొత్త సంవత్సరం వేడుకలను కోలాహలంగా జరుపుకోవడం చాలా కాలంగా కొనసాగుతోంది. సంవత్సర ఆరంభ దినాన పాత అలవాట్లను వదిలేస్తామని కొత్తగా తీర్మానాలు చేసుకోవడం, కొత్త డైరీలను ప్రారంభించడం, కొత్త సంవత్సరం సందర్భంగా కేకు కోసి, బంధుమిత్రులతో పంచుకోవడం, ఆత్మీయులతో కలసి విందు వినోదాలు జరుపుకోవడం, పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకోవడం వంటివి ప్రపంచవ్యాప్తంగా ఉన్న పద్ధతులే! కొన్ని దేశాల్లో కొత్త సంవత్సరం సందర్భంగా పాటించే ప్రత్యేక ఆచారాలు, పద్ధతులు కూడా ఉన్నాయి. ఇవి కొంత వింతగా ఉంటాయి. ఇలాంటి వింత ఆచారాల గురించి, కొత్త సంవత్సరం ముచ్చట్ల గురించి తెలుసుకుందాం.



టమాలీల కానుక

ఆత్మీయులకు ఇంట్లో వండిన టమాలీలను కానుకగా ఇవ్వడం మెక్సికన్ల ఆచారం. టమాలీ స్పానిష్ సంప్రదాయ వంటకం. టమాలీల తయారీలో మొక్కజొన్న పిండితో పాటు కూరగాయల ముక్కలు, మాంసం, సుగంధద్రవ్యాలు ఉపయోగిస్తారు. కొత్త సంవత్సరం జరుపుకొనే విందు కార్యక్రమాల్లో ఈ టమాలీలను స్థానికంగా 'మెనుడో' అని పిలుచుకునే సూప్‌తో కలిపి వడ్డిస్తారు. మెక్సికన్లు టమాలీలను అదృష్టానికి సంకేతంగా భావిస్తారు.

కొత్త సంవత్సరం కానుకలు



కొత్త సంవత్సరం సందర్భంగా ఆత్మీయులకు కానుకలు ఇచ్చి పుచ్చుకోవడం చాలా చోట్ల ఉన్న పద్ధతే అయినా, జర్మనీలో మాత్రం దీనిని తప్పనిసరి ఆచారం గా పాటిస్తారు. జర్మన్లు కొత్త సంవత్సర వేడుకలకు హాజరైన తమ ఆత్మీయులకు కానుకలు ఇచ్చి పుచ్చుకుంటారు. ఈ కానుకల్లో పుస్తకాలు, పెన్నులు వంటి సర్వసాధారణమైన వస్తువుల నుంచి ఖరీదైన వజ్రాభరణాల వంటివి కూడా ఉంటాయి. జర్మన్లు కొత్త సంవత్సరంలోకి అడుగుపెడుతూనే, షాంపేన్ లేదా స్పార్క్లింగ్ వైన్‌ను రుచి చూస్తారు. దీనివల్ల సంవత్సరం అంతా శుభప్రదంగా ఉంటుందని వారి నమ్మకం. జర్మన్లకు మరో వింత ఆచారం కూడా ఉంది. కొత్త సంవత్సరం సందర్భంగా చిన్న చిన్న సీసపు విగ్రహాలను కరిగించి, కరిగిన సీసాన్ని నీట్లోకి పోస్తారు. నీటిలో ఆ సీసం సంతరించుకునే ఆకారాన్ని బట్టి, కొత్త సంవత్సరంలో జీవితం ఎలా ఉండబోతుందో జోస్యం చెబుతారు.

పన్నెండు ద్రాక్షలు



డిసెంబర్ 31న అర్ధరాత్రి పన్నెండు గంటలు కొడుతుండగా, కొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టే వేళ ఒక్కొక్కరు పన్నెండు ద్రాక్షలను ఆరగించడం స్పానిష్ ఆచారం. స్పెయిన్‌లో మాత్రమే కాదు, స్పానిష్ ప్రజలు ఎక్కువగా నివసించే లాటిన్ అమెరికా దేశాల్లోను, కరీబియన్ దీవుల్లోను ఈ ఆచారాన్ని తప్పనిసరిగా పాటిస్తారు. పన్నెండు ద్రాక్షలను కొత్త సంవత్సరంలోని పన్నెండు నెలలకు సంకేతంగా భావిస్తారు. స్పెయిన్‌లోని అలకాంటీ ప్రాంతానికి చెందిన ద్రాక్షతోటల యజమానులు 1895లో ఈ ఆచారాన్ని ప్రారంభించారు. ఇరవయ్యో శతాబ్ది ప్రారంభం నాటికి ఈ ఆచారం స్పానిష్ ప్రజల్లో విస్తృతంగా వ్యాప్తిలోకి వచ్చింది. డిసెంబర్ 31న అర్ధరాత్రి గడియారం పన్నెండు గంటలు కొడుతుండగా, ఒక్కో గంటకు ఒక్కో ద్రాక్ష చొప్పున పన్నెండు ద్రాక్షలు తినే ఆచారం ఇప్పటికీ కొనసాగుతోంది. స్పానిష్ ప్రజలు ఈ తంతు తర్వాతనే కేకు కోయడం, బాణసంచా కాల్చడం వంటి సంబరాలు జరుపుకుంటారు.



అన్నీ గుండ్రమైనవే

కొత్త సంవత్సరం సందర్భంగా ఫిలిప్పీన్స్ ప్రజలు గుండ్రని వస్తువులను సేకరించడాన్ని, గుండ్రని డిజైన్లు ఉన్న దుస్తులు ధరించడాన్ని, గుండ్రని పండ్లు, ఆహార పదార్థాలు తినడాన్ని శుభప్రదంగా భావిస్తారు. కొత్త సంవత్సరం సందర్భంగా గుండ్రంగా ఉండే పుచ్చకాయలు, యాపిల్, ద్రాక్ష, కివీ, దానిమ్మ, నారింజ, బత్తాయి వంటి పండ్లను, గుండ్రంగా ఉండే డోనట్స్, కుకీస్, గుడ్లు తింటారు. అలాగే, గుండ్రంగా ఉండే నాణేలను సేకరించి దాచుకుంటారు. గుండ్రంగా ఉండే లాకెట్లను ధరిస్తారు. గుండ్రమైన వస్తువులను పరిపూర్ణమైన జీవితానికి సంకేతంగా భావిస్తారు. కొత్త సంవత్సరం రోజున అన్నీ గుండ్రంగా ఉండేటట్లు చూసుకుంటే జీవితంలో పరిపూర్ణత సాధించగలుగుతామని వీరి విశ్వాసం.

ద్వారానికి ఉల్లిపాయలు

కొత్త సంవత్సరం సందర్భంగా గ్రీకు ప్రజలు చర్చిలలో ప్రార్థనలు జరిపి, ఇళ్లకు చేరుకున్న తర్వాత, ఇళ్ల ప్రవేశ ద్వారాలకు, గుమ్మాలకు ఉల్లిపాయలను వేలాడదీస్తారు. ఉల్లిపాయలను ఇలా వేలాడదీయడం వల్ల ఇంట్లోని వారికి ఆయురారోగ్య వృద్ధి, వంశాభివృద్ధి కలుగుతుందని నమ్ముతారు. ఇలా వేలాడదీసిన ఉల్లిపాయలను మరునాడు వేకువ జామునే తొలగిస్తారు. ద్వారాల నుంచి తొలగించిన ఉల్లిపాయలతో ఇంట్లో నిద్రిస్తున్న పిల్లల నుదుటికి తట్టి, వారిని నిద్రలేపుతారు. ఇలా చేయడం వల్ల పిల్లలకు దృష్టిదోషాలు తొలగిపోతాయని వారి నమ్మకం.



సోబా నూడుల్స్‌తో ప్రారంభం



కొత్త సంవత్సరం రోజున జపాన్‌లో వేడి వేడి సోబా నూడుల్స్ తింటారు. ఈ ఆచారాన్ని జపానీస్ ప్రజలు పన్నెండో శతాబ్ది నుంచి కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. పొడవాటి ఈ నూడుల్స్‌ను కొరికి తినడం వల్ల పాత ఏడాదిలోని చెడును కొరికి పారేసినట్లేనని జపానీస్ ప్రజలు భావిస్తారు. వేడి వేడి సూప్‌లో ఉడికించిన సోబా నూడుల్స్ తినడం వల్ల జీవక్రియ మెరుగుపడుతుందని, శీతకాలంలో రోగనిరోధక శక్తి మెరుగుపడుతుందని పురాతన జపానీస్ పాకశాస్త్ర గ్రంథాలు చెబుతుండటం విశేషం.

ధవళవస్త్ర ధారణ



కొత్త సంవత్సరం వేడుకల్లో బ్రెజిల్ ప్రజలు ధవళవస్త్రాలను ధరిస్తారు. బ్రెజిల్‌లో జరిగే కొత్త సంవత్సరం వేడుకల్లో ఎక్కడ చూసినా, తెలుపు దుస్తులు ధరించిన జనాలే కనిపిస్తారు. సంవత్సర ప్రారంభ దినాన తెలుపు దుస్తులను ధరించడం వల్ల సంతవ్సరమంతా ప్రశాంతంగా, సంతృప్తికరంగా గడుస్తుందని బ్రెజిలియన్ల నమ్మకం. తెలుపు దుస్తులు ధరించి చర్చిలకు వెళ్లి ప్రార్థనలు జరుపుతారు. అనంతరం కొత్త సంవత్సరం వేడుకలను విందు వినోదాలతో ఆర్భాటంగా జరుపుకుంటారు.



దిష్టిబొమ్మల దహనం

ఆఫ్రికన్ దేశమైన ఈక్వడార్‌లో కొత్త సంవత్సరం సందర్భంగా ఇళ్ల ముందు వీథుల్లో దిష్టిబొమ్మలను దహనం చేస్తారు. పాత కాగితాలు, కట్టెల పొట్టు, చిరిగిన దుస్తులు నింపి, మానవాకారాల్లో దిష్టిబొమ్మలను తయారు చేస్తారు. డిసెంబర్ 31న అర్ధరాత్రి పన్నెండు గంటలకు కొత్త సంవత్సరంలోకి అడుగుపెడుతున్న వేళ ఈ దిష్టిబొమ్మలను దహనం చేస్తారు. ఈ దిష్టిబొమ్మలను గడచిన సంవత్సరంలో ఎదురైన కష్టాలకు, నష్టాలకు, దురదృష్టాలకు సంకేతంగా భావిస్తారు. వీటిని తగులబెట్టడం ద్వారా కొత్త సంవత్సరంలో అదృష్టం కలసివస్తుందని నమ్ముతారు.

ఇంకొన్ని వింత ఆచారాలు

కొత్త సంవత్సరానికి సంబంధించి ఇంకొన్ని వింత ఆచారాలు కూడా ఉన్నాయి. ఐర్లండ్‌లో ప్రజలు బ్రెడ్ స్లైస్‌తో ఇంటి తలుపులను, కిటికీలను, గోడలను కొడతారు. ఇలా చేయడం వల్ల ఇంట్లోని దుష్టశక్తులు పారిపోతాయని నమ్ముతారు. ఆచార సంప్రదాయాలు ఎలా ఉన్నా, కొత్త సంవత్సరం అంటేనే ఒక కొత్త ఉత్సాహం, ఒక కొత్త సంరంభం. అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు.

ఆల్ హ్యాపీస్ 2025

గుమ్మడి సూప్ స్వేచ్ఛా చిహ్నం



హైతీలో కొత్త సంవత్సరాన్ని గుమ్మడి సూప్ సేవించడంతో ప్రారంభిస్తారు. వీరికి జనవరి1 స్వాతంత్ర్య దినోత్సవం కూడా! గుమ్మడి సూప్‌ను హైతీయన్లు 'సూప్ జోమో' అంటారు. స్వాతంత్ర్యానికి ముందు హైతీని పాలించిన స్పానిష్, ఫ్రెంచ్ వలస పాలకుల హయాంలో గుమ్మడి సూప్‌ను రుచి చూడటానికి స్థానిక నల్లజాతి ప్రజలకు అనుమతి లేదు. అందుకే స్వాతంత్ర్యం పొందిన తర్వాత హైతీయన్లు స్వేచ్ఛా చిహ్నంగా గుమ్మడి సూప్ సేవనంతో కొత్త సంవత్సరాన్ని ప్రారంభించడం ఆచారంగా మార్చుకున్నారు.

పాత్రల మోతతో స్వాగతం



కొత్త సంవత్సరానికి ఇంగ్లండ్, ఐర్లండ్‌లలోని కొన్ని ప్రాంతాల ప్రజలు విచిత్రంగా స్వాగతం పలుకుతారు. ఇంట్లోని గిన్నెలు, మూకుళ్లు, తపేలాలు వంటి వంటపాత్రలపై గరిటెలతో మోత మోగిస్తూ చేసే చప్పుళ్లతో కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతారు. వంటపాత్రలను మోగిస్తూ రణగొణ ధ్వనులను చేయడం వల్ల ఇంట్లోని దుష్టశక్తులు పారిపోతాయని వారి నమ్మకం. తొలుత ఈ ఆచారం ఐర్లండ్‌లో ప్రారంభమైందని చెబుతారు. తర్వాతి కాలంలో ఐర్లండ్‌తో పాటు ఇంగ్లండ్, ఆస్ట్రేలియాలకు కూడా ఈ ఆచారం వ్యాపించింది.

కల్యాణం... కమనీయం...

సినిమా

2024 స్టార్ కపుల్

'శ్రీరస్తూ శుభమస్తు... శ్రీకారం చుట్టుకుంది పెళ్ళి పుస్తకం... ఇక ఆకారం దాల్చుతుంది కొత్త జీవితం'... 'పెళ్ళి పుస్తకం' చిత్రంలోని ఈ పాట తెలుగింటి పెళ్లి వేడుకల్లో వినబడుతుంటుంది. 2024లో పెళ్లితో 'కల్యాణం... కమనీయం...' అంటూ తమ జీవిత పుస్తకంలో కొత్త అధ్యాయాన్ని ఆరంభించిన స్టార్స్ చాలామందే ఉన్నారు. ఇక ఏయే తారలు ఏయే నెలలో, ఏ తేదీన పెళ్లి చేసుకున్నారనే విశేషాలు తెలుసుకుందాం.



● నాగచైతన్య, శోభిత



● ఆంటోని, కీర్తీ సురేష్

ఫిబ్రవరిలో... నార్త్, సౌత్‌లో హీరోయిన్‌గా ఓ మంచి స్థాయికి వెళ్లిన ఉత్తరాది భామ రకుల్ ప్రీత్ సింగ్ ఉత్తరాది ఇంటి కోడలు అయ్యారు. బాలీవుడ్ నటుడు-నిర్మాత జాకీ భగ్నానీతో 21న ఆమె ఏడడుగులు వేశారు. వీరిది ప్రేమ వివాహం. పెద్దల సమ్మతితో గోవాలో పెళ్లి చేసుకున్నారు.

మార్చిలో... పంజాబీ భామ కృతీ కర్బందా, బాలీవుడ్ నటుడు పుల్‌కిత్ సామ్రాట్‌తో మార్చి 15న ఏడు అడుగులు వేశారు. వీరిది ప్రేమ వివాహం. గుర్‌గావ్‌లో వీరి వివాహం జరిగింది.




● రకుల్, జాకీ



● పుల్‌కిత్, కృతీ

● సౌత్, నార్త్‌లో హీరోయిన్‌గా మంచి గుర్తింపు తెచ్చుకున్న తాప్సీ డెన్మార్క్ బ్యాడ్మింటన్ ప్లేయర్ మథియాస్ బో‌ని 23న వివాహం చేసుకున్నారు. పదేళ్ల రిలేషన్‌షిప్‌లో ఉన్న వీరిద్దరూ కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో ఉదయ్‌పూర్‌లో పెళ్లి చేసుకున్నారు.

జూన్‌లో... నటుడు అర్జున్ పెద్ద కుమార్తె, నటి ఐశ్వర్యా అర్జున్, తమిళ స్టార్ కమెడియన్ తంబి రామయ్య కుమారుడు, నటుడు ఉమాపతిల వివాహం చెన్నైలో జరిగింది. చాలా కాలంగా ప్రేమలో ఉన్న ఐశ్వర్య-ఉమాపతి పెద్దల అంగీకారంతో వైవాహిక బంధంలోకి అడుగుపెట్టారు.



● అదితి, సిద్ధార్థ్

● ప్రముఖ బాలీవుడ్ నటుడు శత్రుఘ్న సిన్హా కుమార్తె, హీరోయిన్ సోనాక్షీ సిన్హా, బాలీవుడ్ నటుడు జహీర్ ఇక్బాల్ ఏడడుగులు వేశారు. 23న వీరి వివాహం ఘనంగా జరిగింది.

జూలైలో... వరలక్ష్మీ శరత్ కుమార్ తన ప్రేమికుడు, ముంబైకి చెందిన ఆర్ట్ గ్యాలరీ నిర్వాహకుడైన నికోలయ్ సచ్‌దేవ్‌తో వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. ఇరు కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో థాయ్‌ల్యాండ్‌లో 2న వీరి పెళ్లి జరిగింది.

ఆగస్టులో... 'రాజావారు రాణిగారు' (2019) సినిమాతో తెలుగులో హీరో హీరోయిన్లుగా పరిచయమయ్యారు కిరణ్ అబ్బవరం, రహస్య గోరఖ్. రీల్ లైఫ్‌లో ప్రేమికులుగా నటించిన ఈ ఇద్దరూ రియల్ లైఫ్‌లో భార్యాభర్తలయ్యారు. ఆ మూవీ సమయంలో వీరి మధ్య ఏర్పడిన స్నేహం ఆ తర్వాత ప్రేమగా మారింది. ఇరు కుటుంబ సభ్యుల సమక్షంలో కర్నాటకలోని కూర్గ్‌లో 22న కిరణ్-రహస్య వివాహం చేసుకున్నారు.



● ప్రీతి, క్రిష్



● మేఘా, సాయి విష్ణు



● స్రవంతి, సుబ్బరాజు

సెప్టెంబరులో... హీరోయిన్ మేఘా ఆకాశ్ తన ప్రియుడు సాయి విష్ణుని పెళ్లాడారు. వీరి వివాహం 15న చెన్నైలో ఘనంగా జరిగింది. రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబానికి చెందిన సాయి విష్ణుతో మేఘా ఆకాశ్ చాన్నాళ్లుగా ప్రేమలో ఉన్నారు. ఇరు కుటుంబ సభ్యులు వీరి పెళ్లికి పచ్చజెండా ఊపడంతో ఏడడుగులు వేశారు.

● గత కొన్నాళ్లుగా ప్రేమలో ఉన్న హీరో సిద్ధార్థ్, హీరోయిన్ అదితీరావు హైదరీ వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. తొలుత తెలంగాణలోని వనపర్తి జిల్లా శ్రీరంగాపురంలోని 400 ఏళ్ల పురాతన రంగనాథస్వామి ఆలయంలో మార్చి 27న, ఆ తర్వాత రాజస్థాన్‌లోని ఓ రిసార్ట్‌లో సెప్టెంబరు 16న డెస్టినేషన్ వెడ్డింగ్ చేసుకున్నారు.

నవంబరులో... ప్రముఖ దర్శకుడు క్రిష్ జాగర్లమూడి పెళ్లి పీటలెక్కారు. డాక్టర్ ప్రీతీ చల్లాతో 11న ఆయన ఏడడుగులు వేశారు. 'వేదం, గమ్యం, కంచె, గౌతమీపుత్ర శాతకర్ణి' వంటి చిత్రాలతో తెలుగులో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు క్రిష్. ప్రీతీతో ఆయన వివాహం హైదరాబాద్‌లో అత్యంత సన్నిహితుల సమక్షంలో జరిగింది.



● కిరణ్, రహస్య



● సందీప్, చాందిని

● తెలుగు చిత్ర పరిశ్రమలో గాయకులుగా తమకంటూ ప్రత్యేక గుర్తింపు సొంతం చేసుకున్న రమ్య బెహరా, అనురాగ్ కులకర్ణి 15న వివాహ బంధంలోకి అడుగుపెట్టారు.



● వరలక్ష్మి, నికోలయ్

● నటుడిగా, విలన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా దక్షిణాదిలో తనకంటూ గుర్తింపు సొంతం చేసుకున్న సుబ్బరాజు పెళ్లి పీటలెక్కారు. స్రవంతితో ఆయన ఏడడుగులు వేశారు. 26న వీరి వివాహం జరిగింది.

డిసెంబరులో.. హీరో అక్కినేని నాగచైతన్య-హీరోయిన్ శోభిత ధూళిపాళ్ల వివాహం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ 4న హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోలో వేసిన ప్రత్యేక పెళ్లి పందిరిలో వీరిద్దరూ ఏడడుగులు వేశారు. ఈ వివాహానికి పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు హాజరై, నూతన వధూవరులను ఆశీర్వదించారు. కాగా చైతన్య-శోభితల పరిచయం ప్రేమగా మారి, ఆ తర్వాత పెళ్లి పీటల వరకూ వచ్చింది. పెద్దల అంగీకారంతో ఈ ఇద్దరూ పెళ్లి చేసుకున్నారు.



● ఉమాపతి, ఐశ్వర్య

● 'కలర్ ఫొటో' (2020) సినిమా డైరెక్టర్ సందీప్ రాజ్, నటి చాందినీ రావుతో కలిసి ఏడడుగులు వేశారు. ఇరు కుటుంబ సభ్యుల సమక్షంలో తిరుమలలో 7న వీరి వివాహం జరిగింది. 'కలర్ ఫొటో' చిత్రంలో చిన్న పాత్ర చేసిన చాందినీ రావుతో ఆయన పెళ్లి జరగడం విశేషం. ఆ సినిమా చిత్రీకరణ సమయంలో వారి మధ్య ఏర్పడిన పరిచయం ప్రేమగా మారడంతో పెద్దల అంగీకారంతో ఒక్కటయ్యారు.

● 'నువ్వేకావాలి, ప్రేమించు' వంటి చిత్రాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు నటుడు సాయి కిరణ్. ఆ తర్వాత సీరియల్స్ వైపు వెళ్లిన ఆయన బుల్లితెర ప్రేక్షకులను అలరిస్తున్నారు. ఈ నెల 9న ఆయన స్రవంతి అనే సీరియల్ ఆర్టిస్ట్‌ని వివాహం చేసుకున్నారు.

● మహానటిగా ప్రేక్షకుల మనసుల్లో స్థానం సొంతం చేసుకున్నారు కీర్తీ సురేష్ తన చిన్ననాటి స్నేహితుడు, వ్యాపారవేత్త ఆంటోనీ తట్టిల్‌తో ఈ నెల 12న ఏడడుగులు వేశారు. వీరిద్దరి మధ్య 15 ఏళ్లుగా స్నేహం, ప్రేమ కొనసాగుతోంది. ఇరు కుటుంబ సభ్యులు ఓకే చెప్పడంతో గోవాలో వీరి వివాహం జరిగింది.

● 'మత్తు వదలరా, మత్తు వదలరా 2' వంటి చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్నారు నటుడు శ్రీసింహా (సంగీతదర్శకుడు కీరవాణి తనయుడు). ఆయన వివాహం నటుడు మురళీమోహన్ మనవరాలు మాగంటి రాగతో దుబాయ్‌లో 14న జరిగింది.

ఇలా 2024లో ఎక్కువమంది తారలు వివాహబంధంలోకి అడుగుపెట్టం విశేషం.

● దేరంగుల జగన్ మోహన్



● జహీర్, సోనాక్షి



● శ్రీసింహా, రాగ

కలల నేపథ్యంలో...

ప్రశాంత్ కృష్ణ, అనీషా ధామ, శ్రీనివాస్ రామిరెడ్డి, ఐశ్వర్య హోలక్కల్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'డ్రీమ్ క్యాచర్'. సందీప్ కాకుల దర్శకత్వంలో సీయెల్ మోషన్ పిక్చర్స్‌పై రూపొందిన ఈ సినిమా జనవరి 3న రిలీజ్ కానుంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ ప్రెస్ మీట్‌లో సందీప్ కాకుల మాట్లాడుతూ– ''నిద్రలో వచ్చే కలలపై సినిమా చేస్తే ఎలా ఉంటుందనే ఆలోచనతో 'డ్రీమ్ క్యాచర్' మూవీ మొదలైంది. కలల నేపథ్యంలో ఇలాంటి సినిమా ఇప్పటి దాకా తెలుగులో రాలేదని చెప్పగలను. గంటన్నర నిడివితో ఉండే ఈ మూవీలో పాటలు, ఫైట్స్ ఉండవు'' అన్నారు. ప్రశాంత్ కృష్ణ మాట్లాడుతూ– ''మంచి సైకలాజికల్ థ్రిల్లర్‌గా ఈ సినిమా సరికొత్త అనుభూతినిస్తుంది. మా మూవీ ట్రైలర్ చూశాక అడివి శేష్, రానాగార్లలా నేను ఉన్నానంటూ కామెంట్స్ వస్తున్నాయి. అలాంటి ప్రతిభ ఉన్న నటులతో నన్ను పోల్చడం హ్యాపీగా ఉంది'' అన్నారు. కెమేరామేన్ ప్రణీత్ గౌతమ్ నందా, ట్రైలర్‌కి సంగీతం అందించిన వెంకటేశ్, సిద్ధార్థ్ కాకుల మాట్లాడారు. ఈ చిత్రానికి సంగీతం: రోహన్ శెట్టి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎస్. రవివర్మ.



● ప్రశాంత్ కృష్ణ, అచ్యన సిన్హా, సందీప్

థ్రిల్ ఇస్తోంది

''శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్' సినిమాకి, నా పాత్రకి ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తుండటం హ్యాపీగా ఉంది. మా మూవీ ఆడియన్స్‌కి మంచి థ్రిల్ ఇస్తోంది'' అని హీరోయిన్ అనన్య నాగళ్ల అన్నారు. 'వెన్నెల' కిశోర్ టైటిల్ రోల్‌లో, రవితేజ మహాదాస్యం, అనన్య నాగళ్ల జంటగా, శియా గౌతమ్ కీలక పాత్రలో నటించిన చిత్రం 'శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్'. లాస్యా రెడ్డి సమర్పణలో వెన్నపూస రమణారెడ్డి నిర్మించారు. వంశీ నందిపాటి ఈ చిత్రాన్ని ఈ నెల 25న విడుదల చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం నిర్వహించిన సక్సెస్ మీట్‌లో వంశీ నందిపాటి మాట్లాడుతూ– ''సినిమా స్క్రీన్‌ప్లే చాలా అద్భుతంగా ఉంది, చివరి 40 నిమిషాలు కట్టిపడేస్తోంది, సీట్ ఎడ్జ్ థ్రిల్లర్ అనే ప్రశంసలు వస్తుండటం హ్యాపీ'' అన్నారు. ''తొలి ప్రయత్నంగా నిర్మించిన 'శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్'తో సక్సెస్ సాధించాననుకుంటున్నాను'' అని వెన్నపూస రమణారెడ్డి చెప్పారు.

– అనన్య నాగళ్ల



● రవితేజ మహాదాస్యం, అనన్య నాగళ్ల

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲ 227	78,699
నిఫ్టీ ▲ 63	23,813

విదేశీ సూచీలు (శుక్ర రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	19,572	▽ 448
డోజోన్స్	42,772	▽ 554
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,150	▲ 13
డాక్స్	19,984	▲ 136
షాంఘై	3,400	▲ 2
నికాయ్	40,281	▲ 713

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	76,436
బంగారం (99.5 స్వచ్ఛత)	76,130
వెండి (కిలో)	87,831

ఫారెక్స్ రేట్లు రూ.లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		83.99	87.10
£	బ్రిటన్ పౌండ్		105.36	109.63
€	యూరో		87.24	91.09
¥	జపాన్ ఎన్ (100)		43.00	64.00
AUS	ఆస్ట్రేలియా డాలర్		51.04	55.16
S$	సింగపూర్ డాలర్		60.93	65.00
SAR	సౌదీ రియాల్		21.93	23.44
UAE D	యూఏఈ దిర్హామ్		22.43	24.15
¥	చైనా యువాన్		10.97	12.56

కరిగిపోతున్న రూపాయి

- 21 పైసల నష్టంతో 85.48 వద్ద ముగింపు
- ఇంట్రాడేలో 85.80కు పతనం




న్యూఢిల్లీ: నెలాఖరులో బ్యాంకులు, దిగుమతిదార్ల నుంచి డాలర్లకు డిమాండ్ ఏర్పడటంతో రూపాయి మారకం విలువ మరో జీవిత కాల కనిష్టానికి పడిపోయింది. శుక్రవారం ఇంట్రాడేలో 53 పైసలు తగ్గి 85.80 స్థాయికి పతనమైంది. చివరికి 21 పైసల క్షీణతతో 85.48 వద్ద క్లోజయ్యింది. ఇది రికార్డు స్థాయి ముగింపు కావడం గమనార్హం. అంతేగాకుండా 2023 ఫిబ్రవరి 2 తర్వాత ఒక్క రోజులో రూపాయి ఇంతగా క్షీణించడం ఇదే తొలిసారి. అప్పట్లో దేశీ కరెన్సీ 68 పైసలు పతనమైంది. గత కొన్నాళ్లుగా దాదాపు ప్రతి రోజు రూపాయి మారకం విలువ కొత్త కనిష్టాలకు పడిపోతూనే ఉన్న సంగతి తెలిసిందే. గురువారం కూడా 12 పైసలు పతనమైంది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో..
మారుతి కారు ఆద్యుడు ఒసాము సుజుకీ ఇక లేరు / మధ్య తరగతికి బడ్జెట్‌లో పన్ను ఊరట!

స్టాక్ మార్కెట్ మన్మోహనుడు

మాజీ ప్రధాని మన్మోహన్ హయాంలో మార్కెట్ల దూకుడు ● 5 రెట్లు ఎగసిన బీఎస్‌ఈ ప్రధాన ఇండెక్స్.. సెన్సెక్స్



దశాబ్దకాలంపాటు దేశ ప్రధాన మంత్రిగా బాధ్యతలు నిర్వహించిన మన్మోహన్ సింగ్ హయాంలో స్టాక్ మార్కెట్లు లాభాల దుమ్మురేపాయి. మార్కెట్ల ప్రామాణిక ఇండెక్స్ సెన్సెక్స్ దాదాపు 400 శాతం దూసుకెళ్లింది. వెరసి 10 ఏళ్లలో 8 సంవత్సరాలు లాభాలు పంచింది. 2006-07లో 47 శాతం జంప్ చేయగా.. 2009లో మరింత జోరు చూపుతూ 81 శాతం ఎగసింది. వివరాలు చూద్దాం..

పలు కీలక నిర్ణయాలు

ఆర్థిక మంత్రిగా (1991–96) ఉన్నప్పటి నుంచే క్యాపిటల్ మార్కెట్లలో సంస్కరణలకు బీజం వేశారు మన్మోహన్ సింగ్. భారతీయ ఆర్థిక వ్యవస్థలను ఆధునీకరించడం, అంతర్జాతీయ స్థాయిలో పటిష్టం చేసే విధానాలకు రూపకల్పన చేసారు. సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) 1988లోనే ఏర్పాటైనప్పటికీ 1992లో సెబీ చట్టం ద్వారా దానికి చట్టబద్ధమైన అధికారాలు అందించారు. దేశీ క్యాపిటల్ మార్కెట్లలో పారదర్శకతను పెంపొందించేందుకు, ఇన్వెస్టర్ల ప్రయోజనాలను పరిరక్షించేందుకు సెబీ ఒక పటిష్టమైన నియంత్రణ సంస్థగా మారేందుకు ఇది తోడ్పడింది. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లకు కూడా భారతీయ స్టాక్ మార్కెట్లలో ప్రవేశం కల్పించడం ద్వారా మార్కెట్లో లిక్విడిటీకి, విదేశీ పెట్టుబడులను ఆకర్షించడానికి మన్మోహన్ సంస్కరణలు దోహదపడ్డాయి.

బుల్ పరుగుకు దన్ను



మన్మోహన్ సింగ్ దేశానికి ఆర్థిక స్వేచ్ఛను కల్పించిన గొప్ప శిల్పి. 1991లో సంస్కరణలతో దేశీ స్టాక్ మార్కెట్లలో బుల్ రన్‌కు తెరతీశారు. వ్యాపారాలు భారీగా విస్తరించాయి. దీంతో ప్రామాణిక ఇండెక్స్ సెన్సెక్స్ 1,000 పాయింట్ల స్థాయి నుంచి జోరందుకుంది. 780 రెట్లు ఎగసి ప్రస్తుతం 78,000 పాయింట్లకు చేరుకుంది. ఫలితంగా దీర్ఘకాలిక ఇన్వెస్టర్లకు అత్యుత్తమ రిటర్నులు అందించింది.

\- వీకే విజయకుమార్, చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజిస్ట్, జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్

సంస్కరణల జోష్



ఆర్థిక మంత్రిగా మన్మోహన్ సింగ్ 1991లో చేపట్టిన సంస్కరణలు దేశీ క్యాపిటల్ మార్కెట్లలో చెప్పుకోదగ్గ మార్పులకు కారణమయ్యాయి. దేశ ఆర్థిక వ్యవస్థకు జోష్‌నిచ్చాయి. ఆధునిక భారత్‌కు బాటలు వేశాయి. లైసెన్స్ రాజ్‌కు చెక్ పెట్టడంతోపాటు, స్వేచ్ఛా వాణిజ్యం, స్టాక్ మార్కెట్లలో పారదర్శకత, జవాబుదారీతనానికి ఆయన దారి చూపారు. విదేశీ ఇన్వెస్టర్లకు భారత్‌ను ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు.

\- పల్కా అరోరా చోప్రా, డైరెక్టర్, మాస్టర్ క్యాపిటల్ సర్వీసెస్

4,961 నుంచి 24,693కు

మన్మోహన్ సింగ్ ప్రధానిగా పదవిలో ఉన్న 2004 నుంచి 2014వరకూ పరిగణిస్తే సెన్సెక్స్ 4,961 పాయింట్ల నుంచి 24,693 వరకూ దూసుకెళ్లింది. ఈ కాలంలో మూడేళ్లు మినహా ప్రతీ ఏటా ఇండెక్స్ లాభాల బాటలోనే సాగడం గమనార్హం! ప్రపంచ ఆర్థిక సంక్షోభం కారణంగా 2008లో ఇండెక్సులు పతనంకాగా.. 2011, 2014లోనూ మార్కెట్లు వెనకడుగు వేశాయి. 2011లో సెన్సెక్స్ అత్యధికంగా 27% క్షీణించింది. ఆర్థిక మంత్రిగా మన్మోహన్ 1991లో చేపట్టిన సంస్కరణలు ఆర్థిక వ్యవస్థకు జోష్ నివ్వడంతో టర్న్‌అరౌండ్ అయ్యింది. విదేశీ పెట్టుబడులు భారీగా తరలివచ్చాయి. బక్కచిక్కిన రూపాయి బలోపేతమైంది. ప్రధానంగా విదేశీ మారక నిల్వలు భారీగా ఎగశాయి.



సెన్సెక్స్ పరుగు

ఏడాది	లాభం(%)
2004	33
2005	42
2006	47
2007	47
2009	81
2010	17
2012	26
2013	9

బ్యాంకులు, ఆటో షేర్లలో కొనుగోళ్లు

వారాంతాన సూచీలకు లాభాలు

ముంబై: దేశీయ స్టాక్ సూచీలు వారాంతపు రోజైన శుక్రవారం లాభాలతో ముగిశాయి. సెన్సెక్స్ 227 పాయింట్లు పెరిగి 78,699 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 63 పాయింట్లు బలపడి 23,813 వద్ద నిలిచింది. రూపాయి రోజుకో కొత్త కనిష్టానికి చేరుకోవడం, ఎఫ్ఐఐల వరుస విక్రయాలున్నా.., సూచీలు రాణించడం విశేషం. మార్కెట్లు ఉదయం స్వల్ప లాభాలతో మొదలయ్యాయి. బ్యాంకులు, ఐటీ, ఆటో షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో ఒక దశలో సెన్సెక్స్ 571 పాయింట్లు బలపడి 79,043 వద్ద, నిఫ్టీ 189 పాయింట్లు ఎగసి 23,939 వద్ద గరిష్టాన్ని తాకాయి. ద్వితీయార్ధంలో మెటల్, ఆయిల్‌అండ్ గ్యాస్, విద్యుత్, ఇంధన షేర్లలో అమ్మకాలు తలెత్తడంతో సూచీలు సగానికి పైగా లాభాలు కోల్పోయాయి. బీఎస్‌ఈ స్మాల్‌క్యాప్ సూచీ 0.28% లాభపడగా, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.08 శాతం నష్టపోయింది. అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడవుతున్నాయి.



5 షేర్ల లిస్టింగ్ అదుర్స్

ఇటీవల పబ్లిక్ ఇష్యూ పూర్తి చేసుకున్న అయిదు కంపెనీల షేర్లు శుక్రవారం స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్టయ్యాయి. ప్రీమియం ధరతో లిస్టయ్యి.., ట్రేడింగ్ తొలిరోజే ఇన్వెస్టర్లకు లాభాలు పంచాయి.

MAMATA · DAM CAPITAL · TRANSRAIL · Sanathan Textiles · CONCORD enviro

కంపెనీ పేరు	ఇష్యూ ధర	లిస్టింగ్	గరిష్టం	ముగింపు	మార్కెట్ విలువ(కోట్లలో)
మమతా మెషీనరీ	243	600(147%)	630(159%)	630(159%)*	రూ.1,550 కోట్లు
డీఏఎం క్యాపిటల్	283	393(39%)	457(61%)	415(47%)	రూ.2,934 కోట్లు
ట్రాన్స్‌రైల్ లైటింగ్	432	585(35%)	604(40%)	553(28%)	రూ.7,428 కోట్లు
సనాతన్ టెక్స్‌టైల్	321	419(31%)	423(32%)	389(21%)	రూ.3,283 కోట్లు
కాంకర్డ్ ఎన్విరో	701	832(19%)	860(23%)	828(18%)	రూ.1,715 కోట్లు

●(ధర రూ.లలో) ● బ్రాకెట్లలో పేర్కొన్నవి ట్రేడింగ్ సమయంలో ఆయా షేర్ల ప్రీమియం శాతాలు/ * అప్పర్ సర్క్యూట్

స్టార్ సిమెంట్‌లో అల్ట్రాటెక్ పెట్టుబడులు

- 8.69 శాతం వాటా కొనుగోలు
- డీల్ విలువ రూ. 851 కోట్లు

న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ దిగ్గజం అల్ట్రాటెక్ సిమెంట్ తాజాగా స్టార్ సిమెంట్‌లో మైనారిటీ వాటా కొనుగోలు చేస్తోంది. ప్రమోటర్ల నుంచి మొత్తం 8.69 శాతం వాటా సొంతం చేసుకోనున్నట్లు అల్ట్రాటెక్ పేర్కొంది. ఇందుకు రూ. 851 కోట్లు వెచ్చించనుంది. దక్షిణాది కంపెనీ ఇండియా సిమెంట్స్‌లో ఇటీవలే ఆదిత్య బిర్లా గ్రూప్ కంపెనీ అల్ట్రాటెక్ నియంత్రిత వాటాను సొంతం చేసుకుంది. మరోవైపు అదానీ గ్రూప్ సైతం ఇతర సంస్థల కొనుగోళ్లు, సొంత ప్లాంట్ల ఏర్పాటుతో సిమెంట్ రంగంలో పోటీ పడుతున్న సంగతి తెలిసిందే.

పోటా పోటీగా..

అటు అల్ట్రాటెక్, ఇటు అదానీ గ్రూప్ దిగ్గజం అంబుజా సిమెంట్స్ ఇతర సంస్థల కొనుగోళ్లు, సొంత ప్లాంట్ల ఏర్పాటు ద్వారా సామర్థ్య విస్తరణను చేపడుతున్నాయి. లక్ష్యాలకు అనుగుణంగా చిన్న సిమెంట్ కంపెనీలను కొనుగోలు చేస్తున్నాయి. వెరసి గత రెండేళ్లలో ఇండియా సిమెంట్స్, కేశోరామ్ సిమెంట్ బిజినెస్, ఆర్ఏకేడబ్ల్యూసీటీని సొంతం చేసుకుంది. ఇదేవిధంగా సంఘీ ఇండస్ట్రీస్, పెన్నా ఇండస్ట్రీస్‌సహా ఇటీవలే ఓరియంట్ సిమెంట్‌ను అంబుజా సొంతం చేసుకుంది. తద్వారా 2024లో అదానీ సిమెంట్ సామర్థ్యం 100 ఎంటీపీఏకు చేరింది. కంపెనీ రెండేళ్ల క్రితం హోల్సిమ్ నుంచి 70 ఎంటీపీఏ సామర్థ్యాలను కొనుగోలు చేయడం ద్వారా సిమెంట్ రంగంలోకి ప్రవేశించింది. మరోపక్క 156.66 ఎంటీపీఏ సామర్థ్యంతో అల్ట్రాటెక్ మార్కెట్ లీడర్‌గా నిలుస్తోంది. ఆధిపత్యాన్ని నిలుపుకునే బాటలో 2027కల్లా 200 ఎంటీపీఏ లక్ష్యంగా ముందుకు సాగుతోంది.



బ్లాక్ డీల్ ద్వారా

ఎన్ఎస్ఈ బ్లాక్ డీల్ గణాంకాల ప్రకారం అల్ట్రాటెక్ సిమెంట్ 3.36 కోట్లకుపైగా స్టార్ సిమెంట్ షేర్లను కొనుగోలు చేసింది. షేరుకి రూ. 227.7 సగటు ధరలో వీటిని సొంతం చేసుకుంది. వీటి విలువ రూ. 766 కోట్లుకాగా.. 8.32 శాతం వాటాకు సమానం.

స్టార్ సామర్థ్యమిలా..

మేఘాలయ సంస్థ స్టార్ సిమెంట్ 7.7 ఎంటీపీఏ స్థాపిత సామర్థ్యాన్ని కలిగి ఉంది. షేరుకి రూ. 235 మించకుండా స్టార్ సిమెంట్‌లో 8.69 శాతం వాటాకు సమానమైన 3.7 కోట్ల షేర్ల కొనుగోలుకి బోర్డు అనుమతించినట్లు అల్ట్రాటెక్ వెల్లడించింది. వెరసి రూ. 851 కోట్లవరకూ ఇన్వెస్ట్ చేయనున్నట్లు తెలియజేసింది. దీంతో స్టార్ సిమెంట్ ప్రమోటర్ గ్రూప్‌లోని రాజేంద్ర చమారియా, ఆయన కుటుంబీకుల వాటాలను సొంతం చేసుకుంది. అయితే ఇతర ప్రమోటర్లు(సెంచురీ ప్లై) వాటాలను ఆఫర్ చేయలేదని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. స్టార్ సిమెంట్‌లో ప్రమోటర్, ప్రమోటర్ గ్రూప్ వాటా 66.47 శాతంగా ఉంది.

సాక్షి స్పోర్ట్స్



భారత్ క్లీన్‌స్వీప్

ఆఖరి వన్డేలోనూ ఓడిన వెస్టిండీస్ ● దీప్తికి 6 వికెట్లు, రేణుకకు 4 వికెట్లు

వడోదర: దీప్తి శర్మ (6 వికెట్లు; 48 బంతుల్లో 39 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్) ఆల్‌రౌండ్ ప్రదర్శనతో... వెస్టిండీస్ మహిళల జట్టుతో జరిగిన వన్డే సిరీస్‌ను భారత జట్టు 3–0తో క్లీన్‌స్వీప్ చేసింది. శుక్రవారం జరిగిన ఆఖరి మూడో వన్డేలో టీమిండియా 5 వికెట్ల తేడాతో వెస్టిండీస్‌ను ఓడించింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన కరీబియన్ జట్టు 38.5 ఓవర్లలో 162 పరుగులకే కుప్పకూలింది. సీమర్ రేణుక (4/29) నిప్పులు చెరగడంతో ఓపెనర్లు క్వియానా (0), హేలీ మాథ్యూస్ (0) ఖాతానే తెరువలేదు. డాటిన్ (5), మాండి మంగ్రూ (9) సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. షెమైన్ (46; 7 ఫోర్లు), చినెల్ హెన్రీ (61; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించడంతో ఆ మాత్రం స్కోరు సాధ్యమైంది. తర్వాత హర్మన్ బృందం 28.2 ఓవర్లలో 5 వికెట్లకు 167 పరుగులు చేసి గెలిచింది. స్మృతి మంధాన (4), ప్రతీక (18), హర్లీన్ (1) విఫలమైనా... కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (32; 7 ఫోర్లు), జెమీమా రోడ్రిగ్స్ (29; 1 ఫోర్), రిచా ఘోష్ (11 బంతుల్లో 23 నాటౌట్; 1 ఫోర్, 3 సిక్స్‌లు), దీప్తి రాణించడంతో స్వల్ప లక్ష్యాన్ని 29వ ఓవర్లోనే అందుకుంది.

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి నివాళిగా మెల్‌బోర్న్‌లో ఆస్ట్రేలియాతో 'బాక్సింగ్ డే' టెస్టు ఆడుతున్న భారత పురుషుల జట్టు, వడోదరలో వెస్టిండీస్‌తో తలపడిన భారత మహిళల జట్టు సభ్యులు నల్ల రిబ్బన్లు కట్టుకొని బరిలోకి దిగారు.

9 మూడు మ్యాచ్‌ల ద్వైపాక్షిక వన్డే సిరీస్‌లను భారత జట్టు 3–0తో క్లీన్‌స్వీప్ చేయడం ఇది తొమ్మిదోసారి.

1 వన్డేల్లో రెండుసార్లు 6 వికెట్లు పడగొట్టిన తొలి భారత బౌలర్‌గా దీప్తి శర్మ నిలిచింది. 2016లో శ్రీలంకతో జరిగిన వన్డేలో దీప్తి శర్మ 20 పరుగులిచ్చి 6 వికెట్లు తీసింది.

స్కోరు వివరాలు

వెస్టిండీస్ ఇన్నింగ్స్: క్వియాన (సి) రిచా (బి) రేణుక 0; హేలీ (బి) రేణుక 0; షెమైన్ (సి) ప్రతీక (బి) దీప్తి శర్మ 46; డియాండ్రా (బి) రేణుక 5; హెన్రీ (బి) దీప్తి శర్మ 61; జైదా జేమ్స్ (సి) హర్మన్‌ప్రీత్ (బి) దీప్తి శర్మ 1; ఆలియా (సి) జెమీమా (బి) దీప్తి శర్మ 21; మాండి మంగ్రూ (సి) జెమీమా (బి) రేణుక 9; అఫీ ఫ్లెచర్ (సి) జెమీమా (బి) దీప్తి శర్మ 1; మునిసర్ (బి) దీప్తి శర్మ 4; కరిష్మా (నాటౌట్) 3; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (38.5 ఓవర్లలో ఆలౌట్) 162. వికెట్ల పతనం:** 1–0, 2–1, 3–9, 4–100, 5–102, 6–141, 7–150, 8–152, 9–158, 10–162. **బౌలింగ్:** రేణుక సింగ్ 9.5–0–29–4, టిటాస్ సాధు 7–1–28–0, తనూజ 9–0–44–0, ప్రియా 3–0–30–0, దీప్తిశర్మ 10–3–31–6.

భారత ఇన్నింగ్స్: స్మృతి మంధాన (సి) మునిసర్ (బి) ఆలియా 4; ప్రతీక (సి) కరిష్మా (బి) హేలీ 18; హర్లీన్ (సి) షెమైన్ (బి) డియాండ్రా 1; హర్మన్‌ప్రీత్ (బి) అఫీ ఫ్లెచర్ 32; జెమీమా (సి) డియాండ్రా (బి) కరిష్మా 29; దీప్తి శర్మ (నాటౌట్) 39; రిచా ఘోష్ (నాటౌట్) 23; ఎక్స్‌ట్రాలు 21; **మొత్తం (28.2 ఓవర్లలో 5 వికెట్లకు) 167. వికెట్ల పతనం:** 1–22, 2–23, 3–55, 4–73, 5–129. **బౌలింగ్:** డియాండ్రా 5–2–27–1, ఆలియా 4–0–28–1, హేలీ మాథ్యూస్ 9–1–31–1, అఫీ ఫ్లెచర్ 4.2–42–1, కరిష్మా 5–0–29–1, మునిసర్ 1–0–9–0.

స్వయంకృతం!

టీమిండియా చక్కటి అవకాశాన్ని చేజేతులా చెడగొట్టుకుంది. మెల్‌బోర్న్ టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో ఒక దశలో 153/2తో పటిష్ట స్థితిలో నిలిచిన భారత్ 6 పరుగుల వ్యవధిలో 3 వికెట్లు కోల్పోయింది. రెండో రోజును 164/5 వద్ద ముగించి ఫాలోఆన్ ఎదుర్కొనే ప్రమాదంలో పడింది. ఒక్క అనవసర రనౌట్ భారత ఇన్నింగ్స్ గతినే మార్చేసింది. స్మిత్ భారీ సెంచరీకి లోయర్ ఆర్డర్ సహకారం తోడవడంతో ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో భారీ స్కోరు చేయగా... ఆసీస్ సారథి కమిన్స్ చూపిన తెగువ మన టాపార్డర్‌లో లోపించింది. ఇక ఈ మ్యాచ్‌లో ఏదైనా ఆశ మిగిలుందంటే అది పంత్, జడేజా క్రీజులో ఉండటమే. మరి ఈ జోడీ మూడో రోజు ఆసీస్ పేసర్లను ఎలా ఎదుర్కొంటుందనే దానిపైనే భారత జట్టు ఆశలు ఆధారపడి ఉన్నాయి.


నాలుగో టెస్టులో భారత్ ఎదురీత

- 153/2 నుంచి 164/5
- యశస్వి జైస్వాల్ అర్ధ సెంచరీ
- ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ 474 ఆలౌట్
- స్టీవ్ స్మిత్ భారీ శతకం

మెల్‌బోర్న్: బౌలర్ల అసహాయతకు, బ్యాటర్ల నిర్లక్ష్యం తోడవడంతో ప్రతిష్టాత్మక 'బోర్డర్–గావస్కర్' ట్రోఫీ నాలుగో టెస్టులో భారత్ కష్టాల్లో పడింది. ప్రత్యర్థి బ్యాటర్లు పరుగుల పండగ చేసుకున్న పిచ్‌పై మనవాళ్లు కనీస ప్రదర్శన కనబర్చలేకపోవడంతో శుక్రవారం ఆట ముగిసే సమయానికి టీమిండియా తొలి ఇన్నింగ్స్‌లో 46 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 164 పరుగులు చేసింది. ఓపెనర్ యశస్వి జైస్వాల్ (118 బంతుల్లో 82; 11 ఫోర్లు, 1 సిక్స్) అర్ధశతకంతో రాణించగా... విరాట్ కోహ్లి (36; 4 ఫోర్లు) ఫర్వాలేదనిపించాడు. ఆసీస్ బౌలర్లలో కమిన్స్, బోలండ్ రెండేసి వికెట్లు తీశారు. చేతిలో 5 వికెట్లు ఉన్న టీమిండియా... ప్రత్యర్థి తొలి ఇన్నింగ్స్ స్కోరుకు ఇంకా 310 పరుగులు వెనుకబడి ఉంది. రిషభ్ పంత్ (6 బ్యాటింగ్), రవీంద్ర జడేజా (4 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. ఫాలోఆన్ తప్పించుకోవాలంటే రోహిత్ బృందం ఇంకా 111 పరుగులు చేయాల్సి ఉంది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 311/6తో రెండో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆస్ట్రేలియా 122.4 ఓవర్లలో 474 పరుగులకు ఆలౌటైంది. స్టీవ్ స్మిత్ (197 బంతుల్లో 140; 13 ఫోర్లు, 3 సిక్స్‌లు) భారీ సెంచరీతో కదంతొక్కగా... కమిన్స్ (49; 7 ఫోర్లు) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. భారత బౌలర్లలో బుమ్రా 4, జడేజా 3 వికెట్లు పడగొట్టారు.

ఒక్క రనౌట్‌తో...

సాఫీగా సాగుతున్న భారత ఇన్నింగ్స్‌లో రనౌట్ చిచ్చు పెట్టింది. చూడచక్కటి షాట్లతో సెంచరీ దిశగా సాగుతున్న జైస్వాల్... బోలండ్ వేసిన ఇన్నింగ్స్ 41వ ఓవర్ చివరి బంతిని మిడాన్ వైపు కొట్టి సింగిల్ కోసం పరిగెత్తాడు. కానీ నాన్ స్ట్రయికింగ్ ఎండ్‌లో కోహ్లి స్పందించలేదు. అప్పటికే యశస్వి సగం పిచ్ దాటి వచ్చేశాడు. మిడాన్ వద్ద కమిన్స్ బంతిని అందుకొని కీపర్ కేరీ వైపు విసరడం అతను వికెట్లు గిరాటేయడం జరిగిపోయింది. దాంతో యశస్వి నిరాశగా పెవిలియన్ బాట పట్టాడు. దీంతో యశస్వి–కోహ్లి మూడో వికెట్‌కు 102 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. యశస్వి రనౌట్‌తో ఏకాగ్రత కోల్పోయిన కోహ్లి ఈ సిరీస్‌లో మరోసారి తన బలహీనతను బయట పెట్టుకున్నాడు. బోలండ్ వేసిన ఇన్నింగ్స్ 43వ ఓవర్ తొలి బంతికి కోహ్లి అవుటయ్యాడు. ఆఫ్‌స్టంప్ అవతల వెళుతున్న బంతిని అనవసరంగా ఆడి కీపర్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. నైట్ వాచ్‌మన్ ఆకాశ్‌దీప్ (0) కూడా అవుటవ్వడంతో భారత జట్టు సగం వికెట్లు కోల్పోయింది. గత రెండు మ్యాచ్‌ల్లో మిడిలార్డర్‌లో బ్యాటింగ్‌కు దిగి విఫలమైన రోహిత్ (3) ఓపెనర్‌గానూ నిరాశ పరచగా... కేఎల్ రాహుల్ (24; 3 ఫోర్లు) కమిన్స్ అద్భుతమైన బంతికి బౌల్డయ్యాడు.


స్టీవ్ స్మిత్

స్మిత్ సూపర్ సెంచరీ

భారత బౌలింగ్ లోటుపాట్లను సొమ్ముచేసుకున్న స్మిత్ రెండో రోజు ఆసీస్‌కు భారీ స్కోరు సాధించి పెట్టాడు. బుమ్రా మినహా ఇతర బౌలర్లు ఏమాత్రం ప్రభావం చూపలేకపోతుండటంతో సునాయాసంగా పరుగులు రాబట్టాడు. అతడికి మరో ఎండ్ నుంచి కమిన్స్ చక్కటి సహకారం అందించాడు. ఈ క్రమంలో స్మిత్ 167 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. సుదీర్ఘ ఫార్మాట్‌లో అతడికిది 34వ శతకం. ఏడో వికెట్‌కు 112 పరుగులు జోడించిన అనంతరం కమిన్స్ అవుట్ కాగా... స్టార్క్ (15), లయన్ (13) సాయంతో కీలక పరుగులు జోడించాడు.

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: కోన్‌స్టాస్ (ఎల్బీ) (బి) జడేజా 60; ఖ్వాజా (సి) రాహుల్ (బి) బుమ్రా 57; లబుషేన్ (సి) కోహ్లి (బి) సుందర్ 72; స్మిత్ (బి) ఆకాశ్‌దీప్ 140; హెడ్ (బి) బుమ్రా 0; మార్ష్ (సి) పంత్ (బి) బుమ్రా 4; కేరీ (సి) పంత్ (బి) ఆకాశ్‌దీప్ 31; కమిన్స్ (సి) నితీశ్ రెడ్డి (బి) జడేజా 49; స్టార్క్ (బి) జడేజా 15; లయన్ (ఎల్బీ) (బి) బుమ్రా 13; బోలండ్ (నాటౌట్) 6; ఎక్స్‌ట్రాలు: 27; **మొత్తం (122.4 ఓవర్లలో ఆలౌట్) 474. వికెట్ల పతనం:** 1–89, 2–154, 3–237, 4–240, 5–246, 6–299, 7–411, 8–455, 9–455, 10–474. **బౌలింగ్:** బుమ్రా 28.4–9–99–4; సిరాజ్ 23–3–122–0; ఆకాశ్‌దీప్ 26–8–94–2; జడేజా 23–4–78–3; నితీశ్ రెడ్డి 7–0–21–0; సుందర్ 15–2–49–1.


యశస్వి జైస్వాల్

భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (రనౌట్) 82; రోహిత్ (సి) బోలండ్ (సి) కమిన్స్ 3; రాహుల్ (బి) కమిన్స్ 24; కోహ్లి (సి) కేరీ (బి) బోలండ్ 36; ఆకాశ్‌దీప్ (సి) లయన్ (బి) బోలండ్ 0; పంత్ (బ్యాటింగ్) 6; జడేజా (బ్యాటింగ్) 4; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (46 ఓవర్లలో 5 వికెట్లకు) 164. వికెట్ల పతనం:** 1–8, 2–51, 3–153, 4–154, 5–159. **బౌలింగ్:** స్టార్క్ 13–0–48–0; కమిన్స్ 13–2–57–2; బోలండ్ 12–3–24–2; లయన్ 5–1–18–0; మార్ష్ 3–0–15–0.

11 భారత్‌పై అత్యధిక (11) సెంచరీలు చేసిన బ్యాటర్‌గా స్మిత్ రికార్డుల్లోకెక్కాడు. ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ జో రూట్ (10) రెండో స్థానానికి పడిపోయాడు.

1 'బోర్డర్–గావస్కర్' ట్రోఫీలో అత్యధిక (10) సెంచరీలు చేసిన బ్యాటర్‌గా స్మిత్ నిలిచాడు. విరాట్ కోహ్లి, సచిన్ టెండూల్కర్ 9 శతకాలతో రెండో స్థానంలో ఉన్నారు.

కోహ్లిని గేలి చేసిన ఆసీస్ అభిమానులు

తొలి రోజు ఆటలో ఆస్ట్రేలియా ఓపెనర్ కోన్‌స్టాస్‌ను ఢీకొట్టి జరిమానాకు గురైన కోహ్లికి రెండో రోజు మైదానంలో చేదు అనుభవం ఎదురైంది. విరాట్ ఆడుతున్నంత సేపు గోల చేసిన అభిమానులు... అతడు అవుటై మైదానాన్ని వీడుతున్నప్పుడు అనుచిత వ్యాఖ్యలు చేశారు. దీంతో డ్రెస్సింగ్ రూమ్‌కు వెళ్తున్న కోహ్లి తిరిగివచ్చి ఆసీస్ అభిమానుల వైపు ఆగ్రహంగా చూడగా... భద్రతా అధికారి అతడికి నచ్చజెప్పి తీసుకెళ్లాడు.

కోహ్లి భుజం మీద చేయి వేసి...

శుక్రవారం ఆటలో ఓ అభిమాని సెక్యూరిటీ వలయం దాటుకొని మైదానంలోకి దూసుకు రావడం కలకలం రేపింది. తొలి సెషన్‌లో టీమిండియా ఫీల్డింగ్ చేస్తున్న సమయంలో గ్రౌండ్‌లోకి వచ్చిన ఆ వ్యక్తి కోహ్లి భుజంపై చేయి వేయడం గమనార్హం. ఇది గుర్తించిన సిబ్బంది అతడిని బలవంతంగా మైదానం నుంచి బయటకు తీసుకెళ్లారు.



మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

రేపే కొమురవెల్లి మల్లన్న కల్యాణం

ఈ నెల 29 నుంచి మార్చి 24 వరకు జాతర

సాక్షి, సిద్దిపేట: సిద్దిపేట జిల్లా కొమురవెల్లిలో మల్లికార్జున స్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించేందుకు దేవాదాయ శాఖ ఏర్పాట్లను ముమ్మరం చేసింది. ఆదివారం ఉదయం 10.45 గంటలకు స్వామివారి కల్యాణం జరగనుంది. యేటా మార్గశిర మాసం చివరి ఆదివారం నిర్వహించే స్వామివారి కల్యాణంతో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరుగుతుంది. ఫాల్గున మాసం చివరి ఆదివారం నిర్వహించే అగ్నిగుండాల ప్రవేశంతో జాతర ముగుస్తుంది. మూడు నెలలపాటు బ్రహ్మోత్సవాలు జరిగే ఏకైక శైవక్షేత్రంగా కొమురవెల్లి ప్రసిద్ధిగాంచింది. ఈనెల 29న జాతర మొదలై మార్చి 24వ తేదీ వరకు కొనసాగుతుంది. ఈ ఉత్సవాలకు తెలుగు రాష్ట్రాలతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక నుంచి భక్తులు భారీగా తరలి వస్తారు. మల్లన్న కల్యాణ ఆహ్వాన పత్రికలను ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలకు అందజేశారు.

రెండు పద్ధతుల్లో కల్యాణం

కొమురవెల్లి స్వామి వారి కల్యాణం రెండు పద్ధతుల్లో జరుగుతుంది, యేటా మార్గశిర మాసం చివరి ఆదివారం (ఈ నెల 29న) వీరశైవ ఆగమ శాస్త్రం ప్రకారం కల్యాణోత్సవం నిర్వహిస్తారు. తర్వాత ఫిబ్రవరి 26న మహాశివరాత్రిని పురస్కరించుకుని యాదవ సంప్రదాయం ప్రకారం స్వామి వారి కల్యాణం (పెద్ద పట్నం) నిర్వహిస్తారు.

తోటబావి వద్ద ఏర్పాట్లు

ప్రతి ఏడాది తోటబావి దగ్గర మల్లన్న కల్యాణం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా తోటబావి ప్రాంగణంలో చలువపందిళ్లు వేశారు. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ప్రభుత్వం తరపున స్వామివారికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు అందజేయనున్నారు.

వైభవంగా నిర్వహిస్తాం..

స్వామివారి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. కల్యాణం వైభవంగా నిర్వహిస్తాం. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. – బాలాజీ, ఈవో



శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు దంపతులు



రిషబ్ ఓస్వాల్

రిషబ్ ఓస్వాల్ అకడమిక్ ప్రొఫైల్

పదో తరగతి (ఐసీఎస్ఈ)	ఇంటర్మీడియట్	సీఏ ఇంటర్మీడియట్	సీఏ ఫైనల్
97.5 శాతంతో ఉత్తీర్ణత	96.8 శాతంతో ఉత్తీర్ణత	ఆల్ ఇండియా ఎనిమిదో ర్యాంకు	ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంకు
			సీఎంఏ ఫౌండేషన్, ఇంటర్మీడియట్ ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంకు

చార్టర్డ్ అకౌంటెన్సీ (సీఏ) కోర్సు.. దేశంలో ఎంతో క్లిష్టమైన చదువుల్లో వాటిలో ఒకటిగా భావించే కోర్సు. ఈ కోర్సులో ఉత్తీర్ణత శాతం తక్కువగా ఉంటుందని చాలా మంది వెనుకడుగు వేస్తుంటారు. కానీ, సీఏ విజయవంతంగా పూర్తిచేసినవారికి అద్భుతమైన కెరీర్ ఆహ్వానం పలుకుతుంది. ఇంత ప్రాధాన్యం ఉన్న కోర్సులో చేరి 22 ఏళ్ల వయసులోనే దానిని పూర్తి చేయటమే కాకుండా.. ఈ నెల 26న ఐసీఏఐ విడుదల చేసిన 'ఫైనల్'ఫలితాల్లో జాతీయ స్థాయిలో మొదటి ర్యాంకు సాధించాడు.. పలమనేరుకు చెందిన రిషబ్ ఓస్వాల్. తన విజయానికి హార్డ్ వర్క్, ప్లానింగే కీలకంగా నిలిచాయని చెబుతున్న రిషబ్ ఓస్వాల్ సక్సెస్ స్టోరీ అతని మాటల్లోనే...

ఇష్టంగా చదివితే ఏదీ కష్టం కాదు



రాజస్తాన్ నుంచి పలమనేరుకు

రాజస్తాన్‌కు చెందిన మా కుటుంబం.. వృత్తి రీత్యా చిత్తూరు జిల్లాలోని పలమనేరులో స్థిరపడింది. నాన్న రాజేశ్ ఓస్వాల్ బంగారం, ఫైనాన్స్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. నా స్కూల్ చదువు పలమనేరులోని ఎమ్మాస్ స్విస్ స్కూల్‌లోనే సాగింది. 2018లో ఐసీఎస్ఈ పదో తరగతిలో 97.5 శాతం మార్కులతో పాసయ్యాను. ఆ తర్వాత సీఏ కోర్సు అభ్యసించడానికి గుంటూరులోని మాస్టర్‌మైండ్స్ అకాడమీలో చేరాను. 2020లో ఇంటర్మీడియట్‌లో 96.8 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాను

సీఏ దిశగా ఇలా..

ఇంటర్మీడియెట్ పూర్తవగానే 2020లో సీఏ కోర్సులో చేరాను. 2021లో సీఏ ఇంటర్మీడియట్‌లో జాతీయ స్థాయిలో ఎనిమిదో ర్యాంకు సాధించాను. ఆ తర్వాత ప్రముఖ కన్సల్టింగ్ సంస్థ కేపీఎంజీలో ఆర్టికల్‌షిప్ పూర్తి చేశాను. ఒకవైపు ఆర్టికల్ షిప్ చేస్తూనే సీఏ ఫైనల్ పరీక్షలకు ప్రిపేరయ్యాను. గత నవంబర్‌లో పరీక్షలకు హాజరయ్యాను. తాజాగా విడుదలైన ఫలితాల్లో జాతీయ స్థాయిలో మొదటి ర్యాంకు రావడం ఎంతో ఆనందంగా ఉంది.

సీఏలో మొదటిరోజు నుంచే ప్లానింగ్‌తో చదవాలి

కోర్సులో ఒత్తిడి సహజం.. అలా అని భయపడొద్దు

సీఏ ఆల్ ఇండియా టాపర్ రిషబ్ ఓస్వాల్

భవిష్యత్తులో 'సివిల్స్'పై దృష్టి పెడతానని వెల్లడి

22 ఏళ్ల వయసులోనే నేషనల్ టాపర్‌గా రిషబ్

సీఎంఏ కూడా..

సీఏ కోర్సు కంటే ముందు కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటెన్సీ (సీఎంఏ) కోర్సులో చేరి.. 2020లోనే సీఎంఏ ఫౌండేషన్‌లో, 2021లో సీఎంఏ ఇంటర్మీడియట్‌లో జాతీయ స్థాయిలో ఫస్ట్ ర్యాంకు సొంతం చేసుకున్నాను. అయితే సీఏనే నా లక్ష్యం కావటంతో 2021 నుంచి పూర్తిగా సీఏపైనే దృష్టి పెట్టాను.

ఐదో తరగతిలోనే ఆలోచన..

సీఏ కోర్సు చేయాలనే ఆలోచన నాలో ఐదో తరగతిలోనే మొదలైంది. ఇందుకు మా మేనమామ ప్రోత్సాహం ఎంతో ఉంది. మోతీలాల్ ఓస్వాల్ కంపెనీలో ఆయన సీఏగా పనిచేసే వారు. ఆయనకు లభిస్తున్న గుర్తింపు, హోదా చూసి.. నేను కూడా సీఏ చేయాలని నిర్ణయించుకున్నాను.

డైలీ ప్లానింగ్

సీఏ కోర్సులో రాణించడానికి ప్రతి రోజూ దాదాపు 10 గంటలు చదివాను. పరీక్షలకు నెల రోజుల ముందు నుంచి రోజుకు 12 గంటలు.. చివరి 15 రోజులు రోజుకు 14 నుంచి 15 గంటలు కష్టపడ్డాను. ఇన్‌స్టిట్యూట్ మెటీరియల్ చదవడం, ప్రాక్టీస్ టెస్ట్‌కు హాజరవడం కూడా ఎంతో ప్రయోజనం చేకూర్చాయి.

ఆర్టికల్‌షిప్‌లో ప్రిపరేషన్ కాస్త కష్టమే

సీఏ కోర్సులో ఆర్టికల్‌షిప్ (ప్రాక్టికల్ ట్రైనింగ్) తప్పనిసరి. ఈ సమయంలో మాత్రం ప్రిపరేషన్‌కు ఆశించిన సమయం దొరకలేదు. అందులోనూ ప్రముఖ కన్సల్టింగ్ సంస్థ కేపీఎంజీలో ఆర్టికల్‌షిప్ కోసం చేరడంతో పని భారం కొంత ఎక్కువగానే ఉండేది. అయితే, పరీక్ష సమయం దగ్గరపడుతున్నప్పుడు మా మేనేజర్ నాకు చదువుకునేలా వీలు కల్పించారు. ఇది కూడా నాకు ఎంతో ఉపయోగపడింది.

ఒత్తిడి సహజం

సీఏ కోర్సు ప్రిపరేషన్ సమయంలో మానసిక ఒత్తిడి సహజం. కానీ దీన్ని చూసి ఆందోళన చెందకుండా.. ఒత్తిడిని అధిగమించే మార్గాలు అన్వేషించాలి. నేను రిలాక్సేషన్ కోసం స్నేహితులతోపాటు నా సోదరితో మాట్లాడానికి సమయం కేటాయించాను. నేను ఎప్పుడైన మరింత నిస్సత్తువగా ఉంటే మా సోదరి నాకు నైతిక బలం అందించింది.

మొదటి రోజు నుంచే ప్రణాళిక వేసుకోవాలి

సీఏ కోర్సులో చేరాలనుకునేవారికి నేనిచ్చే సలహా.. కోర్సులో చేరిన మొదటి రోజు నుంచే విజయం దిశగా ప్రణాళిక రూపొందించుకోవాలి. చాలామంది పరీక్షకు కొన్ని నెలల ముందు నుంచి చదవడం ప్రారంభిస్తారు. దీనివల్ల ఒత్తిడికి లోనవడమే కాకుండా.. ఆశించిన ఫలితం కూడా రాదు. దీన్ని దృష్టిలో పెట్టుకుని రెండున్నర సంవత్సరాలు కష్టపడితే.. భవిష్యత్తు అంతా బాగుంటుందని గుర్తించాలి. దానికి అనుగుణంగా నిత్యం కోర్సు పుస్తకాలను అభ్యసనం చేయాలి. అదేవిధంగా.. ఆర్టికల్‌షిప్ సమయంలో కూడా ఏ మాత్రం సమయం దొరికినా చదవడానికే కేటాయించాలి.

'సాక్షి' స్పెల్–బి మెడల్

స్కూల్‌లో చదివేటప్పుడు కోకరిక్యులర్ యాక్టివిటీస్‌లో పాల్గొన్నాను. ఈ క్రమంలో 2016లో 'సాక్షి'స్పెల్–బి ఫైనల్స్‌కు చేరుకుని మెడల్ కూడా సాధించాను. దీంతోపాటు వీఐటీ స్పెల్–బిలోనూ రెండో ర్యాంకు సాధించాను.

ప్రైవేట్ ఈక్విటీ సంస్థలో ఉద్యోగం

ప్రస్తుతం ప్రైవేట్ ఈక్విటీ సంస్థలు లేదా కన్సల్టింగ్ సంస్థలో ఉద్యోగంలో చేరాలని భావిస్తున్నాను. ప్రజాసేవకు దోహదం చేసే సివిల్ సర్వీసెస్ వైపు భవిష్యత్తులో దృష్టి పెట్టాలనుకుంటున్నాను. మా నాన్న నన్ను సివిల్స్ దిశగా అడుగులు వేయాలని సూచిస్తున్నారు. దాన్ని కూడా ఆచరణలో పెడతాను.

– సాక్షి, హైదరాబాద్

నేటి నుంచి అన్నారంలో మళ్లీ పరీక్షలు

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి అన్నారం బరాజ్‌లో ఏర్పడ్డ సీపేజీ లీకేజీలపై సీడబ్ల్యూపీఆర్ఎస్ బృందం మళ్లీ పరీక్షలు జరపనుంది. ఎన్‌డీఎస్ఏ ఆదేశాలతో సమాంతర భూకంప తరంగ అధ్యయన పద్ధతిలో పరీక్షలు (ప్యారలల్ సీస్మిక్ వేవ్ మెథడ్ పరీక్షలు) జరపనున్నారు. గతంలో రెండు సార్లు బరాజ్‌లో బృందం పరీక్షలు జరపగా.. వరదలతో ఆటంకం ఏర్పడింది. మొత్తం 21 వెంట్‌లలో పరీక్షలు చేయాల్సి ఉండగా 9 మిగిలి ఉన్నాయి. ఈ నేపథ్యంలో మళ్లీ పరీక్షలు జరిపేందుకు శని, ఆదివారాల్లో బరాజ్‌కు రానున్నారు. దీంతో బరాజ్ డౌన్‌సీమ్‌లోని వెంట్‌ల వద్ద శుక్రవారం శుభ్రం చేశారు.

31న రాత్రి 12 గంటల దాకా వైన్‌షాపులు ఖుల్లా

నూతన సంవత్సరం నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వెసులుబాటు

బార్ అండ్ రెస్టారెంట్లు, ఈవెంట్ల పర్మిషన్లు రాత్రి ఒంటిగంట వరకు పొడిగింపు

రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు



సాక్షి, హైదరాబాద్: నూతన సంవత్సరం సందర్భంగా ఈ నెల 31న రాష్ట్రంలో మద్యం విక్రయ వేళలను పొడిగించారు. 31న అర్ధరాత్రి ఒంటి గంట వరకు మద్యం విక్రయాలు జరుపుకొనేందుకు అనుమతినిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలోని అన్ని బార్ అండ్ రెస్టారెంట్లు, ఈవెంట్లు, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ హోటళ్లలో అర్ధరాత్రి ఒంటి గంట వరకు మద్యం అమ్మవచ్చు. అదే విధంగా అన్ని వైన్‌షాపులను ఆ రోజు రాత్రి 12 గంటల వరకు తెరిచి ఉంచవచ్చని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇక ఈ వేడుకల్లో డ్రగ్స్ వినియోగించకుండా, ఇతర రాష్ట్రాల నుంచి తెచ్చే మద్యం అమ్మకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించింది. ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో జరిగే ఈవెంట్లు, పార్టీలపై నిఘా ఉంచాలని స్పష్టం చేసింది. ఈ మేరకు ఇటీవల జిల్లాల అధికారులతో జరిగిన సమావేశంలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ సిబ్బందికి సూచించారు.

4 రోజుల పాటు ఏపీజీవీబీ సేవలు నిలిపివేత

- ఈ నెల 30, 31 తేదీల్లో రూ.10 వేలు విత్‌డ్రా చేసుకునే అవకాశం
- తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఏపీజీవీబీ విలీనం.. జనవరి 1 నుంచి తెలంగాణ గ్రామీణ బ్యాంకుగా సేవలు
- ఏపీజీవీబీ చైర్మన్ కె.ప్రతాప్‌రెడ్డి

హనుమకొండ: ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ (ఏపీజీవీబీ) బ్రాంచీలు తెలంగాణ గ్రామీణ బ్యాంకులో విలీనం అవుతున్న క్రమంలో నాలుగు రోజులపాటు బ్యాంకు సేవలు నిలిచిపోనున్నాయని బ్యాంక్ చైర్మన్ కె.ప్రతాప్‌రెడ్డి చెప్పారు. శుక్రవారం హనుమకొండలోని ఏపీజీవీబీ ప్రధాన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఒక రాష్ట్రంలో ఒకే ప్రాంతీయ గ్రామీణ బ్యాంకు ఉండాలని నిబంధనలు తీసుకువచ్చిందన్నారు. ఈ క్రమంలో తెలంగాణలోని ఏపీజీవీబీ బ్రాంచీలను తెలంగాణ గ్రామీణ బ్యాంకులో విలీనం చేస్తున్నట్లు తెలిపారు. ఈ దృష్ట్యా ఈ నెల 28 నుంచి 31 వరకు ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ వికాస బ్యాంక్ సేవలు నిలిపివేయనున్నట్లు వివరించారు. అయితే అత్యవసరాల కోసం ఈ నెల 30, 31 తేదీల్లో రూ.10 వేల వరకు విత్ డ్రా చేసుకునే అవకాశాన్ని ఖాతాదారులకు కల్పిస్తున్నామన్నారు. తమ బ్యాంకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో 771 బ్రాంచీలు కలిగి ఉందన్నారు. తెలంగాణలోని 493 బ్రాంచీలను తెలంగాణ గ్రామీణ బ్యాంకుల్లోకి విలీనం చేస్తున్నట్లు వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లోని మిగతా 278 బ్రాంచీలు అదే రాష్ట్రంలో ఏపీజీవీబీ పేరిట కొనసాగుతాయన్నారు. తెలంగాణలో ఏపీజీవీబీ ఏటీఎంలు, నెట్ బ్యాంకింగ్, యూపీఐతో పాటు ఇతర బ్యాంకింగ్ సేవలకు అంతరాయం కలుగుతుందన్నారు. దీనిపై విస్తృత ప్రచారం చేస్తున్నామన్నారు. ఖాతాదారులు సహకరించాలని ఆయన కోరారు. 2025 జనవరి 1 నుంచి తెలంగాణ గ్రామీణ బ్యాంకుగా సేవలు పునరుద్ధరిస్తామన్నారు. బ్రాంచీల విలీనం జరిగినా ఖాతా నంబర్లు మారవని స్పష్టం చేశారు.



మాట్లాడుతున్న ఏపీజీవీబీ చైర్మన్ కె.ప్రతాప్‌రెడ్డి

నీట్ పీజీ మెరిట్ లిస్ట్ విడుదల

రాష్ట్ర మెరిట్ జాబితా విడుదల చేసిన కాళోజీ వర్సిటీ

పీజీ కౌన్సెలింగ్‌కు 3,314 మంది అర్హత

- నేటి సాయంత్రం 4 గంటల వరకు అభ్యంతరాలకు గడువు
- ఆ తర్వాత తుది మెరిట్ జాబితా ప్రకటన
- జాబితాలో ఇతర రాష్ట్రాల విద్యార్థులు 281 మంది
- సుప్రీంకోర్టు తీర్పు తర్వాతే తుది ప్రవేశాలు: వీసీ కరుణాకర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: సుదీర్ఘ జాప్యం తరువాత ఎట్టకేలకు నీట్ పీజీ అడ్మిషన్లకు రాష్ట్ర మెరిట్ జాబితాను కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం శుక్రవారం విడుదల చేసింది. హైకోర్టు తీర్పును పరిగణనలోకి తీసుకొని తెలంగాణలో ఎంబీబీఎస్ చేసిన స్థానికేతరులను 'లోకల్ ఏరియా'కింద పరిగణిస్తూ 3,314 మందిని పీజీ కౌన్సెలింగ్‌కు అర్హులుగా ప్రకటించింది. హైకోర్టు ఆదేశాల మేరకు 281 మంది ఇతర రాష్ట్రాలకు చెందిన అభ్యర్థులు పీజీ అడ్మిషన్లకు అర్హులుగా యూనివర్సిటీ తెలిపింది. అదే సమయంలో తక్కువ పర్సంటైల్‌తో ఎంబీబీఎస్ పూర్తిచేసిన ఇతర రాష్ట్రాలకు చెందిన 30 మంది విద్యార్థులను కౌన్సెలింగ్‌కు అనర్హులుగా ప్రకటించింది. ఈ మెరిట్ జాబితాకు సంబంధించి ఏవైనా అభ్యంతరాలు, ఫిర్యాదులు ఉంటే శనివారం (28వ తేదీ) సాయంత్రం 4 గంటలలోపు " knrpgadmissions@gmail.com' మెయిల్ ఐడీకి ఫిర్యాదు చేయవచ్చు. ఫిర్యాదులకు బలం చేకూర్చే పత్రాలను కూడా అదేరోజు సమర్పించాల్సి ఉంటుంది. ఫిర్యాదులు పరిశీలించిన తరువాత తుది మెరిట్ లిస్ట్‌ను ప్రకటించనున్నట్లు యూనివర్సిటీ తెలిపింది.

స్థానికత వివాదంతో ఆలస్యం

నీట్ పీజీ అడ్మిషన్లలో తెలంగాణ విద్యార్థులకే అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో అడ్మిషన్ నిబంధనల్లో ప్రభుత్వం పలు మార్పులు చేసింది. గత పదేళ్లుగా స్థానికేతరులకు కొనసాగిన 15 శాతం నాన్ లోకల్ కోటాను తొలగించడంతో పాటు స్థానికతకు సంబంధించి కొన్ని నిబంధనలను జత చేస్తూ అక్టోబర్ 28న జీవో 148, 149లను తీసుకొచ్చింది. రాష్ట్రంలో మెడికల్ పీజీ అడ్మిషన్ పొందాలంటే ఎంబీబీఎస్, బీడీఎస్, బీహెచ్ఎంఎస్ కోర్సులు తప్పనిసరిగా తెలంగాణలో చదివి ఉండాలని, అలాగే 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు తెలంగాణలో చదివినవారే అర్హులు అయ్యే విధంగా నిబంధనలు చేర్చింది. వీటిని సవాల్ చేస్తూ 94 మంది విద్యార్థులు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో అక్టోబర్‌లో ప్రారంభం కావాల్సిన అడ్మిషన్ల ప్రక్రియ వాయిదా పడింది. ఈ నెల 17న హైకోర్టు ఈ వివాదంపై తీర్పునిస్తూ 148, 149 జీఓలను కొట్టి వేసింది. ప్రెసిడెన్షియల్ రూల్స్–1974 ప్రకారం ఎంబీబీఎస్ తెలంగాణలో చదివిన వారంతా పీజీ అడ్మిషన్లలో లోకల్ కోటా కింద అర్హులేనని స్పష్టం చేసింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీంతో మెరిట్ జాబితాను ప్రకటించలేదు. ఈలోపు జాతీయ స్థాయిలో నీట్ ప్రవేశాల ప్రక్రియ రెండు రౌండ్లు ముగిశాయి. రాష్ట్ర ప్రభుత్వ అప్పీల్ పిటిషన్‌పై సుప్రీంకోర్టులో వచ్చే నెల 7వ తేదీన వాదనలు జరిగే అవకాశం ఉండడంతో విద్యార్థుల్లో ఆందోళన మొదలైంది. యూనివర్సిటీ తాత్సారంపై విమర్శలు వెల్లువెత్తాయి.



పిటిషన్ పెండింగ్‌లో ఉండగానే..

నీట్ పీజీ మెరిట్ లిస్టు ఆలస్యంతో జాతీయస్థాయి ప్రవేశాలకు ఎదురవుతున్న ఇబ్బందులపై విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశాన్ని ఐఎంఏతో పాటు సీఎం రేవంత్‌రెడ్డి, వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టులో విచారణ ప్రక్రియ పెండింగ్‌లో ఉండగానే వర్సిటీ నీట్ పీజీ మెరిట్ లిస్ట్‌ను విడుదల చేసింది. దీంతో ఎంసీసీ ద్వారా జాతీయస్థాయిలోని ప్రతిష్టాత్మక కళాశాలల్లో ప్రవేశాలు పొందే అవకాశం ఉన్న ర్యాంకర్లు దరఖాస్తు చేసేందుకు వెసులుబాటు లభించింది. ఇప్పటికే ఎంసీసీ అడ్మిషన్లకు మూడో రౌండ్ ప్రక్రియ ప్రారంభమైంది. తెలంగాణ స్టేట్ మెరిట్ లిస్టు ద్వారా జాతీయ స్థాయి కళాశాలల్లో ప్రవేశాలు పొందేవారికి ఇది ఉపయోగపడనుంది. కాగా, తెలంగాణలోని ప్రభుత్వ పీజీ మెడికల్ కళాశాలల్లో 2,708 పీజీ వైద్య విద్య సీట్లు ఉన్నట్లు జాతీయ వైద్య మండలి ఇటీవల వెల్లడించింది. ఇందులో ప్రభుత్వ కళాశాలల్లో 1,500 వరకు ఉన్నాయి. ఇందులో సగం సీట్లు సెంట్రల్ పూల్‌కు వెళితే మిగిలే సీట్ల కోసం తెలంగాణలో ఎంబీబీఎస్ చేసిన విద్యార్థులు పోటీ పడాల్సి ఉంటుంది.



సుప్రీం తీర్పును అనుసరించే ప్రవేశాల ప్రక్రియ

నీట్ పీజీ అడ్మిషన్లకు సంబంధించి హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా మెరిట్ లిస్టు విడుదల చేశాం. సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన తరువాత తదనుగుణంగా అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగిస్తాం. శనివారం సాయంత్రం 4 గంటల వరకు అభ్యంతరాలు స్వీకరించి, తరువాత తుది మెరిట్ లిస్ట్ ప్రకటిస్తాం.

– కరుణాకర్ రెడ్డి, కాళోజీ యూనివర్సిటీ వీసీ

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

బతుకులను మార్చిన 'బంతి'

వాలీబాల్ ఆటలో గోవిందరావుపేట యువకుల ప్రతిభ

- రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణింపు
- ఉన్నత స్థాయిలో కొందరు.. కూలీలుగా మరికొందరు
- మట్టిలో మాణిక్యాలను వెలికి తీసిన వాలీబాల్ ఆట

గోవిందరావుపేట: వాలీబాల్ ఆటంటే గుర్తొచ్చేది ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం అని చెప్పొచ్చు. అంతటి ప్రత్యేకత సంతరించుకున్న ఈ మండలం నుంచి ఎంతోమంది యువకులు వాలీబాల్ ఆటలో రాణించి జీవితంలో స్థిరపడ్డారు. మరికొందరు ఆర్థిక పరిస్థితులు బాగులేక, చదువులు పూర్తి కాక రోజువారీ కూలి పనులు చేసుకుంటూ ఆటలో, చదువులో రాణిస్తున్నారు. రాష్ట్రంలో ఎక్కడ వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించినా గోవిందరావుపేట మండలం క్రీడాకారులు పాల్గొంటారు. ప్రథమ లేదా ద్వితీయ స్థానం దక్కించుకుని వస్తారు. అంతేకాకుండా భారత్ టీంలో కెప్టెన్‌గా, కోచ్‌గా, టీంలో సభ్యులుగా.. ఈ మండలం నుంచి ఎంతోమంది క్రీడాకారులు రాణించారు., రాణిస్తున్నారు. గోవిందరావుపేట మండలం రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి వాలీబాల్ క్రీడాకారులను అందించడం విశేషం.


ఇండియా వాలీబాల్ మహిళ జట్టు టీముతో కోచ్ కోసరి క్రిష్ణ ప్రసాద్

చల్వాయి వాలీబాల్ టీం ప్రత్యేకం

రాష్ట్రంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో చల్వాయి వాలీబాల్ **టీం** ప్రత్యేకమైనది. 1985లో గ్రామంలో వాలీబాల్ ఆట మొదలైంది. గ్రామానికి చెందిన గింజిపెల్లి నాగేశ్వరరావు, సురేశ్, భేతి రవీందర్ రెడ్డి, ఎండి హకీం, గాజర్ల తిరుపతి, బండమీది రమేశ్, అప్పాల శ్రీనివాస్‌లతోపాటు పలువురికి ఆట నేర్చుకోవాలనే తపన విద్యార్థి దశలోనే కలిగింది. అప్పటి పీఈటీలు గణపతి రెడ్డి, రాములు.. జెడ్పీ హైస్కూల్ ఆవరణలో వాలీబాల్ గ్రౌండ్ ఏర్పాటు చేసి విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. అప్పటి శిక్షణలో క్రీడాకారులకు కనీసం కాళ్లకు చెప్పులు కూడా లేని పరిస్థితి. వాలీబాల్ క్రీడపై మక్కువ చూపుతున్న క్రీడాకారులను పీఈటీలు చూసి మురిసిపోయి మరింత ప్రోత్సాహం అందించారు. 1990లో ఖిలా వరంగల్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌లో.. జిల్లాలో మొదటి స్థానంలో నిలిచే వెంకటాపూర్, ఇనుగుర్తి టీంలను సైతం చల్వాయి టీం ఓడించింది. చల్వాయి టీం మొదటి స్థానం సాధించడంతో రాష్ట్రస్థాయి క్రీడాకారులు సైతం ఆశ్చర్యపోయారు. దీంతో చల్వాయి గ్రామంలో వాలీబాల్ ఆటపై చాలామంది యువకుల్లో ఆసక్తి పెరిగి బంతి పట్టి సాధన మొదలుపెట్టారు. గ్రామంలో ఇప్పటికే మేకల కృష్ణ ప్రభుత్వ పాఠశాలలో పీడీగా, సాయబోయిన భిక్షపతి పోలీస్ శాఖలో, కన్నెబోయిన సతీశ్ ఎస్ఆర్ యూనివర్సిటీ కోచ్‌గా, తాటి సుమన్, మద్దెల శ్రీనులు కళాశాలలో పీఈటీలుగా ఉద్యోగాలు చేస్తూ విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. చదువుతో పాటు, వాలీబాల్ క్రీడల్లో రాణించడంతో.. గ్రామానికి చెందిన సుమారు 30 మంది క్రీడా కోటాలో డిఫెన్స్, పోలీస్, ఆర్మీ, పీఈటీ, ఉపాధ్యాయులుగా ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగాలు సాధించి జీవితంలో స్థిరపడ్డారు.

భారత్ కెప్టెన్‌గా పాలడుగు వెంకటేశ్వరరావు

గోవిందరావుపేటలో జన్మించిన పాలడుగు వెంకటేశ్వరరావు వాలీబాల్ క్రీడల్లో రాణిస్తూ అంచెలంచెలుగా ఎదిగారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించారు. భారత జట్టులో 1995 నుంచి 2001 వరకు 6 సంవత్సరాల పాటు 19 అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని, 9 బంగారు, 2 సిల్వర్, 4 కాంస్య పతకాలు సాధించారు. వెంకటేశ్వరరావు ప్రతిభను గుర్తించి 1996లో మూడు అంతర్జాతీయ టోర్నమెంట్‌లకు కెప్టెన్‌గా బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం డాజిల్ స్పోర్ట్స్ వేర్ కంపెనీని స్థాపించి క్రీడాకారులకు కావాల్సిన దుస్తులను తయారుచేస్తూ, క్రీడా రంగంలో ములుగు జిల్లాను దత్తత తీసుకున్నారు. క్రీడాకారులకు కావలసిన ఆర్థిక సహాయాన్ని, టోర్నమెంట్లు నిర్వహించడానికి తన వంతు సహాయం చేస్తున్నారు.

గోవిందరావుపేట నుంచి ఎందరో క్రీడాకారులు..

గోవిందరావుపేట గ్రామంలో 1982లో వాలీబాల్ ఆట మొదలైంది. అప్పటి గోవిందరావుపేట హైస్కూల్ పీఈటీలు రాజుకుమార్, నర్సింహం ఆధ్వర్యంలో శిక్షణ పొందిన క్రీడాకారులు కోనేరు చంద్రశేఖర్, గోడవల్లి రామకృష్ణ, అన్నె శ్రీనివాస్, కొంరాజుల నరేందర్, ఆకుల యుగేందర్, గోడవల్లి జయప్రకాశ్, ముంజా రమేశ్, తుమ్మల రామకృష్ణ, సూరపనేని రవి, కొత్తపల్లి ప్రసాద్, నాగేశ్వరరావు, సాంబశివరావులు వాలీబాల్ ఆటల్లో రాణించేవారు. స్పోర్ట్స్ కోటాలో సుమారు ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో 20 మంది క్రీడాకారులు ఉద్యోగాలు సాధించి జీవితంలో స్థిరపడ్డారు. గ్రామం నుంచి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆడడమే కాకుండా.. ఇండియా జట్టు కెప్టెన్‌గా పాలడుగు వెంకటేశ్వరరావు వ్యవహరించడం గర్వించదగ్గ విషయం.

కుగ్రామంనుంచి అంతర్జాతీయ స్థాయి కోచ్‌గా..

ములుగు జిల్లాలోని చల్వాయి గ్రామం నుంచి కోసరి కృష్ణ ప్రసాద్ వాలీబాల్ ఆటలో గ్రామస్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి కోచ్‌గా ఎదిగారు. 1994లో వాలీబాల్ ఆట మొదలుపెట్టిన కృష్ణ ప్రసాద్ అనతి కాలంలోనే తిరుగులేని ఆటగాడిగా రుజువు చేసుకున్నారు. ఇప్పటి వరకు 33 బంగారు, రెండు రజిత పతకాలతోపాటు క్రీడా సేవ రత్న అవార్డు అందుకున్నారు. ఇతని ప్రతిభతో 2005లో డీఆర్డీవోలో ఉద్యోగం సాధించారు. ప్రస్తుతం భారత మహిళ వాలీబాల్ జట్టుకు కోచ్‌గా వ్యవహరిస్తున్నారు. ఇదే గ్రామంలో తనతో ఆడిస్తూ.. ఆటల్లో మెలకువలు నేర్పుతూ.. శిక్షణ ఇస్తూ.. మరింత మంది క్రీడాకారులను తయారు చేశారు. వారంతా ప్రస్తుతం ప్రతిభతో పాటు స్పోర్ట్స్ కోటాలో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించినందుకు సంతోషంగా ఉందని కోసరి కృష్ణప్రసాద్ పేర్కొన్నారు.


చల్వాయి వాలీబాల్ టీం


గోవిందరావుపేట వాలీబాల్ టీం



విసుగెత్తిస్తున్న వీఐపీలు

- దేశంలో తగ్గని వీఐపీ సంస్కృతి
- లోకల్ సర్కిల్స్ సర్వేలో ప్రతి ముగ్గురిలో ఇద్దరి అభిప్రాయం ఇదే..
- ఆసుపత్రులు, రోడ్లు, ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రార్థన స్థలాల్లో వీఐపీ సంస్కృతి ఎక్కువని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ప్రజాస్వామ్యంలో వివిధ పదవుల్లో ఉండే నాయకులు, అధికారంలో లేకపోయినా ప్రముఖ రాజకీయ నాయకులు, సినిమా, వ్యాపారం సహా పలు రంగాల్లో అత్యంత ప్రముఖులు.. ఇలా మన దేశంలో వీఐపీ (వెరీ ఇంపార్టెంట్ పర్సన్)లకు కొదవ లేదు. వీళ్లు కాలు తీసి కాలు పెట్టినా.. అత్యంత ప్రాధాన్యం కోరుకుంటారు. ఇది కొన్ని సందర్భాల్లో శ్రుతి మించుతోంది కూడా. ఇటీవల ఝాన్సీ పట్టణంలోని ఒక ఆసుపత్రిలో జరిగిన ప్రమాదంలో 10 మంది నవజాత శిశువులు చనిపోవడం తెలిసిందే. ఆ చిన్నారుల తల్లిదండ్రులు మృతదేహాల కోసం ఎదురు చూస్తుండగా.. ఓ మంత్రి పరామర్శకు ఆసుపత్రికి వస్తున్నారని సిబ్బంది రోడ్ల వెంట సున్నంతో లైన్లు కొట్టి ఏర్పాటు చేస్తున్న వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. దేశంలో ఈ వీఐపీ సంస్కృతిపై విమర్శలు మొదలయ్యాయి. దేశంలో వీఐపీ సంస్కృతిపై లోకల్ సర్కిల్స్ సంస్థ దేశవ్యాప్తంగా 362 జిల్లాల్లో నిర్వహించిన సర్వేలో 45 వేల మంది అభిప్రాయాలు సేకరించింది. ఆ సర్వేలో పాల్గొన్న ప్రతి ముగ్గురిలో ఇద్దరు.. వీఐపీ సంస్కృతిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. 64 శాతం మంది దేశంలో వీఐపీ సంస్కృతి తగ్గడం లేదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ప్రధానంగా రోడ్లపై వెళ్తున్నప్పుడు, టోల్ ప్లాజాల వద్ద నిరీక్షణ, ఆసుపత్రులు, ప్రభుత్వ కార్యాలయాల్లో మితిమీరిన జోక్యం వంటి అంశాలను వారు ఉదహరించారు. ప్రభుత్వ స్థలాలు కబ్జా చేయడం, బెదిరింపులకు పాల్పడడం, ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలు, పోస్టింగ్‌ల కోసం డబ్బు వసూలు.. ఇలా ఎన్నో విషయాల్లో వీఐపీల ధోరణిని వారు సర్వేలో లేవనెత్తారు. సర్వేలో పలు అంశాలపై అడిగిన ప్రశ్నలకు వచ్చిన సమాధానాలివి.

మూడేళ్లలో భారత్‌లో వీఐపీ సంస్కృతి మారిందా..?

అభిప్రాయం	శాతంలో
గతంతో పోలిస్తే మరింత పెరిగింది	14 శాతం మంది
గతంలో మాదిరిగానే కొనసాగుతోంది	46 శాతం మంది
గతంతో పోలిస్తే స్వల్పంగా పెరిగింది	4 శాతం మంది
గతంతో పోలిస్తే కొంతమేర తగ్గింది	26 శాతం మంది
గతంతో పోలిస్తే చాలా తగ్గిపోయింది	9 శాతం మంది

ఏ సమయంలో వీఐపీ సంస్కృతితో ఇబ్బందులు ఎదుర్కొన్నారు..?

అభిప్రాయం	శాతంలో
రోడ్లపై ప్రయాణం, టోల్ ప్లాజాల వద్ద	27 శాతం మంది
రోడ్లు, ఎయిర్‌పోర్టుల్లో	50 శాతం మంది
రైళ్లు, రైల్వే స్టేషన్లలో	11 శాతం మంది
విమానాలు, ఎయిర్ పోర్టుల్లో	12 శాతం మంది

ప్రయాణ సమయాల్లో కాకుండా ఇంకా ఎక్కడెక్కడ వీఐపీ సంస్కృతి చూశారు..?

అంశం	శాతంలో
ప్రభుత్వ కార్యాలయాల్లో	83 శాతం మంది
పబ్లిక్, ప్రైవేట్ ఈవెంట్లలో	79 శాతం మంది
మతపరమైన ప్రాంతాల్లో	73 శాతం మంది

గత ఏడాదిలో ఆసుపత్రుల వద్ద వీఐపీ సంస్కృతి గమనించారా..?

అవును, ప్రతిసారి	12 శాతం మంది
ఒకసారి గమనించాను..	12 శాతం మంది
లేదు, ఒక్కసారి కూడా వీఐపీ సంస్కృతి ఆసుపత్రుల్లో చూడలేదు	66 శాతం మంది
చెప్పలేను	10 శాతం మంది

వీఐపీలు చేసే తప్పుల్లో మీరు గమనించినవి..:

అంశం	శాతంలో
ప్రభుత్వ ఆస్తులు ఆక్రమణ	48 శాతం మంది
సొసైటీ, కాలనీ నిబంధనల అతిక్రమణ	39 శాతం మంది
ఇరుగుపొరుగు వారికి ఇబ్బంది కలిగించడం	26 శాతం మంది
వ్యాపారులు, ఇతర వ్యక్తుల నుంచి బెదిరించి డబ్బుల వసూళ్లు	26 శాతం మంది
ప్రభుత్వ అనుమతులకు లంచాలు తీసుకోవడం	22 శాతం మంది
ఎన్జీవోలను ఉపయోగించి నిధుల మళ్లింపునకు పాల్పడడం	26 శాతం మంది
బదిలీలు, పోస్టింగ్‌లకు డబ్బు వసూలు	26 శాతం మంది
ఇతర అసాంఘిక కార్యక్రమాల్లో ఉండడం	26శాతం మంది
చెప్పలేం	13 శాతం మంది.

రాష్ట్రపతి నిలయంలో మిట్టీ కేఫ్

- శారీరక, మానసిక దివ్యాంగులతో నిర్వహణ
- కొత్తగా ఏర్పాటు చేసిన రిసెప్షన్‌లో వారికి వసతి
- ఇటీవల మిట్టీ కేఫ్‌ను సందర్శించిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

సాక్షి, హైదరాబాద్: శారీరక, మానసిక వైకల్యంతో బాధపడుతున్న వారిలో ఆత్మస్థైర్యం నింపేదిశగా రాష్ట్రపతి నిలయం అధికారులు సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. స్వశక్తితో నిలబడి ముందుకు సాగాలని భావించిన ఆ దివ్యాంగులతో రాష్ట్రపతి నిలయంలో మిట్టీ కేఫ్ ఏర్పాటుకు అవకాశం కల్పించారు. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌తో పాటు సుప్రీంకోర్టు కాంప్లెక్స్, వివిధ అంతర్జాతీయ విమానాశ్రయాల్లోనూ మిట్టీ కేఫ్‌లను ఏర్పాటు చేసుకునేందుకు సంబంధిత అధికారులు అనుమతివ్వడంతో వాటిని ఏర్పాటు చేస్తూ వచ్చారు. శారీరక, మానసిక దివ్యాంగులకు అవసరమైన నైపుణ్యాలను, శిక్షణను ఇచ్చేందుకు మిట్టీ కేఫ్ అనే స్వచ్ఛంధ సంస్థ చేయూతనందిస్తోంది. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 40కిపైగా మిట్టీ కేఫ్‌లను ఏర్పాటు చేశారు. వీటిల్లో గృహ, కార్యాలయ అలంకరణ పరికరాలు, పిల్లల ఆట వస్తువులు, నోటు పుస్తకాలు, పెన్నులు లాంటివి విక్రయిస్తారు. వీటిని శారీరక, మానసిక దివ్యాంగులు తయారు చేస్తారు. సామాజిక దృక్పథంతో ఏర్పాటు చేస్తున్న మిట్టీ కేఫ్ ఆలోచనను గుర్తించిన పలు ప్రభుత్వ రంగ, ప్రైవేట్, కార్పొరేట్ సంస్థలు, జాతీయ, అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థలు ఈ కేంద్రాల నిర్వహణకు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కింద ఆర్థికంగా సహకరిస్తున్నారు. ఈ కేఫ్‌లను పలువురు సెలబ్రిటీలు సందర్శించి సంఘీభావం ప్రకటించారు. బొల్లారంలోని రాష్ట్రపతి నిలయం ఆవరణలో నూతనంగా నిర్మించిన రిసెప్షన్ సెంటర్ భవనంలో రాష్ట్రపతి నిలయం అధికారులు ఉచితంగా కేటాయించిన స్థలంలో మిట్టీ కేఫ్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో 15 మంది దివ్యాంగులు కేఫ్‌ను స్వయంగా నిర్వహిస్తున్నారు. వీరికి నెలకు (వారు చేసే విధులను బట్టి) రూ.15 వేల నుంచి రూ.50 వేల వరకు వేతనంగా అందుతోంది. ఆర్థిక స్వావలంబన, ఆత్మ గౌరవంతో జీవించేందుకు, కుటుంబాన్ని నడపటానికి మిట్టీ కేఫ్ అండగా ఉందని నిర్వాహకురాలు స్వాతి తెలిపారు. ఇక్కడున్న మిట్టీ కేఫ్‌లో సమోసా, చాట్, పకోడి, మసాలా టీ, బిస్కెట్లు, కాఫీ, మ్యాగీ, శాండ్ విచ్, పలు రకాల ఐస్‌క్రీమ్‌లు, ఇతర చిరుతిళ్లు స్వయంగా నాణ్యతతో రుచికరంగా తయారు చేసి విక్రయిస్తున్నారు. రాష్ట్రపతి నిలయాన్ని సందర్శించటానికి వచ్చే పర్యాటకులు కూడా మిట్టీ కేఫ్‌ను సందర్శించవచ్చు. బొల్లారంలోని రాష్ట్రపతి నిలయం ఆవరణలో ఏర్పాటు చేసిన మిట్టీ కేఫ్‌కు అవసరమైన పెట్టుబడి, నిర్వహణకు అయ్యే ఖర్చులను కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసీఎల్)తో పాటు ఆస్ట్రేలియా–న్యూజిలాండ్ బ్యాంకింగ్ గ్రూప్‌లు భరిస్తున్నాయి. ఈ కేఫ్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని తెలంగాణ సోషల్ ఇంపాక్ట్ గ్రూప్ (సీఎస్ఆర్ వింగ్) చొరవ తీసుకుంది. ఏటా రూ.36 నుంచి 46 లక్షల టర్నోవర్ సాధిస్తుందని నిర్వాహకులు చెబుతున్నారు. ఇటీవల శీతాకాల విడిదికి వచ్చిన సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఈ మిట్టీ కేఫ్‌ను సందర్శించి నిర్వాహకులతో ముచ్చటించారు. వారి స్ఫూర్తిని రాష్ట్రపతి ప్రత్యేకంగా అభినందించారు.









క్లుప్తంగా...

మహిళా శిశు సంక్షేమశాఖలో ఏడుగురికి పదోన్నతిపై పోస్టింగులు

సాక్షి, అమరావతి: రాష్ట్ర మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖలో ఏడుగురు అసిస్టెంట్ డైరెక్టర్ కేడర్ అధికారులకు ప్రభుత్వం పదోన్నతి కల్పించింది. వారికి జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారత అధికారి (డిడబ్ల్యూసిడబ్ల్యూ ఈఓ)గా పోస్టింగ్స్ ఇస్తూ మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి ఎ.సూర్యకుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఎవర్ని.. ఎక్కడ పోస్టింగ్

1.పి.శారద	- ఏలూరు జిల్లా
2.పి.నిర్మల	- కర్నూలు జిల్లా
3.కెవిఎస్ విజయ లక్ష్మి	- గుంటూరు జిల్లా
4.బి.హేనా సుజన్	-ప్రకాశం జిల్లా
5.సిహెచ్ సుశీలా దేవి	-నెల్లూరు జిల్లా
6.డి.వెంకటేశ్వరి	- చిత్తూరు జిల్లా
7.తోట కనక దుర్గ	- పార్వతీపురం మన్యం జిల్లా

రోడ్డునపడ్డాం.. ఆదుకోండి!

హెల్త్ అసిస్టెంట్ల వినతి

సాక్షి, అమరావతి: హైకోర్టు తీర్పు నేపథ్యంలో రోడ్డునపడిన తమను ఆదుకోవాలని హెల్త్ అసిస్టెంట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కోరారు. తమను వెంటనే పునర్‌నియమించేలా చర్యలు తీసుకోవాలని అభ్యర్థించారు. ప్రభుత్వం ఇటీవల ఉద్యోగం నుంచి తొలగించిన పలువురు హెల్త్ అసిస్టెంట్లు శుక్రవారం సచివాలయంలో మంత్రిని కలిశారు. మంత్రితో మాట్లాడుతూ.. తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీం కోర్టు స్టే ఇచ్చిన నేపథ్యంలో పునర్‌నియామకం విషయంలో జాప్యం చేయవద్దని కోరారు. తమ అభ్యర్థనలను విని న్యాయం చేస్తామని మంత్రి హామీ ఇచ్చారని ఏపీ పారా మెడికల్ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ ప్రసాద్ వెల్లడించారు.

పదోన్నతుల్లో 'ఓసీ' ఉద్యోగులకు అన్యాయం

విద్యుత్ ఓసీ ఉద్యోగుల సంక్షేమ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్

సాక్షి, అమరావతి: విద్యుత్ సంస్థల పదోన్నతుల్లో రిజర్వేషన్ల వల్ల ప్రతిభ గల ఓసీ, బీసీ మైనారిటీ ఉద్యోగులు నష్టపోతున్నారని, తక్కువ స్థాయి (క్యాడర్)లోనే ఉద్యోగ విరమణ చేయాల్సి వస్తోందని విద్యుత్ ఓసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ అన్నారు. సంఘం డైరీ–2025, క్యాలెండర్‌ను శుక్రవారం నెల్లూరులో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. కోర్టు తీర్పులు ఓసీలకు అనుకూలంగా వచ్చినప్పటికీ.. వాటిని అమలు చేయడంలో విద్యుత్ సంస్థలు విఫలమయ్యాయని మండిపడ్డారు. ఆ తీర్పులను అమలు చేయడమే కాకుండా.. ప్రతిభ ఆధారంగానే పదోన్నతులివ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

అంబేడ్కర్ స్మృతి వనం పవిత్రతను కాపాడండి

అఖిల భారత మాల సంఘాల జేఏసీ

లబ్బీపేట (విజయవాడ తూర్పు): విజయవాడ నడిబొడ్డున ఏర్పాటు చేసిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతి వనం పవిత్రను కాపాడాలని అఖిల భారత మాల సంఘాల జేఏసీ చైర్మన్, రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి ఉప్పులేటి దేవిప్రసాద్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి స్పందించి వెంటనే స్మృతివనంలో ఏర్పాటు చేసిన డ్వాక్రా బజార్‌ను తొలగించాలని ఆయన కోరారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతి వనం ప్రాంగణంలో డ్వాక్రా బజార్ ఏర్పాటు చేయడాన్ని ఖండిస్తూ అఖిల భారత మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్‌షా వెంటనే సస్పెండ్ చేయాలని, డ్వాక్రా బజార్‌ను తక్షణమే తొలగించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఉప్పులేటి దేవీప్రసాద్ మాట్లాడుతూ రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉన్న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పవిత్రతను దెబ్బతీసేలా ఏర్పాటు చేసిన డ్వాక్రా బజార్‌ను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు.

నష్టపోయి నారు



దేవరపల్లి మండలం పల్లంట్లలో మడుల్లోనే ఉన్న పొగాకు నారు

- ముగిసిన పొగాకు నారు సీజన్
- డిమాండ్ లేక నష్టపోయిన రైతులు
- ఎకరాకు రూ.5 లక్షల వరకూ పెట్టుబడి

దేవరపల్లి: ధరలు పడిపోవడం, ఇతర ప్రాంతాల్లో రైతులు సొంతంగా నారు పెంచడంతో.. పొగాకు నారు వేసిన రైతులు, కౌలుదార్లు ఈ సీజన్‌లో నష్టాలు చవిచూడాల్సి వచ్చింది. తూర్పు గోదావరి, ఏలూరు జిల్లాల్లోని ఐదు వేలం కేంద్రాల పరిధిలో సుమారు 23 వేల హెక్టార్లలో పొగాకు సాగుకు టుబాకో బోర్డు అనుమతి ఇచ్చింది. అయితే, గత ఏడాది పొగాకుకు రికార్డు స్థాయి ధర రావడంతో ఈసారి రైతులు బోర్డు అనుమతించిన దానికి మించి, ఇప్పటికే సుమారు 25 వేల హెక్టార్లలో పొగాకు నాట్లు వేశారు. ఇప్పటికే చాలా వరకూ నాట్లు దాదాపు పూర్తి కావడంతో పొగాకు నారు సీజన్ ముగిసింది.

గత ఏడాది కాసుల పంట

గత ఏడాది పొగాకు నారుకు చివరి దశలో ఊహించని డిమాండ్ ఏర్పడి, రైతులకు ఊహించని లాభాలు వచ్చాయి. నాట్ల ప్రారంభంలో ఎకరం నారు (6 వేల మొక్కలు) ధర రూ.3 వేల నుంచి రూ.3,500 వరకూ పలికింది. ఇది గిట్టుబాటు కాక కొంత మంది రైతులు నష్టపోయారు. అనంతరం గత ఏడాది డిసెంబర్ 6, 7 తేదీల్లో బంగాళాఖాతంలో ఏర్పడిన మిచాంగ్ తుపాను నారు రైతుల పాలిట వరంగా మారింది. వేసిన పొగాకు నాట్లు ఈ తుపాను ప్రభావంతో దెబ్బ తిన్నాయి. తుపాను అనంతరం రైతులు మళ్లీ నాట్లు వేయడంతో నారుకు ఎక్కడ లేని డిమాండూ ఏర్పడింది. దీంతో నారుమడులు కట్టిన కౌలు రైతులు ఊపిరి పీల్చుకున్నారు. తుపాను అనంతరం ఎకరం నారు ధర ఏకంగా రూ.16 వేల నుంచి రూ.20 వేల వరకూ పలికింది. ఈ ధర పొగాకు నారు చరిత్రలో రికార్డుగా నిలిచింది. ఎకరం విస్తీర్ణంలో నారు మడులు కట్టిన రైతుకు రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షల వరకూ ఆదాయం వచ్చింది. అప్పటి వరకూ గిట్టుబాటు ధర లేక గగ్గోలు పెట్టిన కౌలు దారులకు కాసుల పంట పండింది.

ఆశ పడితే మొదటికే మోసం

గత ఏడాది ధరలు చూసిన కౌలుదార్లు, రైతులు ఈసారి కూడా పొగాకు నారుకు మంచి ధరలు పలుకుతాయని ఆశ పడ్డారు. ఈ క్రమంలో ఈ ఏడాది ఆగస్టులో అధిక ధరలకు భూములను కౌలుకు తీసుకున్నారు. గత ఏడాది ఎకరం కౌలు రూ.40 వేలు కాగా, ఈ ఏడాది అది రూ.70 వేల నుంచి రూ.80 వేల వరకూ పలికింది. అయినా సరే తగ్గేదేలే.. అన్నట్లు కౌలుదార్లు పోటీ పడి మరీ భూములను కౌలుకు తీసుకుని నారుమడులు కట్టారు. తూర్పు గోదావరి, ఏలూరు జిల్లాల్లోని ఉత్తర తేలికపాటి నేలల (ఎన్ఎల్ఎస్) ప్రాంతంలోని నాలుగు వేలం కేంద్రాల పరిధిలో సుమారు 2 వేల ఎకరాల్లో నారుమడులు కట్టినట్లు అధికారులు అంచనా వేశారు. అయితే, వాతావరణం అనుకూలించడంతో తక్కువ సమయంలోనే రైతులు పొగాకు నాట్లు పూర్తి చేశారు. నాట్ల ప్రారంభంలో నారు ధర రూ.2 వేల నుంచి రూ.2,500 పలకగా, నవంబరులో అది రూ.1,500కు పడిపోయింది. అయినప్పటికీ నారు అడిగే నాథుడు లేక చాలా మంది రైతులు బోణీ కూడా చేయలేదు. ఎకరాకు సుమారు రూ.5 లక్షలు ఖర్చవడంతో పెట్టుబడులు కూడా దక్కకపోవడంతో కౌలుదార్లు, రైతులు మొదటికే మోసపోయిన పరిస్థితిని ఎదుర్కొన్నారు. నారుమడులు కట్టిన రైతుల్లో 80 శాతం కౌలుదార్లే ఉన్నారు. వీరు భూములను కౌలుకు తీసుకుని, ఏటా నారుమడులు కట్టి, నారు విక్రయాలు జరుపుతారు. సాధారణంగా వీరి వద్ద నుంచి ఈ ప్రాంతంతో పాటు తెలంగాణలోని జీలుగుమిల్లి, అశ్వారావుపేట ప్రాంతాల నుంచి ప్రకాశం జిల్లాలోని పొదిలి, కనిగిరి ప్రాంతాల రైతులు నారు కొనుగోలు చేస్తుంటారు. ఈ ఏడాది అక్కడ కూడా రైతులు సొంతంగా మడులు కట్టి, నారు పెంచడంతో ఇక్కడి నారుకు డిమాండ్ తగ్గింది. దాదాపు 50 ఏళ్లుగా ఈ ప్రాంతంలో పొగాకు నారు వ్యాపారం జరుగుతోంది. గత ఏడాది నారు ధర చూసి బెంబేలెత్తిన పొగాకు రైతులు ఈ ఏడాది ముందుగానే జాగ్రత్త పడ్డారు. తమ అవసరాలకు సరిపడా సొంతంగా మడులు కట్టి నారు పెంచారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో నారు రైతులు ఈ సీజన్‌లో నష్టాలు ఎదుర్కోవలసి వచ్చింది.

పెట్టుబడులు కూడా రాలేదు



నేను 60 సెంట్ల విస్తీర్ణంలో నారుమడులు కట్టాను. కౌలు రూ.40 వేలు, పెట్టుబడి రూ.1.50 లక్షలు అయ్యింది. రెండేళ్లుగా నారు రేటు ఆశాజనకంగా లేదు. పొగాకు సాగుకు మించి నారుమడులు ఉండటంతో డిమాండ్ తగ్గింది. చాలా మంది రైతులకు పెట్టుబడులు కూడా రాలేదు.

– గెల్లా గోవిందరాజు, సుబ్బరాయపురం, కౌలు రైతు, దేవరపల్లి


కోలుకోలేని దెబ్బ



ఎకరం విస్తీర్ణంలో నారుమడులు కట్టాను. కౌలు రూ.80 వేలు, పెట్టుబడి రూ.2.30 లక్షలు అయ్యింది. ఎకరం నారు ధర రూ.1,500 పలికింది. అది కూడా అడిగిన నాథుడే లేడు. ఈ ఏడాదికి నారు సీజన్ ముగిసింది. ఎకరాకు రూ.2 లక్షల నష్టం వస్తోంది. నారు రైతులు నిండా మునిగారు.

– సీహెచ్ వెంకటేశు, కౌలు రైతు, రామన్నపాలెం, దేవరపల్లి మండలం

యమడ్రింకరులు



కర్నూలు బాలాజీ నగర్‌కు చెందిన కొంత మంది యువకులు స్నేహితుని పుట్టిన రోజు వేడుకలను అలంపూరు గ్రామ శివారులోని ఓ తోటలో జరుపుకున్నారు. అనంతరం కర్నూలుకు వస్తుండగా వారు ప్రయాణిస్తున్న కారు తుంగభద్ర బ్రిడ్జి దగ్గర ప్రమాదానికి గురైంది. ఏ వాహనమూ వారికి అడ్డు రాలేదు. వేగంగా వెళ్లి బ్రిడ్జికి ఢీకొట్టడం వల్ల ఘటనా స్థలంలోనే ఒకరు మృతిచెందగా మరో నలుగురు గాయాలపాలయ్యారు. ఈ ప్రమాదం కూడా మద్యం మత్తులో వాహనం నడపటమే కారణమని పోలీసులు తేల్చారు. ఇలాంటి ఘటనలతో ఆయా కుటుంబాలు చీకటిలోకి జారుకుంటున్నాయి.

- పెరుగుతున్న డ్రంకెన్ డ్రైవ్ కేసులు
- మద్యం మత్తులో రోడ్డెక్కడంతో ప్రమాదాలు
- చనిపోతూ, మరి కొందరి మృతికి కారణమవుతున్న వైనం
- మూడేళ్లలో 2,596 డ్రంకెన్ డ్రైవ్ కేసులు
- జైలు శిక్షలు పడుతున్నా యువతలో కనిపించని మార్పు

కర్నూలు: వారు నడిస్తే.. కాళ్లు రకరకాలుగా అడుగులేస్తాయి. ఇక వాహనాలు నడిపితే యముడు వెనుక వస్తున్నట్లే. మృత్యువుకు ఎదురెళ్తారు. ఎందుకంటే వారి శరీరంలోకి మద్యం వెళ్లింది. ఏమి జరుగుతుందో తెలుసుకునేలోపే ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. మత్తులో రోడ్డు ప్రమాదానికి గురవుతున్నారు. అలా వాహనాలు నడుపుతూ ప్రజల ప్రాణాలతోనూ ఆడుకుంటున్నారు. మద్యం మత్తులోని యమకింకరులను పోలీసులు పట్టుకుంటున్నా, కోర్టు శిక్షలు విధిస్తున్నా నానాటికీ పెరిగిపోతున్న కేసులు మరింత కలవరపాటుకు గురి చేస్తున్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో నిత్యం ఎక్కడో చోట మద్యం మత్తులో ప్రమాదాలు చోటు చేసుకుని మరణాలు సంభవిస్తున్నాయి. మద్యం తాగడం ఎంత హానికరమో.. వివరించే ప్రచార చిత్రాలు చాలా చోట్ల కనిపిస్తుంటాయి. పోలీసులు కూడా పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా డ్రంకెన్ డ్రైవ్‌పై అవగాహన కల్పిస్తుంటారు. ఇవి చాలా మందిలో మార్పు తీసుకురాలేకపోతున్నాయి. పండుగలు, ఉత్సవాలు, ఇళ్లలో జరిగే శుభకార్యాల పేరుతో మందుబాబులు తెగ తాగేస్తున్నారు. అదే సమయంలో వాహనాలతో రోడ్లపైకి రావడం ముప్పు తెస్తోంది. ఎక్కువగా 20 నుంచి 45 సంవత్సరాల మధ్య యువకులే తనిఖీల్లో పట్టుబడుతున్నట్లు పోలీసులు చెబుతున్నారు. 40 నుంచి 55 ఏళ్ల వయస్సు వారు తర్వాత స్థానంలో ఉన్నారు. ఇటీవల కాలంలో 18 నుంచి 22 సంవత్సరాల మధ్య వయసు వారు కూడా అధికంగానే మద్యం సేవించి తనిఖీల్లో పట్టుబడుతున్నట్లు పోలీసులు గుర్తించారు.

చైతన్యపరుస్తున్నా.. లెక్క చేయని యువత

మద్యం సేవించి వాహనాలు నడపటం ప్రమాదకరమని పోలీసులు జిల్లాలో నిత్యం ఎక్కడో చోట అవగాహన కల్పిస్తున్నప్పటికీ యువత లెక్క చేయడం లేదు. ఎంతో భవిష్యత్తు ఊహించుకున్న కన్నవారు తేరుకోలేని పరిస్థితిలోకి వెళ్లిపోతున్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే ఎంత ప్రమాదమో ఎక్కడికక్కడ చైతన్యం చేస్తున్నప్పటికీ కొందరు లెక్క చేయడం లేదు. చివరకు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది. వారిపై ఆధారపడినవారిని అంధకారంలోకి నెట్టేస్తున్నారు. జిల్లాలో ఏటా డ్రంకెన్ డ్రైవ్ కేసులు పెరుగుతూనే ఉన్నాయి. పోలీసులు కూడా ఎక్కడికక్కడ పకడ్బందీగా తనిఖీలు ముమ్మరం చేశారు. వారిని కూడా తప్పించుకుని వెళ్లిపోయినవారిని లెక్కల్లోకి తీసుకుంటే భయపడేంత స్థాయిలో మద్యం ప్రియులు వ్యవహరిస్తున్నారని తెలుస్తోంది. దొరికిన కొందరు కొన్ని రోజుల పాటు జైలు శిక్షకు కూడా గురవుతున్నారు. ఇన్ని ఘటనలు తమ చుట్టూ జరుగుతున్నా 'నిషా'లో మునిగిన వారు వాహనాలు నడపటం మాత్రం ఆపడం లేదు. మూడేళ్లలో 2,596 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు కావడమే ఇందుకు నిదర్శనం.

జైలు.. జరిమానా



మద్యం తాగి వాహనం నడపడం చట్టరీత్యా నేరం అని అందరికీ తెలిసిన విషయమే. ఇలా చేస్తే భారీ జరిమానాలు, జైలు శిక్ష వేస్తారని కూడా మందు బాబులు తెలుసుకోవాలి. మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడితే మొదటిసారి రూ.10,000 వరకు జరిమానా, ఆరు నెలల జైలు శిక్ష విధిస్తారు. రెండో సారి కూడా ఇదే తప్పు చేస్తే రూ.15,000 వరకు జరిమానా, రెండు సంవత్సరాల జైలు శిక్ష విధిస్తారు. ఇలాంటి సంఘటనల్లో ఎవరికైనా ప్రాణాపాయం కలిగితే జైలు శిక్ష కూడా రెండేళ్లు ఉండేది. కొత్త చట్టం ప్రకారం మద్యం తాగి వాహనం నడపడం వల్ల కలిగే మరణాలకు ఐదు సంవత్సరాల వరకు తప్పనిసరి జైలు శిక్ష విధిస్తారు. అంతేకాకుండా జరిమానా కూడా ఎక్కువగా వేస్తారు. ఒకవేళ ప్రమాదం చేసిన వ్యక్తి చనిపోయిన వ్యక్తి మరణానికి సరైన కారణం చెప్పకపోతే 10 సంవత్సరాల వరకు జైలు శిక్షతో సహా అదనపు కఠినమైన శిక్షలు విధించే విధంగా చట్టాన్ని మార్చారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టరీత్యా నేరం



మద్యం తాగి వాహనాలు నడపటం చట్టరీత్యా నేరం. ప్రమాదానికి గురైతే కుటుంబీకులు ఇబ్బంది పడతారనే విషయాన్ని విస్మరించవద్దు. ప్రధానంగా యువత మద్యం మత్తులో వాహనాలు నడపటం, ప్రమాదాలకు గురవటం ఆందోళనకరం. చాలా మందిలో మార్పు రావడం లేదు. వారి విలువైన భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని కౌన్సెలింగ్‌లో సూచిస్తున్నాం.

– మన్సూరుద్దీన్, ట్రాఫిక్ సీఐ, కర్నూలు


క్యాన్సర్ వ్యాక్సినేషన్‌పై పరిశోధనలు అవసరం

- బయోటెక్నాలజీతో క్యాన్సర్ వ్యాధికి అడ్డుకట్ట సాధ్యమే
- ఆహారపు అలవాట్లు, జీవనశైలితోనే వ్యాధి విజృంభణ
- అంతర్జాతీయ సదస్సులో వక్తలు



జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న అతిథులు

తిరుపతి సిటీ: క్యాన్సర్ వ్యాధిని ఆదిలోనే అంతం చేసేందుకు వ్యాక్సినేషన్‌పై పరిశోధనలు జరగాలని, ఈ మేరకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ప్రధాన వక్త అమెరికా అలబామ వర్సిటీ అధ్యాపకుడు డాక్టర్ మల్ల మిథున్ పేర్కొన్నారు. ఎస్వీయూ బయోటెక్నాలజీ విభాగం, అమెరికా అలబామ వర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో సెనేట్ హాల్‌లో క్యాన్సర్ నివారణ మార్గాలపై మూడు రోజుల పాటు జరగనున్న అంతర్జాతీయ సదస్సును శుక్రవారం ఎస్వీయూ వీసీ సీహెచ్ అప్పారావుతో కలసి ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బయోటెక్నాలజీ, మెడిసిన్, ప్రివెన్షన్ ఆఫ్ క్యాన్సర్, థెరపీ అంశాలపై అంతర్జాతీయ సదస్సు పరిశోధకులకు, విద్యార్థులకు, సాధారణ ప్రజలకు ఎంతో ఉపయోగకరమన్నారు. మారిన ఆహారపు అలవాట్లు, జీవన శైలి మానవునిపై తీవ్ర పరిణామలు చూపుతున్నాయని, దీంతో చిన్న వయస్సులోనే పలు రకాల క్యాన్సర్ వ్యాధుల బారిన పడుతుంటం ఆవేదన కలిగించే అంశమన్నారు. పేగు క్యాన్సర్ నిర్వహణలో గణనీయమైన పురోగతి సాధించామని, మైక్రోసాటిలైట్ స్టేబుల్, మెటాస్టాటిక్ కొలొరెక్టల్ కార్సినోమాతో బాధపడుతున్న రోగులకు టార్గెటెడ్ థెరపీ ఎంతో ఉపయోగకరమన్నారు. బయోటెక్నాలజీ, బయో కెమిస్ట్రీ విభాగాలతో చికిత్స విధానం అభివృద్ధి చెందుతోందన్నారు. క్యాన్సర్‌కు వ్యాక్సినేషన్ కనుగొనడంపై విద్యార్థి అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ వ్యాక్సినేషన్ అత్యవసరమని, ఆ మేరకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. వీసీ అప్పారావు మాట్లాడుతూ క్యాన్సర్‌కు సరైన చికిత్స విధానం, ఔషధాల లేనందున బయోటెక్నాలజీ ద్వారా వాటికి సరైన చికిత్స విధానాలను రూపొందించవచ్చన్నారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కేటీ రామకృష్ణారెడ్డి, కన్వీనర్ డాక్టర్.సరిత, డాక్టర్ జ్యోతికుమార్, వివిధ విద్యాసంస్థల విద్యార్థులు, పరిశోధకలు హాజరయ్యారు.



శ్రీవారి దర్శనానికి 20గంటల సమయం

తిరుమల: తిరుమలలో శుక్రవారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. టీటీడీ అధికారుల సమాచారం మేరకు స్వామి వారి సర్వదర్శనం సుమారు 20 గంటల సమయం పట్టే అవకాశం ఉంది. ఇప్పటికే అన్ని కంపార్టుమెంట్లు నిండిపోయి పెద్ద సంఖ్యలో భక్తులు శిలాతోరణం వరకు క్యూలైన్‌లో వేచి ఉన్నారు. బుధవారం 59,564మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 24,905మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.18కోట్లుగా అధికారులు తెలిపారు.

వరసిద్ధుడికి రూ.1.97 కోట్ల ఆదాయం



కాణిపాకం: చిత్తూరు జిల్లా కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం హుండీలో భక్తులు సమర్పించిన కానుకలను శుక్రవారం లెక్కించారు. ఉదయం లెక్కింపు ప్రారంభం కాగా మధ్యాహ్నం వరకు సాగింది. కాగా హుండీ ఆదాయం రూ.1,97,76,188 వచ్చినట్లు ఈఓ పెంచలకిషోర్ తెలిపారు. గోసంరక్షణ హుండీ ద్వారా రూ.17,242, నిత్యాన్నదానం హుండీ ద్వారా రూ.35,700 వచ్చిందన్నారు. యూఎస్ ఏవీ 1,344 డాలర్లు, యూఏఈ 10 దిర్హామ్స్, ఇంగ్లాడ్‌వి 35 పౌండ్స్, యూరోవి 155 యూరోలు, కెనడావి 10 డాలర్లు, సింగపూర్‌వి 80 డాలర్లు, ఆస్ట్రేలియావి 290 డాలర్లు వచ్చాయన్నారు. బంగారం 75 గ్రాములు, వెండి 4.10 కిలోలుగా లెక్క తేలిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు కృష్ణారెడ్డి, హరిమాధవరెడ్డి, ధనంజయ, నాగేశ్వరరావు, కోదండపాణి, శ్రీధర్‌బాబు, బాలరంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు సౌకర్యాలు కల్పించండి

కాణిపాకం: చిత్తూరు జిల్లాలోని కాణిపాకానికి ఆంగ్ల నూతన సంవత్సరాది రోజు వరసిద్ధి వినాయస్వామి దర్శనార్థం వచ్చే భక్తులకు ఇబ్బంది కలగకుండా సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ చందోలు, ఎమ్మెల్యే మురళీమోహన్ ఆలయాధికారులను ఆదేశించారు. వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలోని సమావేశ మందిరంలో శుక్రవారం అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ జనవరి ఒకటో తేదీన స్వామి దర్శనార్థం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది ఉండకూడదన్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా ముందస్తు ఏర్పాట్లల్లో లోపాలు లేకుండా చూసుకోవాలన్నారు. ట్రాఫిక్ సమస్యలను అధిగమించాలన్నారు. పార్కింగ్ ప్రదేశాల్లోనే వాహనాలు పార్కింగ్ చేసేలా చూడాలన్నారు. తొలుత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, ఏఈవోలు రవీంద్రబాబు, కృష్ణారెడ్డి, ధనంజయ, సీఐ శ్రీధర్‌నాయుడు పలువురు అధికారులు పాల్గొన్నారు.



డీడీఈ పీజీ సైకాలజీ ఫలితాల విడుదల

తిరుపతి సిటీ: ఎస్వీయూ డీడీఈ ఆధ్వర్యంలో ఈ ఏడాది అక్టోబర్‌లో జరిగిన పీజీ సైకాలజీ ఫైనల్ ఇయర్ ఫలితాలు విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ మూడే దామ్లానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఫలితాల కోసం ఎస్వీయూ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలి సూచించారు.

బి ఫార్మసీలో స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి సిటీ: ఎస్వీయూ బీఫార్మసీ కోర్సులో మిగిలి ఉన్న సీట్ల కోసం స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ భూపతి నాయుడు తెలియజేశారు. ప్రవేశం కోసం ఏపీసెట్ – 2024లో అర్హత సాధించిన విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత, కేవలం ఇంటర్మీడియెట్ (ఎంపీసీ, బైపీసీ) చదివిన వారికి చివరి ప్రాధాన్యత ఇవ్వనున్నట్టు తెలిపారు. కోర్స్ ఫీజు సంవత్సరానికి రూ.81 వేలు చెల్లించాల్సి ఉంటుందని, చేరదలచిన విద్యార్థులు ర్యాంక్ కార్డ్, సంబంధిత ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో సోమవారం ఉదయం 10 గంటలకు డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయంలో హాజరు కావాలని సూచించారు. ప్రవేశం పొందిన వారికి ఫీజు రీయింబర్స్‌మెంట్ సౌకర్యం ఉండదని విద్యార్థులు ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని ఆయన సూచించారు.

విద్యాశాఖ రూట్‌మ్యాప్ సిద్ధం: లోకేశ్

సాక్షి, అమరావతి: వచ్చే ఆరునెలలకు విద్యాశాఖకు సంబంధించిన రూట్‌మ్యాప్‌ను సిద్ధం చేసినట్లు రాష్ట్ర మంత్రి లోకేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. వన్ స్కూల్ వన్ యాప్ పేరుతో డ్యాష్ బోర్డు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

పీఆర్ ఉపాధ్యాయులకు పదోన్నతుల్లో వాటా ఇవ్వాలి

సాక్షి, అమరావతి: బోధనేతర సిబ్బందికి బోధనా రంగంలో పదోన్నతులు ఇచ్చినట్లు, పంచాయతీ రాజ్ ఉపాధ్యాయులకు కూడా పదోన్నతుల్లో 20 శాతం వాటా కల్పించాలని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కరణం హరికృష్ణ, మాగంటి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. పంచాయతీరాజ్ శాఖతో పాటు ఇతర ప్రభుత్వ శాఖల్లోనూ ఈ వాటా ఇవ్వాలని కోరుతూ సీఎస్‌కు శుక్రవారం వారు ఓ లేఖ రాశారు.

మైనారిటీ యువతకు ఉచిత శిక్షణ

సాక్షి, అమరావతి: ప్రభుత్వం ఆధ్వర్యంలో సీడాప్ ద్వారా పారిశ్రామిక రంగంలో ఉపాధి, స్వయం ఉపాధి ఉచిత శిక్షణకు రాష్ట్రంలోని మైనార్టీ యువత దరఖాస్తు చేసుకోవాలని మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ సూచించారు. ఉచిత శిక్షణలో రవాణ, కెరీర్ కౌన్సెలింగ్, యూనిఫాం, వసతి, ఆహారం, స్టడీ మెటీరియల్, ఉద్యోగ శిక్షణ ఇస్తారని తెలిపారు. ఎస్ఎస్‌డీసీ ద్వారా సర్టిఫికేషన్, ఉద్యోగ నియామకాలు, పోస్ట్ జాబ్ ప్లేస్‌మెంట్‌కు మద్దతు కల్పిస్తామన్నారు.

● మన సినిమా | ది గ్రించ్

క్రిస్మస్ నవ్వుల పువ్వులు

'ది గ్రించ్' సూపర్ అమెరికన్ యానిమేటెడ్ క్రిస్మస్ కామెడీ ఫిల్మ్. ప్రపంచమంతా క్రిస్మస్ సెలబ్రేషన్స్ కోసం ఎదురు చేస్తూ ఉంటుంది. హూవిలే టౌన్ అనే ఊరు కూడా అలాగే రెడీ అయ్యింది. బోలెడన్ని అలంకరణలతో, లైట్లతో ఊరంతా ఉత్సాహంగా ఫెస్టివల్ కోసం ఎదురు చూస్తూ



వుంటే ఆకుపచ్చ బొచ్చుగల గ్రించ్ మాత్రం ఈ క్రిస్మస్ సెలబ్రేషన్‌ను ఎలా నాశనం చేయాలా అని ఆలోచిస్తుంటాడు. కాని అదే ఊళ్ళో ఉన్న ఆరేళ్ళ సిండీ లీ మాత్రం గ్రించ్‌కి ఎదురు వెళుతుంది. వాడిని ఢీ కొంటుంది. తన హూవిలే టౌన్ నుండి క్రిస్మస్ ఫెస్టివల్‌ను గ్రించ్ స్టీల్ చేయకుండా షీల్డ్ అవుతుంది. అసలీ గ్రించ్ ఎవరు, గ్రించ్ క్రిస్మస్ ఫెస్టివల్‌ని హూవిలే టౌన్ నుండి ఎందుకు దూరం చేయాలనుకుంటాడు. అలాగే సిండీ లీ ఎవరు... తనకు గ్రించ్‌కు ఉన్న సంబంధమేమిటి... వీటన్నిటికీ ఆన్సర్స్ కావాలనుకుంటే నెట్ ఫ్లిక్స్‌లో స్ట్రీమ్ అవుతున్న 'ది గ్రించ్' చూడాల్సిందే. యూనివర్సల్ పిక్చర్స్‌తో పాటు ఫేమస్ బ్యానర్ ఇల్యూమినేషన్ కలిసి ఈ మూవీని ప్రొడ్యూస్ చేశాయి. మూవీ ఫస్ట్ షాట్ నుండి సూపర్ కామెడీతో కలర్‌ఫుల్ విజువల్స్‌తోటి ఎంటర్‌టైనింగ్‌గా ఉంటుంది. పిల్లలూ 'ది గ్రించ్' చూసి ఎంజాయ్ చేయండి.

–ఇంటూరు హరికృష్ణ

గువ్వల మేఘం





ఈ ఫోటోలోని ఆకారం ఎలా ఉందో చూడండి. వేలాది పక్షులు ఒక్కసారిగా ఎగిరి ఏర్పరిచిన ఆకారం అది. చైనాలోని ఎల్లో రివర్ అంచున తేమ మైదానాలు వలస పక్షులకు ఆవాసాలు. ఈ సీజన్‌లో అలస్కాతో మొదలు రష్యా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ తదితర దేశాల నుంచి తేమ మైదానాలు వెతుక్కుంటూ పక్షులు బయలుదేరుతాయి. ఇవి చైనా నుంచి కొరియా వరకూ వ్యాపించి ఉన్న తేమ మైదానాల్లో ఆగుతాయి. ఎల్లో రివర్ తేమ మైదానాల్లో ముప్పై లక్షల వలస పక్షులు ఈ సీజన్‌లో ఆగుతాయంటే ఎంత ఆశ్చర్యం. అవి ఒక్కసారిగా ఎగిరితే ఇదిగో ఇలాంటి ఆకారాలు ఏర్పరుస్తుంటాయి. తేమ మైదానాలు కార్బన్ డైఆక్సయిడ్‌ను పీల్చుకుని ఆక్సిజన్‌ను ఇస్తాయి. వాటిని కాపాడుకుంటే పక్షులు కువకువలాడతాయి.

● బాలల గేయం

ఆకాశంలో తారకలు

ఆకాశంలో తారకలు..
అందమైన తారకలు
మిలమిల మెరిసే తారకలు
రండి చూద్దాం.. రారండి

చంద్రుడి చాటున నేస్తాలై
తళతళ మెరిసే తారకలు
చీకటి అంచున దీపాలై
చల్లగ వెలిగే తారకలు

వజ్రాలల్లె విరిసేటి తారకలు
ముత్యాలల్లె వెలిగేటి తారకలు
అందంగా కొలువుదీరిన తారకలు
ఆకాశంలో ముగ్గులా తారకలు

ఆకాశంలో తారకలు..
అందమైన తారకలు
మిలమిల మెరిసే తారకలు
రండి చూద్దాం.. రారండి

ఇళయరాజానా? రెహమానా?...



అనే సందేహం వస్తుంది ఇంగ్లండ్‌కు చెందిన అల్మా ఎలిజబెత్ డీషర్‌ను చూస్తే. చిన్నవయసులోనే కచరీలు కచేరీలు చేసే స్థాయికి ఎదిగితే అనుమానం రాదూ?

రెండేళ్ల వయసు నుంచే అల్మా పియానో వాయించడం మొదలుపెట్టింది. ఆ వయసులోనే స్పష్టంగా పాటలు పాడటం మొదలుపెట్టింది. అంత చిన్నవయసులో తన ఆసక్తి చూసి తల్లిదండ్రులు ప్రోత్సహించారు. ఆమె మూడో పుట్టినరోజు నాడు చిన్న వయెలిన్‌ని బహుమతిగా ఇచ్చారు. దాన్ని ఆటబొమ్మలా కాక, వాయిద్యంలా చూసి సాధన చేయడం మొదటుపెట్టింది అల్మా. ఏడాదిలోనే వయోలిన్ వాయించడంలో ఎంతో ప్రతిభ చూపింది అల్మా.

ఐదో ఏట నుంచి పియానోపై సొంతంగా బాణీలు కట్టడం మొదలుపెట్టింది. అయితే అవన్నీ అస్పష్టంగా ఉండేవి. ఆరో ఏట నుంచి స్పష్టంగా అనేక బాణీలు కంపోజ్ చేసింది. 2013లో తన 8వ ఏట ఆ బాణీలన్నీ కలిపి ఆల్బమ్‌గా విడుదల చేశారు ఆమె తల్లిదండ్రులు. పదేళ్ల వయసుకు అల్మా వయోలిన్ వాయించడంలో మరింత నేర్పు సాధించింది. పూర్తి స్థాయి కచేరీకి అవసరమైన కంపోజిషన్‌ను రూపొందించింది. ఆమె ప్రతిభ చూసి అందరూ తనను మెచ్చుకున్నారు. మరి అల్మా స్కూల్ సంగతులేంటి? ఐదేళ్ల వయసులో తల్లిదండ్రులు ఆమెను స్కూల్‌కి పంపారు. కానీ అక్కడి పాఠాలు ఆమెకు నచ్చలేదు. దీంతో మొదటి



రోజే ఆమె స్కూల్ మానేసింది. అప్పట్నుంచి ఇంట్లోనే అమ్మానాన్న ఆమెకు చదువు చెప్పడం మొదలుపెట్టారు. కళాకారులకు స్వేచ్ఛ కావాలని, ఎవరూ అడ్డుకోని స్వతంత్రం కావాలని అంటున్నారు.

బాల సంగీతకారురాలిగా పేరు పొందిన అల్మా 'ది స్వీపర్ ఆఫ్ డ్రీమ్స్(2012), 'సిండ్రెల్లా'(2015), 'ది ఎంపరర్స్ న్యూ వాల్జ్'(2023) వంటి సంగీత రూపకాలను స్వరపరిచి, ప్రదర్శించింది. 2021లో లియోనార్డో డావిన్సీ అంతర్జాతీయ పురస్కారం అందుకుని, ఆ పురస్కారం అందుకున్న చిన్నవయస్కురాలిగా రికార్డు సాధించింది. అనేక అంతర్జాతీయ వేదికలపై ప్రదర్శనలు ఇస్తోంది.

ఆడుకో సుడోకు

తొమ్మిది గడులు.. తొమ్మిది అంకెలు. అటు చూసినా ఇటు చూసినా ఒకటి నుంచి తొమ్మిది వరకు అన్ని అంకెలూ రావాలి. ఒక్కటీ మిస్ కాకూడదు, ఒకే అంకె మరోసారి రాయకూడదు. ఇవన్నీ సుడోకు ఆటలో నియమాలు. ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది నిత్యం ఆడే ఈ ఆటంటే పిల్లలతోపాటు పెద్దలకూ చాలా ఇష్టం. దీని వల్ల లెక్కల మీద ఇష్టంతోపాటు ఏకాగ్రత, దీక్ష పెరుగుతాయి.

'సుడోకు' జపాన్‌లో చాలా ప్రసిద్ధి చెందింది. అయితే పుట్టింది మాత్రం అమెరికాలో. 1979లో హోవర్డ్ గార్న్స్ అనే ఆయన దీన్ని కనిపెట్టారు. ఆ తర్వాత ఇది పలు పత్రికల్లో ప్రచురితమైంది. అయితే 1986లో జపాన్‌కు చెందిన పజిల్ కంపెనీ 'నికోలీ' ఈ ఆటకు 'సుడోకు' అని పేరు పెట్టిన ప్రపంచమంతా తెలిసింది. 'సుడోకు' అంటే 'ఒకే సంఖ్య' అని అర్థం.

సుడోకు ఆడాలంటే లెక్కలు తెలిసి ఉండాలని చాలామంది పొరబడుతుంటారు. నిజానికి అదేమీ అక్కర్లేదని సుడోకు నిపుణులు అంటున్నారు. ఒకటి నుంచి తొమ్మిది వరకు అంకెలు గుర్తుపట్టగలిగేవారు ఎవరైనా సుడోకు ఆడొచ్చంటున్నారు. ఈ ఆట ఆడేందుకు గణితశాస్త్రంతో పని లేదని, కేవలం ఆలోచనాశక్తి చాలని వివరిస్తున్నారు. సుడోకులోనూ అనేక రకాలున్నాయి. జిగ్‌సా సుడోకు, సమురాయ్ సుడోకు, మినీ సుడోకు, లాజిక్ 5, కిల్లర్ సుడోకు.. ఇలా ఒకే ఆటని రకరకాలుగా ఆడతారు. పేరుకు ఆటే అయినా ఇది ఆడేందుకు ఒక్కరే సరిపోతారు. ఒకచోట కూర్చుని పెన్ను, కాగితం పట్టుకొని గడులు నింపడమే ఇందులో కీలకం.

సుడోకు ఎలా ఆడాలి, తొందరగా ఎలా పూర్తి చేయాలి అనే విషయాలను వివరిస్తూ కొంతమంది పుస్తకాలు రాశారు. అలాగే సుడోకు పేపర్లతో నిండిన పుస్తకాలను మార్కెట్లో అమ్ముతుంటారు. త్రీడీ సుడోకులు కూడా అందుబాటులోకి వచ్చాయి. వీటితోపాటు ఫోన్లో సుడోకు ఆడేందుకు ప్రత్యేకమైన యాప్స్ అందుబాటులో ఉన్నాయి. 2006లో ఇటలీలో ప్రపంచ సుడోకు ఛాంపియన్‌షిప్ ఏర్పాటు చేశారు.

ఏటా ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. ఇవన్నీ విన్నాక మీకూ సుడోకు మీద ఆసక్తి కలుగుతోందా? ఇంకెందుకు ఆలస్యం.. వెళ్లి ఆడేయండి. మెదడును పదునుగా మార్చుకోండి.



9	3		8	2	1	4	7	5
5	8	2	9	4	7	3	1	6
7	4 5 6	1	3	6	5			
8	1	5		3	9		4	7
			7	1			5	3
	9	7			6			
6	2		1					
4		3			2	1		8
1		9		8			2	

● మహనీయులు

ఆడపిల్లల కోసం.. పాఠశాల ప్రారంభించిన సావిత్రిబాయి



ఇప్పుడంటే అబ్బాయిలతోపాటు అమ్మాయిలు కూడా బడికి వెళ్లి చదువుకుంటున్నారు కానీ నూటయాభై ఏళ్ల క్రితం పరిస్థితి అలా ఉండేది కాదు. ఆడవాళ్లను గడప దాటనిచ్చేవారు కాదు. వారు కేవలం ఇంటి పనులకే పరిమితమయ్యేవారు. ఏ కొద్దిమందో తప్ప ఆడవాళ్లు చదువుకునేవారు కాదు. అలాంటి సమయంలో ఒక మహిళ ఆడవాళ్లు తప్పక చదువుకోవాలని ఆడవాళ్ల కోసం ప్రత్యేకంగా బడి ఏర్పాటు చేసింది. దేశంలో మొదటి మహిళా టీచర్‌గా మారి ఎందరికో చదువు నేర్పింది. ఆమే సావిత్రిబాయి పులె.

సావిత్రిబాయి బడికి వెళ్లి చదువుకోలేదు. ఆమెకు తొమ్మిదేళ్ల వయసులో జ్యోతిరావు పులెతో వివాహమైంది. ఆయన సంఘసంస్కర్త, బహుజనుల హక్కుల కోసం పోరాడిన యోధుడు. ఆడవాళ్లు తప్పకుండా విద్యావంతులు కావాలన్న ఉద్దేశంతో తన భార్యకు చదువు చెప్పారు. అలా సావిత్రిబాయి విద్యావంతురాలైంది. ఆ తర్వాత టీచర్ ట్రైనింగ్ కోర్సులు పూర్తి చేసి పుణెలో ఆడపిల్లలకు చదువు చెప్పడం మొదలుపెట్టింది. అయితే అందుకు ఎన్నో అవాంతరాలు వచ్చాయి. ఇంట్లో ఉండి పనులు చేసుకోవాల్సిన ఆడపిల్లలు బయటికి వెళ్లి చదువుకోవడం ఏమిటని చాలామంది భావించారు. మరికొంతమంది సావిత్రిబాయి చేస్తున్న పనిని అనుమానించి, అవమానించారు. ఆమె బడికి వెళ్తున్నప్పుడు ఆమె మీద పేడనీళ్లు చల్లేవారు. కొంతమంది రాళ్లు వేసేవారు. అయినా సావిత్రిబాయి ఆడపిల్లల్ని విద్యావంతుల్ని చేయాలన్న లక్ష్యంతో ముందుకుసాగేది. 1851 నాటికి సావిత్రిబాయి, జ్యోతిరావు పులె కలిసి పుణెలో ఆడపిల్లల కోసం మూడు పాఠశాలలు నడిపారు.ఆ తర్వాతి రోజుల్లో మొత్తం 18 పాఠశాలలు తెరిచి వందలమందిని విద్యావంతులను చేశారు.

చూశారుగా.. ఆడపిల్లల చదువుకోసం సావిత్రిబాయి చేసిన కృషి. ఎన్ని ఇబ్బందులు వచ్చినా తలవంచకుండా ముందుకు సాగిన ఆమె పట్టుదల మీకు ఆదర్శం కావాలి. ఆమెలాగే మీరూ సమాజానికి ఆదర్శంగా నిలవాలి.

● ఈ జాతీయాలు తెలుసా?

ప్రజల సంభాషణల్లో స్థిరపడిపోయిన కొన్ని నానుడులు, మాటలను 'జాతీయాలు' అంటారు. వాటిలో కొన్ని ఇవి..

పంటి కింద రాయి

అర్థం: ఇబ్బందికరంగా మారడం
వాక్యం: అతను తన ప్రవర్తనతో వాళ్లకి పంటి కింద రాయిలా మారాడు.

ఆడిందే ఆటగా

అర్థం: ఏది తలిచితే అది జరగడం
వాక్యం: ఆ జిల్లా కలెక్టరు గారి పని ఆడిందే ఆటగా సాగుతోంది.

కడుపు మంట

అర్థం: ఈర్ష్య
వాక్యం: ఎవరైనా బాగుపడితే అతనికి కడుపుమంటగా ఉంటుంది.

పక్కలో బల్లెం

అర్థం: శత్రువు
వాక్యం: అతను వారికి పక్కెలో బల్లెంలా తయారయ్యాడు.

చేతికి ఎముక లేదు

అర్థం: బాగా దానాలు చేసే వ్యక్తి
వాక్యం: వరద బాధితులకు అతను చేతికి ఎముక లేనట్టుగా సాయం చేశాడు.

పప్పులో కాలు

అర్థం: పొరపాటు చేయడం
వాక్యం: హీరో డిమాండు తెలియక టికెట్ల విషయంలో అతను పప్పులో కాలేశాడు.

ఆకాశానికెత్తటం

అర్థం: అతిగా పొగడటం
వాక్యం: ముఖ్యమంత్రిని అతను ఆకాశానికెత్తేశాడు.

ఆటలు సాగలేదు

అర్థం: అనుకున్నది జరగలేదు
వాక్యం: సరిహద్దు వద్ద మన సైనికుల దెబ్బకు శత్రువుల ఆటలు సాగలేదు.

● కథ

పాలబువ్వా పచ్చగడ్డి



ఒక రైతు దగ్గర ఒక ఎద్దు, ఒక కుక్క ఉండేవి. అవి రెండు రైతు చెప్పిన పని చెప్పినట్లు పూర్తి చేసేవి. రైతు కూడా వాటిని బాగా చూసుకునేవాడు.

ఒకరోజు రైతు పని పూర్తి కాగానే ఎద్దు ముందు పచ్చగడ్డి, కుక్క ముందు పాలబువ్వ తినడానికి పెట్టి వెళ్లిపోయాడు. కుక్క ఎద్దును చూసి 'మన యజమాని నీకు అనవసరంగా మూడుపూటలా పచ్చగడ్డి పెట్టి పందిలాగా మేపుతున్నాడు. నాలుగు గంటలు పని చేస్తే ఎనిమిది గంటలు పడుకుంటావు. నీకు అసలు తిండి దండగ' అంది.

ఆ మాటలకు ఎద్దు కోపంగా 'ఊరికే ఉత్త డబ్బా లెక్క లొడలొడా వాగడం కాదు... పొలానికి వచ్చి నాలాగా నాలుగు ఎకరాలు ఆగకుండా దున్ని చూడు... అప్పుడు తెలుస్తుంది నా పని ఎంత కష్టమో. అయినా పొద్దునంతా తిని తిరిగి రాత్రిపూట కాసేపు భౌభౌమని అరిచే నీకు నేను పడే కష్టం గురించి ఏం తెలుస్తుందిలే' అంది.

'అబ్బో పెద్ద చెబుతున్నావులే. ఇంటిని, పొలాన్ని, ఆఖరికి నిన్ను కూడా దొంగల బారిన పడకుండా కాపలా కాసేది నేనే. నీవు కూడా ఒకరోజు నాలా కన్నుమూయకుండా రాత్రింబవలు కాపలా కాయి చూద్దాం' అంది.

అలా అవి గొడవ పడుతూ వుంటే ఒక గాడిద ఎద్దు వెనుక వైపు వచ్చి ఎద్దు వెనక వున్న పచ్చగడ్డి చప్పుడు కాకుండా తినసాగింది. ఇదంతా కుక్కకు కనబడుతోంది. కానీ చెప్పలేదు. 'దీనికి ఈ రోజు రాత్రి బాగా కడుపు కాలుతుందిలే' అని లోపల్లోపల నవ్వుకొంది.

అంతలో ఒక పిల్లి ఇంకొక వైపునుంచి వచ్చింది. దానికి కుక్క వెనక ఉన్న పాలబువ్వ కనబడింది. ఇదే సందనుకొని నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటా వచ్చి చప్పుడు కాకుండా పాలబువ్వ తినసాగింది.

ఇదంతా ఎద్దుకు కనబడుతూనే ఉంది. కానీ 'ఈ రాత్రి తిండి లేక దీని కడుపు బాగా కాలుతుందిలే' అని లోపల్లోపల నవ్వుకుంది. రెండు అలా చాలాసేపు అరుచుకొని అలసిపోయి ఆకలై తినడానికి వెనక్కి తిరిగాయి.

ఇంకేముంది...

అక్కడ ఎద్దుకు పచ్చగడ్డీ లేదు. కుక్కకు పాలబువ్వా లేవు. ఒక దానితో ఒకటి గొడవపడి ఆ రాత్రి అనవసరంగా రెండూ కడుపు మాడ్చుకున్నాయి. వైరం ఎప్పుడూ నష్టమే తెస్తుంది.

– డా.ఎం.హరికిషన్

● కామెడీ క్లాస్

కళలు

టీచర్: చింటూ... నీకు తెలిసిన కళల పేర్లు చెప్పు?
చింటు: నాకు మూడు కళలే తెలుసు టీచర్...
టీచర్: ఫరవాలేదు...చెప్పు
చింటు: శశికళ, చంద్రకళ, సూర్యకళ



ఎందుకంటే...

టీచర్: బబ్లూ....కిషోర్‌ని కొట్టావట ఎందుకు?
బబ్లూ: నేను పుస్తకం చదువుతుంటే డిస్టర్బ్ చేశాడు టీచర్
టీచర్: ఇంతకీ ఏం పుస్తకం చదువుతున్నావు?
బబ్లూ: 'ఎప్పుడూ సహనంగా ఉండాలి–కోపానికి దూరంగా ఉండాలి' అనే పుస్తకం.

బిజినెస్ రీల్

థర్డ్ పార్టీ యాప్‌ల ద్వారా పీపీఐ లావాదేవీలకు అనుమతి

ముంబై: ప్రీపెయిడ్ పేమెంట్ సాధనాలను (గిఫ్ట్ కార్డ్‌లు, డిజిటల్ వాలెట్లులాంటివి) ఉపయోగించే యూజర్లు ఇకపై గూగుల్‌పే, ఫోన్‌పేలాంటి థర్డ్ పార్టీ మొబైల్ యాప్స్ ద్వారా కూడా యూపీఐ చెల్లింపులు చేసేందుకు, స్వీకరించేందుకు అనుమతిస్తూ రిజర్వ్ బ్యాంక్ నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం ప్రీపెయిడ్ పేమెంట్ సాధనం (పీపీఐ) పూర్తి స్థాయిలో 'నో యువర్ కస్టమర్' (కేవైసీ) నిబంధనలకు అనుగుణంగా ఉండాలి. ప్రస్తుతం బ్యాంకు ఖాతాల నుంచి యూపీఐ చెల్లింపులను సదరు బ్యాంకు లేదా థర్డ్ పార్టీ యాప్ నుంచి చేయడానికి వీలుంటోంది. కానీ పీపీఐల నుంచి చెల్లించాలన్నా, స్వీకరించాలన్నా ఆయా పీపీఐ సంస్థ యాప్ ద్వారానే చేయాల్సి ఉంటోంది.

హార్లే-హీరో సరికొత్త బైక్!



న్యూఢిల్లీ: నూతన వర్షన్‌ను పరిచయం చేసేందుకు అమెరికన్ బ్రాండ్ హార్లే డేవిడ్‌సన్‌తో సహకారాన్ని విస్తరించినట్టు హీరో మోటోకార్ప్ శుక్రవారం తెలిపింది. ఒప్పందంలో భాగంగా ఇరు సంస్థలు హార్లే డేవిడ్‌సన్ ఎక్స్440 మోడల్‌లో కొత్త వర్షన్‌తోపాటు సరికొత్త బైక్‌ను అభివృద్ధి చేస్తాయి. హీరో మోటోకార్ప్, హార్లే డేవిడ్‌సన్ సంయుక్తంగా అభివృద్ధి చేసిన తొలి మోడల్ ఎక్స్ 440 గతేడాది రోడ్లపై పరుగు తీసింది. 2020 అక్టోబరులో ఇరు సంస్థల మధ్య భారతీయ మార్కెట్ కోసం భాగస్వామ్యం కుదిరింది. దీని ప్రకారం దేశంలో హార్లే డేవిడ్‌సన్ బ్రాండ్ ప్రీమియం మోటార్‌సైకిళ్లను అభివృద్ధి చేసి హీరో మోటోకార్ప్ విక్రయిస్తుంది. సర్వీస్, విడిభాగాల బాధ్యత కూడా హీరో మోటోకార్ప్ చేపట్టింది.

మురుగప్ప గ్రూప్‌నకు సీసీఐ అనుమతి

ఎంహెచ్‌ఎం హోల్డింగ్ కొనుగోలుకు వీలు

న్యూఢిల్లీ: జర్మన్ సంస్థ ఎంహెచ్‌ఎం హోల్డింగ్ కొనుగోలుకి మురుగప్ప కుటుంబ సంస్థ మామ్‌కో ఇన్వెస్ట్‌మెంట్స్‌తోపాటు, ఎవెన్యూ క్యాపిటల్ గ్రూప్‌నకు కాంపిటీషన్ కమిషన్(సీసీఐ) గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. వెరసి ప్రింటింగ్ ఇంక్, కెమికల్ పరిశ్రమలో గ్లోబల్ దిగ్గజంగా నిలుస్తున్న హ్యూబర్‌గ్రూప్‌నకు మాతృ సంస్థ అయిన ఎంహెచ్‌ఎంలో 100 శాతం వాటా కొనుగోలుకి వీలు చిక్కింది. హ్యూబర్ గ్రూప్ ఆసియా, భారత్‌సహా ప్రపంచ మార్కెట్లలో కార్యకలాపాలు కలిగి ఉంది. కాగా.. ఎంహెచ్‌ఎం కొనుగోలుకి ఇండియా న్యూకో పేరుతో ఎవెన్యూ, మామ్‌కో భాగస్వామ్య కంపెనీ(జేవీ)ని ఏర్పాటు చేయనున్నాయి. తద్వారా వాటా విక్రయదారులకు నగదు చెల్లింపుసహా సంస్థ ప్రస్తుత రుణ చెల్లింపులకు అవసరమైన నగదును సమకూర్చనున్నాయి. గ్రీన్ చానల్ మార్గంలో సీసీఐ ఇందుకు అనుమతించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

28-12-2024

విశాఖ	600-00
చిత్తూరు	603-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	600-00
విజయవాడ	600-00
రిటైల్ ధర (డజను)	84.00
హైదరాబాద్	585-00
వరంగల్	587-00
రిటైల్ ధర	6.45

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
DRREDDY	1,392.00	2.72
INDUSINDBK	954	2.37
M&M	3,042.00	2.23
TATAMOTORS	754	1.78
EICHERMOT	4,874.00	1.51

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
HINDALCO	617.9	-1.73
SBIN	800.85	-1.43
COALINDIA	381.2	-1.4
ONGC	237.1	-1.31
BEL	292.2	-1.02

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్‌ఈ	5,741
ఎన్‌ఎస్‌ఈ	79,108
ఎన్‌ఎస్‌ఈ(డెరివేటివ్స్)	1,12,468
ఎఫ్‌ఐఐ	- 1,323
డీఐఐ	+ 2,545

ముడిచమురు... (బ్యారెల్)

	రాత్రి 11.30కు		క్రితం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	70.68	$	69.62
బ్రెంట్	73.84	$	72.85

మారుతి కారు ఆద్యుడు ఇక లేరు

- కేన్సర్‌తో కన్నుమూసిన ఒసాము సుజుకీ
- భారత మార్కెట్‌పై అచంచల విశ్వాసం
- మారుతి ఉద్యోగ్ లిమిటెడ్ ఏర్పాటులో కీలక పాత్ర



న్యూఢిల్లీ: భారత ఆటోమొబైల్ పరిశ్రమ ముఖచిత్రాన్ని మార్చేసిన జపనీస్ వ్యాపారవేత్త ఒసాము సుజుకీ 94 ఏళ్ల వయసులో తుది శ్వాస విడిచారు. భారత్‌లో ఆటోమొబైల్ కంపెనీ ఏర్పాటుకు ఏ ఒక్క విదేశీ సంస్థ ముందుకురాని రోజుల్లో.. ఆర్థిక వ్యవస్థను గ్లోబలైజేషన్‌కు ద్వారాలు తెరవక ముందే, లైసెన్స్ రాజ్ కాలంలో ఒసాము సుజుకీ తీసుకున్న నిర్ణయం దేశ పారిశ్రామిక రంగంలో చిరస్థాయిలో నిలిచిపోతుంది. జపాన్‌కు చెందిన సుజుకీ మోటార్ కార్పొరేషన్ 1981లో భారత ప్రభుత్వ భాగస్వామ్యంతో (జాయింట్ వెంచర్) మారుతి ఉద్యోగ్ లిమిటెడ్‌ను ఏర్పాటు చేయడంలో కీలకంగా వ్యవహరించింది ఆయనే. 2007లో కేంద్ర ప్రభుత్వం తన పెట్టుబడులను ఉపసంహరించుకోవడంతో కంపెనీ పేరు మారుతి సుజుకీగా మారింది. ఆ తర్వాత మెజారిటీ వాటాతో సుజుకీ మోటార్ కార్పొరేషన్ ఏకైక ప్రమోటర్‌గా అవతరించింది. తుదిశ్వాస విడిచే వరకు మారుతి సుజుకీ ఇండియా లిమిటెడ్‌కు డైరెక్టర్‌గా ఒసాము సేవలు అందించారు. మాలిగ్నెంట్ లింఫోమా (కేన్సర్‌లో ఒక రకం) కారణంగా ఈ నెల 25న ఒసాము సుజుకీ మరణించినట్టు సుజుకీ మోటార్ కార్పొరేషన్ శుక్రవారం ప్రకటించింది. ''ఆయన దూరదృష్టి, భవిష్యత్‌పై సానుకూల దృక్పథం, రిస్క్ తీసుకునే తత్వం, భారత్ పట్ల ప్రగాఢమైన ప్రేమ అనేవి లేకుంటే, భారత ఆటోమొబైల్ పరిశ్రమ నేడు ఇంత శక్తివంతంగా మారి ఉండేది కాదు''అని మారుతి సుజుకీ ఇండియా లిమిటెడ్ (ఎంఎస్ఐఎల్) చైర్మన్ ఆర్‌సీ భార్గవ వ్యాఖ్యానించారు. నేడు భారత్‌లో లక్షలాది మంది మెరుగైన జీవనం వెనుక ఆయన కృషి ఉందన్నారు. ఆటోమొబైల్ రంగం ద్వారా భారత ఆర్థిక వ్యవస్థకు ఒసాము అందించిన విశేష సేవలను గుర్తించిన కేంద్ర సర్కారు.. 2007లో పద్మభూషణ్ అవార్డుతో ఆయన్ను సత్కరించింది.

1958లో సుజుకీలో చేరిక..

1930 జనవరి 30న జన్మించిన ఒసాము సుజుకీ, చువో యూనివర్సిటీ, ఫాకల్టీ ఆఫ్ లా నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్నారు. 1958లో సుజుకీ మోటార్ కంపెనీలోనే చేరారు. 1963లో డైరెక్టర్‌గా నియమితులయ్యారు. 1967లో మేనేజింగ్ డైరెక్టర్ బాధ్యతలు చేపట్టారు. 1978లో ప్రెసిడెంట్; సీఈవోగా, 2000 జూన్‌లో సుజుకీ మోటార్ కార్పొరేషన్‌కు చైర్మన్, సీఈవోగా నియమితులయ్యారు. ''మారుతి సుజుకీ రూపంలో ఆయన అందించిన అసాధారణ సేవలు భారత ఆటోమొబైల్ ముఖచిత్రాన్ని విప్లవాత్మకంగా మార్చడమే కాదు, భారత్-జపాన్ మధ్య బంధాన్ని బలోపేతం చేశాయి.



ప్రపంచ ఆటోమొబైల్ పరిశ్రమకు బెంచ్‌మార్క్‌లను ఏర్పాటు చేయడమే కాకుండా, భారత్‌లో బలమైన సరఫరా వ్యవస్థ ఏర్పాటును ప్రోత్సహించింది''అని ఆటోమొబైల్ విడిభాగాల తయారీదారుల సంఘం (ఏసీఎంఏ) ప్రెసిడెంట్, సుబ్రోస్ కంపెనీ సీఎండీ శ్రద్ధా సూరి మార్వా అభిప్రాయపడ్డారు.

ఒసాము వల్లే సామాన్యుడి చెంతకు కారు

పరిశ్రమ నివాళి

ఒసాము సుజుకీ దార్శనిక నాయకత్వం వల్లే లక్షలాది మంది సామాన్యులకు కార్లు అందుబాటులోకి వచ్చినట్టు, భారత్-జపాన్ మధ్య దృఢమైన బంధానికి బాటలు వేసినట్టు భారత ఆటోమొబైల్ తయారీదారుల సంఘం (సియామ్) ప్రెసిడెంట్ శైలేష్ చంద్ర వ్యాఖ్యానించారు. ఒసాము సుజుకీ మృతి పట్ల భారత ఆటోమొబైల్ పరిశ్రమ తరఫున సంతాపం వ్యక్తం చేశారు. ''స్థానికత, పెట్టుబడులు, ఆవిష్కరణల పట్ల ఆయనకున్న నిబద్ధత శాశ్వత వారసత్వంగా నిలిచిపోతుంది''అని అభిప్రాయపడ్డారు. భారత్‌లో ప్యాసింజర్ కార్ల ప్రజాస్వామ్యానికి ఒసాము సుజుకీ కీలక పాత్ర పోషించారని మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రా అన్నారు.

ఆటోమొబైల్ దిగ్గజం.. దార్శనికుడు



ఒసాము సుజుకీ మరణ వార్త నన్ను తీవ్రంగా బాధించింది. ప్రపంచ ఆటోమొబైల్ పరిశ్రమలో ఆయనొక దిగ్గజం. ఆయన దార్శనికత మొబిలిటీ విషయంలో ప్రపంచ అవగాహననే మార్చివేసింది. ఆయన నాయకత్వంలో సుజుకీ మోటార్ కార్పొరేషన్ అంతర్జాతీయ దిగ్గజంగా అవతరించడమే కాదు, సవాళ్లను విజయవంతంగా అధిగమించడంతోపాటు, ఆవిష్కరణలు, విస్తరణ దిశగా అడుగులు వేసింది. సుజుకీతో నాకున్న సంప్రదింపుల మధుర జ్ఞాపకాలను ఎంతో ఇష్టపడతాను. ఆయన ఆచరణాత్మక, వినయపూర్వక విధానాన్ని మెచ్చుకుంటున్నాను. ఆయన కుటుంబానికి, సహచరులకు, ఆయన్ను విశ్వసించే ఎంతో మందికి ఈ సందర్భంగా హృదయపూర్వక సానుభూతి తెలియజేస్తున్నాను

– ప్రధాని నరేంద్ర మోదీ

మధ్య తరగతికి పన్ను రిలీఫ్

- ఆదాయ పన్ను రేట్లు తగ్గించే యోచన
- ప్రభుత్వ పరిశీలనలో ప్రతిపాదన
- బడ్జెట్‌లో ప్రకటించే అవకాశం



అధిక పన్నులతో అల్లాడుతున్న మధ్య తరగతి ప్రజలకు రానున్న బడ్జెట్‌లో ఊరట లభించనుందా? మందగించిన వినియోగానికి ప్రేరణగా ప్రభుత్వం పన్ను రేటును తగ్గించనుందా? విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. ఈ అంశాన్ని ప్రభుత్వం సునిశితంగా పరిశీలిస్తున్నట్టు తెలుస్తోంది. ఆర్థిక వ్యవస్థ మందగించిన తరుణంలో జీవన వ్యయాలు పెరిగిపోయి, మధ్య తరగతి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, వినియోగం పడిపోతుందన్న ఆందోళనలు వినిపిస్తుండడం తెలిసిందే. వీటికి పరిష్కారంగా పన్ను రేట్ల తగ్గింపుతో వినియోగానికి ఊతమివ్వాలన్నది ఈ ప్రతిపాదన లక్ష్యమని ఆ వర్గాలు వెల్లడించాయి. 2025-26 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌ను 2025 ఫిబ్రవరి 1న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటుకు సమర్పించనున్నారు. ఇందులో గనుక ఈ మేరకు ప్రతిపాదన ఉంటే అది లక్షలాది మందికి ఊరట కల్పించనుంది. అయితే, కొత్త పన్ను వ్యవస్థలోనే ఈ మేరకు ఉపశమనం ఉండొచ్చన్నది సమాచారం. తద్వారా మరింత మందిని కొత్త పన్ను విధానం వైపు తీసుకురావడం కూడా ఈ ప్రతిపాదనలోని ఉద్దేశ్యంగా తెలుస్తోంది. 2020లో కేంద్రం అప్పటి వరకు ఉన్న పన్ను విధానానికి అదనంగా, మరో కొత్త విధానాన్ని సైతం ప్రవేశపెట్టింది. పాత విధానంలో ఆదాయం రూ.6లక్షలు మించితే 20 శాతం పన్ను పరిధిలోకి వస్తారు. అదే కొత్త పన్ను విధానంలో అయితే ప్రస్తుతం రూ.12 లక్షల వరకు ఆదాయంపై 15 శాతమే పన్ను అమల్లో ఉంది. కాకపోతే పాత పన్ను వ్యవస్థలో గృహ రుణం, బీమా ప్రీమియంలు, పెట్టుబడులపై పన్ను ప్రయోజనాలున్నాయి. కొత్త విధానంలో స్టాండర్డ్ డిడక్షన్ మినహా ఇతర మినహాయింపుల్లేవు. ఈ రెండింటిలో ఎంపిక పన్ను చెల్లింపుదారుల ఐచ్ఛికమే.

సర్కారుపై పెరుగుతున్న ఒత్తిళ్లు

ద్రవ్యోల్బణం గరిష్ట స్థాయిల నుంచి దిగిరావడం లేదు. వేతనాల్లో వృద్ధి సైతం మందగించింది. దీంతో ఖర్చు చేసేందుకు మిగులు లేక, మధ్యతరగతి ప్రజల కొనుగోలు శక్తి క్షీణించింది. ఫలితంగా పట్టణ, గ్రామీణ వినియోగం క్షీణించి, అది దేశ ఆర్థిక వృద్ధిపైనా ప్రభావం చూపిస్తోంది. జీడీపీ ఏడు త్రైమాసికాల కనిష్ట స్థాయి అయిన 5.4 శాతానికి సెప్టెంబర్ త్రైమాసికంలో పడిపోవడం తెలిసిందే. దీంతో ఆదాయపన్ను రేట్లను తగ్గించాలంటూ కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెరుగుతోంది. బడ్జెట్ ముందస్తు సమావేశాలు, వినతుల సందర్భంగా పలు రంగాల నిపుణులు, ఆర్థిక వేత్తలు సైతం పన్ను రేట్లు, కస్టమ్స్ టారిఫ్‌లు తగ్గించాలంటూ ప్రభుత్వానికి సూచించడం గమనార్హం. సహజంగా పన్ను తగ్గింపు డిమాండ్లు ఏటా బడ్జెట్ ముందు వినిపిస్తూనే ఉంటాయ్. ఆర్థిక వృద్ధి క్షీణించిన తరుణంలో ఈ విడత ప్రభుత్వం ఈ దిశగా సానుకూల నిర్ణయం తీసుకుంటుందన్న ఆసక్తి నెలకొంది.

– సాక్షి, బిజినెస్ డెస్క్

ఓ2 పవర్‌తో జేఎస్‌డబ్ల్యూ నియో ఎనర్జీ డీల్

4.7 గిగావాట్ల ఆర్‌ఈ ప్లాట్‌ఫాం కొనుగోలు



న్యూఢిల్లీ: ఓ2 పవర్ పూలింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నుంచి జేఎస్‌డబ్ల్యూ నియో ఎనర్జీ 4.7 గిగావాట్ల పునరుత్పాదక విద్యుదుత్పత్తి ప్లాట్‌ఫాంను కొనుగోలు చేయనుంది. ఈ డీల్ విలువను రూ. 12,468 కోట్లుగా లెక్కగట్టారు. ఒప్పందం ప్రకారం ఓ2 పవర్ మిడ్‌కో హోల్డింగ్స్, ఓ2 ఎనర్జీ ఎస్‌జీ సంస్థలు జేఎస్‌డబ్ల్యూ నియో ఎనర్జీకి దక్కుతాయి. మొత్తం 4,696 మెగావాట్లలో (సుమారు 4.7 గిగావాట్లు) 2,259 మెగావాట్ల సామర్థ్యం వచ్చే ఏడాది జూన్ నాటికి అందుబాటులోకి రానుండగా, 1,463 మెగావాట్ల ప్రాజెక్టు ప్రస్తుతం నిర్మాణంలోనూ, మరో 974 మె.వా. ప్రాజెక్టు ప్రారంభ దశలోనూ ఉన్నాయి. ఇవి 2027 జూన్ నాటికి అందుబాటులోకి వస్తాయి. వీటన్నింటితో కూడుకున్న ప్లాట్‌ఫాంకి సంబంధించి కిలోవాట్ అవర్ ధర టారిఫ్ 23 ఏళ్ల పాటు సగటున రూ. 3.37గా ఉంటుందని జేఎస్‌డబ్ల్యూ నియో ఎనర్జీ మాతృసంస్థ జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ వెల్లడించింది. దేశీయంగా విద్యుత్ రంగంలో దిగ్గజంగా తమ స్థానాన్ని మరింత పటిష్టం చేసుకునేందుకు ఈ డీల్ దోహదపడగలదని జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ జాయింట్ ఎండీ శరద్ మహేంద్ర తెలిపారు.

రియల్‌మీ భారీ వృద్ధి లక్ష్యం



కోపెన్‌హేగన్: స్మార్ట్ పరికరాల తయారీలో ఉన్న చైనా కంపెనీ రియల్‌మీ వినూత్నంగా ఉత్పత్తుల డిజైన్, విస్తృత శ్రేణి, రిటైల్ విస్తరణతో 2025లో భారతీయ స్మార్ట్‌ఫోన్ రంగంలో 18 శాతం వాటాను అందుకోవాలని లక్ష్యంగా చేసుకుంది. ఇందుకోసం ఉత్పత్తుల మెరుగైన పనితీరు, అత్యుత్తమ డిజైన్, మధ్య నుండి అధిక-శ్రేణి ఉత్పత్తులపై ప్రత్యేకంగా దృష్టిసారిస్తామని వెల్లడించింది. కంపెనీకి భారత్ అతి పెద్ద విపణిగా ఉంది. 2024లో దేశీయ స్మార్ట్‌ఫోన్ విపణిలో రియల్‌మీ 12 శాతం మార్కెట్ వాటాను కలిగి ఉంది. వచ్చే ఏడాది మార్కెట్ వాటాలో 50 శాతం వృద్ధిని లక్ష్యంగా పెట్టుకున్నామని రియల్‌మీ వైస్ ప్రెసిడెంట్, సీఎంవో చేస్ షూ వెల్లడించారు. 2025 ప్రారంభంలో విడుదల కానున్న రియల్‌మీ 14 ప్రో డిజైన్‌ను ఆవిష్కరించిన సందర్భంగా చేస్ మీడియాతో మాట్లాడారు.

ఆఫ్‌లైన్ కోసం ప్రత్యేకంగా..

భారత్‌లో కంపెనీ తీవ్ర పోటీని ఎదుర్కొంది. కానీ చాలా మంచి ఫలితాలతో 2024 ముగించాం అని చేస్ వివరించారు. 'ధర సున్నిత అంశమైన భారతీయ మార్కెట్‌లో అమ్మకాలను పెంచడానికి ప్రధాన ఈ-కామర్స్ కంపెనీలతో భాగస్వామ్యం కుదుర్చుకుంటాం. 2025లో ఫ్లిప్‌కార్ట్‌లో నంబర్ వన్‌గా, అమెజాన్ వేదికగా మొదటి మూడు స్థానాల్లో ఒకటిగా ఉండాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. యువ కస్టమర్లను ఆకట్టుకునేలా మరిన్ని కలర్ ఆప్షన్స్‌తో భారత్ కోసం ప్రత్యేక డిజైన్స్ తీసుకురావాలని కంపెనీ యోచిస్తోంది. ఆఫ్‌లైన్ నెట్‌వర్క్, సర్వీస్ సెంటర్లను విస్తరిస్తాం. మార్కెట్ వాటాను పెంచడానికి ఆఫ్‌లైన్ మార్కెట్ కోసం ప్రత్యేకంగా మోడళ్లను తీసుకొస్తాం' అని వివరించారు.

బంగారం @ రూ.79,200

రూ.350 అప్ ● రూపాయి పతనం ఎఫెక్ట్



న్యూఢిల్లీ: బంగారం 10 గ్రాముల ధర న్యూఢిల్లీలో క్రితం ముగింపుతో పోల్చితే రూ.350 పెరిగి రూ.79,200కు ఎగసింది. వెండి కేజీ ధర రూ.900 పెరిగి రూ.91,700కు చేరింది. రూపాయి క్షీణత ఎఫెక్ట్ బంగారం, వెండి ధరల పెరుగుదలకు కారణమవుతోంది. దీనికితోడు ఆభరణాల వర్తకుల నుంచి డిమాండ్ పటిష్టంగా కనబడుతోంది. కొనసాగుతున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతల నేపథ్యంలో పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు సైతం యల్లో మెటల్ డిమాండ్‌కు కారణమవుతోంది. వెండి ధర వరుసగా నాలుగు సెషన్ల నుంచి పెరుగుతోంది.

మెరుగుపడిన కరెంట్ అకౌంట్ లోటు

- క్యూ2లో 1.2 శాతంగా నమోదు
- 2023 ఇదే కాలంలో ఈ రేటు 1.3 శాతం

ముంబై: భారత్ కరెంట్ అకౌంట్ లోటు (క్యాడ్) పరిస్థితి కొంత మెరుగుపడింది. 2024-25 రెండో త్రైమాసికంలో (జూలై-సెప్టెంబర్) 11.2 బిలియన్ (స్థూల దేశీయోత్పత్తి-జీడీపీ 1.2 శాతం) డాలర్లుగా నమోదయ్యింది. గత ఏడాది ఇదే కాలంలో క్యాడ్ 11.3 బిలియన్ (జీడీపీ 1.3 శాతం) డాలర్లు. దేశంలోకి ఒక నిర్దిష్ట కాలంలో వచ్చీ-పోయే విదేశీ మారకద్రవ్యం మధ్య నికర వ్యత్యాసాన్ని కరెంట్ అకౌంట్ ప్రతిబింబిస్తుంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) విడుదల చేసిన గణాంకాల ప్రకారం ముఖ్యాంశాలు ఇవీ...



2024-25 క్యూ2లో: 11.2 బిలియన్ (జీడీపీలో 1.2 శాతం) డాలర్లు.

2023-24 క్యూ2లో: 11.3 బిలియన్ (జీడీపీలో 1.3 శాతం) డాలర్లు.

2024-25 తొలి భాగం (ఏప్రిల్-సెప్టెంబర్): 21.4 బిలియన్ (జీడీపీలో 1.2 శాతం) డాలర్లు.

2023-24 తొలి భాగం (ఏప్రిల్-సెప్టెంబర్): 20.2 బిలియన్ (జీడీపీలో 1.2 శాతం) డాలర్లు.

వాణిజ్య లోటు ఇలా...

2024-25 రెండో త్రైమాసికంలో ఎగుమతి-దిగుమతుల మధ్య వాణిజ్యలోటు 75.3 బిలియన్ డాలర్లకు పెరిగింది. 2023-24 ఇదే కాలంలో ఈ లోటు 64.5 బిలియన్ డాలర్లుగా ఉంది.

నికర సేవల ఆదాయం

2024-25 రెండో త్రైమాసికంలో నికర సేవల ఆదాయం 44.5 బిలియన్ డాలర్లకు పెరిగింది. గత ఏడాది ఇదే కాలంలో ఈ విలువ 39.9 బిలియన్ డాలర్లుగా ఉంది. సమీక్షా కాలంలో కంప్యూటర్, వ్యాపార, ప్రయాణ, రవాణా సేవల వంటి రంగాలలో సేవల ఎగుమతులు అధికంగా నమోదయ్యాయి.

భారీ స్థాయిలో ఆఫీస్ వసతుల నిర్మాణం

- ప్రముఖ పట్టణాల్లో 250 లక్షల ఎస్ఎఫ్‌టీ
- ఐటీ, బీఎఫ్‌ఎస్‌ఐ రంగాల్లో సానుకూలం
- రియల్టీ కన్సల్టెంట్ అనరాక్ వెల్లడి



న్యూఢిల్లీ: ప్రీమియం పని ప్రదేశాలకు (వర్క్‌స్పేస్) డిమాండ్ పెరుగుతోంది. దీంతో ఈ విభాగంలో దేశ, విదేశీ కంపెనీల అవసరాలను తీర్చేందుకు వీలుగా.. దేశవ్యాప్తంగా ప్రముఖ పట్టణాల్లో 250 లక్షల చదరపు అడుగుల (ఎస్ఎఫ్‌టీ) ఆఫీస్ వసతుల నిర్మాణం జరుగుతున్నట్టు రియల్టీ కన్సల్టెంట్ అనరాక్ వెల్లడించింది. హౌసింగ్ బ్రోకరేజీ, క్యాపిటల్ మార్కెట్ లావాదేవీలు, రిటైల్, ఇండస్ట్రియల్, వేర్‌హౌసింగ్ లీజింగ్ విభాగాల్లో సేవలు అందిస్తున్న అనరాక్ ఈ ఏడాది ఏప్రిల్‌లో ఆఫీస్ స్పేస్ లీజింగ్‌లోకి అడుగు పెట్టడం గమనార్హం. భారత ఆఫీస్ మార్కెట్‌కు 2024 ఎంతో సానుకూలంగా నిలిచిపోతుందని అనరాక్ కమర్షియల్ లీజింగ్ అండ్ అడ్వైజరీ ఎండీ పీయూష్ జైన్ తెలిపారు. రికార్డు స్థాయిలో ఆఫీస్ మార్కెట్ లీజింగ్ లావాదేవీలు నమోదైనట్టు, ఖాళీ ఆఫీస్ స్పేస్ తగ్గినట్టు చెప్పారు. 2025లోనూ ఆఫీస్ మార్కెట్‌లో బలమైన డిమాండ్ కొనసాగుతుందన్నారు. కరోనా తర్వాత ఆఫీస్ మార్కెట్ చాలా బలంగా కోలుకున్నట్టు పేర్కొన్నారు. గ్లోబల్ క్యాపబులిటీ సెంటర్లను (జీసీసీలు) బహుళజాతి సంస్థలు భారత్‌తో పెద్ద సంఖ్యలో ఏర్పాటు చేస్తుండడం, హైదరాబాద్, బెంగళూరు, ఢిల్లీ-ఎన్‌సీఆర్, ముంబై, పుణె, చెన్నై, అహ్మదాబాద్, కోల్‌కతా నగరాల్లో ఆఫీస్ స్పేస్‌కు గణనీయమైన డిమాండ్‌ను తీసుకొస్తున్నట్టు జైన్ వెల్లడించారు. ఫ్లెక్సిబుల్ ఆఫీస్ స్పేస్ (గంటలు, రోజుల తరబడి లీజింగ్‌కు అవకాశం ఇచ్చేవి) ఆపరేటర్లు పెద్ద ఎత్తున కార్యకలాపాలను విస్తరిస్తూ, ఆఫీస్ స్పేస్‌లను లీజుకు తీసుకుంటున్నట్టు అనరాక్ నివేదిక తెలిపింది.

ఈ రంగాల నుంచి డిమాండ్..

ఐటీ/ఐటీఈఎస్, ఫైనాన్షియల్ సర్వీసెస్ (బ్యాంకులు సహా), ఇంజనీరింగ్ అండ్ తయారీ రంగ కంపెనీలు ఆఫీస్ స్పేస్ లీజింగ్ డిమాండ్‌కు కీలకంగా ఉన్నట్టు అనరాక్ నివేదిక వెల్లడించింది. ''2025 సంవత్సరంలో డిమాండ్ ఆశావహంగా ఉండనుంది. స్థిరీకరణ, విస్తరణ, హైబ్రిడ్ పని నమూనా డిమాండ్‌కు మద్దతుగా నిలవనున్నాయి. గురుగ్రామ్, బెంగళూరు, పుణెలో గ్రేడ్-1 ఆఫీస్ స్పేస్ సరఫరాలో కొరత ఉంది. డెవలపర్లు ఈ అంతరాన్ని భర్తీ చేసేందుకు కృషి చేస్తున్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 20-25 మిలియన్ (200-250 లక్షల) ఎస్ఎఫ్‌టీ గ్రేడ్-ఏ ఆఫీస్ స్పేస్ నిర్మాణంలో ఉంది. సకాలంలో నిర్మాణం పూర్తి చేసే డెవలపర్లు పెరుగుతున్న డిమాండ్ అవకాశాలను సొంతం చేసుకోవడంలో ముందుంటారు''అని జైన్ తెలిపారు. ఈ డిమాండ్ స్థిరంగా కొనసాగుతుందా? అన్న ప్రశ్నకు కచ్చితంగా అని బదులిచ్చారు. తక్కువ వ్యయాలు, నైపుణ్య మానవ వనరులు, నిర్వహణ సామర్థ్యాలు వెరసి బీఎఫ్ఎస్ఐ, హెల్త్‌కేర్, టెక్నాలజీ, ఆర్అండ్‌డీ పరిశ్రమల్లో జీసీసీలకు భారత్ చిరునామాగా మారుతోందన్నారు.

సవాళ్లు..

ఆఫీస్ స్పేస్ మార్కెట్లో సవాళ్ల గురించి జైన్ ప్రస్తావిస్తూ.. అధిక ముడి సరుకుల ధరలు, సరఫరా వైపు సమస్యలతో నిర్మాణంలో జాప్యం నెలకొనడం ప్రధాన సవాలుగా తెలిపారు. ఆఫీస్ స్పేస్‌లో స్వల్పకాల లీజుకు ప్రాధాన్యం ఇస్తుండడం ఈ విభాగంలో దీర్ఘకాల ఒప్పందాలపై ప్రభావం చూపిస్తున్నట్టు చెప్పారు.

టాప్-5లో రౌనక్, హారిక

భారత చెస్ క్రీడాకారులకు మిశ్రమ ఫలితాలు


అర్జున్


రౌనక్ సాధ్వాని


హారిక

న్యూయార్క్: ప్రపంచ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్‌లో భారత క్రీడాకారులకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. ఓపెన్ విభాగంలో భారత్ నుంచి 9 మంది గ్రాండ్‌మాస్టర్లు... మహిళల విభాగంలో 8 మంది క్రీడాకారిణులు ఈ మెగా ఈవెంట్‌లో పోటీపడుతున్నారు. తొలి రోజు ఓపెన్ విభాగంలో 5 రౌండ్ గేమ్‌లు... మహిళల విభాగంలో 4 రౌండ్ గేమ్‌లు జరిగాయి. ఐదు రౌండ్‌లు ముగిశాక ఓపెన్ విభాగంలో భారత గ్రాండ్‌మాస్టర్ రౌనక్ సాధ్వాని 4 పాయింట్లతో ఐదో స్థానంలో ఉన్నాడు. భారత్‌కే చెందిన ఇరిగేశి అర్జున్ 4 పాయింట్లతో 12వ ర్యాంక్‌లో, ప్రణవ్ 3.5 పాయింట్లతో 32వ ర్యాంక్‌లో, ప్రజ్ఞానంద 3 పాయింట్లతో 56వ ర్యాంక్‌లో, దీప్తాయన్ ఘోష్ 3 పాయింట్లతో 69వ ర్యాంక్‌లో, హర్ష భరతకోటి 2 పాయింట్లతో 108వ ర్యాంక్‌లో, అరవింద్ చిదంబరం 2 పాయింట్లతో 120వ ర్యాంక్‌లో, కార్తీక్ వెంకటరామన్ 1.5 పాయింట్లతో 144వ ర్యాంక్‌లో, 1.5 పాయింట్లతో 156వ ర్యాంక్‌లో ఉన్నారు. ప్లేయర్ల పాయింట్లు సమంగా ఉంటే మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంక్‌ను వర్గీకరిస్తున్నారు. హెల్గీ గ్రేటర్‌సన్ (ఐస్‌లాండ్), అలీరెజా ఫిరూజా (ఫ్రాన్స్), షాంగ్లీ లు (చైనా)లపై గెలిచిన రౌనక్... సామ్యూల్ సెవియన్ (అమెరికా), రే రాబ్సన్ (అమెరికా)లతో గేమ్‌లను 'డ్రా' చేసుకున్నాడు. డేవిడ్ బ్రాడ్‌స్కీయ్ (అమెరికా), విక్టర్ బోలోగన్ (మాల్డొవా), ఫిడేల్ జిమెనెజ్ (అమెరికా), ఎల్తాజ్ సఫార్లీ (అజర్‌బైజాన్)లపై గెలిచిన అర్జున్... సామ్యూల్ సెవియన్ (అమెరికా) చేతిలో ఓడిపోయాడు.

మహిళల విభాగంలో నాలుగు రౌండ్ల తర్వాత తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక 3.5 పాయింట్లతో నాలుగో ర్యాంక్‌లో నిలిచింది. ఇనా అగ్‌రెస్ట్ (స్వీడన్), నటాలియా జుకోవా (ఉక్రెయిన్), ఉల్వియా ఫతాలియెవా (అజర్‌బైజాన్)లపై నెగ్గిన హారిక... టియోడోరా ఇన్‌జాక్ (సెర్బియా)తో గేమ్‌ను 'డ్రా' చేసుకుంది. భారత్‌కే చెందిన వైశాలి 3 పాయింట్లతో 15వ ర్యాంక్‌లో, వంతిక అగర్వాల్ 2.5 పాయింట్లతో 35వ ర్యాంక్‌లో, కోనేరు హంపి 2.5 పాయింట్లతో 38వ ర్యాంక్‌లో, సాహితి వర్షిణి 2 పాయింట్లతో 57వ ర్యాంక్‌లో, నూతక్కి ప్రియాంక 2 పాయింట్లతో 61వ ర్యాంక్‌లో, దివ్య దేశ్‌ముఖ్ 2 పాయింట్లతో 70వ ర్యాంక్‌లో, పద్మిని రౌత్ 1.5 పాయింట్లతో 78వ ర్యాంక్‌లో ఉన్నారు.

మాజీ ప్రధానికి క్రీడాలోకం శ్రద్ధాంజలి

న్యూఢిల్లీ: అనారోగ్యంతో తుదిశ్వాస విడిచిన భారత మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్‌కు క్రీడాలోకం నివాళులు అర్పించింది. పలువురు దిగ్గజాలు, మాజీ క్రికెటర్లు సచిన్ టెండూల్కర్, వీవీఎస్ లక్ష్మణ్, వీరేంద్ర సెహ్వాగ్, యువరాజ్ సింగ్, హర్భజన్ సింగ్, రెజ్లర్ వినేశ్ ఫొగాట్, షట్లర్ సింధు, గోల్ఫర్ జీవ్ మిల్కాసింగ్‌లు ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.



మాజీ ప్రధాని మన్మోహన్ మృతి దేశానికి తీరని లోటు. ఆయన సేవల్ని జాతి ఎప్పటికీ గుర్తుంచుకుంటుంది. -సచిన్ టెండూల్కర్

రెస్ట్ ఇన్ పీస్ మన్మోహన్‌జీ. మీ జీవితం మా అందరికీ స్ఫూర్తిదాయకం. 2013లో మీతో ముచ్చటించిన క్షణాలు ఎప్పటికీ మర్చిపోలేను. మీ కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. -షట్లర్ పీవీ సింధు


మన్మోహన్ సింగ్ మరణవార్త నన్ను తీవ్రంగా బాధించింది. 2008 బీజింగ్ ఒలింపిక్స్‌లో స్వర్ణం గెలిచాక ఆయనతో నేను భేటీ అయ్యాను. ఆయన నాయకత్వం, ప్రధానిగా ఎంచుకున్న దీర్ఘకాలిక లక్ష్యాలవల్లే భారత్ వృద్ధి సాధించింది. ఆయన సేవలు జాతి ఎన్నటికీ మరువదు. -షూటర్ అభినవ్ బింద్రా

నా జీవితంలో నేను కలిసి అతిగొప్ప వ్యక్తుల్లో మన్మోహన్ ఒకరు. దార్శనికతలో ఆయన్ని మించినవారు లేరు. ప్రపంచం గొప్ప జ్ఞానిని కోల్పోయింది. -గోల్ఫర్ జీవ్ మిల్కాసింగ్

మన్మోహన్ ప్రధాని మాత్రమే కాదు. దేశ ప్రగతి కోసం నిరంతరం పాటుపడిన ఆర్థికవేత్త. ఆయన దూరదృష్టి. ప్రవేశపెట్టిన సంస్కరణలు దేశాన్ని ముందుకు నడిపించాయి. -మాజీ రెజ్లర్, ఎమ్మెల్యే వినేశ్ ఫొగాట్

మాజీ ప్రధాని మన్మోహన్ గొప్ప రాజనీతిజ్ఞుడు. భారత్‌ను ప్రగతిపథంలో నిలిపేందుకు అలుపెరగని కృషి చేశారు. బరువెక్కిన హృదయంతో ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తున్నాను. -యువరాజ్ సింగ్

సచిన్‌కు ఎంసీసీ విశిష్ట గౌరవ సభ్యత్వం



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియాకు చెందిన మెల్‌బోర్న్ క్రికెట్ క్లబ్ (ఎంసీసీ) భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్‌కు విశిష్ట గౌరవ సభ్యత్వం ఇవ్వనున్నట్లు ప్రకటించింది. 'ఎంసీసీ సభ్యత్వం స్వీకరించేందుకు భారత మాజీ కెప్టెన్, లెజెండ్ బ్యాటర్ సచిన్ అంగీకరించడం చాలా సంతోషంగా ఉంది. క్రికెట్‌కే అతనొక ఐకాన్ ప్లేయర్. అంతర్జాతీయ క్రికెట్లో అసాధారణ ఆటతీరుకు గుర్తింపుగా విశిష్ట సభ్యత్వం ఇస్తున్నాం' అని ఎంసీసీ 'ఎక్స్'లో పోస్ట్ చేసింది. 1838లో స్థాపించిన ఎంసీసీ ఆసీస్‌లోనే పురాతన క్రీడా క్లబ్. ఈ క్లబ్‌కు చెందిన మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్ (ఎంసీజీ)లో సచిన్ చేసిన పరుగుల రికార్డు ఇంకా కొనసాగుతోంది. ఈ వేదికపై ఐదు టెస్టులాడిన టెండూల్కర్ 44.90 సగటుతో 449 పరుగులు చేశాడు. ఇందులో ఒక సెంచరీ, మూడు అర్ధ శతకాలున్నాయి. ఆసీస్ నుంచి సచిన్‌కు ఈ గౌరవం కొత్తేం కాదు. మనదేశంలో 'భారతరత్న' లాంటి 'ఆర్డర్ ఆఫ్ ఆస్ట్రేలియా' పురస్కారంతో 2012లోనే అక్కడి ప్రభుత్వం సచిన్‌ను సత్కరించింది. ప్రస్తుతం ఎంసీజీలోనే భారత్, ఆస్ట్రేలియా మధ్య 'బాక్సింగ్ డే' టెస్టు జరుగుతోంది.

సెమీఫైనల్లో కేరళ, సర్వీసెస్

సాక్షి, హైదరాబాద్: సంతోష్ ట్రోఫీ జాతీయ సీనియర్ పురుషుల ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో డిఫెండింగ్ చాంపియన్ సర్వీసెస్, కేరళ జట్లు సెమీఫైనల్లోకి దూసుకెళ్లాయి. డెక్కన్ ఎరీనాలో శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్స్‌లో కేరళ 1-0 గోల్ తేడాతో జమ్మూ కశ్మీర్ జట్టును ఓడించగా... సర్వీసెస్ 2-1 గోల్స్ తేడాతో మేఘాలయ జట్టుపై విజయం సాధించింది. ఆదివారం జరిగే సెమీఫైనల్స్‌లో మణిపూర్‌తో కేరళ; పశ్చిమ బెంగాల్‌తో సర్వీసెస్ తలపడతాయి. జమ్మూ కశ్మీర్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో 73వ నిమిషంలో నసీబ్ రెహమాన్ చేసిన గోల్‌తో కేరళ 31వసారి సెమీఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. మేఘాలయ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో సర్వీసెస్ తరఫున థింగ్నామ్ సింగ్ (33వ నిమిషంలో), రాహుల్ రామకృష్ణన్ (46వ నిమిషంలో)ఒక్కో గోల్ చేశారు. మేఘాలయ జట్టుకు మావ్నాయ్ ఏకైక గోల్ అందించాడు.





టైటిల్ పోరుకు హరియాణా స్టీలర్స్, పట్నా పైరేట్స్

సెమీఫైనల్స్‌లో ఓడిన యూపీ యోధాస్, దబంగ్ ఢిల్లీ

పుణే: ప్రొ కబడ్డీ లీగ్‌లో హరియాణా స్టీలర్స్ వరుసగా రెండోసారి ఫైనల్‌కు దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన తొలి సెమీఫైనల్లో హరియాణా స్టీలర్స్ 28-25 పాయింట్ల తేడాతో యూపీ యోధాస్‌ను ఓడించింది. తాజా సీజన్‌లో తిరుగులేని ఆధిపత్యంతో గ్రూప్ దశలో అగ్రస్థానంలో నిలిచిన హరియాణా స్టీలర్స్ సెమీస్‌లోనూ అదే జోరు కొనసాగించింది. ఆద్యంతం హోరాహోరీగా సాగిన పోరులో తొలి అర్ధభాగం ముగిసే సమయానికి హరియాణా 12-11తో ముందంజలో నిలిచింది. ద్వితీయార్ధంలో ప్రత్యర్థిని ఆలౌట్ చేసి ఒత్తిడిలోకి నెట్టి చివరి వరకు దాన్ని కొనసాగించి స్టీలర్స్ తుదిపోరుకు చేరింది. హరియాణా తరఫున శివమ్ పతారె 7, వినయ్ 6 రెయిడ్ పాయింట్లు సాధించారు. రాహుల్ సత్పాల్ (5 పాయింట్లు) ట్యాక్లింగ్‌లో అదరగొట్టాడు. ఓవరాల్‌గా ఈ మ్యాచ్‌లో స్టీలర్స్ 15 రెయిడ్ పాయింట్లు సాధించగా... యూపీ యోధాస్ 18 రెయిడ్ పాయింట్లు ఖాతాలో వేసుకుంది. అయితే డిఫెన్స్‌లో మెరుగైన ప్రదర్శన చేసిన స్టీలర్స్ ప్రత్యర్థిని ఒకసారి ఆలౌట్ చేయడంతో పాటు మరో రెండు ఎక్స్‌ట్రా పాయింట్లు సాధించి ముందంజ వేసింది. యూపీ యోధాస్ తరఫున స్టార్ రెయిడర్ గగన్ గౌడ 10 పాయింట్లతో పోరాడగా... భవానీ రాజ్‌పుత్, హితేశ్ చెరో 5 పాయింట్లు సాధించారు. రెండో సెమీఫైనల్లో మూడుసార్లు చాంపియన్ పట్నా పైరేట్స్ 32-28 పాయింట్ల తేడాతో మరో మాజీ చాంపియన్ దబంగ్ ఢిల్లీపై గెలుపొందింది. ఆధిక్యం చేతులు మారుతూ సాగిన పోరులో ఆఖర్లో ఒత్తిడిని అధిగమించిన పైరేట్స్ విజయతీరానికి చేరింది. పట్నా తరఫున దేవాంక్, అయాన్ చెరో 8 పాయింట్లు సాధించగా... శుభమ్ షిండే (5 పాయింట్లు), అంకిత్ (4 పాయింట్లు) రాణించారు. ఢిల్లీ జట్టు తరఫున అషు మలిక్ (9 పాయింట్లు), మోహిత్ దేశ్వాల్ (7 పాయింట్లు) పోరాడారు. ఆదివారం జరగనున్న తుదిపోరులో హరియాణా స్టీలర్స్‌తో పట్నా పైరేట్స్ తలపడనుంది.

మార్క్‌రమ్, బాష్ మెరుపులు

- దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్ 301
- పాకిస్తాన్ రెండో ఇన్నింగ్స్ 88/3


బాష్

సెంచూరియన్: పాకిస్తాన్‌తో తొలి టెస్టులో దక్షిణాఫ్రికా పటిష్ట స్థితిలో నిలిచింది. అరంగేట్ర మ్యాచ్‌లో బంతితో 4 వికెట్లు పడగొట్టిన కార్బిన్ బాష్ (93 బంతుల్లో 81 నాటౌట్; 15 ఫోర్లు) బ్యాట్‌తోనూ విజృంభించాడు. లోయర్ ఆర్డర్ అండతో పాకిస్తాన్ బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొంటూ అర్ధ సెంచరీ నమోదు చేశాడు. అరంగేట్ర మ్యాచ్‌లో 9వ స్థానంలో బ్యాటింగ్‌కు దిగి అత్యధిక వ్యక్తిగత స్కోరు చేసిన ఆటగాడిగా బాష్ రికార్డుల్లోకెక్కాడు. ఫలితంగా ఓవర్‌నైట్ స్కోరు 82/3తో శుక్రవారం రెండో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన దక్షిణాఫ్రికా చివరకు 73.4 ఓవర్లలో 301 పరుగులకు ఆలౌటైంది. దీంతో ఆతిథ్య సఫారీ జట్టుకు 90 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. ఓపెనర్ మార్క్‌రమ్ (144 బంతుల్లో 89; 15 ఫోర్లు) 11 పరుగుల తేడాతో సెంచరీని కోల్పోయాడు. కెప్టెన్ బవుమా (31; 4 ఫోర్లు), బెడింగ్‌హామ్ (30; 5 ఫోర్లు) ఫర్వాలేదనిపించారు. కైల్ వెరిన్ (2), మార్కో యాన్సెన్ (2) విఫలమయ్యారు. పాకిస్తాన్ బౌలర్లలో ఖుర్రమ్ షహజాద్, నసీమ్ షా చెరో 3 వికెట్లు పడగొట్టారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన పాకిస్తాన్ రెండో రోజు ఆట ముగిసే సమయానికి 22 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 88 పరుగులు చేసింది. కెప్టెన్ షాన్ మసూద్ (28; 4 ఫోర్లు) అయూబ్ (28; 6 ఫోర్లు), కమ్రాన్ గులామ్ (4) అవుట్ కాగా... బాబర్ ఆజమ్ (16 బ్యాటింగ్), సాద్ షకీల్ (8 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. చేతిలో 7 వికెట్లు ఉన్న పాకిస్తాన్... ప్రత్యర్థి తొలి ఇన్నింగ్స్ స్కోరుకు 2 పరుగులు వెనుకబడి ఉంది. సఫారీ బౌలర్లలో యాన్సెన్ 2 వికెట్లు తీశాడు.



భారత డేవిస్‌కప్ జట్టులో రిత్విక్

న్యూఢిల్లీ: డేవిస్‌కప్ వరల్డ్ గ్రూప్-1 ప్లే ఆఫ్ మ్యాచ్‌లో పోటీపడే భారత పురుషుల టెన్నిస్ జట్టును ప్రకటించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 1, 2 తేదీల్లో న్యూఢిల్లీ వేదికగా టోగో జట్టుతో భారత బృందం తలపడుతుంది. అఖిల భారత టెన్నిస్ సంఘం (ఏఐటీఏ) సెలెక్షన్ ప్యానెల్ ఐదుగురు సభ్యులతో కూడిన భారత జట్టును ప్రకటించగా... ఈ ఏడాది అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ) సర్క్యూట్‌లో నిలకడగా రాణించిన తెలంగాణ ప్లేయర్ బొల్లిపల్లి రిత్విక్ చౌదరీ తొలిసారి జాతీయ జట్టులోకి ఎంపికయ్యాడు. శశికుమార్ ముకుంద్, రామ్‌కుమార్ రామనాథన్, శ్రీరామ్ బాలాజీ, కరణ్ సింగ్ జట్టులోని ఇతర సభ్యులు. సింగిల్స్‌లో భారత నంబర్‌వన్ సుమిత్ నగాల్, డబుల్స్‌లో భారత రెండో ర్యాంకర్ యూకీ బాంబ్రీ టోగోతో మ్యాచ్‌కు తాము అందుబాటులో ఉండటం లేదని ఏఐటీఏకి తెలిపారు. సింగిల్స్ మ్యాచ్‌ల్లో శశికుమార్, రామ్‌కుమార్... డబుల్స్ మ్యాచ్‌లో శ్రీరామ్ బాలాజీ-రిత్విక్ చౌదరీ ఆడే అవకాశం ఉంది. ఆర్యన్ షా, మానస్ ధామ్నె, దక్షిణేశ్వర్ సురేశ్, యువన్ నందల్‌లను డేవిస్‌కప్ సన్నాహక శిబిరానికి ఎంపిక చేశారు. ఈ నలుగురిలో నుంచి ఇద్దరిని రిజర్వ్ ప్లేయర్లుగా ఎంపిక చేస్తామని భారత జట్టు నాన్ ప్లేయింగ్ కెప్టెన్ రోహిత్ రాజ్‌పాల్ తెలిపారు. స్వీడన్‌తో గత సెప్టెంబర్‌లో జరిగిన వరల్డ్ గ్రూప్ పోటీలో ఆడిన సిద్ధార్థ విశ్వకర్మ, నిక్కీ పునాచాలను టోగోతో మ్యాచ్‌కు ఎంపిక చేయలేదు.

నేటి నుంచి హాకీ ఇండియా లీగ్



రూర్కెలా: ఏడేళ్ల విరామం తర్వాత హాకీ ఇండియా లీగ్ మళ్లీ ప్రారంభమవుతోంది. నేటి నుంచి జరిగే ఈ టోర్నీ ఫిబ్రవరి 1వ తేదీన జరిగే ఫైనల్‌తో ముగుస్తుంది. పురుషుల విభాగంలో మొత్తం ఎనిమిది జట్లు పోటీపడుతున్నాయి. నేడు జరిగే తొలి మ్యాచ్‌లో ఢిల్లీ ఎస్‌జీ పైపర్స్‌తో గోనసిక వైజాగ్ జట్టు తలపడుతుంది. మహిళల విభాగంలో నాలుగు జట్ల మధ్య తొలిసారి జరిగే హాకీ ఇండియా లీగ్ జనవరి 12న రాంచీలో మొదలవుతుంది.

సెమీస్‌లో లక్ష్యసేన్

షెన్‌జెన్ (చైనా): భారత స్టార్ షట్లర్ లక్ష్యసేన్ కింగ్ కప్ ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ ఓపెన్ టోర్నీలో సెమీఫైనల్‌కు దూసుకెళ్లాడు. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ పోరులో ప్రపంచ 12వ ర్యాంకర్ లక్ష్యసేన్ 10-21, 21-13, 21-13తో అంగుస్ లాంగ్ (హాంకాంగ్)పై విజయం సాధించాడు. తొలి గేమ్‌లో పరాజయం పాలైన లక్ష్యసేన్... ఆ తర్వాత తిరిగి పుంజుకుని సత్తా చాటాడు. అంగుస్ లాంగ్‌తో ఇప్పటి వరకు నాలుగు మ్యాచ్‌లాడిన 23 ఏళ్ల లక్ష్యసేన్‌కు ఇదే తొలి విజయం కావడం విశేషం.



చైనా బ్యాడ్మింటన్ దిగ్గజం లిన్ డాన్ ఆలోచనల్లోనుంచి పుట్టిన ఈ టోర్నీలో 8 మంది అగ్రశ్రేణి షట్లర్లు పాల్గొంటున్నారు. మూడు రోజుల పాటు జరగనున్న ఈ టోర్నమెంట్‌లో లక్ష్యసేన్, అంగుస్‌తో పాటు కున్లావత్ వితిద్‌సర్న్ (థాయ్‌లాండ్), అంటోన్‌సెన్ (డెన్మార్క్), లోహ్ కీన్ యె (సింగపూర్), అలెక్స్ లానైర్ (ఫ్రాన్స్), హు జీ అన్ (చైనా), వాంగ్ జి జున్ (చైనా) పోటీపడుతున్నారు. ఈ టోర్నీ బీడబ్ల్యూఎఫ్ క్యాలెండర్‌లో భాగం కాకపోవడంతో ఇందులో విజయం సాధించినా ర్యాంకింగ్ పాయింట్లు లభించవు.


జింబాబ్వే 586 ఆలౌట్

టెస్టుల్లో తమ అత్యధిక స్కోరు నమోదు ● సెంచరీలతో కదంతొక్కిన ఇర్విన్, బెనెట్ ● అఫ్గానిస్తాన్ 95/2


బెనెట్


ఇర్విన్

బులవాయో: అఫ్గానిస్తాన్‌తో జరుగుతున్న తొలి టెస్టులో రెండో రోజు కూడా జింబాబ్వే జోరే కొనసాగింది. దీంతో ఆ జట్టు తమ టెస్టు చరిత్రలో అత్యధిక స్కోరు నమోదు చేసింది. కెప్టెన్ క్రెయిగ్ ఇర్విన్ (176 బంతుల్లో 104; 10 ఫోర్లు), బ్రియాన్ బెనెట్ (124 బంతుల్లో 110 నాటౌట్; 5 ఫోర్లు, 4 సిక్స్‌లు) సెంచరీలతో మొత్తం మూడు శతకాల మోత మోగింది. తొలిరోజు ఆటలో సీన్ విలియమ్స్ సెంచరీ సాధించాడు. ఓవర్‌నైట్ స్కోరు 363/4తో రెండో రోజు ఆట కొనసాగించిన జింబాబ్వే తొలి ఇన్నింగ్స్‌లో 135.2 ఓవర్లలో 586 పరుగుల వద్ద ఆలౌటైంది. 2001లో వెస్టిండీస్‌తో జరిగిన టెస్టులో జింబాబ్వే చేసిన 563/9 స్కోరే ఇప్పటిదాకా అత్యధిక పరుగులు కాగా... ఇప్పుడా రికార్డును సవరించింది. ఓవర్‌నైట్ బ్యాటర్లలో విలియమ్స్ ఎంతోసేపు నిలువలేదు. ఇర్విన్... తర్వాత వచ్చిన బెనెట్‌తో ఇన్నింగ్స్‌ను నడిపించాడు. ఈ క్రమంలో ఇద్దరు సెంచరీలు పూర్తిచేసుకున్నారు. టెయిలెండర్లు న్యూమన్ న్యామ్‌హురి (26; 2 ఫోర్లు, 1 సిక్స్), ముజరబని (19; 1 ఫోర్, 1 సిక్స్) చేసిన పరుగులతో జింబాబ్వే అత్యధిక స్కోరు సాధించింది. అఫ్గాన్ బౌలర్లలో ఘజన్‌ఫర్ 3, నవీద్ జద్రాన్, జహీర్ ఖాన్, జియావుర్ రహ్మాన్ తలా 2 వికెట్లు తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన అఫ్గానిస్తాన్ ఆట ముగిసే సమయానికి 30 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 95 పరుగులు చేసింది. ఓపెనర్లు సిదిఖుల్లా అతల్ (3), అబ్దుల్ మాలిక్ (23; 1 ఫోర్) నిష్క్రమించగా, రహ్మత్ షా (49 బ్యాటింగ్; 5 ఫోర్లు, 1 సిక్స్), కెప్టెన్ హష్మతుల్లా షాహిది (16 బ్యాటింగ్; 3 ఫోర్లు) క్రీజులో ఉన్నారు. అఫ్గాన్ ఇంకా 491 పరుగులు వెనుకబడి ఉంది.



2007లో అమెరికా అధ్యక్షుడు బుష్‌తో మన్మోహన్..



బౌద్ధ గురువు దలైలామాతో మన్మోహన్



పాక్ మాజీ అధ్యక్షుడు ముషారఫ్‌తో..



2006లో నెల్సన్ మండేలాతో



2013లో అమెరికా అధ్యక్షుడు ఒబామాతో..

వినయపూర్వక సమాధానం..

చిన్నచిన్న విషయాల పట్ల స్పందనే మనుషుల వ్యక్తిత్వమేంటో తెలిసేలా చేస్తుంది. కొంతకాలంగా మన్మోహన్ సింగ్ ఆరోగ్యం క్షీణించడంతో ఆయనకు విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించారు. దీంతో ఆయన సమావేశాలు, ఇంటర్వ్యూలను సిబ్బంది వాయిదా వేస్తున్నారు. అంతటి అనారోగ్యంలోనూ ఆయన ఈ-మెయిల్‌లకు సమాధానం ఇచ్చారు. ఇంటర్వ్యూ కావాలని అడిగిన ఓ విలేకరికి.. 'అనారోగ్యం కారణంగా నేను ప్రస్తుతానికి ఇంటర్వ్యూ ఇవ్వలేకపోతున్నా. అందుకు చింతిస్తున్నా'అని రిప్లై ఇచ్చారు. ఆ ప్రస్తుతానికి అనే మాట ఎప్పటికిలా మిగిలిపోయింది.

విస్పష్ట స్పందన...

బాధ్యతల్లో ఉన్నప్పుడు ఓకే.. ఏ బాధ్యతల్లో లేకపోయినా.. అంతగా సహకరించని వయసులో దేశం గురించి ఆందోళన చెందే వ్యక్తులు చాలా అరుదు. అలాంటి అరుదైన గొప్ప వ్యక్తి మన్మోహన్ సింగ్. గతేడాది జీ20 సదస్సు మన దేశంలో నిర్వహించారు. సదస్సు జరగడానికి ముందే ఆయన మీడియాకు ఇంటర్వ్యూ ఇచ్చారు. కాంగ్రెస్‌లోని నేతలంతా అదో షోగా ఎగతాళి చేసినా.. ఆయన మాత్రం సదస్సు ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. కొత్త ప్రపంచ క్రమాన్ని నడిపించడంలో దేశం కీలకపాత్ర పోషిస్తోందని, అలాగే తన సార్వభౌమ, ఆర్థిక ప్రయోజనాలకు ప్రాధాన్యతను ఇస్తూ సరైన పనిచేస్తోందని కొనియాడారు. దేశ భవిష్యత్ గురించి ఆశావాహంగా ఉన్నానని చెప్పిన ఆయన.. భారత సమాజం సామరస్యంగా ఉంటేనే అది సాధ్యమవుతుందంటూ బీజేపీకి చురకలంటించారు.

కుమార్తె కోసం ఒక్కరోజు..

పదేళ్ల పదవీకాలంలో కార్యాలయంలో అందరూ మన్మోహన్‌సింగ్‌ను 'డాక్టర్ సాహెబ్'అని పిలుచుకునేవారు. సుదీర్ఘ విదేశీ పర్యటనలు అంటే ఆయనకు అస్సలు ఇష్టం ఉండేది కాదు. ఆయన అమెరికా అధికారిక పర్యటనలో ఉన్నప్పుడైనా, ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో పాల్గొనడానికి వెళ్లినా ఒక రోజు మాత్రమే పర్యటనను పొడిగించేవారు. ఆ ఒక్కరోజూ న్యూయార్క్‌లో అటార్నీగా పనిచేస్తున్న తన కుమార్తె అమృత్‌తో గడిపేవారు.

సిగ్గుపడుతూనే కేక్ కట్ చేసి..

వ్యక్తిగత వేడుకలను అంతగా ఇష్టపడని వ్యక్తి మన్మోహన్‌సింగ్. 2011లో ఐక్యరాజ్యసమితి సమావేశాల అనంతరం న్యూయార్క్ నుంచి ఇండియా వస్తున్నారు. అది కూడా ఆయన జన్మదినమైన సెప్టెంబర్ 26న. దీంతో ఎయిర్ ఇండియా వన్ విమాన సిబ్బంది కేక్ కట్ చేయించాలని ప్లాన్ చేసింది. మన్మోహన్‌కు షుగర్ ఉండటంతో షుగర్ ఫ్రీ కేక్‌ను విమానంలో సిద్ధంగా ఉంచారు. విమానంలో వేడుకలకు ఆయన మర్యాదగా నో చెప్పారు. టేకాఫ్ అయిన తరువాత, పాత్రికేయులను పలకరించడానికి మీడియా విభాగానికి వచ్చినప్పుడు జర్నలిస్టులు అభ్యర్థించడంతో ఆయన సిగ్గుపడుతూనే అంగీకరించారు. అందరికీ కేక్ ముక్కలను అందించారు.

యాక్సిడెంటల్ ప్రధాని అంటూ పుస్తకమేసినా..

2014లో ఆయన పదవినుంచి దిగిపోయాక.. ప్రధాని నివాసాన్ని ఖాళీ చేస్తున్న సమయం. ప్రధాని మాజీ మీడియా సలహాదారు సంజయ్ బారు 'ది యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్'అనే పుస్తకాన్ని ప్రచురించారు. మీడియానో, ప్రతిపక్షాలో కాదు.. తన సేవను చరిత్ర గుర్తిస్తుందని చెప్పిన మన్మోహన్ అన్నింటికీ దూరంగా తన పుస్తకాలను సర్దుకునే పనిలో పడ్డారు. ఆ సందర్భంలో ఆయన పెద్ద కుమార్తె ఉపిందర్ సింగ్‌ను మీడియా కలవగా.. 'ఆ పుస్తకం నా తండ్రి నమ్మకానికి చేసిన ద్రోహం. ఆయన వ్యక్తిత్వాన్ని తప్పుగా అర్థం చేసుకోవడం'అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినా ఆయన ఇవేమీ పట్టించుకునే స్థితిలో లేరని.. తన వద్ద పెద్ద సంఖ్యలో ఉన్న పుస్తకాలను కొత్త ఇంట్లోకి మార్చడంపైనే దృష్టి పెట్టారని.. విమర్శలను పట్టించుకోని మన్మోహన్ వ్యక్తిత్వం గురించి ఉపిందర్ చెప్పారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

అసాధారణ వ్యక్తి

ప్రపంచ నేతల నివాళులు

అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా తన జ్ఞాపకాలు 'ఎ ప్రామిస్డ్ ల్యాండ్'పుస్తకంలో మన్మోహన్ సింగ్ అసాధారణ నాయకత్వానికి నివాళులు అర్పించారు. ''అసాధారణ జ్ఞానం ఉన్న వ్యక్తి. ఆర్థిక సంస్కరణల పట్ల, భారత ప్రజల శ్రేయస్సు పట్ల ఆయనకు నిబద్ధత, అంకితభావం, అచంచలమైన చిత్తశుద్ధి ఉంది. ఆయన లక్షలాది మందిని పేదరికం నుంచి బయటికి తీసుకొచ్చారు. తెలివైన వ్యక్తి. ఆలోచనాపరుడు. నిజాయితీపరుడు. భారత ఆర్థిక వ్యవస్థపై మన్మోహన్ సింగ్ ప్రభావం మరిచిపోలేనిది. వృద్ధిని ప్రోత్సహించే, పేదరికాన్ని తగ్గించే, విద్య, ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యతనిచ్చే విధానాలను అమలు చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (నరేగా), సమాచార హక్కు చట్టం వంటి తమ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు దేశంపై శాశ్వత ప్రభావాన్ని చూపాయి. తన పదవీకాలంలో విమర్శలను ఎదుర్కొన్నప్పటికీ, ఆయన భవిష్యత్ పట్ల ఆశాజనకంగా ఉన్నారు''.

- అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా

ఆయన అంకితభావాన్ని గుర్తుంచుకుంటాం : అమెరికా

మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ మృతి పట్ల భారత ప్రజలకు అమెరికా ప్రగాఢ సంతాపం తెలిపింది. ''అమెరికా-భారత్ వ్యూహాత్మక భాగస్వామ్యానికి దారులేసిన గొప్ప ఛాంపియన్లలో మన్మోహన్ సింగ్ ఒకరు. గత రెండు దశాబ్దాల్లో మన దేశాలు కలిసి సాధించిన అనేక అంశాలకు ఆయన కృషి పునాది వేసింది. అమెరికా-భారత్ పౌర అణు సహకార ఒప్పందాన్ని ముందుకు తీసుకెళ్లారు. భారత వేగవంతమైన ఆర్థిక వృద్ధికి ఊతమిచ్చిన ఆర్థిక సంస్కరణలకు స్వదేశంలో మన్మోహన్ సింగ్ గుర్తుండిపోతారు. డాక్టర్ సింగ్ మృతికి సంతాపం తెలుపుతున్నాం. అమెరికా, భారత్‌లను మరింత దగ్గర చేయడానికి ఆయన చూపిన అంకితభావాన్ని ఎప్పటికీ గుర్తుంచుకుంటాం''అని అమెరికా ప్రకటించింది.

ఆయన పర్యటన మైలురాయి

''మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ మరణానికి మాల్దీవుల ప్రజల తరపున సంతాపం తెలుపుతున్నా. 2011 నవంబరులో మాల్దీవుల్లో ఆయన చేసిన చారిత్రాత్మక పర్యటన మన ఆర్థిక, సామాజిక అభివృద్ధిలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది. అభివృద్ధి పట్ల డాక్టర్ మన్మోహన్‌సింగ్‌కు ఉన్న నిబద్ధత, 'లుక్ ఈస్ట్ పాలసీ'ని బలోపేతం చేయడంలో ఆయన నాయకత్వం దక్షిణాసియా ప్రాంత అభివృద్ధికి, సహకారం పెంపొందించడంలో కీలక పాత్ర పోషించాయి. ఈ విపత్కర సమయంలో ఆయన కుటుంబానికి, భారత ప్రజలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నా'' - డాక్టర్ మొహమ్మద్ ముయిజు, మాల్దీవుల అధ్యక్షుడు

మన్మోహన్‌సింగ్ నాకు గురువు

''డాక్టర్ మన్మోహన్ సింగ్‌ను నేను గురువుగా భావిస్తా. జర్మనీ మాజీ ఛాన్సలర్ ఏంజెలా మెర్కెల్ కూడా ఆర్థిక అంశాలపై డాక్టర్ సింగ్ సలహాలు తీసుకున్నారు. 2013లో యూరోజోన్ క్రైసిస్ మీటింగ్ నిర్వహించినప్పుడు ఆమె డాక్టర్ సింగ్ సహాయం కోరారు''

- జపాన్ మాజీ ప్రధాని షింజో అబే

అస్సాం ఇంటికి అద్దె చెల్లించారు

మన్మోహన్ సింగ్ లోక్‌సభకు ఒక్కసారి కూడా ఎన్నికకాలేదు. ఎక్కువసార్లు అస్సాం నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యారు. 1991 నుంచి 2019 దాకా అస్సాంకు, ఆ తర్వాత రాజస్తాన్‌కు ఎగువసభలో ప్రాతినిధ్యం వహించారు. తొలిసారిగా 1991లో పోటీకి నామినేషన్ దాఖలు చేశారు. అస్సాం మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత హితేశ్వర్ సైకియా ఒత్తిడితో ఆయన అస్సాం నుంచి రాజ్యసభకు పోటీ చేశారు. అయితే, అస్సాంతో మన్మోహన్‌కు ఎలాంటి సంబంధం లేదు. అక్కడ స్థిరచరాస్తులేవీ లేవు. కనీసం చిరునామా కూడా లేదు. దాంతో తన ఇంటిని మన్మోహన్‌కు అద్దెకు ఇవ్వడానికి హితేశ్వర్ ముందుకొచ్చారు. హౌజ్ నెం.3989, నందన్ నగర్, వార్డ్ నెం.51, సరూమతారియా, డిస్‌పూర్, గౌహతి జిల్లా, కామరూప్(అస్సాం) -781006. ఈ చిరునామాతో మన్మోహన్ నామినేషన్ దాఖలు చేశారు. ఈ ఇల్లు హితేశ్వర్ భార్య హేమప్రభ సైకియా పేరిట రిజిస్టరై ఉంది. అస్సాంలో దాదాపు మూడు దశాబ్దాలపాటు మన్మోహన్‌కు ఇదే చిరునామాగా ఉండేది. అయితే ఆయన ఏనాడూ ఈ ఇంట్లో నివాసం ఉండలేదు. రాజ్యసభ ఎన్నికలు జరిగినప్పుడు అస్సాంకు వచ్చి ఓటు వేసి వెళ్లేవారు. ఇంట్లో ఉండనప్పటికీ మన్మోహన్ ప్రతినెలా ఠంచనుగా ప్రతినెలా రూ.700 చొప్పున అద్దె చెల్లించారని హేమప్రభ చెప్పారు.

మన్మోహన్‌కు అంతర్జాతీయ మీడియా నివాళులు

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మరణానికి అంతర్జాతీయ మీడియా సంతాపం తెలిపింది. ఆర్థిక సంస్కరణలతో దేశాన్ని అభివృద్ధి బాటన నడిపిన నాయకుడని ప్రపంచ మీడియా ప్రశంసించింది.

ఆర్థిక సంస్కరణల రూపశిల్పి: బీబీసీ

1991లో ఆర్థిక మంత్రిగా, 2004 నుంచి 2014 వరకు ప్రధానిగా భారత ఆర్థిక వ్యవస్థను ఆధునీకరించడంలో మన్మోహన్‌సింగ్ కీలక పాత్ర పోషించారు. ఆయన కీలక సరళీకృత ఆర్థిక సంస్కరణల రూపశిల్పి. భారత అత్యున్నత పదవిని నిర్వహించిన మొదటి సిక్కుగా చారిత్రక ప్రాముఖ్యత కలిగిన నేత. 1984 సిక్కు వ్యతిరేక అల్లర్లకు ఆయన బహిరంగ క్షమాపణ చెప్పారు.

పదవులు నచ్చని రాజు: రాయిటర్స్

మన్మోహన్ సింగ్.. పదవులు నచ్చని రాజు. భారత్‌లో అత్యంత విజయవంతమైన నాయకులలో ఒకరు. ఆయన పాలనలో జరిగిన ఆర్థిక వృద్ధి లక్షలాదిమందిని పేదరికం నుండి బయటకు తీసుకొచ్చింది. గొప్ప ప్రధానిగా ప్రపంచవ్యాప్తంగా గౌరవం పొందినా.. సోనియాగాంధీ చేతిలోనే ప్రభుత్వం ఉందనే విమర్శలను ఆయన ఎదుర్కోవాల్సి వచ్చింది.

దూరదృష్టిగల నేత: న్యూయార్క్ టైమ్స్

మన్మోహన్‌సింగ్ భారతదేశాన్ని ప్రపంచ ఆర్థిక వేదికపైకి నడిపించిన దూరదృష్టి గల నేత, మృదుభాషి. పాకిస్తాన్‌తో సయోధ్య కోసం ఆయన అనేక ప్రయత్నాలు చేశారు.

సమగ్రతకు చిహ్నం: వాషింగ్టన్ పోస్ట్

మన్మోహన్‌సింగ్ టెక్నోక్రాట్ నుంచి ప్రధాని స్థాయికి నాటకీయంగా ఎదిగారు. భారత్-అమెరికా సంబంధాలను బలోపేతం చేయడంలో కీలక పాత్రను పోషించారు. ఆయన హయాంలో జరిగిన ఇండో-యూఎస్ పౌర అణు ఒప్పందం ఒక మైలురాయి. సమగ్ర నాయకుడైన ఆయన శక్తిహీనులని ప్రత్యర్థుల నుంచి విమర్శలు ఎదుర్కొన్నారు.

భారత ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టిన వ్యక్తి: బ్లూమ్‌బర్గ్

మన్మోహన్‌సింగ్ గొప్ప సంస్కర్త. 1990లలో భారత ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడంలో కీలక పాత్ర పోషించారు. అవినీతి కుంభకోణాలతో రెండో పర్యాయంలో ఆయన సవాళ్లు ఎదుర్కొన్నారు. ఇది పెట్టుబడిదారులను నిరాశపరిచింది. ఆయన ప్రతిష్ఠను దెబ్బ తీసింది.



ఎల్లలెరుగని స్నేహితుడు: ఎక్స్‌ప్రెస్ ట్రిబ్యూన్

ద్వైపాక్షిక సంబంధాలను పెంపొందించడంలో మన్మోహన్‌సింగ్ పాత్ర అమోఘం. వేగవంతమైన ఆర్థిక వృద్ధికి ఆయన చేసిన కృషి, సంస్కరణలు ఆయన పదవీకాలంలో మైలురాళ్లు. సామాజిక విధానం, దౌత్యంలో ఆయన నాయకత్వం గొప్పది. 2జీ స్పెక్ట్రమ్ కేసు, బొగ్గు కుంభకోణం వంటి వివాదాలు ఆయన తర్వాతి కాలాన్ని దెబ్బతీశాయి.

సౌమ్యుడైన నాయకుడు: అల్ జజీరా

మన్మోహన్ సింగ్ సౌమ్య ప్రవర్తన కలిగిన టెక్నోక్రాట్. గొప్ప వ్యక్తిగత సమగ్రత కలిగిన నాయకుడు. దూర దృష్టితో సామాజిక, ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చారు.

సిక్కులకు క్షమాపణ చెప్పిన మన్మోహన్ సింగ్

భారత్‌కు తొలి సిక్కు ప్రధానమంత్రిగా మన్మోహన్ రికార్డుకెక్కారు. 1984లో జరిగిన సిక్కులపై జరిగిన దాడులకు ప్రధానమంత్రి హోదాలో ఆయన క్షమాపణ చెప్పారు. 2005 ఆగస్టు 11న రాజ్యసభలో మాట్లాడారు. ఇందిరా గాంధీ హత్యానంతరం కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలోజరిగిన సిక్కు వ్యతిరేక అల్లర్లు, దాడుల పట్ల విచారం వ్యక్తంచేశారు. బాధితులతోపాటు మొత్తం భారతీయులకు క్షమాపణ చెప్పారు. అప్పటి దాడుల్లో జగదీష్ టైట్లర్, సజ్జన్ కుమార్ సహా పలువురు కాంగ్రెస్ నేత హస్త ఉందని నానావతి కమిషన్ నివేదిక వెల్లడించింది. ఈ నేపథ్యంలో సిక్కులకు కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలన్న డిమాండ్లు వెల్లువెత్తాయి. కానీ, వారు నోరు మెదపలేదు. మన్మోహన్ సింగ్ ఒక్కరే క్షమాపణ కోరారు. నిందితులపై దర్యాప్తు కొనసాగిస్తామని, తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బాధితులను ఆదుకుంటామని చెప్పారు. సిక్కులకు మన్మోహన్ క్షమాపణ చెప్పడం అంతర్జాతీయంగా ప్రశంసలందుకుంది. గత 20 ఏళ్లలో ఏ భారతీయ నాయకుడూ చేయలేని పని మన్మోహన్ చేశారని అప్పట్లో ఢిల్లీలోని అమెరికన్ ఎంబసీలో డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్‌గా పనిచేస్తున్న రాబర్ట్ ఓ బ్లేక్ ప్రశంసించారు.

అమెరికన్లు పిల్లల్ని తప్పుడు మార్గంలో పెంచుతున్నారు: వివేక్ రామస్వామి

వాషింగ్టన్: భారత్ వంటి దేశాల నుంచి నిపుణులైన సిబ్బందిని నియమించుకోవడాన్ని పూర్తిగా ఆపేయాలంటూ మాగా (మేక్ అమెరికా గ్రేట్ అగైన్) వేదిక మళ్లీ డిమాండ్ చేస్తున్న వేళ.. భారతీయ అమెరికన్ వ్యాపార వేత్త, అమెరికా అధ్యక్ష పదవికి పోటీ చేసిన వివేక్ రామస్వామి చేసిన వ్యాఖ్యలు వివాదం రేపాయి. అమెరికా అధ్యక్షుడిగా మరికొద్ది రోజుల్లో పగ్గాలు చేపట్టనున్న డొనాల్డ్ ట్రంప్ భారతీయ అమెరికన్ వెంచర్ కేపిటలిస్ట్ శ్రీరాం కృష్ణన్‌ను కృత్రిమ మేథ సీనియర్ విధాన సలహాదారుగా ఇటీవల నియమించడం తెలిసిందే. ఈ నియామకంపై మాగా వేదిక విమర్శలు గుప్పిస్తోంది. ఇలాంటి చర్యలు అమెరికా ఫస్ట్ లక్ష్యాన్ని పక్కదారి పట్టిస్తాయని అంటోంది. ఇమిగ్రేషన్ విధానాల వల్లే అమెరికన్లకు అవకాశాల్లేకుండా పోతున్నాయని మరి కొందరు వాదిస్తున్నారు. అయితే, వివేక్ రామస్వామి మరో కోణంలో చేస్తున్న వాదించారు. అసలు సమస్య ఇమిగ్రేషన్ విధానాల్లో లేదని, అమెరికా సంస్కృతిలో పిల్లల పెంపకంలో లోపమే కారణమంటూ 'ఎక్స్'లో వ్యాఖ్యానించారు. అమెరికన్ యువతలో సహజంగానే నైపుణ్యం ఉందని, అయితే దానిని పెంపొందించడంలో వ్యవస్థాగతంగా విఫలమైందన్నారు. గణిత మేధావులు, ఉన్నత విద్యావంతులను వదిలేసి అలంకార పదవుల్లో ఉన్న వారిని పొగుడుతుండటమనే సంస్కృతే ఇందుకు కారణమన్నారు. అదే సమయంలో, వలసదారుల కుటుంబాలు తమ పిల్లలను విద్యారంగంలో నిష్ణాతులుగా మార్చి, క్రమశిక్షణతో పెంచుతున్నాయని తెలిపారు. సామాజిక కార్యక్రమాలు, టీవీ వీక్షణం వంటివాటిపైనా ఆంక్షలు పెడుతుంటాయన్నారు. ఫలితంగా ఈ కుటుంబాల నుంచి నాయకులు తయారవడం మామూలేనన్నారు. ఈ వ్యాఖ్యలపై మాగా వేదిక భగ్గుమంది. వలసదారులకు, హెచ్-1బీ వీసాదారులకు అనుకూలంగా మాట్లాడుతున్నారంటూ వివేక్ రామస్వామిపై ఎదురుదాడికి దిగింది.

8 ఏళ్లప్పుడు కిడ్నాపై.. 57 ఏళ్ల వయస్సులో ప్రత్యక్షం

ఆజంగఢ్: చిన్నతనంలో ఓ ఉత్సవానికి వెళ్లి కనిపించకుండా పోయిన మహిళను 49 ఏళ్ల తర్వాత సొంత కుటుంబంతో కలిపారు ఉత్తరప్రదేశ్ పోలీసులు. దశాబ్దాల ఎడబాటుకు పోలీసులు చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్ ముగింపు పలికింది. రెండు కుటుంబాలు ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయింది. మొరాదాబాద్‌కు చెందిన ఫుల్‌మతి/ ఫులా దేవి 8 ఏళ్ల వయస్సులో ఉండగా తల్లితో కలిసి ఓ ఉత్సవానికి వెళ్లింది. అక్కడ ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆమెను కిడ్నాప్ చేసి రాంపూర్‌కు చెందిన ఒకరికి అమ్మేశాడు. ఆమె అక్కడే ఉండిపోయింది. ఎన్ని ఏళ్లు గడిచినా తన సొంత కుటుంబం గురించి ఆరా తీయడం మాత్రం మానలేదు. రాంపూర్‌కు చెందిన స్కూల్ టీచర్ డాక్టర్ పూజా రాణికి ఈ విషయం తెలిసింది. అదనపు ఎస్పీ శైలేంద్ర లాల్‌కు ఆమె ఫుల్‌మతి విషయం చేరవేశారు. ఆజంగఢ్‌లో ఉండే సొంత కుటుంబాన్ని కలుసుకోవాలని ఆమె తపన చెందుతున్నట్లు వివరించారు. అదనపు ఎస్పీ శైలేంద్ర లాల్ చొరవ తీసుకుని, దర్యాప్తు కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఫుల్ మతి తెలిపిన సమాచారం మేరకు మౌ జిల్లాలో ఆమె మేనమామ రామ్ చందర్‌ను కనిపెట్టారు పోలీసులు. 1975లో తప్పిపోయిన తన మేన కోడలు ఫుల్‌మతిని ఆయన గుర్తు పట్టారు కూడా. రాంచందర్ ద్వారా ఆజంగఢ్ జిల్లా బెద్‌పూర్ గ్రామంలోని ఫుల్‌మతి కుటుంబం జాడ తెలుసుకున్నారు. అక్కడ ఫుల్‌మతి సోదరుడు లాల్‌ధర్‌ను కలిసి విషయం తెలిపారు. ఫుల్‌మతి తప్పిపోయిన తన సోదరేనని అతడు ధ్రువీకరించాడు. చివరికి పోలీసుల ద్వారా ఫుల్‌మతి, లాల్‌ధర్ కుటుంబాలు ఒక్కటయ్యాయి. ఎన్నో ఏళ్ల తర్వాత సొంత కుటుంబాన్ని చూసుకున్న ఆనందంలో ఫుల్‌మతి ఉప్పొంగిపోయింది. కన్నీటి పర్యంతమైంది. రెండు కుటుంబాలు పోలీసుల కృషిని కొనియాడాయి.

బోగీ కింద అత్యంత ప్రమాదకరంగా..

250 కిలోమీటర్లు ప్రయాణించిన ఓ వ్యక్తి..

- రైల్వే సిబ్బంది తనిఖీల్లో బయటపడ్డ వైనం

జబల్పూర్: మధ్యప్రదేశ్‌లోని ఇటార్సి నుంచి జబల్పూర్‌కు దాదాపు 250 కిలోమీటర్ల దూరం రైలు బోగీ కింద ప్రాణాలను పణంగా పెట్టి ప్రయాణించిన ఓ వ్యక్తిని రైల్వే అధికారులు పట్టుకున్నారు. టిక్కెట్ కొనేందుకు డబ్బుల్లేకనే ఈ పనికి పూనుకున్నట్లు అతడు విచారణలో తెలిపాడు. జబల్పూర్ రైల్వే స్టేషన్‌లో ఇటీవల దానాపూర్ ఎక్స్‌ప్రెస్ వచ్చి ఆగింది. వాగన్ విభాగం సిబ్బంది సాధారణ తనిఖీలు చేపట్టారు. ఎస్-4 కోచ్ కింద, చక్రాలకు పైగా ఓ వ్యక్తి వేలాడుతూ పడుకుని ఉండగా గమనించారు. షాకైన సిబ్బంది ఆ వ్యక్తిని గద్దించి, కిందికి దించారు. విచారణలో అతడు ఇటార్సి నుంచి వస్తున్నట్లుగా తెలిపాడు. అంటే, అప్పటికే 250 కిలోమీటర్ల మేర ప్రయాణించినట్లు లెక్క. టిక్కెట్ కొనేందుకు డబ్బులు లేకనే ఈ సాహసానికి పూనుకున్నట్లు తెలిపారు. అతడు అక్కడ ఎలా దాక్కోగలిగాడని ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ అతడిని అదుపులోకి తీసుకుని, విచారణ చేపట్టారు. అతడి వివరాలను వెల్లడించలేదు. ఇందుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరలవుతోంది. ఇదంతా పెరుగుతున్న ద్రవ్యోల్బణం వల్లేనని నెటిజన్లు వ్యాఖ్యలు చేస్తున్నారు. జనరల్ బోగీల్లో రద్దీ విపరీతంగా ఉంటోంది. అందుకే బోగీల కింద వారు ప్రయాణం చేయాల్సిన పరిస్థితులు దాపురించాయని కొందరంటున్నారు. ఇలాంటి అభాగ్యులపట్ల జాలి చూపాలని కోరుతున్నారు.

వలసదారుల పడవ మునక.. 69 మంది జలసమాధి

రబాట్: పశ్చిమ ఆఫ్రికా నుంచి స్పెయిన్ వైపు వలసదారులతో వెళ్తున్న పడవ మునిగిన ఘటనలో కనీసం 69 మంది చనిపోయారు. మొరాకో ప్రాదేశిక జలాల్లో గత వారం ఈ విషాదం చోటుచేసుకున్నట్లు మాలె అధికారులు గురువారం తెలిపారు. మృతుల్లో తమ దేశస్తులు 25 మంది ఉన్నారన్నారు. ప్రమాద సమయంలో పడవలో 80 మంది వరకు ఉన్నారు. 9 మంది మాలె దేశస్తులు సహా 11 మందిని మాత్రమే కాపాడగలిగినట్లు చెప్పారు.

చలి.. ఉరుములతో కూడిన వర్షం

సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీ సహా పరిసర ప్రాంతాల్లో ఒక్క రోజులో వాతావరణ పూర్తిగా మారిపోయింది. ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షం వల్ల చలి తీవ్రత పెరిగింది. పొగమంచు కారణంగా సూర్యుడి జాడే కనిపించలేదు. గురువారం అర్ధరాత్రి నుంచి కురుస్తున్న వర్షానికి జనం బేజారెత్తారు. నోయిడాలో పలుచోట్ల భారీ వర్షం, వడగళ్ల వాన కురిసింది. దట్టమైన మేఘాలు, భారీ వర్షం కారణంగా మధ్యాహ్నానికే చీకటి పడింది. వాహనదారులు లైట్లు వేసుకుని రోడ్లపై వెళ్లాల్సి వచ్చింది.

వాతావరణ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం.. ఢిల్లీలో శుక్రవారం తెల్లవారుజామున 2:30 నుంచి 5:30 గంటల మధ్య 1.8 మిల్లీమీటర్లు, ఉదయం 8:30 గంటల వరకు 7.3 మి.మీ వర్షం నమోదైంది. పాలెం వాతావరణ కేంద్రంలో 11.3 మి.మీ వర్షపాతం నమోదు కాగా, లోధి రోడ్డులో 6.8 మి.మీ, పూసాలో 5.5 మి.మీ వర్షపాతం నమోదైంది. అలాగే.. కనిష్ట ఉష్ణోగ్రత 12 డిగ్రీల సెల్సియస్, గరిష్ట ఉష్ణోగ్రత 20 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. శనివారం ఢిల్లీలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం, ఉరుములు మెరుపులు, బలమైన గాలులతో పాటు తేలికపాటి పొగమంచు కురిసే అవకాశం ఉంది.

తీవ్రంగా పడిపోయిన గాలి నాణ్యత

ఢిల్లీలోని గాలి నాణ్యత సూచి (ఏక్యూఐ) తీవ్రంగా పడిపోయిందని సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ (సీపీసీబీ) వెల్లడించింది. శుక్రవారం ఉదయం 7 గంటలకు 371 ఏక్యూఐగా నమోదైంది. ఆనంద్ విహార్‌లో 398, ఇందిరా గాంధీ ఎయిర్‌పోర్ట్ (టెర్మినల్-3)లో 340, అయా నగర్‌లో 360, లోధి రోడ్‌లో 345, ఐటీఓలో 380, చాందినీ చౌక్‌లో 315, పంజాబీ బాగ్‌లో 386 ఏక్యూఐ నమోదైంది.

ఢిల్లీలో తీవ్రంగా పడిపోయిన గాలి నాణ్యత

- కనిపించని సూర్యుడు, జనం బేజారు

పంజాబ్‌లో బస్సు ప్రమాదం.. 8 మంది మృతి

భటిండా: అదుపుతప్పిన బస్సు వంతెన పైనుంచి కొన్ని అడుగుల లోతున్న కాల్వలో పడిపోయిన ఘటనలో 8 మంది చనిపోగా 25 మంది వరకు గాయాలపాలయ్యారు. పంజాబ్‌లోని జీవన్ సింఘ్వాలా గ్రామ సమీపంలోని లాసరా డ్రెయిన్ వద్ద శుక్రవారం ఈ ఘటన చోటుచేసుకుంది. తల్వాండి సాబో నుంచి భటిండా వైపునకు వెళ్తున్న ఈ బస్సులో ఘటన సమయంలో 45 మంది ప్రయాణికులున్నారు. ప్రమాదం విషయం తెలిసిన గ్రామస్తులు వెంటనే సహాయక చర్యలకు ఉపక్రమించారు.

ఓయూలో విద్యాబోధన ఎప్పుడు ప్రారంభమైంది?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ హిస్టరీ



మీర్ ఉస్మాన్ అలీఖాన్ (1911-48)

మీర్ మహబూబ్ అలీఖాన్, అమత్ - ఉజ్-జహరున్నిసా బేగం దంపతులకు 1886లో మీర్ ఉస్మాన్ అలీఖాన్ జన్మించాడు. ఇతడు ఏడో అసఫ్ జా బిరుదుతో హైదరాబాద్ సింహాసనాన్ని అధిష్ఠించాడు. ఏడో నిజాం పరిపాలనా కాలాన్ని హైదరాబాద్ రాజ్య చరిత్రలో నూతన శకంగా పేర్కొనవచ్చు. రాజ్యాన్ని ఆధునికత వైపు అడుగులు వేయించిన గొప్ప దార్శనికుడు ఉస్మాన్ అలీఖాన్. ఇతడిని హైదరాబాద్ చరిత్రలో గొప్ప హీరో, విలన్‌గా పేర్కొంటారు.

రాజ్యంలో వ్యవసాయాభివృద్ధి, తాగునీటి అవసరాలను తీర్చడానికి 1920లో ఉస్మాన్‌సాగర్ (గండిపేట చెరువు), 1927లో హిమాయత్ సాగర్; అలీసాగర్(బోధన్), రాయపల్లి చెరువు(మెదక్), పాలేరు చెరువు(ఖమ్మం)లను తవ్వించాడు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య సహకారంతో నిజాంసాగర్‌ను నిర్మించి నీటిపారుదల సౌకర్యాలను కల్పించాడు. 1914లో పురావస్తు శాఖను ఏర్పాటు చేసి వెయ్యి స్తంభాల గుడి, రామప్ప దేవాలయం, ఎల్లోరా, అజంతా లాంటి చారిత్రక ప్రదేశాలను సంరక్షించాడు. హైదరాబాద్ అభివృద్ధి కోసం 1912లో హైదరాబాద్ నగరాభివృద్ధి సంస్థను ఏర్పాటు చేశాడు. 1919లో హైకోర్టు భవనాన్ని, జూబ్లీహాల్, అసెంబ్లీ, మొజంజాహి మార్కెట్ భవనాలను నిర్మించాడు. 1922లో హైదరాబాద్ రాజ్యంలో మరణశిక్షను రద్దు చేశాడు. సాంఘిక దురాచారాలైన దేవదాసి, వెట్టి చాకిరి విధానాలను అదే ఏడాది రద్దు చేశాడు.

1927లో ఉచిత ప్రాథమిక విద్యను ప్రవేశపెట్టాడు. 1936లో మాధ్యమిక విద్యా మండలిని స్థాపించాడు. 1918లో ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని స్థాపించి ఉన్నత విద్యను ప్రోత్సహించాడు. (1919 ఆగస్టు 28 నుంచి ఓయూలో విద్యాబోధన ప్రారంభమైంది.) నిజాం స్టేట్ రైల్వేలో భాగంగా దేశంలో తొలి రోడ్డు రవాణా సంస్థను 1932లో ఏర్పాటైంది. రాజ్యాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు దక్కన్ బటన్ ఫ్యాక్టరీ(1916), వజీర్ సుల్తాన్ టొబాకో(వీఎస్‌టీ) ఫ్యాక్టరీ, దక్కన్ గ్లాస్ ఫ్యాక్టరీ(1927), నిజాం షుగర్ ఫ్యాక్టరీ (1937), సిర్పూర్ పేపర్ మిల్లు(1939), గోల్కొండ సిగరెట్ ఫ్యాక్టరీ(1941), హైదరాబాద్ ఆల్విన్ మెటల్స్(1942) తదితర పరిశ్రమలను నెలకొల్పాడు.

హైదరాబాద్ స్టేట్ బ్యాంక్ చట్టం-1941 ప్రకారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ ప్రారంభమైంది. ఈ బ్యాంక్ మొదటి శాఖను 1942 ఏప్రిల్ 5న గన్‌ఫౌండ్రి వద్ద మీర్ ఉస్మాన్ అలీఖాన్ ప్రారంభించాడు. ఉస్మాన్ అలీఖాన్ తన పేరు మీద 'ఉస్మానియా సిక్కా'ను ప్రవేశపెట్టాడు. ప్రముఖ చరిత్రకారుడు రాజేంద్రప్రసాద్ అభిప్రాయం ప్రకారం 'పాలనా పగ్గాలు చేపట్టిన తొలి సంవత్సరాల్లో ఉస్మాన్ అలీఖాన్ మంచి సంస్కర్త'. రెండో ప్రపంచ యుద్ధ కాలం నుంచి బ్రిటిష్ ప్రభుత్వం దేశంలో, ముఖ్యంగా స్వదేశీ సంస్థానాల విషయాల్లో జోక్యం చేసుకోవడం తగ్గించింది. ఇదే అదనుగా ఉస్మాన్ అలీఖాన్ ఆంగ్లేయ అధికారులను తొలగించి ముస్లింలతో ఉద్యోగాలను భర్తీ చేశాడు.

జిల్లాల పేర్ల మార్పు

మీర్ ఉస్మాన్ అలీఖాన్ కాలంలో హైదరాబాద్‌ను ముస్లిం రాజ్యంగా మార్చే ప్రయత్నం జరిగింది. 1905లో వివిధ జిల్లాల పేర్లను మార్చారు. ఎలగండలను కరీంనగర్‌గా, పాలమూరును మహబూబ్‌నగర్‌గా, ఇందూరును నిజామాబాద్‌గా, మెతుకును మెదక్‌గా మార్చారు. మానుకోటను మహబూబాబాద్‌గా, భువనగిరిని భోన్‌గిర్‌గా మార్చారు. ప్రభుత్వ ప్రోత్సాహంతో 1927లో మజ్లిస్-ఇ-ఇత్తేహాదుల్-ముస్లిమిన్ అనే సంస్థను స్థాపించారు. ఈ సంస్థ అంజుమన్ తబ్లి గులిస్తాన్ అనే మరో సంస్థతో కలిసి హిందువుల్ని ముస్లిం మతంలోకి మార్చే తబ్లిక్ ఉద్యమాన్ని ప్రారంభించింది. హైదరాబాద్ నగరంలో ఆర్య సమాజం శాఖను 1892లో ఏర్పాటు చేశారు. కేశవరావ్ కొరాట్కర్, దామోదర్ సత్యాలేకర్, డాక్టర్ అఘోరనాథ్ ఛటోపాధ్యాయ లాంటి ప్రముఖులు నగరంలో ఆర్య సమాజ కార్యకలాపాలకు మద్దతునిచ్చారు. ఆర్య సమాజం తబ్లిక్ ఉద్యమానికి వ్యతిరేకంగా 'శుద్ధి' కార్యక్రమాన్ని చేపట్టి ఇస్లాం మతంలో చేరిన వారిని తిరిగి హిందువులుగా మార్చింది. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఉర్దూ మాధ్యమంలోనే బోధించేవారు. మెజార్టీ ప్రజల మాతృభాషలైన తెలుగు, కన్నడ, మరాఠీల్లో విద్యాబోధనపై నిషేధం ఉండేది. తెలుగు మాధ్యమంలో విద్యాబోధన చేయడం వల్ల నారాయణగూడలోని ఆంధ్ర బాలికోన్నత పాఠశాలకు ఉస్మానియా విశ్వవిద్యాలయం గుర్తింపు ఇచ్చేందుకు నిరాకరించింది. హైదరాబాద్ రాజ్యంలో ఖిలాఫత్ ఉద్యమాన్ని ప్రజలు ప్రారంభించారు. ఈ ఉద్యమాన్ని ఉస్మాన్ అలీఖాన్ తన రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకున్నాడు. 1920లో హైదరాబాద్, కరీంనగర్, మెదక్ లాంటి పట్టణాల్లో ఖిలాఫత్ దినాన్ని పాటించారు. ఈ ఉద్యమ కాలంలో ముస్లింలు ఉస్మాన్ అలీఖాన్‌కు 'మెహిపుల్ మిల్లత్-ఇ-ఉద్దీన్' అనే బిరుదునిచ్చి, ఖిలాఫత్ ఉద్యమంలో పాల్గొనాలని కోరారు. జమీందార్, సియాసత్, జమానా లాంటి ఉర్దూ పత్రికలు ఖిలాఫత్ భావాలను ప్రచారం చేశాయి.

చందా రైల్వే ఆందోళన

భారత ప్రభుత్వం, హైదరాబాద్ ప్రభుత్వం మధ్య 1870లో ఒక ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం మద్రాస్-బొంబాయి మార్గంలో వాడి-హైదరాబాద్ మధ్య రైల్వే లైన్ నిర్మాణం చేపట్టాలి. రైల్వేల విస్తరణతో బొగ్గుకు గిరాకీ పెరగడం వల్ల ఈ రైల్వే లైన్‌ను బొగ్గు గనులున్న ప్రాంతాలైన డోర్నకల్, సింగరేణి మీదుగా విజయవాడ వరకు పొడిగించాలని నిర్ణయించారు. కొద్దికాలం తర్వాత చందాలో బొగ్గు నిక్షేపాలు కనుగొన్నారు. దీంతో రైల్వే లైన్‌ను చందా వరకు పొడిగించాలని నిర్ణయించారు.

ఈ ప్రతిపాదనలు మొదటి సాలార్‌జంగ్ కాలంలోనే ఆమోదం పొందాయి. ఈ రైల్వే లైన్ల నిర్మాణానికి బ్రిటిష్ రైల్వే కంపెనీ మూడు లక్షల పౌండ్ల ధనాన్ని సమకూర్చింది. రైల్వే నిర్మాణ వివరాలు ప్రజలకు పూర్తిగా తెలియవు. ఈ ప్రతిపాదన వల్ల సంస్థానానికి ఆర్థికంగా చాలా నష్టం వాటిల్లుతుందని అప్పుడే ఉనికిలోకి వస్తోన్న విద్యావంతులు భావించారు. అందువల్ల చందా రైల్వే ప్రణాళికను పరిశీలించేందుకు సంస్థానంలోని విద్యావంతులు అఘోరనాథ్ ఛటోపాధ్యాయ, ముల్లా అబ్దుల్ ఖయ్యూం నాయకత్వంలో ఒక కమిటీని ఏర్పాటు చేశారు. చందా రైల్వే పథకానికి సంబంధించిన పూర్తి వివరాలను తమకు అందజేయాలని ఈ కమిటీ ప్రభుత్వాన్ని కోరింది. ప్రజలు ఈ విధంగా కోరడం హైదరాబాద్ సంస్థాన చరిత్రలో ఇదే తొలిసారి. ఈ విషయమై ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. పర్యవసానంగా అఘోరనాథ్ ఛటోపాధ్యాయ, ముల్లా అబ్దుల్ ఖయ్యూం తదితరులను సంస్థానం నుంచి బహిష్కరించింది. 1883 నాటి చందా రైల్వే ఆందోళన హైదరాబాద్ సంస్థానంలో ప్రజా చైతన్యానికి నాంది అనడంలో సందేహం లేదు.

తెలంగాణలో రాజకీయ చైతన్యం

ఆంధ్ర ప్రాంతంతో పోలిస్తే తెలంగాణలో రాజకీయ చైతన్యం ఆలస్యంగా మొదలైంది. మిగతా సంస్థానాల తరహాలోనే హైదరాబాద్ సంస్థానంలోనూ నిరంకుశత్వం అమల్లో ఉండేది. రాజ్యంలో ప్రాథమిక హక్కులు కరవయ్యాయి. వ్యవసాయ కౌలుదార్ల పరిస్థితి దుర్భరంగా తయారైంది. ముక్తేదార్లు, పత్తేదార్లు అనే పెద్ద భూస్వాములు కౌలుదారీ రైతులను బాగేలా అనే దాస్యానికి, బానిసత్వానికి గురి చేశారు. ఇలాంటి దుర్భర పరిస్థితుల్లో ప్రజల్లో రాజకీయ చైతన్యం తీసుకురావడానికి కొమర్రాజు లక్ష్మణరావు 1901లో హైదరాబాద్ నగరంలో 'శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయం'ను స్థాపించారు. ఇదే తెలంగాణలో ఏర్పాటైన తొలి గ్రంథాలయం. మునగాల రాజా ఎస్.వెంకటరావు, హైదరాబాద్ మునసబ్‌దార్ రావిచెట్టు రంగారావు ఆర్థిక ప్రోత్సాహంతో లక్ష్మణరావు ఈ గ్రంథాలయాన్ని స్థాపించారు. 1904లో హన్మకొండలో 'శ్రీ రాజరాజ ఆంధ్ర భాషా నిలయం, 1905లో సికింద్రాబాద్‌లో 'ఆంధ్ర సంవర్ధిని' లాంటి తెలుగు గ్రంథాలయాలను ఏర్పాటు చేశారు. 1906లో లక్ష్మణరావు 'విజ్ఞాన చంద్రికా గ్రంథ మండలి' అనే సాహితీ సంస్థను ఏర్పాటు చేశారు. ఈ సంస్థ ప్రభుత్వ వ్యతిరేక చర్యలు చేపడుతోందని ప్రభుత్వానికి సందేహం వచ్చింది. దీంతో 'విజ్ఞాన చంద్రికా గ్రంథ మండలి' ప్రధాన కేంద్రాన్ని మద్రాసుకు తరలించారు. ఈ విధంగా తెలంగాణలో సాంస్కృతిక పునర్జీవనానికి పునాదులు వేయడంలో కొమర్రాజు లక్ష్మణరావు సఫలీకృతుడయ్యాడు.

ఆంధ్ర జనసంఘం ఏర్పాటు

1921 నవంబర్ 11, 12 తేదీల్లో హైదరాబాద్ సంస్థాన సాంఘిక సమావేశం హైదరాబాద్‌లో జరిగింది. ఈ సమావేశానికి సంఘ సంస్కర్త, ఎస్.ఎన్.డి.టి. మహిళా విశ్వవిద్యాలయ వ్యవస్థాపకుడైన మహర్షి కార్వే అధ్యక్షత వహించారు. ఈ సమావేశ కార్యక్రమాలను ఆంగ్ల, ఉర్దూ భాషల్లో నిర్వహించారు. ఈ సమావేశంలో ఆలంపల్లి వెంకట రామారావు ఒక తీర్మానంపై తెలుగులో మాట్లాడేందుకు ప్రయత్నించారు. దీంతో సమావేశంలో పాల్గొన్న ఒక వర్గం ఆయన ప్రసంగాన్ని అడ్డుకొంది. ఈ సమావేశంలో తెలుగు భాషకు అవమానం జరిగిందని భావించి, తెలుగు వారి కోసం ఓ సంస్థను ప్రారంభించాలని తీర్మానించారు. మాడపాటి హనుమంతరావు, బి.రామకృష్ణారావు, ఎం.నరసింగరావు, ఆదిరాజు వీరభద్రరావు సహా 11 మంది సభ్యులతో 'ఆంధ్ర జనసంఘం' పేరుతో ఒక సంఘాన్ని ఏర్పాటు చేశారు. ఆంధ్ర జనసంఘం మొదటి సమావేశం 1922 ఫిబ్రవరి 14న కొండా వెంకట రంగారెడ్డి అధ్యక్షతన హైదరాబాద్‌లో జరిగింది. ఈ సమావేశంలోనే ఆంధ్ర జనసంఘం పేరును 'నైజాం ఆంధ్ర రాష్ట్ర జనసంఘం'గా మార్చారు. తెలంగాణ ప్రజల్ని సాంఘిక, ఆర్థిక, సాంస్కృతికాభివృద్ధి దిశగా నడపడమే ఈ సంఘం ముఖ్యోద్దేశం.

తెలంగాణలోని వివిధ ఆంధ్ర సంఘాల కార్యకలాపాలను సమన్వయపరిచేందుకు 'ఆంధ్ర జన కేంద్ర సంఘం' అనే కేంద్ర సంఘాన్ని ఏర్పాటు చేశారు. ఈ సంస్థకు మాడపాటి హనుమంతరావు కార్యదర్శిగా పనిచేశారు. వెట్టిచాకిరి, వర్తక సంఘం అనే కరపత్రాలను ఈ సంస్థ విడుదల చేసింది. ఆంధ్ర జన సంఘం నిర్వహించిన తొలి నాలుగు సమావేశాలు హైదరాబాద్(1923), నల్గొండ(1924), మధిర(1925), సూర్యాపేట(1928)లో జరిగాయి. 'నిజాం ఆంధ్ర రాష్ట్ర ప్రశంస', 'నిజాం ఆంధ్ర రాష్ట్ర ఆంధ్రులు' అనే పుస్తకాలను ప్రచురించారు. కొమర్రాజు లక్ష్మణరావు జ్ఞాపకార్థం 'లక్ష్మణరాయ పరిశోధక మండలి' పేరుతో ఒక చారిత్రక పరిశోధన సంఘాన్ని జన సంఘం ఏర్పాటు చేసింది. 1930లో ఈ సంస్థ 'కాకతీయ సంచిక' అనే పేరుతో ఒక సంపుటిని విడుదల చేసింది.

'రూట్ కెనాల్ థెరపీ' వేటికి సంబంధించిన చికిత్స?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

బయాలజీ

జనరల్‌సైన్స్ విభాగం నుంచి గతంలో వచ్చిన ప్రశ్నలు

1. మానవ శరీరంలో ఎన్ని ఎముకలుంటాయి? (ఏఈఈ-2007)
   1) 330 2) 280
   3) 206 4) 220
2. మానవ శరీరంలో అతి కఠిన భాగం? (ఏఎస్ఓ-2008)
   1) గోర్లు 2) ఎముకలు
   3) కొమ్ములు 4) ఎనామిల్
3. చెవుల్లోని మొత్తం ఎముకల సంఖ్య? (ఏఎస్ఓ-2008)
   1) రెండు 2) నాలుగు
   3) ఆరు 4) ఎనిమిది
4. దంతక్షయాన్ని అరికట్టడానికి నీటి సరఫరాలో కలిపే రసాయన పదార్థం? (గ్రూప్-2, 2000)
   1) క్లోరైడ్ 2) ఫ్లోరైడ్
   3) బ్రోమైడ్ 4) సల్ఫైడ్
5. పాలలోని చక్కెర? (జె.ఎల్.-2007)
   1) ఫ్రక్టోజ్ 2) గ్లూకోజ్
   3) సుక్రోజ్ 4) లాక్టోజ్
6. పాలు అంటే ఏమిటి? (గ్రూప్-1, 2002)
   1) కొవ్వు విస్తరించి ఉన్న రక్తం
   2) కొవ్వు విస్తరించి ఉన్న నీరు
   3) నీరు విస్తరించి ఉన్న కొవ్వు
   4) నీరు విస్తరించి ఉన్న చమురు
7. పాలలో కొవ్వు శాతం ఏ సమయంలో తగ్గుతుంది? (ఏఈఈ-2009)
   1) చలికాలం 2) వేసవికాలం
   3) వర్షాకాలం 4) ఏదీకాదు
8. ఆవు పాలు పసుపు రంగులో ఉండటానికి కారణం? (గ్రూప్-2, 2012)
   1) జాంతోపిల్ 2) మాల్టోజ్
   3) రైబోఫ్లావిన్ 4) కెరాటిన్
9. కండరాలకు వచ్చే కేన్సర్ ఏది? (గ్రూప్-1, 2003)
   1) లింపోమా 2) ల్యూకేమియా
   3) సార్కోమా 4) అనీమియా
10. నేత్రదానంలో దాత తన కంటిలోని ఏ భాగాన్ని దానం చేస్తాడు? (గ్రూప్-1, 2003)
    1) కార్నియా 2) లెన్స్
    3) రెటీనా 4) పూర్తి కన్ను
11. పాలిష్ చేసిన బియ్యాన్ని ఎక్కువగా తీసుకుంటే ఏ విటమిన్ లోపిస్తుంది? (డిప్యూటీ ఈవో-2008)
    1) A 2) B_2
    3) D 4) B_1
12. ఏ విటమిన్‌లోపం వల్ల చిగుళ్ల నుంచి రక్తస్రావమవుతుంది?
    1) A 2) D
    3) K 4) C
13. తాడు రక్తం (Cord Blood) అంటే ఏమిటి? (గ్రూప్-2, 2005)
    1) కూతుళ్లకు తండ్రి దానం చేసే రక్తం
    2) కృత్రిమ రక్తం
    3) గుండె కాండ కణాల నుంచి వృద్ధి చేసిన రక్తం
    4) మాయ కాండ కణాల నుంచి వృద్ధి చేసిన రక్తం
14. హిమోగ్లోబిన్‌లో ఉండే లోహం? (గ్రూప్-1, 1987-88)
    1) మెగ్నీషియం 2) ఇనుము
    3) కోబాల్ట్ 4) మాంగనీస్
15. పేస్‌మేకర్ దేనికి సంబంధించింది? (గ్రూప్-1, 2010)
    1) గుండె 2) ఊపిరితిత్తులు
    3) కాలేయం 4) కిడ్నీ
16. రక్తం ఒక..? (గ్రూప్-1, 2010)
    1) ద్రావణం 2) కొల్లాయిడ్
    3) తరల పదార్థం 4) జెల్
17. శిశువు పితృత్వాన్ని నిర్ధారించేందుకు ఏ పరీక్ష నిర్వహిస్తారు? (సివిల్స్-2010)
    1) ఆమ్నియో సెంటాసిస్
    2) డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్
    3) జన్యు సైక్లింగ్ 4) ఏదీకాదు
18. AB రక్త గ్రూపునకు చెందిన ఒక వ్యక్తిని విశ్వగ్రహీత అని ఎందుకంటారు? (గ్రూప్-1, 2007)
    1) ప్రతిరక్షక జనకాలు లేనందువల్ల
    2) ప్రతిరక్షకాలు ఉన్నందువల్ల
    3) ప్రతిరక్షకాలు లేనందువల్ల
    4) ప్రతిరక్షకాలు - ప్రతి రక్షక జనకాలు లేనందువల్ల
19. సిరా రక్తాన్ని ఆక్సిజన్ కోసం ఊపిరితిత్తులకు చేరవేసేది? (గ్రూప్-2, 2008)
    1) పుపుస సిరలు 2) పుపుస ధమనులు
    3) కుడి జఠరిక 4) మహాధమని
20. చాలా కీటకాలు గాలిని సంగ్రహించే పద్ధతి?
    1) చర్మం ద్వారా 2) మొప్పల ద్వారా
    3) ట్రాకియల్ వ్యవస్థ ద్వారా
    4) లంగ్స్ ద్వారా
21. బయోగ్యాస్‌లోని ప్రధానాంశం? (గ్రూప్-1, 1987)
    1) ఈథేన్ 2) మీథేన్
    3) బ్యూటేన్ 4) ఎసిటలిన్
22. ఆక్సిజన్ లేకుండా ఒక జైవిక పదార్థాన్ని విచ్ఛిన్నం చేయడం ద్వారా ఏ వాయువును ఉత్పత్తి చేయొచ్చు? (గ్రూప్-2, 2001)
    1) బొగ్గుపులుసు వాయువు
    2) నత్రజని
    3) SO_2 4) మీథేన్
23. ఆల్కహాల్‌ను తయారు చేయడానికి ఏది అవసరం? (గ్రూప్-2, 2001)
    1) ప్రోటోజోవా
    2) శిలీంద్రాలు - ఈస్ట్
    3) బ్యాక్టీరియా 4) వైరస్
24. పురుషుడి గొంతు కంటే స్త్రీ గొంతు కీచుగా ఉంటుంది. ఎందుకంటే? (గ్రూప్-2, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్- 2009)
    1) అధిక పీడన వ్యాప్తి
    2) అల్ప పీడన వ్యాప్తి
    3) అధిక కంపన పరిమితి
    4) అల్ప కంపన పరిమితి
25. సిలికోసిస్ వ్యాధి ఏ అవయవానికి సంక్రమిస్తుంది?
    1) మూత్రపిండాలు 2) కాలేయం
    3) నరాలు 4) ఊపిరితిత్తులు
26. మొదటిసారిగా కృత్రిమంగా తయారు చేసిన జీవ సమ్మేళనం? (గ్రూప్-2, 2008)
    1) మీథేన్ 2) బెంజీన్
    3) గ్లూకోజ్ 4) యూరియా
27. సాధారణంగా మూత్రం ద్వారా విసర్జితమయ్యే పదార్థం? (గ్రూప్-2, 2003)
    1) పంచదార 2) గ్లూకోజ్
    3) క్రియాటిన్ 4) ప్రోటీన్
28. మానవ కిడ్నీలో ఏర్పడే రాళ్లలో అధికంగా ఉండేది?
    1) కాల్షియం ఆక్జలేట్
    2) సోడియం ఎసిటేట్
    3) మెగ్నీషియం సల్ఫేట్
    4) సోడియం సిట్రేట్
29. మూత్రపిండాల్లోని ఏ భాగంలో మూత్రం వడపోత అవుతుంది? (డీఎల్-2012)
    1) వృక్కం 2) మూత్ర కోశం
    3) ప్రసేకం 4) వృక్క సిర
30. మానవ మూత్రంలోని యూరియా తయారయ్యే భాగం? (గ్రూప్-2, 2000)
    1) మూత్రపిండాలు 2) పెద్దపేగు
    3) కాలేయం 4) మూత్రాశయం
31. కృత్రిమంగా మూత్రపిండాలు వ్యర్థ పదార్థాలను శుద్ధి చేయడాన్ని ఏమంటారు? (గ్రూప్-2బి,1984)
    1) పనోరిసిస్ 2) మానోమీటర్
    3) డయాలసిస్ 4) డయామెంటేషన్
32. చక్కెర వ్యాధిగ్రస్థుని మూత్ర నమూనాలో ఉండేది? (ఏఈఈ-2009)
    1) లాక్టోజ్ 2) మాల్టోజ్
    3) గ్లూకోజ్ 4) సుక్రోజ్
33. క్లోమం ఒక ..? (గ్రూప్-1, 1999)
    1) అంతస్స్రావ గ్రంథి
    2) బహిస్స్రావ గ్రంథి
    3) అంతస్స్రావ - బహిస్స్రావ గ్రంథి
    4) ఏదీకాదు
34. శరీరంలో తాప నియంత్రణను కలిగి ఉన్న గ్రంథి? (గ్రూప్-1, 2007)
    1) పీనియల్ గ్రంథి
    2) పిట్యూటరీ గ్రంథి/ హైపోథలమస్
    3) థైరాయిడ్ 4) అడ్రినలిన్
35. మానవ శరీరంలో 'ఆడమ్స్ ఆపిల్' అని పిలిచే గ్రంథి? (గ్రూప్-1, 2007)
    1) అడ్రినల్ గ్రంథి 2) లివర్/కాలేయం
    3) థైరాయిడ్-బాలగ్రంథి
    4) థైమస్-బాలగ్రంథి
36. తన జాతి జీవులపై ప్రభావం చూపే, జీవి శరీరం నుంచి బాహ్యంగా స్రవించే సమ్మేళనాన్ని ఏమంటారు? (గ్రూప్-1, 1995)
    1) సబ్ హార్మోన్
    2) న్యూరో హార్మోన్
    3) పిరామోన్స్
    4) న్యూరో ట్రాన్స్‌మీటర్
37. పాల పొదుగు నుంచి - చూషణ ద్వారా పాలను స్రవించేందుకు తోడ్పడే హార్మోన్? (సివిల్స్-1989)
    1) ప్రోలాక్టిన్ 2) ఆక్సిటోసిన్
    3) అడ్రినలిన్ 4) థైమోసిన్
38. రక్తపోటు (బ్లడ్ ప్రెజర్)కు కారణమైన హార్మోన్? (అసిస్టెంట్ తెలుగు ట్రాన్స్‌లేటర్-2010)
    1) కాలేయం 2) థైమోసిన్
    3) అడ్రినలిన్ 4) సెక్రిటిన్
39. కణం శక్తి గృహం (కణ శక్తి భాండాగారం) అని పిలిచే కణాంగం? (గ్రూప్-1, 1994, ఎ.ఎం.వి. ఇన్‌స్పెక్టర్- 2009)
    1) క్లోరోప్లాస్ట్ 2) మైటోకాండ్రియా
    3) గ్రానా 4) ప్రోటోప్లాజమ్
40. తుమ్ములు, మింగడం, వాంతులు, వెక్కిళ్లు దేని నియంత్రణలో ఉంటాయి? (గ్రూప్-1, 1990)
    1) మజ్జాముఖం 2) మస్తిష్కం
    3) అనుమస్తిష్కం 4) హైపోథాలమస్
41. అనుమస్తిష్కం (సెరిబెల్లమ్) దేనికి సంబంధించింది? (టౌన్‌ప్లానింగ్ - 2010)
    1) కండరాల కదలిక సమన్వయం
    2) గ్రాహకాంగం
    3) జ్ఞాపక శక్తి 4) దృష్టి
42. జంతు రాజ్యంలో అతిపొడవైన కణం? (గ్రూప్-1, 2010)
    1) ఆస్ట్రిచ్ అండం 2) శుక్రకణం
    3) నాడీకణం 4) మైకోప్లాస్మా
43. మెదడును కప్పి ఉంచే లోపలి పొర? (డీఎల్-2012)
    1) ప్లూరా 2) డ్యూరామ్యాటర్
    3) పియామ్యాటర్
    4) అరాకినాయిడ్ మెంబ్రేన్
44. పార్కిన్సన్ వ్యాధి ఏ అవయవానికి వస్తుంది? (ఏఈఈ-2006)
    1) గుండె 2) కాలేయం
    3) మెదడు 4) చర్మం
45. శరీరంలో వార్తలను గ్రహించి సమన్వయ పరిచే కేంద్రం? (జె.ఎల్.-2007)
    1) గుండె 2) మెదడు
    3) మూత్రపిండాలు 4) పీయూషగ్రంథి
46. మెదడులో ఏ భాగం జ్ఞాపకశక్తికి మూలం? (జె.ఎల్.-2004)
    1) మస్తిష్కం 2) అనుమస్తిష్కం
    3) దవ్వ 4) అథోపర్యంకం
47. కిందివాటిలో జీర్ణక్రియా ఎంజైమ్ కానిది? (సివిల్స్-2007)
    1) ట్రిప్సిన్ 2) పెప్సిన్
    3) టయలిన్ 4) గ్యాస్ట్రిన్
48. హెపటైటిస్ వ్యాధి దేనికి సంబంధించింది? (గ్రూప్-2, 2000)
    1) కాలేయంలో మంట
    2) గుండెలో మంట
    3) మూత్రపిండాల్లో మంట
    4) పేగులో మంట
49. బేరియాట్రిక్ శస్త్ర చికిత్స అంటే ఏమిటి? (గ్రూప్-1, 2004)
    1) గుండె బైపాస్ శస్త్ర చికిత్స
    2) పొట్ట బైపాస్ శస్త్ర చికిత్స
    3) మెదడు సర్జరీ
    4) సియామీ కవలలను విడదీసే సర్జరీ
50. కోసిన తర్వాత 2-3 వారాల్లోనే తన పూర్వ స్థితిని తిరిగి దాదాపు 85 శాతం వరకు పెంచుకునే సామర్థ్యం ఉన్న మానవ శరీర అవయం ఏది? (గ్రూప్-1, 2004, ఏఈఈ-2008)
    1) మెదడు 2) మూత్రపిండాలు
    3) కాలేయం 4) ఊపిరితిత్తులు
51. మానవుని సొల్లు (సెలైవా)లో ఉండే ఎంజైమ్? (గ్రూప్-2, 2003)
    1) రెనిన్ 2) అమైలేజ్
    3) లైపేజ్ 4) టయలిన్
52. 'రూట్ కెనాల్ థెరపీ' వేటికి సంబంధించిన చికిత్స? (గ్రూప్-2, 2000)
    1) దెబ్బతిన్న పళ్లు
    2) దెబ్బతిన్న మూత్రనాళం
    3) రక్తనాళాలు
    4) గోర్లు
53. మానవుడిలో అతిపెద్ద గ్రంథి? (ఆర్కియాలజీ అండ్ మ్యూజియమ్స్-2012)
    1) కాలేయం 2) ఊపిరితిత్తులు
    3) ప్లీహం 4) క్లోమం
54. మానవ ఉదరంలో ఉత్పత్తి అయ్యే ఆమ్లం? (గ్రూప్-1, 2012)
    1) ఎసిటికామ్లం 2) హైడ్రోక్లోరికామ్లం
    3) ఫార్మికామ్లం 4) నైట్రికామ్లం
55. కిందివాటిలో సరైన వరస క్రమం ఏది?
    1) గడ్డి-తోడేలు-జింక-గేదె
    2) గడ్డి-కీటకం-పక్షి-పాము
    3) బ్యాక్టీరియా-కీటకం-పాము-జింక
    4) బ్యాక్టీరియా-గడ్డి-కుందేలు-తోడేలు
56. అండోత్పత్తి స్థానం నుంచి అండాలు గర్భాశయంలోకి ప్రవేశించడానికి ఏ భాగం సహాయపడుతుంది? (గ్రూప్-1, 2004)
    1) సెర్విక్ 2) యోని
    3) జరాయువు 4) పెల్లోపియన్ నాళాలు

సమాధానాలు

1) 3;	2) 4;	3) 3;
4) 2;	5) 4;	6) 2;
7) 2;	8) 3;	9) 3;
10) 1;	11) 4;	12) 4;
13) 4;	14) 2;	15) 1;
16) 2;	17) 2;	18) 3;
19) 2;	20) 3;	21) 2;
22) 1;	23) 2;	24) 4;
25) 4;	26) 4;	27) 3;
28) 1;	29) 1;	30) 3;
31) 3;	32) 3;	33) 3;
34) 2;	35) 3;	36) 3;
37) 2;	38) 3;	39) 2;
40) 1;	41) 1;	42) 3;
43) 3;	44) 3;	45) 2;
46) 1;	47) 4;	48) 1;
49) 2;	50) 3;	51) 4;
52) 1;	53) 1;	54) 2;
55) 2;	56) 4	

'కశ్మీర్ లోయ ముఖద్వారం'గా దేన్ని పిలుస్తారు?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

భూగోళశాస్త్రం

హిమాలయ పర్వత వ్యవస్థ - ప్రాధాన్యం

ఉత్తరాన కోటగోడలా విస్తరించి ఉన్న హిమాలయ పర్వత వ్యవస్థ భారత్‌కు పాకిస్తాన్, చైనా, నేపాల్, భూటాన్ దేశాలతో సరిహద్దుగా ఉంది. వ్యూహాత్మకంగానే కాకుండా ఆర్థిక, సామాజిక అంశాల పరంగా కూడా హిమాలయ పర్వతాలు భారతదేశానికి కీలకం. దేశానికి ఉత్తర ప్రాంతం నుంచి సైనిక దాడులను నిరోధించి రక్షణ కల్పించడంలో హిమాలయాలు ప్రధానపాత్రను పోషిస్తున్నాయి. తూర్పు హిమాలయ ప్రాంతంలో భారత్-చైనాలను విడదీసే 'మెక్‌మోహన్ రేఖ'ను శాస్త్రీయ సరిహద్దుగా అభివర్ణిస్తారు. ఈ ప్రాంతంలో హిమాలయ పర్వతాలు, వాటి కనుమలను పూర్తిగా భారతదేశం కిందకు తేవడంతో చైనా ఈ ప్రాంతంలో భారత్‌లోకి చొచ్చుకు రావడం చాలా కష్టం. కాబట్టి చైనా మెక్‌మోహన్ రేఖను అంగీకరించడం లేదు. చైనా వాదన ప్రకారం ఈ ప్రాంతంలో అంతర్జాతీయ సరిహద్దు హిమాలయ పర్వత పాదాల వద్ద ఉండాలి. అంటే మొత్తం హిమాలయ పర్వతాలను (అరుణాచల్ ప్రదేశ్‌ను) చైనా కోరుతుందన్న మాట. ఇది భారత్‌కు ఎట్టి పరిస్థితుల్లోనూ సమ్మతం కాదు. సైనిక వ్యూహాల పరంగా హిమాలయ పర్వతాల్లోని కనుమలు చాలా ప్రాధాన్యాన్ని కలిగి ఉంటాయి. 1962 యుద్ధంలో అరుణాచల్ హిమాలయాల్లోని తవాంగ్, బొమిడిల్లా కనుమ లను రక్షించుకోలేకపోవడంతోనే చైనా సైన్యాలు సులువుగా అరుణాచల్ ప్రదేశ్‌లోకి ప్రవేశించగలిగాయి. జమ్ముకశ్మీర్ హిమాలయాల్లోని కారకోరం కనుమ నుంచి భారత్, చైనా, పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే) భూభాగాల్లోకి సులువుగా ప్రవేశించవచ్చు. 1980లలో (పీఓకే)మీదుగా చైనా, పాకిస్తాన్‌లను కలుపుతూ కారకోరం కనుమ ద్వారా రహదారి నిర్మించడంతో భారత్ భద్రతకు ముప్పు ఏర్పడింది. కాబట్టి కారంకోరం కనుమకు సమీపంలోని సియాచిన్ హిమానీనద ప్రాంతంలో సైనిక బలగాలను మోహరించాల్సి వచ్చింది. కార్గిల్ యుద్ధంలో కూడా జోజిల్లా కనుమకు ముప్పు ఏర్పడింది. శ్రీనగర్-లే జాతీయ రహదారికి సమీపంలో ఈ కనుమ ఉంది. జోజిల్లా కనుమ శత్రువుల ఆధీనంలోకి వెళితే భారతదేశం నుంచి లడఖ్‌ను సులువుగా వేరు చేయొచ్చు. ఈ ప్రమాదాన్ని గమనించే కార్గిల్ యుద్ధంలో జోజిల్లా కనుమ సమీపంలోని టైగర్‌కొండ, ముష్‌కోష్ లోయల్లో తిష్ట వేసిన ముష్కరులను హతమార్చడానికి భారత సైన్యం పెద్ద మూల్యాన్నే చెల్లించాల్సి వచ్చింది. 'బనిహాల్ కనుమ' గుండా జమ్ము-శ్రీనగర్ జాతీయ రహదారి వెళ్తుంది. అందుకే ఈ కనుమను 'కశ్మీర్ లోయ ముఖద్వారం'గా పరిగణిస్తారు.



వాణిజ్య-సాంస్కృతిక సంబంధాలు

హిమాలయ పర్వతాల కనుమలు అనాదిగా వాణిజ్య, సాంస్కృతిక సంబంధాల్లోనూ కీలక పాత్ర పోషించాయి. భారతదేశం నుంచి చైనాలోకి బౌద్ధమత వ్యాప్తి హిమాలయ పర్వత కనుమల ద్వారా జరిగింది. సిక్కిం-టిబెట్ సరిహద్దులోని నాథూలా, జెలెప్ కనుమల ద్వారా టిబెట్ రాజధాని లాసా, కోల్‌కతా రేవు పట్టణాలను కలిపే రహదారి వెళ్తుంది. 1962 యుద్ధం తర్వాత ఈ రెండు కనుమల ద్వారా జరిపే వాణిజ్యాన్ని నిలిపివేశారు. ఇటీవల నాథూలా కనుమను తిరిగి వాణిజ్యానికి తెరిచారు. టిబెట్-నేపాల్-ఉత్తరాఖండ్ సరిహద్దు ప్రాంతంలోని 'లిపులేక్' కనుమ మార్గం అనాదిగా వాణిజ్యానికి ప్రసిద్ధి. 1962 యుద్ధం తర్వాత ఈ కనుమను కూడా మూసివేశారు.

శీతోష్ణస్థితి నియంత్రణ

భారతదేశపు శీతోష్ణస్థితిని నియంత్రించడంలో కూడా హిమాలయాలు కీలక పాత్రపోషిస్తాయి. శీతాకాలంలో సైబీరియా (రష్యా) నుంచి దక్షిణాసియా వైపు వీచే అతి శీతల పవనాలను హిమాలయాలు అడ్డుకొని గంగా-సింధు-బ్రహ్మపుత్ర మైదానాన్ని హిమపాతం నుంచి కాపాడతాయి. హిమాలయాలు లేకపోతే సైబీరియా శీతల పవనాల వల్ల గంగా-సింధు-బ్రహ్మపుత్ర మైదానంలో శీతకాలంలో రబీ వ్యవసాయం సాధ్యపడేది కాదు. గంగా, యమున, సట్లెజ్, బ్రహ్మపుత్ర నదులు శీతాకాలంలో గడ్డ కట్టుకుపోయేవి. కాబట్టి ఉత్తర మహా మైదాన ప్రాంతం ఉప ఆయనరేఖా అక్షాంశ ప్రాంతంలో ఉన్నప్పటికీ ఆయనరేఖా శీతోష్ణస్థితిని కలిగి ఉంది. భారతదేశంలో నైరుతి రుతుపవనాల చురుకుదనం శీతాకాలంలో హిమాలయాల్లో కురిసిన మంచు పరిమాణంపై ఆధారపడి ఉంటుంది.

జీవ నదులకు ఆలవాలం

హిమాలయాల్లోని హిమానీనద సరస్సులు, హిమానీ నదాలు, మంచుతో కప్పుకుపోయిన పర్వత శిఖరాలు అనేక జీవ నదులకు మాతృకలు. ఉదాహరణకు గంగోత్రి హిమానీనదం నుంచి గంగా, యమునోత్రి వద్ద యమున, రాకాస్‌తాల్ సరస్సు నుంచి సట్లెజ్, చాంమ్యుయాంగ్ హిమానీనదం నుంచి సింధు, వెరినాగ్ కొండల నుంచి జీలం, కైలాస మానస సరోవరం వద్ద బ్రహ్మపుత్ర, కులూ కొండల్లో రావి నదులు ఆవిర్భవిస్తున్నాయి. హిమాలయాల్లో ఆవిర్భవించడం వల్ల ఈ నదులన్నీ 'జీవనదులు'గా అవతరించాయి. అయితే ఇటీవల గ్లోబల్ వార్మింగ్ వల్ల హిమాలయ హిమానీ నదులు క్రమంగా కుంచించుకుపోవడం ఆందోళనను కల్గిస్తోంది. హిమాలయాల్లో రెండో అతిపెద్దదైన గంగోత్రి హిమానీనదం వేగంగా కుంచించుకు పోతుందని శాస్త్రజ్ఞులు నిర్ధారించారు. దీనివల్ల గంగానదిలో సమీప భవిష్యత్తులో వరద తీవ్రత పెరిగి దీర్ఘ కాలంలో క్రమంగా ఎండిపోయే ప్రమాదం ఉందని శాస్త్రజ్ఞులు హెచ్చరిస్తున్నారు.

అటవీ, వన్యమృగ సంపద

హిమాలయ పర్వత సానువులు దట్టమైన అరణ్యాలతో కూడి విశిష్టమైన అటవీ, వన్యమృగ సంపదను కలిగి ఉన్నాయి. హిమాలయ పర్వత సానువుల్లో వివిధ ఎత్తుల్లో వివిధ రకాల అరణ్యాలు ఉన్నాయి. శివాలిక్ కొండల్లో ఆయనరేఖా ఆకురాల్చు అరణ్యాలు, సమశీతోష్ణ అరణ్యాలు పెరుగుతున్నాయి. హిమాచల్ పర్వతాల్లో విశిష్టమైన కోనిఫెరస్ (శృంగాకార) అరణ్యాలు ఉన్నాయి. నాణ్యమైన మెత్తని కలప నిచ్చే పైన్, ఫర్, స్ప్రూస్, దేవదారు మొదలైన వృక్ష జాతులు ఇక్కడ పెరుగుతున్నాయి. హిమాద్రి పర్వతాల (గ్రేటర్ హిమాలయాల) నిమ్న సానువులు విశాలమైన పచ్చిక బయళ్లకు ప్రసిద్ధి. ఈ ప్రాంతాల్లో రోడో డెండ్రాన్ వంటి ఆకర్షణీయమైన పుష్ప జాతులతో పాటు విలువైన ఔషధ మొక్కలు కూడా లభిస్తాయి.

అరుదైన హిమాలయ ఎలుగుబంటి, కస్తూరి మృగం వంటి వన్య ప్రాణులు కూడా ఈ అరణ్యాల్లో సంచరిస్తున్నాయి. శివాలిక్ కొండలు-లెస్సర్ హిమాలయాల మధ్యలో విస్తరించి ఉన్న 'డూన్' ప్రాంతాలు, కశ్మీర్ లోయ ప్రాంతాల్లో సాంద్ర వ్యవసాయం కేంద్రీకృతమై ఉంది. నిమ్న హిమాలయాల్లో పర్వత సానువుల వెంట ఆపిల్ వంటి పండ్ల తోటలను పెంచుతున్నారు. హిమాలయ పర్వతాల్లో వివిధ రకాల ఖనిజ నిల్వలున్నప్పటికీ, వాటి వెలికితీత ఆర్థికంగా లాభదాయకం కాదు. నదులు హిమాలయ పర్వతాలను దాటేటప్పుడు విశిష్టమైన జల పాతాలను సృష్టిస్తాయి. ఇవి విస్తృతంగా జల విద్యుచ్ఛక్తి వనరులను కలిగి ఉన్నాయి. దూల్‌హస్తి, సలాల్, చమేలి, కర్ణప్రయాగ్ ముఖ్యమైన జల విద్యుచ్ఛక్తి ఉత్పత్తి కేంద్రాలు.


మాదిరి ప్రశ్నలు

1. కిందివాటిలో ఏ పర్వత శ్రేణులను 'ఉప హిమాలయాలు'గా పిలుస్తారు?
   ఎ) హిమాచల్ శ్రేణులు
   బి) హిమాద్రి పర్వతాలు
   సి) కారకోరం పర్వతాలు
   డి) శివాలిక్ పర్వతాలు
2. హిమాలయాలకు చెందిన కింది పర్వతాలను 'ఆసియా ఖండ వెన్నెముక'గా వ్యవహరిస్తారు?
   ఎ) కారకోరం పర్వతాలు
   బి) జాగ్రోస్ పర్వతాలు
   సి) లడఖ్ పర్వతాలు
   డి) పిర్‌పంజాల్ పర్వతాలు
3. కశ్మీర్ లోయ ఏ పర్వత శ్రేణుల మధ్య ఉంది?
   ఎ) జాస్కర్-హిమాద్రి పర్వతాలు
   బి) హిమాద్రి పర్వతాలు-పిర్‌పంజాల్
   సి) పిర్‌పంజాల్ శ్రేణులు-జమ్ము కొండలు
   డి) కారకోరం పర్వతాలు-లడఖ్ పర్వతాలు
4. కుమావున్ పర్వత శ్రేణులు ఏ రాష్ట్రంలో ఉన్నాయి?
   ఎ) జమ్ముకశ్మీర్
   బి) హిమాచల్ ప్రదేశ్
   సి) అరుణాచల్ ప్రదేశ్
   డి) ఉత్తరాఖండ్
5. హిమాలయ పర్వత పంక్తులు ఏ కోవకు చెందుతాయి?
   ఎ) నవీన ముడుత పర్వతాలు
   బి) ప్రాచీన ముడుత పర్వతాలు
   సి) అవశిష్ట పర్వతాలు
   డి) భ్రంశ పర్వతాలు
6. వాణిజ్యానికి తిరిగి తెరిచిన 'నాథూలా' కనుమ ఏ రాష్ట్రంలో ఉంది?
   ఎ) అరుణాచల్ ప్రదేశ్
   బి) ఉత్తరాఖండ్
   సి) సిక్కిం
   డి) జమ్ముకశ్మీర్
7. 'కశ్మీర్ లోయ ముఖద్వారం'గా దేనిని పిలుస్తారు?
   ఎ) కారకోరం బి) మానా
   సి) బనిహాల్ డి) పిర్‌పంజాల్
8. భారత్‌లో లేని హిమాలయ పర్వత శ్రేణులు?
   ఎ) మహాభారత్ శ్రేణులు
   బి) కారకోరం శ్రేణులు
   సి) ధవులాదార్ కొండలు
   డి) జాస్కర్ శ్రేణులు
9. ప్రపంచంలోకెల్లా ఎత్తయిన ఎవరెస్ట్ (సాగరమాత) శిఖరం ఏ హిమాలయ పర్వత పంక్తుల్లో ఉంది?
   ఎ) టిబెటన్ హిమాలయాలు
   బి) హిమాద్రి పర్వతాలు
   సి) హిమాచల్ పర్వతాలు
   డి) శివాలిక్ పర్వతాలు
10. వేసవి విడిది కేంద్రమయిన డార్జిలింగ్ ఏ రాష్ట్రంలో ఉంది?
    ఎ) సిక్కిం బి) అసోం
    సి) అరుణాచల్ ప్రదేశ్
    డి) పశ్చిమ బెంగాల్
11. లడఖ్‌లోని 'పూగా లోయ' వేటికి ప్రసిద్ధి?
    ఎ) వేడినీటి బుగ్గలు
    బి) హిమానీ నదాలు
    సి) దట్టమైన అరణ్యాలు
    డి) పైవన్నీ
12. హిమాలయాల్లోకెల్లా అతిపెద్ద హిమానీనదం ఏది?
    ఎ) గంగోత్రి బి) యమునోత్రి
    సి) బయిఫూ డి) సియాచిన్
13. టిబెటన్ హిమాలయాల్లోని మానస సరోవరం ఏ పర్వత శ్రేణుల్లో ఉంది?
    ఎ) నాగటిబ్బ
    బి) కైలాస పర్వతాలు
    సి) సయాడియా పర్వతాలు
    డి) పైవేవీ కావు
14. కశ్మీర్ హిమాలయాల్లోని సోనామెర్గ్, గుల్‌మెర్గ్ వేటికి ప్రసిద్ధి?
    ఎ) కోనిఫెరస్ అరణ్యాలు
    బి) వన్యమృగాలు
    సి) పచ్చిక బయళ్లు
    డి) హిమానీ నదాలు
15. హిమాలయాలు ఉద్భవించిన భౌమ్య యుగం?
    ఎ) ప్రీకాంబ్రియన్
    బి) మీసోజాయిక్
    సి) కెయినో జాయిక్
    డి) టెరిషరీ

సమాధానాలు

1) డి	2) ఎ	3) బి	4) డి
5) ఎ	6) సి	7) సి	8) ఎ
9) బి	10) డి	11) ఎ	12) డి
13) బి	14) సి	15) డి	

Education is a strong instrument..



BANK EXAMS
GENERAL ENGLISH

MODEL QUESTIONS

Directions (Q. 1- 5): Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in bold to help you locate them while answering some of the questions.

A flash of lightning and deafening crash of thunder are enough to make a child scream and a dog **scoot** under the bed, his tail between his legs. Some adults are also frightened, particularly those who have had a close call with nature's fireworks. The child who is frightened by thunder and lightning needs comfort rather than ridicule. The majority of them are calmed by a story or song. Older tots are helped by watching and discussing the flashes and roars provided the parents show no evidence of alarm. The experiments of Benjamin Franklin 200 years ago helped dispel superstitions and primitive ideas about this natural phenomenon. If a church instead of a nearby gambling joint is struck by lightning, the people no longer are amazed that a good rather than a bad place should bear the brunt. They realize the church was struck because its steeple is the highest point in the vicinity. Lightning represents a discharge of atmospheric electricity from one cloud to another or from a cloud to the earth. The best targets here below are projections of some height. This makes the church spire more **vulnerable** than a low building protected by a grove of trees. On the other hand a single tree, shack, fence pole or human being becomes the best target on a prairie, more so when representing the only inlet for a bolt of lightning with in the radius of miles. Stay indoors during a thunderstorm but if caught outside, choose a safe shelter, preferably a large metal building or a dwelling protected against lightning.

1. What should you do during a lightning storm?
1) play golf and other outdoor games
2) watch television and engage yourself
3) if outside choose a safe shelter
4) stay in water
5) stay on a hilltop

2. How should you react to a child's fright over lightning?
1) give strict warning to them
2) try to shout at them and control the things
3) try to hide in a secret place
4) ridicule them
5) calm them by telling a story

3. What kind of structures does lightning generally strike?
1) projections of some height
2) nature's fireworks
3) gambling joint
4) a low building protected by a grove of trees
5) indoors

4. The meaning of **scoot** is
1) crawl 2) creep
3) poke 4) hurry 5) haze

5. The synonym of **vulnerable** is
1) Inclination 2) week
3) experience 4) susceptible
5) averse

Directions (Q. 6-10): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

6. Earlier homemade rafts dumped their waste into the water _____, but by June the _____ rafts were mostly gone, banned under a new state law.
1) untreated, unsightly
2) artfully, dismal
3) openly, few
4) flagrantly, petty
5) hazy, cloudy

7. We live in a _____ age; everyone thinks that maximizing _____ is the point of life.
1) ubiquitous, enjoyment
2) propitious, delight
3) sporadic, bliss
4) hedonistic, pleasure
5) omniscient, plain

8. The ___ of the Minister's statement cannot be verified by people who have no _____ to official records.
1) veracity, access
2) verbosity, entre
3) ambiguity, admission
4) validity, contact
5) opulence, grandeur

9. Catching the earlier train will give us the _____ to do some shopping.
1) chance 2) luck
3) possibility 4) occasion
5) probable

10. David finally found the photographs, after hours spent _____ through drawers.
1) cavorting 2) haggling
3) rummaging 4) divagating
5) cajoling

Directions: (Q. 11 - 15): Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

11. The problems of translation <u>are still remain.</u>
1) are remain 2) will remained
3) will still remain
4) are remaining
5) No Correction required

12. It is ten years since I <u>have begun</u> living here.
1) begun 2) had begun
3) began 4) beginning
5) No Correction required

13. Education is a <u>strong</u> instrument for moldings the character of the young.
1) striking 2) powerful
3) potent 4) proven
5) No Correction required

14. He <u>gave</u> the I.A.S. examination in all seriousness.
1) appeared 2) took
3) undertook 4) prepared
5) No Correction required

15. He has cooked that meal so often he can do it with his <u>eyes closed.</u>
1) mind blank 2) eyes covered
3) hands full 4) hands tied
5) No Correction required

Directions (Q. 16-25): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

16. His interest (1)/ in the study of human behavior (2)/ is indeed (3)/ very large. (4)/ No error (5)

17. The improvement made by changes (1)/ in the system (2)/ was marginal (3)/ and did not warrant the large expenses. (4)/ No error (5)

18. For a few seconds, (1)/ he was totality blinded (2)/ by the powerful lights (3)/ of the oncoming car. (4)/ No error (5)

19. The man who is persistently hesitating (1)/ which of the two things (2)/ he will do first, (3)/ will do either. (4)/ No error (5)

20. The Manager (1)/ gave her his assurance (2)/ that the complaint (3)/ would be discharged. (4)/ No error (5)

21. Everyone felt (1) / that the big (2)/ glittering diamond (3) / was most unique. (4) / No error (5)

22. From all accounts (1) / I learn that (2) / he is the best and honest member (3) / of the new committee. (4) / No error (5)

23. A man entered the tavern (1) / and asked for (2)/ some bread and cheese (3) / with a decided foreign accent. (4) / No error (5)

24. A large scale exchange of nuclear weapons (1) / will produce (2)/ unprecedented amounts of radiation (3) / that can penetrate into the biological tissue. (4) / No error (5)

25. Several prominent figures (1) / involved in the scandal (2) / are required to appear (3) / to the investigation committee. (4) / No error (5)

Directions (Q. 26-30): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) The meeting, the first such gathering in Iraq since the overthrow of Saddam Hussein four years ago, was intended to shore up support for the Iraq government.
B) The next one came six hours later.
C) Delegates from neighboring countries and elsewhere did not set a date for a second, higher-level gathering of foreign ministers and agreed only to establish working groups to focus on various issues.
D) When Iraq's chief delegate stood on a podium and ripped into US policy in Iraq
E) Clobbering hopes that the summit would prove an ice-breaker in the two countries chilly relations
F) On that front, it appeared to have been cordial but far from a resounding success.

26. What is the SECOND sentence after rearrangement?
1) A 2) B 3) C 4) D 5) F

27. What is the THIRD sentence after rearrangement?
1) A 2) B 3) D 4) F 5) E

28. What is the FIFTH sentence after rearrangement?
1) A 2) C 3) D 4) E 5) F

29. What is the FIRST sentence after rearrangement?
1) B 2) A 3) C 4) D 5) E

30. What is the FOURTH sentence after rearrangement?
1) A 2) B 3) C 4) D 5) F

Directions (Q. 31 - 40): In the following passage there are blanks, each of which has been numbered. These numbers are printed below the passage and against each, five words/ phrases are suggested, one of which fits the blank appropriately. Find out the appropriate word/ phrase in each case and mark your answer.

A piece of writing, we have decided, _____ (31) from true forms of visual art in that you cannot respond to the effect of the _____ (32) in a single glance. In reading, the "viewer" has to work at seeing and understanding, for a page of print, _____ (33) at first apprehended by the eye, is fundamentally grasped by the mind _____ (34) the powers of interpretation, reasoning and analysis. But just as your vision can be educated so that _____ (35) respond more intelligently to a work of art, so your powers of interpretation, reasoning and analysis can be _____ (36) so that you respond more efficiently and _____ (37) rapidly to what a writer offers you on a page of print. This process _____ (38) refinement started years ago - when you first learned to read at the age of six or seven. It _____ (39) through elementary and high school and into your late adolescence. And then, possibly, it stopped, though there was _____ (40) much room for improvement.

31. 1) differs 2) vary 3) fluctuate 4) change 5) altered
32. 1) entire 2) whole 3) complete 4) total 5) intact
33. 1) while 2) how ever 3) though 4) still 5) despite
34. 1) during 2) from first 3) though 4) through 5) thorough
35. 1) yours 2) your' s 3) you are 4) your 5) you
36. 1) refined 2) superior 3) design 4) culture 5) experiences
37. 1) additional 2) more 3) extra 4) further 5) other
38. 1) off 2) from 3) of 4) offer 5) with
39. 1) continue 2) continues 3) continuing 4) continued 5) is continued
40. 1) very 2) silent 3) more 4) largely 5) still

Key:

1) 3	2) 5	3) 1	4) 4	5) 4
6) 1	7) 4	8) 1	9) 1	10) 3
11) 3	12) 3	13) 2	14) 2	15) 5
16) 4	17) 5	18) 2	19) 4	20) 4
21) 4	22) 3	23) 4	24) 4	25) 4
26) 4	27) 5	28) 5	29) 1	30) 1
31) 1	32) 2	33) 3	34) 4	35) 5
36) 1	37) 2	38) 3	39) 4	40) 5